


ఈనాడు

కరీంనగర్ 20-1-2018 శనివారం సిటీ సంపుటి 44 సంచిక 160

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi





పరిష్కార పక్షం

15 రోజులపాటు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన

- ఫిబ్రవరి 28లోపు తేల్చేస్తారు
- క్రమబద్ధీకరణకు అవకాశం లేకుంటే కూల్చివేతలే

ఈనాడు - హైదరాబాద్

లేఅవుట్ల క్రమబద్ధీకరణకు తీసుకున్న దరఖాస్తులను ఫిబ్రవరి 28లోగా పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది. నోటీసులు జారీ చేసిన తర్వాత నిర్ణీత గడువులోగా అపరాధ రుసుములు చెల్లించని దరఖాస్తులను తిరస్కరించాలని సూచించింది. క్రమబద్ధీకరణకు అవకాశం లేని భవనాలను నిబంధనల మేరకు కూల్చివేయాలని జీహెచ్ఎంసీ, పట్టణాభివృద్ధి సంస్థలు, నగరపాలికలు, మున్సిపాలిటీల కమిషనర్లకు స్పష్టం చేసింది. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అర్విందకుమార్ ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణలో లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్), భవనాల క్రమబద్ధీకరణ (బీపీఎస్) కింద పురపాలకశాఖ దరఖాస్తులను స్వీకరించింది. ఎల్ఆర్ఎస్ నిబంధనల ప్రకారం దరఖాస్తుల గడువు 2016 డిసెంబరు 31తో ముగిసింది. గడువు ముగిసిన తేదీ నుంచి ఆరు నెలల్లోగా ఆయా దరఖాస్తులను పరిష్కరించాల్సి ఉంది. అయితే పరిపాలన, సాంకేతిక కారణాలతో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, కుడా, ఇతర



మున్సిపాలిటీల్లో గడువులోగా పరిష్కారం కాలేదు. ఒక్కో దరఖాస్తు పరిశీలనకు ఎక్కువ సమయం పట్టడం, దరఖాస్తుల్లో పేర్కొన్న సమాచారం.. ఆ మేరకు అవసరమైన పత్రాలు లేకపోవడం, హక్కు వివాదాలు, వివరాలు అందుబాటులో లేకపోవడంతో ఆలస్యమైందని ఆయా కమిషనర్లు ప్రభుత్వానికి వెల్లడించారు. ఎల్ఆర్ఎస్, బీపీఎస్ దరఖాస్తులపై ఈనెల 12న పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సమీక్ష నిర్వహించారు. వీలైనంత త్వరగా దరఖాస్తుల్ని పరిష్కరించాలని (మిగతా 2లో)

వచ్చేనెల 5కు తేలిపోయినట్లే

- అపరిష్కృత దరఖాస్తులన్నీ 15 రోజుల్లో పరిశీలన పూర్తి చేయాలి. సంబంధిత అధికారులు తనిఖీ, పరిశీలన సిబ్బందికి ఆదేశాలివ్వాలి.
- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ భూముల సెక్షన్ అధికారులు ఆయా ప్లాట్లు, లేఅవుట్ల యాజమాన్య హక్కులను పరిశీలించి.. 10 రోజుల్లో వివరాలు నమోదు చేయాలి. అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో పరిశీలన పూర్తి చేయాలి.
- తిరస్కరించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు తిరస్కరణ లేఖలు, అనుమతించిన వారికి రుసుము చెల్లింపు నోటీసులు ఫిబ్రవరి 5లోగా అందించాలి. అర్హులైన అర్జీదారులు 15 రోజుల్లోగా మిగతా అపరాధ (మిగతా 2లో)




పాతికేళ్లొచ్చినా

టీనేజే!

శాస్త్రవేత్తల అభిప్రాయం

లండన్: మారిన ఆరోగ్య, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా కౌమార దశ నిర్వచనాన్ని కూడా మార్చాలని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం 14-19 ఏళ్ల వయసు మధ్య కాలాన్ని కౌమార (మిగతా 2లో)

ఆప్‌సోపాలు




20 మంది ఆమ్ఆద్మీ శాసనసభ్యులపై అనర్హత వేటు!

- రాష్ట్రపతికి సిఫార్సు చేసిన ఎన్నికల సంఘం
- ఈ చర్య వెనక ప్రధాని ఉన్నారు
- ఆమ్ఆద్మీ పార్టీ ఆరోపణ -2లో
- చర్యను స్వాగతించిన కాంగ్రెస్, భాజపా

జేఈఈ విజేతలకు ఉపకారం!

- కేంద్ర మానవ వనరుల శాఖ పరిశీలనలో ప్రతిపాదన
- 2 వేల లోపు ర్యాంకర్లకు వర్తింపజేసే యోచన
- తెలుగు విద్యార్థులకు అధిక ప్రయోజనం

ఈనాడు, హైదరాబాద్: ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ఆర్థిక సహకారంతో నడిచే ఇతర సాంకేతిక విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం జేఈఈ మెయిన్ రాసి.. రెండు వేల లోపు ర్యాంకులు దక్కించుకునే ప్రతిభావంతులకు ఉపకార వేతనాల పథకం వర్తింపజేయాలనే ప్రతిపాదనను కేంద్ర మానవ వనరుల శాఖ పరిశీలిస్తోంది. దేశవ్యాప్తంగా సుమారు 11.50 లక్షల మంది జేఈఈ మెయిన్ రాస్తుంటారు. దీన్ని అమలు చేస్తే తెలుగు రాష్ట్రాల విద్యార్థులు అధికంగా ప్రయోజనం పొందే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. జేఈఈ మెయిన్‌లో మొదటి 100 ర్యాంకుల్లో 35 వరకు తెలుగు రాష్ట్రాల విద్యార్థులకే దక్కుతున్నాయి. మొదటి 2 వేల ర్యాంకుల వరకైతే 400 నుంచి 500 మంది తెలుగువారే ఉండొచ్చని (మిగతా 2లో)



ఆంధ్రప్రదేశ్ ప్రజలు చేతకానివాళ్లేం కాదు

- కేంద్రం ఆదుకోకుంటే సుప్రీంకు వెళతాం
- కేసీఆర్ వ్యాఖ్యలు బాధపెట్టాయి
- హైదరాబాద్ అభివృద్ధిలో 1995కి ముందు.. తరవాత చూసుకోవాలి
- కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

3 లో

5 నగరాల్లో ఉచిత వైఫై

- రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- సర్వీసు ప్రొవైడర్లకు కొన్ని రాయితీలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని ఐదు నగరాల్లో ఉచిత వైఫై సేవలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కోసం వరంగల్, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్, రామగుండం నగరపాలక సంస్థల పరిధిలో అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చుకునేందుకు సర్వీసు ప్రొవైడర్లకు కొన్ని రాయితీలను ఇవ్వనుంది. ఈ మేరకు ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ సిటీ వైఫై ప్రాజెక్టు, హైఫై విజయవంతమైన తరువాత రాష్ట్రవ్యాప్తంగా ఉచిత వైఫై సేవలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నగరాల్లో నివసించే ప్రజలు, పర్యాటకులు, సందర్శకులకు సేవలందించి ఉచిత సమాచారం తెలుసుకునేందుకు వీలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఉచిత వైఫై సేవలతో ప్రజల భద్రత, జీవన ప్రమాణాలు పెంచేందుకు వీలవుతుందని భావిస్తోంది. కాగా ప్రజలకు ఉచిత వైఫై సేవలు అందించాలంటే... నగరాల్లో ఆ మేరకు నెట్‌వర్క్ విస్తరించి, అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని గుర్తించింది. మున్సిపాలిటీ స్థలాలు, భవనాలను వినియోగించుకుని వైఫై నెట్‌వర్క్ కేంద్రాలు, పరికరాలు ఏర్పాటు చేయాలని ఐటీ శాఖ సూచించింది. ఈ నేపథ్యంలో సర్వీసు ప్రొవైడర్లకు రోడ్ల తవ్వకం, స్తంభాలను ఏర్పాటు చేసుకోవడం, స్తంభాల అద్దె తదితర పనులకు కొన్ని రాయితీలు, వెసులుబాటు కల్పించింది.



ప్రదీప్ డ్రైవింగ్ లైసెన్స్ మూడేళ్లు రద్దు

అబిడ్స్, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డ బుల్లితెర వ్యాఖ్యాత ప్రదీప్ డ్రైవింగ్ లైసెన్స్‌ను మూడేళ్లపాటు రద్దు చేస్తూ నాంపల్లిలోని నాలుగో మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు తీర్పు చెప్పింది. రూ.2,100 జరిమానా విధించింది. శుక్రవారం మధ్యాహ్నం తర్వాత ప్రదీప్ కోర్టుకు హాజరయ్యారు. కేసు (మిగతా 2లో)



రహదారికి ఓ వైపు నిర్మాణ పనులు జరుగుతుండడంతో ఒక వైపు నుంచే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి.

రహదారి ఇలా.. జాతరకు పోయేదెలా?

- హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో జాప్యం
- అడుగడుగునా గుంతలు

ఈనాడు, వరంగల్: మేడారం మహాజాతర సమీపిస్తున్నా అక్కడికి వెళ్లే రహదారుల పరిస్థితి మాత్రం అస్తవ్యస్తంగానే ఉంది. ముఖ్యంగా హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి 163పై అడుగడుగునా గుంతలు దర్శనమిస్తున్నాయి. దీంతో జాతరకు వచ్చే భక్తులకు ఇక్కట్లు తప్పేలా లేవు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు కొనసాగనుంది. మేడారానికి ఇప్పటికే భక్తులు పోటెత్తుతున్నారు. రాజధాని హైదరాబాద్‌తోపాటు, దక్షిణ తెలంగాణ ప్రాంతం నుంచి మేడారానికి వరంగల్ మీదుగానే రావాల్సి ఉంటుంది. ఈ క్రమంలో హైదరాబాద్-వరంగల్ రహదారిపై రద్దీ గణనీయంగా పెరగనుంది.

విస్తరణ పనుల్లో జాప్యం

హైదరాబాద్-వరంగల్ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించే పనుల్లో (మిగతా 2లో)

కౌలు రైతుకు 'పెట్టుబడి' లేనట్లే!

- భూ యజమానులకే ఎకరానికి రూ.4 వేలు
- సాగు చేయని బీడు భూములకూ కష్టమే
- ఖరీఫ్, రబీలకు కలిపి రూ.7,969 కోట్లు
- వానాకాలంలో తొలుత 1.42 కోట్ల ఎకరాలకు
- రబీలో 56 లక్షల ఎకరాలకే ఇవ్వాలి
- వ్యవసాయశాఖ తాజా ప్రతిపాదనలు

16 లో

పత్తి మేశారు.. రైతుకు కత్తెరేశారు..

- సీసీఐలో రూ.400 కోట్ల కుంభకోణం
- అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం
- దర్యాప్తు నీరు గార్చిన అధికారులు
- కేసు నమోదైన వారికి పోస్టింగులు

ఆదిలాబాద్ పట్టణం-న్యూస్‌టుడే

రైతు పేరు చెప్పి జరిగే అక్రమాలు ఎన్నెన్నో! వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని రైతుల కోసం ప్రభుత్వాలు వెచ్చిస్తున్నా అందులో చాలా వరకు అవినీతి అధికారులు, .దళారుల పరమవుతున్నాయి. అలా రూ. 400 కోట్ల మేరకు అవకతవకలు జరిగినట్లు బయటపడిన మరో భారీ కుంభకోణం దర్యాప్తు నీరుగారిపోయింది.. అక్రమార్కులపై చర్యల్లేవు.. బాధ్యులకు శిక్షల్లేవు. కేసు నమోదైన సిబ్బందికి మళ్లీ పోస్టింగులు ఇచ్చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండున్నరేళ్ల కిందట జరిగిన పత్తి కొనుగోళ్ల కుంభకోణం కథ ఇది. ఒత్తిళ్ల కారణంగా ఈ కేసు దర్యాప్తు నీరుగారుతున్నట్లు కనిపిస్తోంది.



సంవత్సరం	పత్తిసాగు (హెక్టార్లలో)	దిగుబడి అంచనా (క్వింటాళ్లు)	మార్కెట్‌లో కొనుగోలైంది (క్వింటాళ్లు)
2013-14	3,15,500	35 లక్షలు	27.33 లక్షలు
2014-15	3,30,060	36 లక్షలు	56.65 లక్షలు
2015-16	3,36,448	50 లక్షలు	37.17 లక్షలు

ఏం జరిగింది?: పత్తి రైతులకు మార్కెట్లో సరైన ధర లేనప్పుడు మద్దతు ధరతో కొనుగోలుకు భారత పత్తి సంస్థ ముందుకొస్తుంది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఈ సంస్థ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2014-15లో ఎవరూ ఊహించనంతగా కొనుగోళ్లు జరిపింది. అప్పట్లో ఇది అందరినీ ఆశ్చర్యపరిచింది. కాని తెరవెనుక జరిగింది వేరు. రైతుల పేరుతో వ్యాపారులు, దళారులకే లాభం చేకూర్చింది. ఒక్కొక్కరు రూ.కోట్లు దండుకున్నారు. అధికారులు అందినంత పుచ్చుకున్నారు.

రూ. 500 కోట్ల నష్టమట..: రైతుల నుంచి సీసీఐ కొన్న 54.76 లక్షల క్వింటాళ్ల పత్తితో రూ. 10.75 లక్షల పత్తిబేళ్లు తయారీ చేశారు. పత్తి కొనుగోలు కోసం రైతులకు రూ.2,000 కోట్ల వరకు చెల్లించి కొన్న సరకు నుంచి గింజలు, బేళ్లు అమ్మగా సీసీఐకి రూ.500 కోట్లకుపైగా నష్టం వచ్చినట్లు వెల్లడించారు. కొనుగోళ్లతో తేమశాతం విషయంలో ఎంతో కఠినంగా వ్యవహరించామని చెప్పినా ఇంతగా నష్టం ఎలా వచ్చిందనేది అంతుబట్టని అంశం. లాభాపేక్ష లేకుండా రైతులకు మద్దతు ధర ఇచ్చేందుకే కొన్నామనేది అధికారుల వాదన. అలా చూసినా ఇంత భారీగా నష్టం రావడం కలకలం రేపింది. ఇందులో దాదాపు రూ.400 కోట్ల వరకు (మిగతా 2లో)

కరవు ప్రకటనకు దూరం..



జిల్లాలో 2014-15లో ఎక్కడ చూసినా కరవు ఛాయలు అలుముకున్నాయి. రైతులకు దిగుబడిలేదు. అతివృష్టి, అనావృష్టితో చాలామంది రైతులు నష్టపోయారు. దీంతో జిల్లాను కరవు ప్రాంతంగా ప్రకటించాలనే డిమాండ్ వచ్చింది. కాని సీసీఐ పత్తి కొనుగోళ్లు 54 లక్షల క్వింటాళ్లకు పైగా ఉండడంతో పంట దిగుబడులు బాగున్నాయని కరవు జిల్లా ప్రకటనకు దూరమైంది. అధికారుల అక్రమాల కారణంగా జిల్లా రైతులు ఈ రూపంలో కూడా నష్టపోయారు.

పార్లమెంటులో రగడ..



సీసీఐ అక్రమాలపై అప్పట్లో పార్లమెంటులోనూ రగడ జరిగింది. విపక్షాలు అడిగిన ప్రశ్నకు అప్పటి కేంద్ర జౌళి మంత్రి స్మృతి ఇరానీ సమాధానమిస్తూ దేశవ్యాప్తంగా 21 మందిపై కేసు నమోదైతే అందులో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వారే 10 మంది ఉన్నట్లు తెలపడం విశేషం.

ఇదీ సంగతి!



ఎవరినీ ఏమీ అనలేం, కనుక సారు చెప్పులకు ఈ ఏర్పాటు చేశాం.



ఆటోట్రాలీల కొనుగోలుకు రుణ ఒప్పందం కుదుర్చుకున్న పురపాలక కమిషనర్ శ్రీదేవి, ఎస్‌బీఐ సీజీఎం స్వామినాథన్

పరిష్కార పక్షం

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. ఈ మేరకు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి పురపాలకశాఖ కొన్ని నిబంధనలు జారీ చేసింది. ఫిబ్రవరి 28 తర్వాత ఆయా దరఖాస్తుల పరిష్కారానికి గడువు పొడిగించే ప్రసక్తే లేదని పేర్కొంది. బీపీఎస్ కింద వచ్చిన దరఖాస్తులు, పరిశీలించినవి, క్రమబద్ధీకరణకు అర్హమైనవి, తిరస్కరించిన వాటి వివరాలు ఈనెల 22లోగా అందజేయాలని సూచించింది. క్రమబద్ధీకరణకు అర్హం కాని భవనాలపై తీసుకున్న చర్యలను తెలియజేయాలని ఆదేశించింది. తెలంగాణలోని 73 మున్సిపాలిటీల్లో ఘన వ్యర్థాల సేకరణకు ఆటోట్రాలీల కొనుగోలుకు రుణాన్ని ఇచ్చేందుకు ఎస్‌బీఐ ముందుకొచ్చింది. ఎస్‌బీఐ సీజీఎం స్వామినాథన్, పురపాలక కమిషనర్ శ్రీదేవి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

సిక్కు అల్లర్ల కేసులో సాక్షుల విచారణకు చర్యలేవి: సుప్రీం

దిల్లీ: మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్యానంతరం 1984లో చోటుచేసుకున్న సిక్కు వ్యతిరేక అల్లర్లకు సంబంధించి ఐదు కేసుల్లో కీలక సాక్షులను ప్రశ్నించడానికి సరైన చర్యలు చేపట్టలేదని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. కేసు రికార్డులను పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని ధర్మాసనం.. ముఖ్య ప్రాసిక్యూషన్ సాక్షికి ఒక్కసారి మాత్రమే సమన్లు జారీ చేసినట్లు వ్యాఖ్యానించింది. ఆ సాక్షి రాకపోవడంతో సాక్ష్యాల నమోదును మూసేసినట్లు పేర్కొంది. 1984 నవంబర్ 1, 2 తేదీల్లో దిల్లీలో జరిగిన గొడవలపై ఈ ఐదు కేసులు దాఖలయ్యాయి.

ఆప్‌సోపాలు

దిల్లీ

ఆమ్ ఆద్మీ పార్టీకి ఎదురుదెబ్బ. దిల్లీలో అధికారంలో ఉన్న ఆ పార్టీకి చెందిన 20 మంది శాసనసభ్యులపై అనర్హత వేటు వేయాలని ఎన్నికల సంఘం శుక్రవారం రాష్ట్రపతికి సిఫార్సు చేసింది. వీరంతా 2015, మార్చి 13 నుంచి 2016, సెప్టెంబరు 8 వరకు పార్లమెంటరీ కార్యదర్శుల పదవిలో ఉండడం ద్వారా లాభదాయక కార్యాలయపు పదవిని చేపట్టినట్లయిందని, ఫలితంగా శాసనసభ్యులుగా అనర్హులవుతారని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు పంపించిన అభిప్రాయంలో ఎన్నికల సంఘం పేర్కొన్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. నిబంధనల ప్రకారం శాసనకర్తలను అనర్హులను చేయాలంటూ తన వద్దకు వచ్చిన పిటిషన్లను రాష్ట్రపతి ఎన్నికల సంఘానికి పంపించాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం చేసిన సిఫార్సుకు రాష్ట్రపతి కట్టుబడి ఉండాలి.

ఈ కేసులో 21 మంది శాసనసభ్యులను అనర్హులను చేయాలని రాష్ట్రపతికి విజ్ఞప్తి చేయగా ఒకరు కొద్ది నెలల క్రితమే రాజీనామా చేశారు. రాష్ట్రపతి నిర్ణయం ప్రకటించిన వెంటనే 20శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అనర్హత వేటు పడేవారిలో మంత్రి కైలాష్ గెహ్లాట్, ప్రముఖ శాసనసభ్యురాలు అల్కా లాంబా కూడా ఉన్నారు. మొత్తం 70 స్థానాలున్న దిల్లీ శాసనసభలో ఆమ్‌ఆద్మీ పార్టీకి భారీ ఆధిక్యం ఉంది. ఆ పార్టీకి 65 మంది సభ్యులున్నారు. అనర్హత వేటు వల్ల ఈ సంఖ్య 45కు తగ్గినా కేజ్రీవాల్ ప్రభుత్వానికి వచ్చిన ముప్పేమీ లేదు. ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ 20 మందిలో ఏడుగురు శాసనసభ్యులు దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. మధ్యంతర ఉత్తర్వులివ్వడానికి హైకోర్టు నిరాకరించింది. శాసనసభ్యుల అనర్హతపై రాష్ట్రపతి కోవింద్‌కు తుది సమాచారం ఏమైనా పంపించారో లేదో తమకు ఈ నెల 22లోపు తెలియజేయాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. స్టే ఇవ్వడానికి నిరాకరిస్తూనే ఈ అంశం కోర్టులో ఉన్నందున ఈ వ్యవహారం జోలికి వెళ్లవద్దని ఎన్నికల సంఘానికి శాసనసభ్యులు చెప్పవచ్చని కోర్టు పేర్కొంది. ఎన్నికల సంఘం వద్దకు వెళ్లకుండా తాను ఆపలేదని స్పష్టం చేసింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న విజ్ఞప్తులను శాసనసభ్యులు కవచంగా వాడుకుంటున్నారని వ్యాఖ్యానించింది. లాభదాయక కార్యాలయపు పదవిని చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలయిన ఫిర్యాదుపై విచారణ చేపట్టాలని ఎన్నికల సంఘం నిర్ణయించగా దాన్ని శాసనసభ్యులు గత ఆగస్టులో హైకోర్టులో సవాల్ చేశారు. ఈ అంశాన్నే హైకోర్టు శుక్రవారం ప్రస్తావించింది.

పార్లమెంటరీ కార్యదర్శులు మంత్రులకు వారి పనిలో సహకరిస్తారు. ఈ పదవిని చేపట్టినా శాసనసభ్యులు ఎటువంటి జీతాలు, ప్రోత్సాహకాలు తీసుకోలేదని ఆమ్‌ఆద్మీ పార్టీ వాదిస్తోంది. ఎన్నికల సంఘం చర్య పట్ల ఆ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నికల సంఘం ఈ స్థాయికి ఎప్పుడూ దిగజారలేదంది. ఈ చర్య వెనక ప్రధాని ఉన్నారని ఆరోపించింది. గతంలో మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన కింద జ్యోతి పని చేశారని, ఈ నెల 23న పదవీవిరమణ చేస్తున్నారని, అందుకే మోదీ రుణం తీర్చుకోవాలనుకుంటున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ నేత సౌరభ్ భరద్వాజ్ ఆరోపించారు. ప్రధాని కార్యాలయపు ఉత్తరాల డబ్బా మాదిరిగా ఎన్నికల సంఘం వ్యవహరించకూడదని ఆమ్‌ఆద్మీ పార్టీ నేత అశుతోష్ ట్వీట్ చేశారు. ఎన్నికల సంఘం నిర్ణయాన్ని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తప్పుబట్టారు. రాజకీయ ప్రతీకారం కోసం రాజ్యాంగ సంస్థను ఉపయోగించుకోరాదని అన్నారు. ఎన్నికల సంఘం నిర్ణయాన్ని కాంగ్రెస్ స్వాగతించింది. ఈ నిర్ణయం తర్వాత అధికారంలో ఉండే హక్కును కేజ్రీవాల్ కోల్పోయారని దిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ మాకెన్ అన్నారు. కేజ్రీవాల్ నైతిక బాధ్యత తీసుకుని రాజీనామా చేయాలని దిల్లీ భాజపా అధ్యక్షుడు మనోజ్ తివారీ అన్నారు. ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘం నుంచి మాత్రం అధికారిక ప్రకటన లేదు.

చివరకు నిజమే గెలుస్తుంది: కేజ్రీవాల్

"నీవు నిజాయితీ మార్గాన్ని ఎన్నుకున్నప్పుడు ఆటంకాలు ఎదుర్కోక తప్పదు. ఇది సహజం. అయితే ప్రపంచంలోని అన్ని శక్తులూ కలిసి వచ్చి నీకు సహకరిస్తాయి. దేవుడు సాయపడుతాడు. ఎందుకంటే నీవు నీ స్వార్థప్రయోజనాల కోసం పనిచేయడం లేదు. నీవు నీ దేశం కోసం, సమాజం కోసం పనిచేస్తున్నావు. చివరకు నిజం విజయం సాధిస్తుందని చరిత్ర రుజువు చేసింది" అంటూ ట్వీట్ చేశారు.

లాభదాయక కార్యాలయం అంటే..

లాభదాయక కార్యాలయం అన్న పదాన్ని రాజ్యాంగంలోని 102(1)(ఎ) అధికరణంలో ఉపయోగించారు. ఆర్థిక ప్రయోజనం కలిగించే కార్యాలయపు పదవిని ఎంపీలు చేపట్టకుండా ఈ అధికరణం నిషేధిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో జీత భత్యాలు, ఇతర ప్రయోజనాలు కల్పించే పదవులు ఈ నిషేధం కిందకు వస్తాయి. లాభదాయక పదవుల కిందకు రాకుండా కొన్ని పదవులకు మినహాయింపునిస్తూ 1950, 1951, 1953లో చట్టాలు చేశారు. వీటి స్థానంలో అనర్హత వేటు నియంత్రణ చట్టం పేరుతో 1959లో మరో చట్టం చేశారు. దీన్ని 2006లో సవరించారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 9(ఎ) సెక్షన్, రాజ్యాంగంలోని 191(1)(ఎ) అధికరణం కూడా ప్రజాప్రతినిధులు లాభదాయక పదవి చేపట్టరాదని స్పష్టం చేస్తున్నాయి.

లాభదాయక కార్యాలయం అనే పదానికి స్పష్టమైన నిర్వచనం లేకున్నా గతంలోని సుప్రీంకోర్టు తీర్పులను బట్టి ఇందులో రెండు అంశాలు ఇమిడి ఉన్నాయి. ఒకటి.. కార్యాలయం ఉండాలి. రెండు.. ఆ కార్యాలయం ద్వారా లాభం వస్తుండాలి. కార్యాలయం అంటే అందులోని వ్యక్తులతో సంబంధం లేకుండా కొనసాగుతుండాలని కాంత కథూరియా వర్సెస్ మానక్ చంద్ సురానా కేసులో సుప్రీంకోర్టు నిర్వచించింది. లాభం అంటే నగదు లబ్ధికి సమానార్థకమని యు.సి.రామన్ వర్సెస్ పి.టి.ఎ.రహీం తదితరుల కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

లాభదాయక కార్యాలయం అంటే ఆర్థిక ప్రయోజనాలే కానక్కర్లేదని మరో కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నియామకాల అధికారం, నియామకాన్ని రద్దు చేసే అధికారం, పారితోషకాన్ని, పారితోషక వనరులను నిర్ణయించే అధికారం తదితర అంశాలను కూడా లాభదాయక కార్యాలయ పదవిని చేపట్టారా లేదా అని నిర్ణయించడంలో పరిగణనలోకి తీసుకోవాలని గురుగోబింద్ బసు వర్సెస్ శంకరి ప్రసాద్ ఘోషల్ తదితరుల కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

అనర్హత వేటుకు సంబంధించిన ప్రముఖ కేసులు

- లోక్‌సభ ఎంపీగా ఉన్న సోనియాగాంధీని యూపీఏ1 ప్రభుత్వం జాతీయ సలహా మండలి (ఎన్‌ఏసీ) ఛైర్‌పర్సన్‌గా నియమించింది. లాభదాయక కార్యాలయపు పదవిని చేపట్టారన్న విమర్శలు రావడంతో ఎంపీగా రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్లారు. అనర్హత వేటు నిరోధక చట్టం నుంచి ఎన్‌ఏసీ ఛైర్‌పర్సన్‌కు మినహాయింపునిస్తూ 2006లో చట్టాన్ని సవరించారు.
- అప్పటి లోక్‌సభ స్పీకర్ సోమ్‌నాథ్ ఛటర్జీ కూడా అనర్హత వేటు ముప్పును ఎదుర్కొన్నారు. అయితే చట్టాన్ని సవరించడంతో వేటు పడలేదు.
- ఉత్తర్‌ప్రదేశ్ చలనచిత్ర అభివృద్ధి సమాఖ్య ఛైర్‌పర్సన్ పదవి బాధ్యతలను చేపట్టినందుకు సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జయాబచ్చన్ ఎంపీ పదవిని కోల్పోయారు.

TRANSCO AE SUB-ENG
FREE DEMO 21/01/18 sunday @ 10AM
సిద్దిపేట స్టడీ సర్కిల్ | SDPT
Ph: 9642 762 724

S.I & కానిస్టేబుల్స్ VRO VRA
New Batch on Jan 22nd
భాగ్యనగర్ ఇన్‌స్టిట్యూట్
040-66338639 0870-2558639

JLM
THE BEST
HANAMKONDA

స్టాఫ్‌నర్సు Monday New Batch
మదర్ థెరిస్సా
హన్మకొండ. 8519900056, 9848947602

JLM
DEMO on సూపర్‌వైజర్
CLASS
HNK 7032322338, 9908797075

State Economy Fame
NAGARJUNA Group-1 MAINS
ECONOMY 21-01-18
NAGARJUNA's STUDY CIRCLE
ASHOK NAGAR, HYDERABAD
040-27613611 / 9989104111

SI - కానిస్టేబుల్స్
యూనిక్

విజేతకాంపిటీషన్స్ పక్షపత్రిక రూ. 20
vijetacompetitions.net
TSPSC-TRT SGT SCHOOL ASSISTANTS
TRANSCO AE ELECTRICAL
9963293399 9963511135

కానిస్టేబుల్స్
VRO/VRA, GR-IV, PANCHAYAT SECRETARY
FREE DEMO 21-1-18 @ 10 AM
బాసర
8686344155 7674883883

TRT(DSC) SA - Methods
బాసర
7674883883 8686344155

SBI CLERKS Posts: 9633 Qly. Any Graduation
FREE AWARENESS PROGRAMME on 21-01-2018 (Sunday) @ 10 AM
New Batch Starts on 22-1-18 (Monday)
FREE 13 Study Materials, 400+ Hrs. Classes, Daily Topic wise Tests & Grand Tests
IACE DSNR & AMEERPET 9700077211

SI-కానిస్టేబుల్స్ TM EM
VRO/VRA, G-II, IV, Panchayat Secretary
FREE DEMO : 21-01-2018 at 10.00 am
రామయ్య
Dilsukhnagar, HYDERABAD
Cell:8555505202, 9246204642, 040-66778942

పత్తి మేశారు.. రైతుకు కత్తెరేశారు..

(మొదటి పేజీ తరువాయి)

కుంభకోణం జరిగిందని అంచనా.

10 ఎకరాల రైతు 2,000 క్వింటాళ్లా?

నిజానికి ఆ ఏడాది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కరవు తాండవించడంతో పత్తి ఆశించినంతగా దిగుబడి రాలేదు. కాని సీసీఐ మాత్రం అసాధారణంగా కొనుగోళ్లు జరిపినట్లు వెల్లడించినప్పుడే అనుమానాలు వ్యక్తమయ్యాయి. సాధారణంగా ఒక్కో రైతుకు 10 ఎకరాల్లో ఎంత లేదన్నా 100 క్వింటాళ్ల కంటే ఎక్కువ దిగుబడి కాదు. ఇక్కడ మాత్రం 10 ఎకరాల రైతు ఏకంగా 2,000 క్వింటాళ్లు అమ్మినట్లు సీసీఐ వెల్లడించింది. ఇలాంటి అక్రమాలే అధికారులను పట్టించాయి.

రూ.2 వేల కోట్లకుపైగా కొనుగోళ్లు..

సీసీఐ మొత్తం 23 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసింది. కనీస మద్దతు ధర రూ. 4,050గా ప్రకటించింది. మార్కెట్ లెక్కల ప్రకారం 54,76,788 క్వింటాళ్ల పత్తిని కొన్నది. రూ. 2,000 కోట్లకుపైగా రైతులకు చెల్లించామని, దాదాపు 1.50 లక్షలమంది రైతులకు లబ్ధి చేకూర్చామని పేర్కొంది. ఏటా దాదాపు 30 లక్షల వరకు పత్తి కొనుగోలు చేసే ప్రైవేటు వ్యాపారులు విచిత్రంగా ఆ సంవత్సరం 1.79 లక్షల క్వింటాళ్లే కొన్నారు. ఇది చూడగానే ఏదో మతలబు జరిగిందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి.

అదే మతలబు: 2014-15లో వ్యవసాయధికారుల అంచనా మేరకు 3,30,060 హెక్టార్లలో రైతులు పత్తిపంట సాగుచేయగా 36 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అంచనావేశారు. కాని మార్కెట్ అధికారుల లెక్క మేరకు ఆ సంవత్సరం ప్రైవేటు వ్యాపారులు 1,88,058 క్వింటాళ్లు కొనుగోలుచేయగా సీసీఐ ఏకంగా 54,76,948 క్వింటాళ్లు కొనుగోలుచేసింది. అంటే మొత్తం 56,65,007 క్వింటాళ్ల మేర కొనుగోళ్లు జరిగాయన్నమాట. మరి ఇంత దిగుబడి ఎక్కడినుంచి వచ్చిందనేది అంతుబట్టని ప్రశ్న.

వ్యాపారులు, దళారులదే కీలకపాత్ర..

పత్తి కుంభకోణంలో బడా వ్యాపారులు, దళారులు కీలకపాత్ర పోషించారు. రైతుల పేర్లమీదనే చెక్కులు ఇవ్వాలనే నిబంధన ఉండడంతో బినామీ పేర్లను తెరపైకి తెచ్చారు. మహారాష్ట్రతోపాటు ఇతర జిల్లాల్లో నాసిరకం పత్తిని తక్కువ ధరకు కొని తెచ్చి ఇక్కడ సీసీఐకి మద్దతు ధరకు విక్రయించారు. ఇలా క్వింటాకు రూ.500 నుంచి రూ.1500 వరకు సంపాదించారు. పేరుగాంచిన వ్యాపారులు ఒక్కోక్కరు రూ. 15 కోట్ల వరకు అక్రమంగా సంపాదించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అప్పట్లో సీసీఐ విజిలెన్స్ అధికారులు జిల్లాకు చెందిన ఆరుగురు బడావ్యాపారులు, ఏడుగురు దళారులను విచారించారు. అయితే విచారణాధికారులు ఉద్యోగులపై కాస్త కఠినంగా వ్యవహరించినా వ్యాపారులు, దళారులను మాత్రం వదిలేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థ అయిన సీబీఐ సైతం వీరిని పరిగణనలోకి తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

10 మంది ఉద్యోగులపై సీబీఐ దర్యాప్తు..



కేంద్రం ప్రభుత్వం సీసీఐ అక్రమాలపై కొరడా ఝుళిపించింది. రెండున్నరేళ్ల కిందట సీసీఐ విజిలెన్స్ బృందం అధికారులు దర్యాప్తు జరిపారు. బాధ్యులుగా గుర్తించడంతో సీసీఐ బ్రాంచి మేనేజర్‌ను, 9 మంది కొనుగోలు కేంద్రాల ఇన్‌ఛార్జిలపై దర్యాప్తు జరిపి 2015 మేలో వారిపై బదిలీ వేటు పడింది. ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. విచిత్రమేమిటంటే.. నెల క్రితం మహారాష్ట్ర, గుజరాత్, చెన్నైలలో వారందరికి పోస్టింగ్లు ఇచ్చారు. వీరిపై సీబీఐ దర్యాప్తు సైతం జరుగుతుండడం విశేషం.

దర్యాప్తు కొనసాగుతోంది..: ఈ కేసు విషయమై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సీసీఐ బ్రాంచి మేనేజర్ మహేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా 2014-15లో జరిగిన పత్తి కొనుగోళ్లపై శాఖాపరమైన విచారణ జరుగుతోందని చెప్పారు. 10 మందిపై విచారణ కొనసాగుతోందన్నారు. హైకోర్టు విశ్రాంతి జడ్జితో దర్యాప్తు చేయిస్తున్నారని తెలిపారు.

చెల్లింపులు ఎన్నడో!

- వైద్యబిల్లుల తిరిగి చెల్లింపులపై వెలువడని ఉత్తర్వులు
- ఆందోళనలో ఉద్యోగులు, పింఛనుదారులు

ఈనాడు, హైదరాబాద్: వైద్య బిల్లులను తిరిగి చెల్లించడానికి అనుమతించిన ఉత్తర్వుల గడువు ముగిసిపోయినా.. నేటికీ వైద్యఆరోగ్యశాఖ నుంచి తదుపరి గడువు పొడిగింపు ఉత్తర్వు వెలువడకపోవడంపై ఉద్యోగులు, పింఛనుదారులు ఆందోళనలో ఉన్నారు. ఉద్యోగులు, పింఛనుదారులకు నగదు రహిత వైద్యం పథకం రాష్ట్రంలో అమల్లో ఉన్నా ప్రభుత్వం మూణ్నెళ్లకోసారి వైద్య బిల్లులు తిరిగి చెల్లింపు విధానాన్ని పొడిగిస్తూ వస్తోంది. గత ఏడాది డిసెంబరు 31తో ఈ గడువు ముగిసిపోయింది. గడువు దాటి 20రోజులు గడిచినా వైద్య బిల్లులు తిరిగి చెల్లింపుపై ఆరోగ్యశాఖ నుంచి ఉత్తర్వులు వెలువడలేదు. దీంతో బిల్లులను పొందడంలో ఉద్యోగులు, పింఛనుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శికి వినతిపత్రం అందజేసింది. కాగా త్వరలోనే వైద్య బిల్లులు తిరిగి చెల్లింపులను మరో మూణ్నెళ్ల వరకూ పొడిగిస్తూ ఉత్తర్వులు వెలువడనున్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి. ఉద్యోగుల ఆరోగ్య పథకంలో అనుసరించే గుర్తింపు సంఖ్యను వైద్య బిల్లుల తిరిగి చెల్లింపుల్లోనూ వర్తింపజేయాలని వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. రెండు పథకాల ద్వారా ఒకే ఉద్యోగి లబ్ధిపొందినా.. ఆ సమాచారం తెలిసే విధంగా రెండింటిని ఒకే గూటి కిందకు తీసుకురావాలని, ఒకే గుర్తింపు సంఖ్యను వర్తింపజేయడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని భావిస్తుండడంతో ఉత్తర్వులు వెలువరించడంలో జాప్యం జరిగినట్లు వైద్యవర్గాలు పేర్కొన్నాయి.

రహదారి ఇలా.. జాతరకు పోయేదెలా?

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ పనులను నేషనల్ హైవే అథారిటీఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) పర్యవేక్షిస్తోంది. హైదరాబాద్ నుంచి యాదాద్రిజిల్లా రాయగిరి వరకు పనులు పూర్తయ్యాయి. అక్కడినుంచి వరంగల్ వరకు ప్రస్తుతం రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. జాతరకల్లా పనులు పూర్తి చేసి, రహదారిని అందుబాటులోకి తీసుకురావాలని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి పలుమార్లు అధికారులను ఆదేశించారు. కానీ పనులు ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఇటీవల రహదారులు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వరంగల్ పర్యటనకు వచ్చినప్పుడు సైతం జాతరకు ఇబ్బందులు లేకుండా రహదారులకు మరమ్మతు చేయాలని సూచించారు. అయినప్పటికీ పూర్తిస్థాయిలో మరమ్మతు పనులు చేపట్టనేలేదు.

ఒకవైపు నుంచే రాకపోకలు:

రాయగిరి నుంచి వరంగల్ వరకు చేపట్టిన రహదారి నిర్మాణ పనుల కారణంగా ఒకవైపు నుంచే వాహనాలు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై వారాంతాలు, పండుగ సమయాల్లోనే ట్రాఫిక్ స్తంభించిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇరుకైన వంతెనలున్నచోట మాత్రమే ప్రత్యామ్నాయంగా పక్క నుంచి మరో మట్టి రహదారిని ఏర్పాటు చేశారు. రహదారులు ఇలాగే గుంతలతో నిండి ఉంటే వాహనాలు స్తంభించి, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన రహదారులకు మరమ్మతులు చేయాల్సిన అవసరముంది.



జనగామ, వరంగల్ మధ్య గుంతలమయమై అధ్వానంగా ఉన్న జాతీయ రహదారి

మరమ్మతులు చేస్తున్నాం... శ్రీనివాస్, పీడీ: జాతర నేపథ్యంలో మరమ్మతులు చేస్తున్నాం. ఇరుకైన వంతెనలున్నచోట పక్కనుంచి మరోదారిని వేస్తున్నాం. ఇప్పటికే ఆలేరు వద్ద పూర్తయ్యాయి. స్టేషన్‌ఘన్‌పూర్ వద్ద పనులు కొనసాగుతున్నాయి. రహదారి ఇరుగ్గా ఉన్నచోట మట్టితో గ్రావెల్ రోడ్డును వేస్తున్నాం.

'సుప్రీం' సంక్షోభం పరిష్కారంపై పడని ముందడుగు

దిల్లీ: సుప్రీంకోర్టులో తలెత్తిన సంక్షోభం పరిష్కార దిశగా శుక్రవారం ఎలాంటి ముందడుగు పడలేదు. అసమ్మతి తెలిపిన సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్ దేశ రాజధానిలో లేకపోవడమే ఇందుకు కారణం. 'ఈ రోజు అంతా నిశ్శబ్దంగా ఉంది. జస్టిస్ చలమేశ్వర్ సోమవారం చెన్నై నుంచి తిరిగి వచ్చిన తరువాత మళ్లీ కదలిక ప్రారంభమవుతుంద'ని న్యాయమూర్తుల సన్నిహిత వర్గాలు తెలిపాయి. అయితే సమస్య పరిష్కారం కోసం కొంతమంది న్యాయమూర్తులు ఇష్టాగోష్ఠిగా చర్చలు జరిపారు.

న్యాయ వ్యవస్థ స్వేచ్ఛను హరించే యత్నాలు... ప్రశాంత్ భూషణ్: న్యాయ వ్యవస్థ స్వేచ్ఛను హరించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఆరోపించారు. శుక్రవారం ఇక్కడ జరిగిన ఓ చర్చావేదికలో ఆయన మాట్లాడుతూ న్యాయమూర్తుల ఎంపికకు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానమే సక్రమంగా లేదని విమర్శించారు. వైద్యకళాశాల వ్యవహారంలో లంచాలు చోటుచేసుకున్నాయన్న ఫిర్యాదులపై ప్రధాన న్యాయమూర్తి వ్యవహరించిన తీరునూ తప్పుపట్టారు.

సుప్రీంకోర్టు తీర్పులను గౌరవించాల్సిందే: జస్టిస్ దీపక్ గుప్తా

దిల్లీ: సర్వోన్నత న్యాయస్థానం తీర్పులు అందరికీ అనుకూలంగా ఉండకపోవచ్చని, అయితే అందరూ వాటిని గౌరవించాల్సిందేనని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపక్ గుప్తా అన్నారు. శుక్రవారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్ని తీర్పులు అందరికీ నచ్చకపోవచ్చని, కానీ అందరూ సుప్రీంకోర్టును గౌరవించాలని అన్నారు. ఇటీవల కొన్ని ప్రజాప్రయోజన వ్యాజ్యాలను సుప్రీంకోర్టు తిరస్కరించడంపై కొందరు న్యాయవాదులు ప్రశ్నించిన నేపథ్యంలో ఈ వ్యాఖ్య ప్రాధాన్యం సంతరించుకొంది.

నేడు గవర్నర్ కాళేశ్వరం పర్యటన

ఈనాడు, హైదరాబాద్: గవర్నర్ నరసింహన్ శనివారం కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పరిశీలించనున్నారు. ఉదయం 7.45కి ఆయన బేగంపేట నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో కాళేశ్వరం చేరుకుంటారు. కాళేశ్వరం ఆలయంలో పూజలు చేస్తారు. ఉదయం 9.30 నుంచి ప్రాజెక్టును సందర్శించి మేడిగడ్డపై ఏరియల్ సర్వే చేస్తారు.

గ్రహం అనుగ్రహం

20-1-2018 శనివారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; మాఘ మాసం; శుక్ల పక్షం
తదియ: మ. 12-00 తదుపరి చవితి
శతభిషం నక్షత్రం: తె. 3-30 తదుపరి పూర్వాభాద్ర
అమృత ఘడియలు: రా. 7-51 నుంచి 9-33 వరకు
వర్జ్యం: ఉ. 9-40 నుంచి 11-21 వరకు
దుర్ముహూర్తం: ఉ. 6-36 నుంచి 8-05 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6-39; సూర్యాస్తమయం: సా.5-44

బీసీలకు అండ: మంత్రి ఈటల

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం బీసీలకు అండగా ఉంటుందని, వారికి అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తుందని ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. శుక్రవారం సచివాలయంలో గౌడసంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ, ఎమ్మెల్యేలు శ్రీనివాస్ గౌడ్, జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బీసీలంతా ఆత్మగౌరవంతో బతకాలన్నదే సీఎం కేసీఆర్ ఆకాంక్ష అని, దాన్నే ప్రభుత్వం పాటిస్తోందని ఈటల పేర్కొన్నారు.

SRI VENKATESWARA UNIVERSITY, TIRUPATI
(Accredited with 'A+' Grade by the NAAC)
DIRECTORATE OF DISTANCE EDUCATION
(Recognised by the UGC - Distance Education Bureau)
ADMISSION NOTIFICATION FOR THE ACADEMIC YEAR 2017-18
POST GRADUATION : M.A.: Telugu, English, Hindi, Economics, History, Political Science & Public Administration, Sociology, Master of Social Work, M.Li.Sc., M.Sc. Physics, Chemistry, Zoology, Botany Psychology, Mathematics and Computer Science. M.Com., M.Com.,(F.M.), M.B.A. (3 Years)
UNDER GRADUATION : B.A., B.Sc., (B.Z.C, M.P.C., M.S.Cs., M.P.E., M.E.Cs., M.PCs)., B.Com., (General/Computers) and B.Li.Sc.
P.G. DIPLOMA COURSES: 1.Industrial Relations & Personal Management 2. Guidance & Counselling.
OPEN UNIVERSITY SYSTEM (OUS): Candidates without any formal education and completed Age of 18 years can persue B.A. and B.Com Courses under OUS by qualifying in the eligibility entrance test.
For further details see website www.svuniversity.edu.in
Ph:0877-2289380, Cell:9177220642, 9705105270 Prof. V.RAVI NAIDU, Director

ప్రదీప్ డ్రైవింగ్ లైసెన్స్ మూడేళ్లు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

పూర్వాపరాలను పరిశీలించిన న్యాయస్థానం.. ఈ మేరకు తీర్పు వెలువరించింది. డ్రైవింగ్ లైసెన్స్ రద్దు కాలంలో వాహనం నడిపితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించింది. పొరపాటు జరిగిపోయిందని, ఇక ముందు అలా జరగదని ప్రదీప్ తెలిపారు. మద్యం సేవించి ఎవరూ వాహనాలు నడపకుండా ప్రచారం చేస్తానని పేర్కొన్నారు.

వచ్చేనెల 5కు తేలిపోయినట్లే

(మొదటి పేజీ తరువాయి)

సొమ్ము చెల్లించి, అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి. నోటీసుతోపాటు అందిన అపరాధ రుసుము, ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి.. అర్హులైన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు అనుమతి పత్రాలు ఫిబ్రవరి 28లోగా మంజూరు చేయాలి. గడువులోగా అపరాధ రుసుము, అవసరమైన పత్రాలు ఇవ్వని దరఖాస్తులను తిరస్కరించి.. సమాచారాన్ని అర్జీదారులకు పంపించాలి.

పాతికేళ్లొచ్చినా టీనేజే!

(మొదటి పేజీ తరువాయి)

దశగా పరిగణిస్తున్నారు. దీన్నే టీనేజ్‌గా వ్యవహరిస్తుంటారు. మెదడులోని హైపోథాలమస్ ప్రాంతంలో హార్మోన్లు విడుదలయి లైంగికపరమైన మార్పులు చేటుచేసుకోవడాన్ని కౌమార దశ ఆరంభంగా గుర్తిస్తున్నారు. సాధారణంగా ఇది 14వ ఏట ప్రారంభమవుతుంది. అయితే పౌష్టికాహారం లభ్యత ఇతర కారణాల పదో ఏటలోనే ఈ లక్షణాలు కనిపిస్తున్నాయి. ఇంగ్లండు వంటి పారిశ్రామిక దేశాల్లో గత 150 ఏళ్ల గణాంకాలను పరిశీలిస్తే బాలికల్లో 12-13 ఏళ్ల వయసులోనే రుతుక్రమం ప్రారంభమవుతోంది. దాంతో పాటు చదువులు కారణంగా 25 ఏళ్ల వయసు వచ్చే వరకు ఎవరూ పెళ్లిమాటే ఎత్తడం లేదు. అంటే యవ్వనం వచ్చినా బాధ్యతలపరంగా వారు కౌమార దశలో ఉన్నట్టే. అందువల్ల 10-25 సంవత్సరాల మధ్యనున్న కాలాన్ని కౌమార దశగా పరిగణిస్తే బాగుటుందని సిఫార్సు చేశారు. ఇందుకుసంబంధించి లాన్సెట్ ఛైల్డ్ అండ్ అడోల్‌సెంట్ హెల్త్ జర్నల్‌లో వ్యాసం ప్రచురితమయింది.

జేఈఈ విజేతలకు ఉపకారం!

(మొదటి పేజీ తరువాయి)

నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎన్‌ఐటీల్లో ఏడాదికి రూ.1.25 లక్షల ట్యూషన్ రుసుం వసూలు చేస్తున్నారు. ఉపకార వేతనాల పథకం అమల్లోకి వస్తే.. ఎంపికైన వారికి కేంద్రమే దాన్ని చెల్లిస్తుంది. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయానికి రాలేదని, చర్చ జరుగుతోందని ఎన్‌ఐటీ వరంగల్ సంచాలకుడు ఆచార్య ఎన్వీ రమణారావు తెలిపారు. జేఈఈ మెయిన్ పరీక్ష నాటికి స్పష్టత రావొచ్చన్నారు. ఐఐటీల్లో మాదిరిగానే ఎన్‌ఐటీల్లోనూ 2018-19 విద్యా సంవత్సరానికి 14 శాతం బాలికలు బీటెక్‌లో ప్రవేశాలు పొందేలా సూపర్ న్యూమరీ సీట్లను సృష్టించనున్నారు. గత ఏడాది ప్రవేశాలను బట్టి ఏ ఎన్‌ఐటీల్లో ఎన్ని సీట్లు బాలికలకు ఇవ్వాలో నిర్ణయిస్తారు. 2019-20 విద్యాసంవత్సరానికి 17 శాతం, 2020-21 నాటికి 20 శాతం సీట్లు బాలికలకు కేటాయిస్తారు. బాలుర సీట్లు తగ్గించరు.

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	7.2	30.7
రామగుండం	10.6	31.2
మెదక్	12.1	34.6
హన్మకొండ	14.0	30.0
శ్రీకాకుళం	14.0	33.0
హైదరాబాద్	14.3	31.4
గుంటూరు	14.8	30.6
నిజామాబాద్	15.0	32.0
విశాఖపట్నం	15.2	29.0
తిరుపతి	15.2	30.0
కరీంనగర్	15.5	32.0
మహబూబ్‌నగర్	17.5	33.4
ఖమ్మం	19.0	28.0
సూర్యాపేట	20.0	34.5

సంప్రదాయేతర ఇంధన కొనుగోలు పరిమితి పెంపు

ఏటా 0.5 శాతం పెంచాలని ఈఆర్‌సీ ముసాయిదా

ఈనాడు, హైదరాబాద్: విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు వార్షిక విద్యుత్ వినియోగంలో సంప్రదాయేతర ఇంధన కొనుగోలు పరిమితికి సంబంధించిన 'నియంత్రణ ముసాయిదా'ను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్‌సీ) శుక్రవారం విడుదల చేసింది. ప్రతీ డిస్కం ఏటా వినియోగించే మొత్తం విద్యుత్‌లో సాంప్రదాయేతర ఇంధనం కనిష్ఠంగా 5 శాతం ఉండాలి. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి దీన్ని 6 శాతానికి పెంచుతున్నట్లు ముసాయిదాలో మండలి స్పష్టం చేసింది. ఇది ఏటా 0.5 శాతం చొప్పున పెరుగుతూ 2021-22 నాటికి 7.5 శాతానికి చేరాలని వివరించింది. సౌర, పవన విద్యుత్ వంటివి సంప్రదాయేతర ఇంధన కోటా పరిధిలోకి వస్తాయి. ఎక్కడి నుంచి కొన్న విద్యుత్ ఈ కోటాలోకి వస్తుందనే అంశంలోనూ ఎన్నో షరతులు విధించింది. ఉదాహరణకు ఎవరైనా వినియోగదారుడు సొంత అవసరాల కోసం సౌరవిద్యుత్ ప్లాంటు ఏర్పాటు చేసుకుని దాన్ని వాడుకుంటే.. సదరు విద్యుత్ యూనిట్లను డిస్కం వార్షిక కోటా పరిధిలో లెక్కించరాదని స్పష్టం చేసింది. సౌరవిద్యుత్ ఫలకాల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను సొంత అవసరాలకు వాడుకున్న తరవాత వినియోగదారుడు మిగిలిన దాన్ని డిస్కంలకు గ్రిడ్ ద్వారా ఇస్తే దాన్ని ఈ కోటా పరిధిలో లెక్కించవచ్చు. వ్యర్థాల నుంచి ఉత్పత్తి చేసే ప్లాంట్ల నుంచి వందశాతం విద్యుత్‌ను డిస్కంలు తప్పనిసరిగా కొనితీరాలి. ఎంత సాంప్రదాయేతర ఇంధనాన్ని కొన్నారనే లెక్కల నివేదికను ఏటా మార్చి 15లోగా అందజేయాలి. ఈ ముసాయిదాపై సలహాలు, సూచనలు వచ్చే నెల 9 లోగా ఎవరైనా అందజేయవచ్చని మండలి తెలిపింది.

దర్శనం పేరుతో దోపిడీ!

- **శ్రీవారి భక్తులను మోసగిస్తున్న నకిలీ సైట్లు**
- **తితిదేకు పదుల సంఖ్యలో ఫిర్యాదులు**

ఈనాడు, తిరుపతి: తిరుమల శ్రీవారి దర్శనం టికెట్లను సులభంగా అందిస్తామంటూ అంతర్జాలంలో నకిలీ వెబ్‌సైట్లు హల్‌చల్ చేస్తున్నాయి. వీటిని నమ్మి అధిక మొత్తాలు చెల్లించి, కొన్నిసార్లు దర్శనం కూడా పొందలేక భక్తులు మోసపోతున్నారు. ఇలాంటి భక్తుల నుంచి వస్తున్న ఫిర్యాదుల మేరకు తితిదే విజిలెన్స్ విభాగం కేసులు నమోదు చేస్తున్నా.. ఆదిలోనే ఈ మోసాలను నివారించే పటిష్ఠమైన యంత్రాంగం కొరవడింది. పైగా మోసపోయిన బాధితులనే అధికారులు తప్పుపడుతున్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానం అధికారిక వెబ్‌సైట్‌లో మాత్రమే రూ.300 దర్శనం టికెట్లు, ఆన్‌లైన్‌లో గదుల బుకింగ్ సేవలు లభిస్తున్నాయి. కానీ అంతర్జాలంలో తిరుమల తిరుపతి దర్శనం అని టైప్ చేయగానే రకరకాల సైట్లు కనిపిస్తున్నాయి. వీటిలో కొన్ని గంటల్లోనే శ్రీవారి దర్శనం చేయిస్తామని నమ్మబలుకుతూ.. ఆన్‌లైన్‌లో నగదు వసూలు చేస్తున్నారు. ఇలాంటివారు నాలుగు రకాలుగా భక్తులను మోసం చేస్తున్నారని తితిదే గుర్తించింది.

మోసాలు ఇలా..

- రూ.300 దర్శనంలో పలు రకాలున్నాయని కొన్ని సైట్లలో నమ్మిస్తున్నారు. దీనికి అనుగుణంగా వెబ్‌పేజీని రూపొందించి.. గంటలో దర్శనం కావాలంటే ఇంత.. రెండు గంటల్లో అయితే ఇంత అంటూ ధరలను ఉంచుతున్నారు.
- భక్తుడు తన పేరు, ఆధార్, ఫోన్ నెంబరు ఆన్‌లైన్‌లో నమోదు చేశాక.. ఆ వివరాల సహాయంతో కొందరు తితిదే అధికారిక వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేస్తున్నారు. దీని కోసం టికెట్‌కు డబుల్ ఛార్జీ వసూలు చేస్తున్నారు.
- మరికొందరు నకిలీ టికెట్లు, జిరాక్స్‌లు అంటగడుతున్నారు. తిరుమలకు వచ్చాక ఫలానా వారిని కలవాలని పని చేయని సెల్ నెంబర్లు, ఉనికిలో లేని చిరునామాలు ఇచ్చి మోసం చేస్తున్నారు.
- తిరుమల, తిరుపతిలో గదులు అందుబాటులో ఉన్నాయని, ప్రైవేటు గదులను అద్దెకు ఇప్పిస్తామంటూ కొన్ని సైట్లు కనిపిస్తున్నాయి. వాటిలో స్వామి దర్శనం కూడా చేయిస్తామని ఆప్షన్ పెడుతున్నారు. దాన్ని క్లిక్ చేసి ఆశ పడ్డ వారి జేబులు గుల్ల అవుతున్నాయి.

ప్రత్యేక వ్యవస్థ ఏదీ?

అవసరమైన సాఫ్ట్‌వేర్ల కోసం తితిదే ప్రైవేటు ఐటీ కంపెనీలపైనే ఆధారపడుతోంది. నకిలీ సైట్లపై ఎలాంటి నిఘా ఉండాలో తితిదేకు స్పష్టత లేదు. ప్రతి నెలా పదుల సంఖ్యలో నకిలీ టికెట్లు, దాతల పేరుతో నకిలీ పాస్‌బుక్‌లపై ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిపై నమోదు చేస్తున్న కేసుల్లో బాధ్యులను ఒక్కరిని కూడా అరెస్టు చేయలేకపోయారు. నకిలీ వెబ్‌సైట్ నిర్వాహకుల చిరునామాలు కూడా గుర్తించలేకపోయారు. అదే సమయంలో తితిదే అధికారిక వెబ్‌సైట్‌పై అవగాహన కల్పించే చర్యలూ కొరవడ్డాయి.



ఓ నకిలీ సైటు హోమ్ పేజీ ఇదీ..

మా దృష్టికి తీసుకురండి

- ఆకే రవికృష్ణ, ముఖ్య విజిలెన్స్, భద్రతాధికారి, తిరుమల

తితిదే అధికారిక సైటులోనే దర్శనం, ఇతర టికెట్లు తీసుకోవాలి. తితిదే ఎవరితోనూ టికెట్ల విషయంలో ఒప్పందం కుదుర్చుకోలేదు. భక్తులు దీన్ని గమనించాలి. నకిలీ సైట్లు లేదా టికెట్లు ఇప్పిస్తామని ఎవరైనా చెబితే మాకు ఫిర్యాదు చేయండి. మా ఫోన్ నెంబరు 0887 2263695 ఎప్పుడూ భక్తులకు అందుబాటులో ఉంటుంది.

ప్రకృతి లోగిలిలో శరీరానికి సానుకూల రూపం



లండన్: ఇరుకు వాడలు, ఇనుప గోడల నడుమ సాగే జీవనమెప్పుడూ ఒత్తిడికి లోనవుతూనే ఉంటుంది. అది మోములో ఎప్పటికప్పుడు తెలిసిపోతూనే ఉంటుంది. అయితే, చెరువు గట్టున కూర్చుని, అటుగా వచ్చే పైరుగాలిని ఆస్వాదిస్తూ, సూర్యాస్తమయాన్ని కనులారా వీక్షించడం వంటి రమణీయమైన ప్ర'కృతి'ని ఆస్వాదిస్తున్నప్పుడు మాత్రం- శరీరం ఎంతో సానుకూలంగా, విశ్రాంతిగా కనిపిస్తుందట. ఆ సమయంలో మనసు ఒత్తిళ్లన్నింటినీ మర్చిపోయి, 'ఆర్ద్ర పరవశభరితం' కావడమే అందుక్కారణమంటున్నారు- ఆంగ్లియా రస్కిన్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు! 'ప్రకృతిలో విహారం శరీరంపై ఎలాంటి ప్రభావం చూపుతుంది?' అన్న విషయమై భారతీయ సంతతికి చెందిన పరిశోధకుడు సహా పలువురు అధ్యయనం సాగించారు. కొందరిని భవనాలు, ఇతర కృత్రిమ వాతావరణంలో ఉంచి ఫొటోలు తీశారు. తర్వాత ప్రకృతి రమణీయ ప్రదేశాలకు తీసుకెళ్లి చిత్రాలను తీయగా- వారి శరీరాకృతి ప్రకృతిలోనే సానుకూలంగా కనిపించినట్లు సామాజిక మనస్తత్వ నిపుణుడు వీరేన్ స్వామి తెలిపారు. ప్రకృతి... మానసిక, శారీరక ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుందని గత పరిశోధనలు తేల్చినా, శరీరం సానుకూల రూపంలో కనిపిస్తుందని తాజాగా రూఢి కావడం విశేషం!

దంతశుద్ధి లేపన పదార్థంతో మలేరియాకు ముకుతాడు!



లండన్: ఏటా ప్రపంచ వ్యాప్తంగా ఐదు లక్షల మందిని, ముఖ్యంగా చిన్నారులను పొట్టన బెట్టుకుంటున్న మలేరియా మహమ్మారి నియంత్రణలో కొత్త డుగు! మనం పండ్లు తోముకోవడానికి ఉపయోగించే టూత్‌పేస్టులో ఉండే 'ట్రిక్లోజన్' అనే పదార్థంతో ఈ వ్యాధిని సమర్థంగా నియంత్రించవచ్చట. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు చేపట్టిన తాజా పరిశోధనలో ప్రాథమికంగా తేలిందీ విషయం. ముఖ్యంగా రక్తం, కాలేయంలో ఈ ఇన్ఫెక్షన్ సోకకుండా అడ్డుకోవచ్చని వారు గుర్తించారు. ప్రస్తుతమున్న మలేరియా నియంత్రణ ఔషధాలపై ఇన్ఫెక్షన్లు క్రమంగా పైచేయి సాధిస్తున్నాయి. దీంతో ఎప్పటికప్పుడు తాజా పరిశోధనలు అనివార్యమవుతున్నాయి. స్టీవ్ ఒలీవర్ బృందం కృత్రిమ మేధ-రోబో సాంకేతికతను ఉపయోగించి కేంబ్రిడ్జ్ జీవరసాయన విభాగంలో పరిశోధన సాగించింది. రక్తంలో సోకిన మలేరియా ఇన్ఫెక్షన్‌ను ఎనాయిల్ రెడ్యుక్టేస్ (ఈఎన్ఆర్) అనే ఎంజైమ్ అంతమొందిస్తుంది. దీని ఉత్పత్తికే కాకుండా, మలేరియా పరాన్నజీవుల పీచమణిచేందుకూ టూత్‌పేస్టులోని ట్రిక్లోజన్ దోహదపడుతుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. దీనిని ఉపయోగించి 'ఈవ్' అనే ఔషధ తయారీకి ప్రయత్నిస్తున్నట్లు ఒలీవర్ చెప్పారు.

ఏపీ ప్రజలు చేతకానివాళ్లేం కాదు

- **కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

ఈనాడు - అమరావతి

విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి న్యాయం జరగకపోతే సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు వెనకాడబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. 24 గంటలూ తగాదాలు పెట్టుకొని వెనకబడిపోవడం ఎందుకని ఆలోచిస్తున్నట్లు చెప్పారు. ఏపీ ప్రజలు చేతకానివాళ్లేం కాదని మన వారికి ఎంతో సామర్థ్యం ఉందని చెబుతూ ఆ రోజు పాలకులు తీసుకున్న నిర్ణయం వల్లే ఇక్కడ ఉన్న 5 కోట్లమంది ఇబ్బందుల పాలయ్యారని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రం ఏదీ అదనంగా కోరడం లేదని చట్టంలో ఉన్నవాటినే నెరవేర్చమంటున్నామని స్పష్టం చేశారు. ఇరుగుపొరుగు రాష్ట్రాలతో తలసరి ఆదాయంలోనూ, అభివృద్ధిలోనూ ఆంధ్రప్రదేశ్ సమానస్థాయికి చేరే వరకూ చేయూతనిచ్చి ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. శుక్రవారం ఉదయం రెండో రోజు కలెక్టర్ల సమావేశం ప్రారంభిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు, నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్‌కుమార్ వేర్వేరు వేదికల్లో చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. వారి మాటలు తనను బాధించాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ఆంధ్రప్రదేశ్‌తో తెలంగాణకు పోలికే లేదనడం బాధ కలిగించిందన్నారు. హైదరాబాద్‌ను ఆంధ్ర పాలకులు నిర్లక్ష్యం చేశారనీ, ధ్వంసం చేశారంటూ తెలంగాణ ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపట్ల సీనియర్ ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యం, ఏపీఐఐసీ ఛైర్మన్ కృష్ణయ్య అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇందుకు చంద్రబాబు స్పందిస్తూ 1995కు ముందు.. తరవాత హైదరాబాద్ అభివృద్ధిని గమనిస్తే వాస్తవాలు తెలుస్తాయని ఎవరు ఏం చేశారో తెలుస్తుందని అలాకాకుండా కేవలం మాటల కోసమే మాట్లాడాలంటే ఏదైనా మాట్లాడొచ్చని అన్నారు. సంయుక్త రాష్ట్రం కావడంతో అందరూ అక్కడకు వెళ్లి తోడ్పాటునిచ్చారని ఎక్కడ అవకాశాలుంటే అక్కడికి వెళ్లి అభివృద్ధిలో పాలుపంచుకుంటారని అన్నారు.

> ★ **ఏపీ ప్రజల ప్రమేయం లేకుండా విభజన చేశారు. అందరితో మాట్లాడి న్యాయం చేయాలంటే పట్టించుకోలేదు. అన్యాయం జరిగిందని అందరూ చెబుతున్నారు.. న్యాయం చేయమంటే ఆలస్యం చేస్తున్నారు.**
>
> ★ **హైదరాబాద్‌లో కష్టపడి పని చేసి, అక్కడ అభివృద్ధికి తోడ్పాటునిచ్చి తిరిగి ఇక్కడ కష్టపడాల్సి వస్తోంది. హైదరాబాద్ తెలంగాణకు ఇవ్వడం వల్ల ఏపీ కోల్పోయేదాన్ని కేంద్రం సర్దుబాటు చేయాలి.**


సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. చిత్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్

కేంద్రం పెద్దన్న పాత్ర పోషించాలి...

ఇటీవల ప్రధానమంత్రిని కలిసినప్పుడు కూడా విభజన సమయంలో సమన్యాయం చేయలేదనే విషయాన్ని స్పష్టంగా చెప్పానని చంద్రబాబు అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెద్ద వ్యవస్థ అనీ, విభజన సమయంలో పెద్దన్న పాత్ర పోషించాలనీ.. కానీ కాంగ్రెస్ నిర్ణయంతో ఏపీకి అన్యాయం జరిగిందని తెలిపారు. తలసరి ఆదాయం తగ్గడానికి అసంబద్ధమైన విభజనే కారణమన్నారు. న్యాయంగా విభజన చట్టంలో హామీలు అమలు చేయకుంటే చివరిగా కోర్టుకు వెళ్తాం అన్నారు. పొరుగు రాష్ట్రాలతో పోల్చి చూసుకొని ఆ మాదిరి రావాలంటే మరో రూ.35వేల తలసరి ఆదాయం పెరగాలని ముఖ్యమంత్రి వివరించారు. కష్టపడి పని చేసి ముందుకు వెళ్లేందుకు నవనిర్మాణ దీక్ష, మహాసంకల్పం చేపట్టామని చెప్పారు. ఇప్పుడిప్పుడే రాష్ట్రం సమస్యల నుంచి బయటపడుతోందనీ, ఇంకా పూర్తిగా కుదుటపడలేదని అన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు ప్రారంభం


సునీల్ అంబేకర్

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: అఖిల భారత విద్యార్థి పరిషత్ 36వ రాష్ట్ర మహాసభలు శుక్రవారం నల్గొండలో ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న మహాసభలకు రాష్ట్రంలోని 31 జిల్లాల నుంచి 1,500 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి అఖిల భారత సంఘటన కార్యదర్శి సునీల్ అంబేకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు ఏబీవీపీ పోరాడిందని చెప్పారు. అంతకుముందు ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.చెన్నకృష్ణారెడ్డి జెండాను ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎం.ప్రసాద్, కార్యదర్శిగా ఎల్.అయ్యప్ప ఎన్నికయ్యారు. మహాసభల కన్వీనర్ బత్తిని నగేష్, ఏబీవీపీ జాతీయ కార్యదర్శి ఒ.నిదిశ్, స్వాగత సమితి అధ్యక్షుడు వినీలారెడ్డి, ప్రధాన కార్యదర్శి కాసర్ల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి

- **నాగోబా దర్బార్‌లో అటవీశాఖ మంత్రి జోగు రామన్న**

ఉట్నూరు, న్యూస్‌టుడే: ఆదివాసీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అటవీ శాఖ మంత్రి జోగు రామన్న స్పష్టం చేశారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా జాతరలో నిర్వహించిన దర్బార్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గతంలోని సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి వాటిలో కొన్నింటిని పరిష్కరించామన్నారు. మిగిలినవాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. నాగోబా ఆలయాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. సున్నితమైన ఆదివాసీలు, లంబాడీల సమస్యను పరిష్కరించాలని సీఎం చిత్తశుద్ధితో ఉన్నారని పేర్కొన్నారు. దశలవారీగా దీని పరిష్కారానికి ప్రభుత్వ కృషి కొనసాగుతుందని చెప్పారు. ఆదివాసీలు సాగుచేస్తున్న అటవీ, పోడు భూముల విషయంలో అర్హులకు హక్కుపత్రాలు అందించే దిశగా చర్యలు చేపట్టామన్నారు. భూప్రక్షాళనలో పార్ట్-బీలో పొందుపర్చిన వాటిని మరో సారి సర్వేలు చేయించి అర్హులకు హక్కు పత్రాలు, పట్టాలు అందిస్తామన్నారు. నాగోబా దేవతకు మంత్రి రామన్న, ఎంపీ జి.నగేష్‌లు పూజలు చేశారు. దర్బార్ సందర్భంగా ఆదివాసీలు భారీఎత్తున తరలివచ్చారు. లంబాడాలను గిరిజన జాబితా నుంచి తొలగించాలనే డిమాండ్ నేపథ్యంలో దర్బార్‌ను కేవలం 2గంటలపాటు నిర్వహించారు. అప్పటికింకా గిరిజనులు చేరుకోలేదు. తుడుం దెబ్బ రాష్ట్రాధ్యక్షుడు సోయం బాపురావు తదితర ఆదివాసీ సంఘాల నాయకులు దీన్ని నిరసించారు. లంబాడీలను గిరిజన జాబితా నుంచి తొలగించాలంటూ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ శోభారాణి, జిల్లా పాలనాధికారి దివ్య, ఎస్పీ విష్ణు ఎస్ వారియర్, మంచిర్యాల పాలనాధికారి, ఇన్‌ఛార్జి పీఓ ఆర్వీకర్ణన్, జిల్లా సంయుక్త పాలాధికారి కృష్ణారెడ్డి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, హైదరాబాద్ నిఘా విభాగం ఎస్పీ శ్రీధర్ నాగోబాను దర్శించుకున్నారు.


దర్బార్‌లో మంత్రి జోగు రామన్నకు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీలు

కొమ్మకొమ్మ.. అలరించేనమ్మా..!



నిలువెత్తు వృక్షం కొమ్మకొమ్మనా శ్వేత వర్ణంలో అలరిస్తున్నవి ఆ చెట్టుకు పూసిన పుష్పాలు ఎంతమాత్రం కాదు.. తెల్లని కొంగలు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఆమదాలవలస సమీపంలోని రాగోలు గ్రామం వద్ద ఉన్న ఓ భారీ చెట్టుపై ప్రతి రోజు పొద్దుపోయాక గుంపులు గుంపులుగా ఇలా తెల్లని కొంగలు వచ్చి చేరుతున్నాయి. ఈ విహంగాల రాకతో ప్రస్తుతం ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. —ఈనాడు, శ్రీకాకుళం

కుర్లా ఎక్స్‌ప్రెస్‌లో 19 కిలోల బంగారం అపహరణ

బెంగళూరు, న్యూస్‌టుడే: పంతొమ్మిది కిలోల బంగారం ఉన్న తన సంచి గురువారం రాత్రి కుర్లా ఎక్స్‌ప్రెస్‌లో అపహరణకు గురైందని రిజాయ్ అనే ఆభరణాల వ్యాపారి బెంగళూరు కంటోన్మెంట్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంగారాన్ని శుద్ధి చేయించేందుకు ముంబయిలోని లోకమాన్య తిలక్ రైల్వేస్టేషన్ నుంచి కోయంబత్తూరుకు వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నగల సంచిని తల కింద పెట్టుకుని నిద్రిస్తున్న సమయంలో అనంతపురం జిల్లా ధర్మవరం, సత్యసాయి ప్రశాంతి నిలయం, నారాయణపుర రైల్వేస్టేషన్ల మధ్యలో దొంగతనం జరిగినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. అందువల్ల కేసు దర్యాప్తు బాధ్యతల్ని ధర్మవరం రైల్వే పోలీసులకు అప్పగించాలని నిర్ణయించారు. నారాయణపుర స్టేషన్ దాటిన తరువాత తన సంచి కనిపించటం లేదని రిజాయ్ రైల్వే టీటీఈకి సమాచారం అందించారు.

వైద్యుడిని సంప్రదించకుండా... ఈ విటమిన్ మాత్రలను వాడొద్దు!

- **అతిగా, అనవసరంగా వాడితే ముప్పు తప్పదు**
- **హెచ్చరించిన అమెరికా శాస్త్రవేత్తలు**

న్యూయార్క్: విటమిన్ మాత్రలు మంచివే. శరీరంలో పోషకాహార లేమిని సర్దుబాటు చేస్తాయి. కానీ, వైద్యులను సంప్రదించకుండా, అదేపనిగా అధిక మోతాదులో వీటిని వాడితే మాత్రం... అంతకుమించిన చేటు మరొకటి ఉండదట. ఈ మాత్రలకు బదులు ఆహారం ద్వారానే విటమిన్లను శరీరానికి అందించడం శ్రేయస్కరమంటున్నారు... 'నేషనల్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్' శాస్త్రవేత్తలు. ముఖ్యంగా ఐదు రకాల విటమిన్ మాత్రల విషయంలో జాగ్రత్తగా ఉండాలంటున్నారు.

- **విటమిన్-ఎ:** ఇది శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్. చక్కని దృష్టికి, సక్రమమైన నాడీ విధులకు అవసరమైనది. అయితే... ఎక్కువ మోతాదులో ఈ మాత్రలను తీసుకునేవారికి కాలేయ సమస్యలు, ఊపిరితిత్తుల క్యాన్సరు వచ్చే ముప్పు ఉంటుందట.
- **విటమిన్-సి:** రోగ నిరోధకశక్తిని పెంపొందిస్తుంది. శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్. ఈ మాత్రలను ఎక్కువగా తీసుకుంటే కిడ్నీలో రాళ్లు ఏర్పడే ప్రమాదముంది.
- **విటమిన్-బి6:** శరీరంలో చాలినంత శక్తి స్థాయిని నిలుపుకోవడానికీ, రోగనిరోధక వ్యవస్థకు కీలకమైన విటమిన్ ఇది. ఒక రోజుకు వంద మిల్లీగ్రాములకు మించి తీసుకుంటే... నాడీ, చర్మ సమస్యలు, గుండెల్లో మంట వచ్చే ప్రమాదముంటుంది.
- **విటమిన్-ఇ:** ఈ మాత్రలను తీసుకునేవారిలో మరణ ముప్పు ఎక్కువగా ఉంటున్నట్లు జాన్స్ హాప్కిన్స్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా గుండె వైఫల్యం, క్యాన్సర్లు వచ్చే ప్రమాదముందట.
- **మల్టీ-విటమిన్:** అన్ని విటమిన్లు సమపాళ్లలో లభించే మాత్రగా దీనిని భావిస్తుంటారు చాలామంది. వ్యాధులు రాకుండా ఇవి కాపాడతాయన్న ప్రచారం ఉత్తదేనని, అనవసరంగా వీటికి డబ్బులు ఖర్చుపెట్టడం వృథా అని నిపుణులు కొట్టిపారేస్తున్నారు. అవసరం లేకపోతే వీటి వల్ల ప్రయోజనం కంటే హానే ఎక్కువని హెచ్చరిస్తున్నారు.



'ఆప్'సోపాలు స్వయంకృతమే!

దేశ రాజధాని దిల్లీలో అధికార ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) నేడు ఎదుర్కొంటున్న పరాభవ స్థితి- తాగేసిన పిల్లి బోర్ల పోసుకున్న చందంగా అఘోరించింది. జోడు పదవుల వివాదంలో 20మంది 'ఆప్' శాసన సభ్యులకు అనర్హత దోషాన్ని నిర్ధారిస్తూ, కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రపతికి చేసిన సూచన రాజకీయ స్పందనావార్లో సంచలనం సృష్టిస్తోంది. తన తప్పు తప్పు కాదన్నట్లుగా వక్ర రాజకీయాలు శుక్రనీతులు వల్లించే ఆప్ నేతాగణాలు ఎన్నెన్ని కొత్త ఆరోపణలకు సానపెట్టినా- వాస్తవాలు కేజ్రీవాల్ సర్కారునే బోనెక్కిస్తున్నాయి. 2015 ఫిబ్రవరి నాటి దిల్లీ ఎన్నికల్లో రాజకీయ ప్రత్యర్థుల కళ్లు బైర్లు కమ్మేలా 70 అసెంబ్లీ సీట్లలో ఏకాయెకి 67 చోట్ల 'ఆప్' జయకేతనం ఎగరేసింది. మొత్తం అసెంబ్లీ స్థానాల్లో పది శాతానికి మించి మంత్రివర్గ కూర్పు ఉండరాదన్న రాజ్యాంగ నిబంధనకు గండికొట్టేలా, ఒక్కో మంత్రికి ముగ్గురు వంతున 'పార్లమెంటరీ కార్యదర్శుల' పదవుల్ని సృష్టించింది. అలా 21 పదవుల సృష్టికి చట్ట రీత్యా లెఫ్టినెంట్ గవర్నర్ ముందస్తు అనుమతి తీసుకోలేదు సరి కదా, అసంబద్ధ చర్యపై చిటపటలు మొదలయ్యేసరికి లాభదాయక పదవుల చట్టసవరణకూ సమకట్టింది. రాష్ట్రపతిగా ప్రణబ్ దా చట్ట సవరణను తోసిపుచ్చడంతో పాటు, ఆ మొత్తం వ్యవహారంపై తన కందిన ఫిర్యాదును ఎన్నికల సంఘం పరిశీలనకు పంపడంతో రాజకీయం వేడెక్కింది. జోడు పదవుల వివాదంపైనే దాఖలైన వ్యాజ్యాన్ని విచారించిన దిల్లీ హైకోర్టు- పార్లమెంటరీ కార్యదర్శి పదవుల ఏర్పాటు రాజ్యాంగ విరుద్ధమంటూ కొట్టేసింది. పదవులెటూ పోయాయి కనుక తమపై ఈసీ జరుపుతున్న విచారణను రద్దు చెయ్యాలన్న ఎమ్మెల్యేల వాదనను కొన్ని నెలల క్రితం దిల్లీ ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. 2015 మార్చి 13 నుంచి 2016 సెప్టెంబరు 8 వరకు సంబంధిత శాసన సభ్యులు పార్లమెంటరీ కార్యదర్శులుగా పెత్తనం చేశారంటూ ఎన్నికల సంఘం వారి శాసనసభ్యత్వాల రద్దుకు సిఫార్సు చేయడం- కేజ్రీవాల్ తిరోగామి రాజకీయాలకు చెంపపెట్టు. స్వచ్ఛరాజకీయాల్లో నవ శకాన్ని వాగ్దానం చేసి అధికారానికి వచ్చిన 'ఆప్' నయా వంచనకు ఇదో రుజువు!

యూపీఏ జమానాలో తాళ ప్రమాణాలకు చేరిన అవినీతిపై అన్నా హజారే పూరించిన సమరశంఖం నాడు దేశవ్యాప్తంగా ప్రతిధ్వనించింది. జన్ లోక్‌పాల్ ఏర్పాటు ద్వారా అవినీతి కళ్లెం రాజ్య వ్యవస్థల ప్రక్షాళనకు ఎలుగెత్తిన అన్నా బృందంలో కీలక సహచరుడిగా కేజ్రీవాల్ ఆమ్‌ఆద్మీ పార్టీ పెట్టినప్పుడు- నయా రాజకీయ సంస్కృతిపై సర్వత్రా కొత్త ఆశ మొలకెత్తింది. 2013లో అధికారానికి వచ్చినా పట్టుమని ఏడు వారాల్లో 'ఆప్' ప్రభుత్వం కుప్పకూలిపోయింది. రాజధాని పౌరుల ఆశలు, ఆకాంక్షల క్రోడీకరణ కోసమంటూ దిల్లీ చర్చలు (దిల్లీ డయలాగ్) నిర్వహించి అందుకు తగ్గ కార్యాచరణ చేపడతామని బులిపించినా- ఆది నుంచే హంస పాదులు వెయ్యడం ప్రారంభించింది. పార్టీ పక్షాన ఎన్నికైన ఎమ్మెల్యేలు చేజారకుండా కాపాడుకోవడానికే పార్లమెంటరీ కార్యదర్శులన్న పదవులు సృష్టించారన్నది నిర్ద్వంద్వం. ఆ పదవుల ద్వారా తాము జీతాలేవీ పొందలేదని ఎమ్మెల్యేలు చెబుతున్నా, క్యాబినెట్ మంత్రి హోదాలో అధికారిక నివాసం సహా ఇతరేతర ప్రయోజనాలెన్నో వారు అనుభవించారన్నదీ వాస్తవం. ప్రభుత్వానికి అనుకూలంగా నడచుకుంటారని, ప్రజాసేవలో నిష్పాక్షికంగా వ్యవహరించలేరనీ భావించినందువల్లే- చట్టసభల సభ్యులు లాభదాయక పదవుల్లో కొనసాగరాదని రాజ్యాంగం నిర్దేశించింది. లాభదాయక పదవి అంటే జీతభత్యాలు తీసుకోవడం ఒక్కటే కాదని, దాని ద్వారా అధికారం, పలుకుబడి సంక్రమించినా దానినీ లాభదాయకమైనదానిగానే పరిగణించాలని సర్వోన్నత న్యాయపాలిక లోగడే స్పష్టీకరించింది. అయినవాళ్లకు అడ్డదారిన లాభదాయక పదవులు వడ్డిస్తే, కడుపులో చల్ల కదలకుండా ఇష్టారాజ్యం వెలగబెట్టగలమనుకొన్న కేజ్రీవాల్ ప్రభుత్వానికి ఈ 'ఆప్'సోపాలు స్వయంకృతమేనని చెప్పాలి!

దేశరాజధాని ప్రాంతంగా దిల్లీ పాలన వ్యవహారాలపై కేంద్రం, కేజ్రీవాల్ సర్కార్ల పని విభజన రాజ్యాంగబద్ధమై ఉన్నా; తక్కిన రాష్ట్రాలకు భిన్నంగా ఎన్నికైన ప్రభుత్వం కంటే గవర్నర్‌కే కార్యనిర్వాహక అధికారాలున్నాయని నిబంధనలు స్పష్టీకరిస్తున్నా- పరిధికి లోబడటం ఒంటికి సరిపడదన్నట్లుగా 'ఆప్' నిర్వాకం వెలగబెడుతోంది. లెఫ్టినెంట్ గవర్నర్ మాటే చెల్లుబాటు అవుతుందని దిల్లీ హైకోర్టు తేల్చిచెప్పినా, దానిపై సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తున్న కేజ్రీ ప్రభుత్వం- ఎమ్మెల్యేల అనర్హత వంటి స్వయంకృతాపరాధాలకూ కేంద్ర సర్కారునే నిందిస్తోంది! రాజ్యాంగాన్ని కాపాడతామంటూ పదవీ ప్రమాణాలు చేసి, దాని మౌలిక స్ఫూర్తి కదలబారిపోయేలా భ్రష్ట నిర్వాకాలు వెలగబెట్టడంలో కేజ్రీవాల్‌కు ముందు, గురివెందకు గురుపాదులు ఎందరో ఉన్నారు! పుష్కర కాలం నాడు జోడు పదవుల స్వారీ చేస్తున్నారంటూ సమాజ్‌వాదికి చెందిన రాజ్యసభ ఎంపీ జయాబచ్చన్ పదవీచ్యుతికి యూపీఏ పాలకులు ఉచ్చు పేనారు. తీరా అది జాతీయ సలహా మండలి అధ్యక్షురాలిగా నిష్పూచీ అధికారాలు చలాయిస్తున్న సోనియా మెడకూ చుట్టుకోనుందన్న ప్రాప్తకాలజ్ఞత కలిగిన మరుక్షణం 2006లో కాంగ్రెస్ గంగవెర్రులెత్తిపోయింది. గత్యంతరం తోచక రాజీనామా చేసి వైదొలగిన సోనియా 'త్యాగమయి'గా అవతరించగా, అందరికీ తలా కొంత ప్రయోజనం కలిగించేలా 'లాభదాయక బిల్లు'ను మన్మోహన్ సర్కారు పార్లమెంటులో నెగ్గించింది. ఆ బిల్లుపై చేవ్రాలు చెయ్యకుండా తిప్పిపంపిన రాష్ట్రపతి అబ్దుల్ కలామ్- దేశమంతటికీ ఏకరీతిన వర్తించేలా హేతుబద్ధ విధివిధానాలు రూపొందించలేదని అసలు లొసుగును వేలెత్తిచూపారు. అది జరిగి పుష్కరకాలమైనా ఏకరీతి నిబంధనావళే కరవు. కాబట్టే, దుర్రాజకీయాలు ఎక్కడికక్కడ గజ్జెకడుతున్నాయి. రాజ్యాంగ వంచనలు భారత ప్రజాతంత్ర క్రతువునే అపహసిస్తున్నాయి!

'ఈశాన్య' పవనాలపై కమలనాథుల ఆశలు



సాధారణంగా ఈశాన్య రాష్ట్రాల ఎన్నికలంటే అంతగా ఆసక్తి ఉండదు. జాతీయ జనజీవన స్రవంతికి దూరంగా ఉండే ఈ ప్రాంత ఎన్నికల ఫలితాలు దిల్లీ రాజకీయాలపై చూపే ప్రభావం పెద్దగా ఉండకపోవడమే ఇందుకు కారణం. కాంగ్రెస్ పార్టీనో, ఇతర ప్రాంతీయ పార్టీలో గద్దెనెక్కడం ఆనవాయితీగా వస్తోంది. ఈ దఫా పరిస్థితి మారనుంది. వచ్చే నెలలో జరగనున్న త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ అసెంబ్లీ ఎన్నికలు ప్రధాన జాతీయ పార్టీలైన భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్, సీపీఐ(ఎం)లకు అగ్నిపరీక్ష కానున్నాయి. అధికారాన్ని సాధించడం, లేదా కనీసం బలమైన ప్రతిపక్షంగా ఆవిర్భవించడం భాజపా లక్ష్యం. మేఘాలయలో ప్రస్తుత ప్రభుత్వాన్ని కాపాడుకోవడం కాంగ్రెస్ ముందున్న కర్తవ్యం. త్రిపురలో సీపీఐ(ఎం) సర్కారుదీ ఇదే పరిస్థితి. 60 స్థానాలు గల ఈ మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల ప్రభావం అక్కడికే పరిమితం కాదు. వచ్చే ఏప్రిల్, మే నెలల్లో కర్ణాటక ఎన్నికలను ఎదుర్కొనేందుకు ఇవి పార్టీలకు బలాన్నిస్తాయి.

మూడు రాష్ట్రాల్లో కీలక ఎన్నికలు

అభివృద్ధే ప్రచారాస్త్రం

2014 వరకు ఈశాన్య రాష్ట్రాల్లో ఉనికే లేని భాజపా అనంతర కాలంలో అక్కడ బలమైన పునాదులే వేసుకుంది. 2016లో జరిగిన అసోం ఎన్నికల్లో సొంతబలంతో అధికారాన్ని సాధించి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. నిరుడు మణిపూర్‌లో మెజారిటీకి చేరువై ఇతరుల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అరుణాచల్‌ప్రదేశ్‌లోనూ ఫిరాయింపుల ద్వారా సర్కారును స్థాపించింది. ఆ ఊపుతో త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్‌ల్లోనూ విజయం సాధిస్తామని కమలనాథులు ఢంకా బజాయిస్తున్నారు. వాస్తవానికి ఈ మూడు రాష్ట్రాల్లో ఎక్కడా భాజపా గతంలో అధికారంలో లేదు. 2013 ఎన్నికల్లో పెద్దగా ఉనికి చాటలేదు. ఈ రాష్ట్రాల్లోని క్రిస్టియన్లు, గిరిజనులు మొదటి నుంచీ భాజపాకు దూరమే. ఈసారి ప్రజల్లో మార్పు వచ్చిందని, తమ పట్ల సానుకూలంగా ఉన్నారని ఆ పార్టీ విశ్వసిస్తోంది. కేంద్రంలో అధికారంలో ఉండటం, నరేంద్ర మోదీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, స్థానిక ప్రభుత్వాలపై ఉండే వ్యతిరేకత తమకు కలిసి వస్తాయని కమలం పార్టీ అంచనా వేస్తోంది. కేవలం లెక్కలు, అంచనాలతోనే సరిపెట్టకుండా అందుకు తగ్గట్లు కార్యాచరణ కూడా చేస్తోంది. ప్రధాని మోదీ ఇప్పటికే ఈ ప్రాంతంలో పర్యటించి అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. తాజాగా గత వారంలో మేఘాలయలో నూతన రహదారి ప్రారంభించారు. వచ్చే రెండేళ్లలో రూ.90వేల కోట్ల వ్యయంతో జాతీయ రహదారులు నిర్మిస్తామని ప్రకటించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిరణ్ రిజిజును నాగాలాండ్, మరో కేంద్రమంత్రి కె.జె.అల్ఫోన్స్‌ను మేఘాలయ, అసోం ఆర్థిక మంత్రి హిమంత్ బిశ్వశర్మను త్రిపుర ఎన్నికల పర్యవేక్షకులుగా ఎప్పుడో నియమించింది. వారు తెరవెనక కసరత్తు మొదలుపెట్టారు. మేఘాలయ, నాగాలాండ్‌ల్లో క్రిస్టియన్లు ఎక్కువ. త్రిపురలో హిందువులు, గిరిజనులు దాదాపు సరిసమానంగా ఉన్నారు. అందువల్లే హిమంత్‌కు త్రిపుర బాధ్యతలు అప్పగించారు. పూర్వాశ్రమంలో కాంగ్రెస్ నాయకుడైన ఆయన ఎన్నికలకు ముందే భాజపాలో చేరారు. అసోం, మణిపూర్‌ల్లో ఎలాంటి బలం లేనప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించామని, ఇదే మాదిరిగా ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లోనూ గెలుస్తామని భాజపా వర్గాలు ధీమాగా ఉన్నాయి.

నాగాలాండ్, మేఘాలయకన్నా త్రిపురపైనే జాతీయస్థాయిలో ఆసక్తి నెలకొంది. 60 స్థానాలు గల ఈ రాష్ట్రంలో రెండు దశాబ్దాలకు పైగా సీపీఐ(ఎం)కు ఎదురులేదు. ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ నీతినిజాయతీ, నిరాడంబరత, వ్యక్తిగత ప్రతిష్ఠ పార్టీకి పెట్టనికోటలా ఉన్నాయి. గతంలో నృపేన్ చక్రవర్తి, దశరథ్‌దేవ్ వంటి సీపీఐ(ఎం) ముఖ్యమంత్రులు పార్టీకి గట్టి పునాదులు వేశారు. ఒక్క 1988-93 మధ్యకాలంలో మాత్రమే ఇక్కడ సీపీఐ(ఎం) ఓడిపోయింది. అప్పట్లో కాంగ్రెస్ తరఫున సుధీర్ రంజన్ మజుందార్, సమీర్ రంజన్ బర్మన్ ముఖ్యమంత్రులుగా పనిచేశారు. 2013 ఎన్నికల్లో భాజపాకు లభించిన ఓట్లు కేవలం 1.4 శాతం. అనంతర కాలంలో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకుని బలపడింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో పెద్దగా ప్రభావం చూపలేదు. వివిధ కారణాల వల్ల కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ బలహీనపడటంతో వాటి స్థానంలో బలపడాలన్నది కమలం వ్యూహం. ప్రస్తుత ఎన్నికల్లో సీపీఐ(ఎం)కు భాజపానే బలమైన ప్రత్యర్థి. రాష్ట్రంలో పార్టీకి శక్తిమంతులైన నాయకులు లేరు. ప్రభుత్వ వ్యతిరేకత, కాంగ్రెస్ వైఫల్యం, కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రారంభించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు, హిందూత్వ నినాదాలతో ముందుకు వెళ్లాలన్నది కమలం వ్యూహం. ఇండీజినియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ)తో పొత్తు పెట్టుకుని బలపడేందుకు ప్రయత్నిస్తోంది. సీపీఐ(ఎం) సర్కారు హామీ మేరకు ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించలేదని, ప్రభుత్వ ఉద్యోగులకు వేతన సవరణ అమలు చేయలేదని, ఇవన్నీ తమకు కలిసివచ్చే అంశాలని అంచనా వేస్తోంది. మరో పక్క అధికారాన్ని కాపాడుకునేందుకు సీపీఐ(ఎం) సర్వశక్తులు ఒడ్డుతోంది. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, మాణిక్ సర్కార్ వ్యక్తిగత ప్రతిష్ఠతో అది ముందుకు వెళుతోంది. పార్టీ జాతీయ నాయకత్వం కూడా పకడ్బందీ వ్యూహరచన చేస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని రెండు లోక్‌సభ స్థానాలనూ కైవశం చేసుకున్న సీపీఐ(ఎం) క్షేత్రస్థాయిలో బలంగానే ఉంది. పార్టీ సిద్ధాంతాలను పక్కనపెట్టి ఇటీవల కాలంలో ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ గుళ్లూగోపురాలు సందర్శిస్తున్నారు. భాజపా హిందూత్వ నినాదాన్ని బలహీనపరచాలన్న లక్ష్యంతో గుజరాత్ ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ మాదిరిగా, మాణిక్ సర్కార్ చేస్తున్నారన్నది రాజకీయ విశ్లేషకుల భావన. ఇతర ఈశాన్య రాష్ట్రాల్లో మాదిరి కాకుండా శాంతికి మారుపేరుగా త్రిపుర మారిందని ఘనంగా ప్రకటిస్తున్నారు. తమ సిఫార్సు మేరకు కేంద్రం 2015 జూన్‌లో రాష్ట్రంలో సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని ఎత్తివేయడమే ఇందుకు నిదర్శనమని వెల్లడిస్తున్నారు. కాంగ్రెస్ పరిస్థితి అచేతనంగా ఉంది. రాహుల్ గాంధీ ప్రచారంపైనే అది ఆధారపడనుంది. పశ్చిమ్ బంగ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పరిస్థితీ అంతే. బంగలో మాదిరిగా త్రిపురలోనూ సీపీఐ(ఎం)ను గద్దె దించాలన్నది దీదీ లక్ష్యమైనప్పటికీ, సమీప భవిష్యత్తులో అది సాధ్యం కాదన్నది ఆమెకు తెలియనిది కాదు.


మాణిక్ సర్కార్ (త్రిపుర)


ముకుల్ సంగ్మా (మేఘాలయ)


టీఆర్ జెలియాంగ్ (నాగాలాండ్)

కాంగ్రెస్‌కు ఎదురుగాలి

మేఘాలయలో ముఖ్యమంత్రి ముకుల్ సంగ్మా నాయకత్వంలోని కాంగ్రెస్ సర్కారు కొనసాగుతోంది. ప్రస్తుతం ఈశాన్య ప్రాంతంలో పార్టీ అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం ఇదే. గత ఎన్నికల్లో 30 స్థానాలు సాధించిన కాంగ్రెస్, మిత్రపక్షమైన యూడీపీ మద్దతుతో నెట్టుకొస్తోంది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని రెండు స్థానాలనూ కాంగ్రెస్ గెలుచుకున్నప్పటికీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. 2010 నుంచి ముఖ్యమంత్రిగా పనిచేస్తున్న ముకుల్ సంగ్మాపైనే కాంగ్రెస్ పార్టీ ఆధారపడుతోంది. రాహుల్ గాంధీ ప్రచారానికి వచ్చినప్పటికీ సంగ్మానే కీలకం కానున్నారు. ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు, పార్టీలో అంతర్గతంగానూ ఆయన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీఎంపై తమ అసంతృప్తిని అధిష్ఠానం పట్టించుకోనందుకు నిరసనగా ఇటీవల కొందరు ఎమ్మెల్యేలు రాజీనామా చేయడం ఎన్నికల సమయంలో పార్టీకి పెద్ద ఎదురుదెబ్బ. వీరిలో కొందరు భాజపాలో, మరి కొందరు నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ)లో చేరారు. లోక్‌సభ మాజీ స్పీకర్ పీఏ సంగ్మా కుమారుడైన కాన్‌రడ్ కె.సంగ్మా ఈ పార్టీకి సారథి. ప్రస్తుతం ఇదే ప్రధాన ప్రతిపక్షం. ఎన్‌డీఏలో ఎన్‌పీపీ భాగస్వామి అయినప్పటికీ ప్రస్తుతం భాజపాతో పొత్తు పెట్టుకోరాదని నిర్ణయించింది. అరవై స్థానాలు గల నాగాలాండ్‌లో మొదటి నుంచీ రాజకీయ అస్థిరత నెలకొంది. నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) ఆధ్వర్యంలోని సంకీర్ణ సర్కారు పని చేస్తోంది. ఇందులో భాజపా భాగస్వామి. ముఖ్యమంత్రి టీఆర్ జెలియాంగ్ పార్టీకి పెద్దదిక్కు. మళ్ళీ గెలిచేందుకు జెలియాంగ్ విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. భాజపా, ఎన్‌పీఎఫ్ సంబంధాలు సజావుగా లేవు. ఎన్‌పీఎఫ్ నుంచి బయటకు వచ్చి సొంత కుంపటి పెట్టుకున్న మాజీ ముఖ్యమంత్రి నైఫియు రియోతో పొత్తు కోసం భాజపా పావులు కదుపుతోంది. మోదీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూపి ముందుకు వెళ్లాలని చూస్తోంది. కాంగ్రెస్ పరిస్థితి దయనీయంగా ఉంది. దానికి సరైన నాయకులు లేరు. ప్రస్తుత ఎన్నికల్లో నాగా శాంతి ఒప్పందం కీలకం కానుంది. మొత్తం మీద మూడు ఈశాన్య రాష్ట్రాల ఎన్నికలు ప్రాంతీయ పార్టీల కన్నా జాతీయ పార్టీలకే ఎక్కువగా ముచ్చెమటలు పట్టిస్తున్నాయి.

- గోపరాజు మల్లపరాజు

అనుక్షణం అప్రమత్తం



ఈశాన్య రాష్ట్రాల పేరు చెప్పగానే ముందుగా శాంతిభద్రతల అంశం తెరపైకి రావడం సహజం. నిత్యం వివిధ వర్గాలు, తెగలు- పోలీసుల మధ్య ఘర్షణలు చోటుచేసుకొంటాయి. ఈ నేపథ్యంలో ఈ మూడు రాష్ట్రాల్లో మొత్తం 30 వేలమంది పోలీసు బలగాలను మోహరించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. పరిస్థితి ప్రస్తుతానికి ప్రశాంతంగానే ఉంది. శాంతిభద్రతల పరిస్థితి సంతృప్తికరంగా ఉండటంతో త్రిపురలో కేంద్రం 2015లో సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని తొలగించింది. నాగాలాండ్ పరిస్థితి నేటికీ సమస్యాత్మకమే. ఇక్కడ సాయుధ దళాల చట్టం ఇప్పటికీ అమలులో ఉంది. నాగాలకు, ఇతర వర్గాలకు గొడవలు; నాగావర్గాల్లో అంతర్గత ఘర్షణల కారణంగా రాష్ట్రంలో పరిస్థితి ఎప్పుడూ కత్తిమీద సాములాగానే ఉంటుంది. ఈ నేపథ్యంలో అవసరమైతే బలగాల సంఖ్యను పెంచే అవకాశం ఉంది. మేఘాలయ కూడా ఇందుకు భిన్నమేమీ కాదు. ఇక్కడా సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం అమలులో ఉంది. రాష్ట్రంలో వివిధ తెగల మధ్య అంతర్గతంగా విభేదాలు నెలకొన్నాయి. ఇటీవల భోపాల్‌లో జరిగిన పోలీసు ఉన్నతాధికారుల సమావేశంలో ప్రధాని మోదీ, హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రత్యేకంగా ఈశాన్య రాష్ట్రాల పరిస్థితిపై చర్చించారు. తాజాగా ఎన్నికల ప్రకటన నేపథ్యంలో ఎన్నికల సంఘం సూచన మేరకు 150మందికి పైగా పోలీసు అధికారులను బదిలీ చేశారు. నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు ఈ చర్య దోహదపడుతుందని ఎన్నికల సంఘం అభిప్రాయపడుతోంది.

ఆంక్షలు దాటి... ఆర్థిక శక్తిగా

ప్రస్తుతం రష్యా ఆర్థికస్థితి ఎలా ఉంది? మూడు కారణాల వల్ల ఈ ప్రశ్నకు విశేష ప్రాముఖ్యం ఏర్పడింది. ఒకటి రష్యాలో బోల్షెవిక్ విప్లవం (1917) జరిగి 2017తో నూరేళ్లు పూర్తవడం. రెండు- సోవియట్ యూనియన్ పతనమై (1991) 25 ఏళ్లు దాటిపోవడం, మూడు- ఈ ఏడాది మార్చి 18న అధ్యక్ష ఎన్నికలు జరగనుండటం. ఈ ఎన్నికల్లో వ్లాదిమిర్ పుతిన్ నాలుగోసారి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఖాయమే. ఈ నేపథ్యంలో నేడు రష్యా ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలేమిటి, అమెరికా, పశ్చిమ ఐరోపా దేశాలు విధించిన ఆర్థిక ఆంక్షలు రష్యాను ఆర్థికంగా దెబ్బతీశాయా అన్నది విశ్లేషించడం సముచితంగా ఉంటుంది.

పటిష్ఠ పునాదులు

1917 విప్లవం ద్వారా అధికారంలోకి వచ్చిన వెంటనే బోల్షెవిక్కులు మార్క్స్ భావజాలానికి అనుగుణంగా సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ స్థాపనకు పునాది వేశారు. వ్యవసాయ భూములు, పరిశ్రమలు, బ్యాంకులను జాతీయం చేశారు. వెంటనే అంతర్యుద్ధం విరుచుకుపడి ఆహార సంక్షోభానికి దారితీయడంతో దాని నుంచి గట్టెక్కడానికి బోల్షెవిక్ ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాన్ని చేపట్టక తప్పలేదు. అది చక్కని ఫలితాలు ఇవ్వడం వల్ల 1929లో యావత్ ప్రపంచం ఆర్థికంగా కుంగుబాటుకు లోనైనా, సోవియట్ ఆర్థిక వ్యవస్థ చెక్కుచెదరలేదు. రెండో ప్రపంచయుద్ధం మొదలయ్యేటప్పటికి సోవియట్ పారిశ్రామికంగా పటిష్ఠమైన పునాది వేసుకుని ఉంది. యుద్ధానంతరం 1950 నుంచి 1975 వరకు ఏటా అయిదు శాతం ఆర్థికాభివృద్ధి రేటును అందుకునేది. ఆ తరవాత అమెరికా కూటమితో ప్రచ్ఛన్న యుద్ధం, అఫ్గాన్ యుద్ధం, స్వదేశంలో అవినీతి, ద్రవ్యోల్బణం, కార్ఖానాల్లో కార్మికుల గైరు హాజరీ పెరగడం, అధికారులు ఉత్పత్తిని, అభివృద్ధిని ఉన్నదానికన్నా ఎక్కువ చేసి చూపడం వంటి కారణాల వల్ల సోవియట్ ఆర్థిక వ్యవస్థ క్రమంగా సంక్షోభంలోకి జారిపోయింది. 1985లో పగ్గాలు చేపట్టిన గోర్బచెవ్ పెరెస్త్రోయికా (పునర్వ్యవస్థీకరణ) పేరిట సంస్కరణలు చేపట్టి ఆర్థిక రథాన్ని గాడిన పెట్టాలని చూసి విఫలమయ్యారు. సంస్కరణలు అరకొరగా ఉండటమేకాదు, అవి చాలా ఆలస్యంగా చేపట్టినవి కావడంతో 1991నాటికి సోవియట్ కుప్పకూలిపోయింది. ఆ సంవత్సరం ఆర్థికాభివృద్ధి రేటు మైనస్ 17 శాతానికి పడిపోయి, కరెన్సీ విలువ పతనమై, ద్రవ్యోల్బణం కట్టలు తెంచుకుంది. 1998లో పాత అప్పులు తీర్చలేని దుస్థితి దాపురించింది. ఆపైన బోరిస్ ఎల్సిన్, పుతిన్‌లు చేపట్టిన సంస్కరణలవల్ల 1999 నుంచి పరిస్థితి కుదుటపడసాగింది. తదుపరి దశాబ్దంలో రష్యా మళ్ళీ అయిదు శాతానికి పైగా వృద్ధిరేటు అందుకొంది. 2008లో ప్రపంచమంతటా ఆర్థిక మాంద్యం నెలకొన్నా, అధిక చమురు ధరల పుణ్యమా అని రష్యా గట్టెక్కగలిగింది. ఇప్పుడు మళ్ళీ సంక్షోభం ముంగిట తారట్లాడుతోంది. దీనికి ప్రధాన కారణం- క్రిమియాను ఆక్రమించుకున్నందుకు రష్యాపై అమెరికా, ఐరోపా సమాఖ్య (ఈయూ) విధించిన ఆర్థిక ఆంక్షలే. ఇందుకు ప్రతిగా రష్యా సైతం అమెరికా, ఈయూలపై ఆంక్షలు విధించింది.

2016లో రష్యా 28,500 కోట్ల డాలర్ల విలువైన ఎగుమతులు చేయగా, వాటిలో 55 శాతం ఒక్క ఐరోపా సమాఖ్య (ఈయూ) దేశాలకే జరిగాయి. తరవాతి స్థానాలను నెదర్లాండ్స్ (10.2 శాతం), చైనా (9.8), జర్మనీ (7.4), అమెరికా (3.3), బ్రిటన్ (2.5), ఉక్రెయిన్ (2.2 శాతం) ఆక్రమించాయి. రష్యా ప్రధానంగా చమురు, ఆయుధాలను ఎగుమతి చేస్తోంది. రష్యన్ చమురు, సహజ వాయువులు లేకుండా ఐరోపా దేశాలకు గడవదు కాబట్టి ఈ రెండింటి ఎగుమతిపై ఆంక్షలు విధించలేదు. ఉక్రెయిన్ చమురు అవసరాల్లో 98 శాతానికి రష్యన్ ఎగుమతులే ఆధారం. జర్మనీ (30 శాతం), ఫ్రాన్స్ (17 శాతం), ఇటలీ (28), బెల్జియం (30), బ్రిటన్ (13), గ్రీస్ (40 శాతం) చమురు అవసరాల కోసం రష్యాపై ఆధారపడుతున్నాయి. 2015లో పీపాకు 50 డాలర్లుగా ఉన్న చమురు ధర, నేడు 70 డాలర్లకు పెరిగింది. ఇది రష్యాకు ఆర్థికంగా ఎంతో ఊరటనిస్తుంది. చమురు ఆదాయం పెరుగుతున్నకొద్దీ రష్యా ఆర్థిక పరిస్థితి కుదుటపడి విదేశ ద్రవ్యనిల్వలు ఇనుమడిస్తాయి. దాదాపుగా రష్యా ఆయుధ ఎగుమతులన్నీ ఐరోపాయేతర దేశాలకే జరుగుతాయి. కానీ బ్రిటన్, ఫ్రాన్స్‌లతో గతంలో కుదిరిన కొన్ని ఒప్పందాలకు మాత్రం విఘాతం కలుగుతోంది. చమురు అన్వేషణకు ఉపయోగించే యంత్రాలు, వ్యవసాయ పరికరాలు, మోటారు వాహనాలను రష్యా దిగుమతి చేసుకొంటుండగా చమురు అన్వేషణ యంత్రాలపై మాత్రమే ఆంక్షలు విధించారు. దీనికి ప్రతిగా మోటారు వాహనాలు, వ్యవసాయ యంత్రాలను కూడా ఈయూ దేశాల నుంచి దిగుమతి చేసుకోబోమని రష్యా ప్రకటించింది. దీనివల్ల ఇటలీ, పోలండ్ తదితర ఈయూ దేశాలు నష్టపోతున్నాయి. రష్యా, అమెరికాల మధ్య నేరుగా చెప్పుకోదగిన వ్యాపార సంబంధాలు లేవు కాబట్టి ఆంక్షల ప్రభావం అతి స్వల్పం. అదీ కాకుండా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాటలకు చేతలకూ పొంతనే ఉండదు. రష్యాతో సమస్యలన్నింటినీ పరిష్కరించుకొంటానని ఎన్నడో ప్రకటించిన ట్రంప్ కనీసం ఆంక్షలనైనా ఎత్తివేయలేదు. రష్యాను మళ్ళీ జి-8 దేశాల బృందంలోకి చేర్చుకోవాలని జపాన్ అంటున్నా ఆ దిశగా అడుగు ముందుకు పడలేదు. రష్యా రాజకీయ వ్యవస్థ, దాని ఆర్థిక పునాదులు పటిష్ఠంగా ఉన్నాయి. తనను తాను మరింత పరిపుష్టం చేసుకోవాలంటే రష్యా డాలర్లు, యూరోల్లో కాకుండా సొంత కరెన్సీ రూబుళ్లలోనే వ్యాపారం నిర్వహించాలి. ఇతర దేశాల కరెన్సీలో తీసుకున్న రుణాలు, వాటిపై వడ్డీని తన కరెన్సీలో చెల్లించే విధంగా ఒప్పందాలు కుదుర్చుకోవాలి. ప్రధానంగా చమురు ఎగుమతులపైనే ఆధారపడకుండా వివిధ రకాల సరకులు, సేవలను ఎగుమతి చేయాలి. రష్యా ఐరోపా నుంచి తన దృష్టిని ఆసియావైపు మళ్లిస్తూ చైనా, భారత్, కొరియాలతో వ్యాపార సంబంధాలను విస్తరించుకొంటోంది. రష్యన్ ఐటీ, ఐటీ ఆధారిత సేవల రంగాన్ని పటిష్ఠపరచడానికి భారత్ ఎంతో తోడ్పడగలదు.


పుతిన్ సారథ్యంలో రష్యా పయనం

భవిష్యత్తు ఎలా ఉంటుంది?

చమురు ధరలు పడిపోయినా, అమెరికా, ఈయూలు ఆర్థిక ఆంక్షలు విధించినా రష్యా దెబ్బతినకుండా నిలదొక్కుకొందని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) 2017 నివేదిక ధ్రువీకరించింది. 2018లో రష్యా వృద్ధిరేటు 1.4 శాతంగా ఉంటుందని అంచనా కట్టింది. 2014లో రష్యా కరెన్సీ విలువ తగ్గినా 2017లో తిరిగి కోలుకుంది. 2014లో ఒక డాలర్ ధర 80 రూబుళ్లు. 2017లో 56 రూబుళ్లకే ఒక డాలర్ లభించడమే దీనికి నిదర్శనం. రష్యా దగ్గర 45 వేల కోట్ల డాలర్ల విదేశ ద్రవ్య నిల్వలు ఉన్నాయి. కాబట్టి తన కరెన్సీ విలువ తగ్గకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్త పడగలదు. ప్రస్తుతం రష్యాలో ద్రవ్యోల్బణం అదుపులోనే ఉంది. ఈ మధ్య రష్యాకు మళ్ళీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐలు) వస్తున్నాయి. 2016లో ఈ మార్గంలో 3,600 కోట్ల డాలర్లు ప్రవహించగా, ఒక్క భారతదేశమే 800 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టింది. వ్యాపార సౌలభ్య సూచీలో 2012లో 118వ స్థానంలో ఉన్న రష్యా, 2017లో 35వ స్థానానికి ఎగబాకింది. ఎన్ని ఆంక్షలున్నా రష్యా ఈ విజయం సాధించడం ప్రశంసనీయం. భారత్-రష్యా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ప్రస్తుత 700 కోట్ల డాలర్ల నుంచి 3,000 కోట్ల డాలర్లకు పెంచాలని మోదీ-పుతిన్‌లు నిశ్చయించారు. తన భూభాగంలో దూరప్రాచ్య ప్రాంతాలను అభివృద్ధి చేయడంపై ప్రస్తుతం రష్యా దృష్టి కేంద్రీకరించిన దృష్ట్యా, భారతీయ సంస్థలు రష్యాలో పెట్టుబడి పెట్టడానికి ఇదే సరైన సమయం. అమెరికా, ఈయూలు విధించిన ఆర్థిక ఆంక్షలను ఖాతరు చేయకుండా రష్యా వృద్ధి పథంలో దూసుకెళ్తోంది. పుతిన్ పాలనలో రష్యా బలంగా సుస్థిరంగా నిలచింది. బలమైన రష్యా, ఐరోపాతోపాటు యావత్ ప్రపంచ సుస్థిరతకు తోడ్పడుతుంది. పటిష్ఠ రష్యా ప్రపంచ రాజకీయ యవనికపై భారత్‌కు బలీయ అండగా నిలుస్తుంది.

- ఎ.శ్రీహరి నాయుడు

(రచయిత- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ సంస్థలో ఆర్థికవేత్త)

ఆధ్యాత్మికత

భగవానుడి అనుగ్రహానికి సంబంధించి, భారతీయ ధర్మగ్రంథాలు మూడు ముఖ్యాంశాల్ని ప్రస్తావించాయి. అవి: మనిషిగా జన్మించడం, ఆధ్యాత్మిక వికాసాన్ని కాంక్షించడం, అసలైన గురువును పొందగలగడం.

ఆధ్యాత్మిక ఎదుగుదలకు ప్రమాణం ఏమిటి, దాన్ని ఏ విధంగా తెలుసుకోగలం అనే ప్రశ్నలు సహజంగానే ఎదురవుతాయి. వాటికి సమాధానం ఒక్కటే- మానసిక ప్రశాంతత సాధించడం!

ఎటువంటి సమస్యలు, బాధలు లేకుండా పరిపూర్ణమైన ఆనందంతో జీవితాన్ని గడపడమే ఆధ్యాత్మికత కాదు. ఈ ప్రపంచంతో మనిషి ఒక సంబంధం, ప్రత్యక్ష జ్ఞానం ఏర్పరచుకుంటాడు. వాటి ద్వారా స్థిరత్వం పొందడం అతడికి ముఖ్యావసరం. అది బాధ్యతతో పాటు, ఇతరుల పట్ల స్పృహ కలిగి మెలిగే మానసిక స్థితిని మానవుడికి కల్పిస్తుంది. ఆ స్థాయిలోనే అతడి జీవన మార్గంలో సేవ, దానగుణం వంటివి చోటుచేసుకుంటాయి.

ఏ మనిషిలోనైనా సర్వసహజంగా విభిన్న వ్యక్తిత్వ ధోరణులుంటాయి. అవన్నీ సమగ్ర రీతిలో ఏక స్వరం వినిపించడమే ఆధ్యాత్మికత! ఒకే లాంటి కోరికలు, నమ్మకాలు, నియమాలు అతణ్ని ఏకైక లక్ష్యం వైపు నడిపిస్తాయి. అప్పుడే ఆధ్యాత్మికత ఓ సృజనాత్మక ప్రక్రియగా గుర్తింపు అందుకుంటుంది. స్వచ్ఛమైన ప్రేమ, దయ, కరుణ, సమర్పణ భావం, కృతజ్ఞత, నమ్మకం, పవిత్రత- ఇవన్నీ ఆధ్యాత్మిక లక్షణాలే అయినా ఏవీ ఒక్కసారిగా ఊడిపడవు. పుట్టుకతో సంక్రమించేవీ కావు. మరొకరి నుంచి ఆశించే బహుమానాలు అంతకన్నా కావు.

ఈ గుణాలు ప్రతి ఒక్కరూ అలవరచుకోవాల్సినవి. ఎంపిక చేసుకోవడం మీదే అంతా ఆధారపడి ఉంటుంది. ఇటువంటి లక్షణాలన్నీ మనిషి లోపల అంతర్గతంగా నిరీక్షిస్తుంటాయి. ఎప్పుడు బయటకు రావాలా అని ఎదురుచూస్తుంటాయి. ఇవి బయటపడటం, పడకపోవడం అనేది మనిషి జీవన వైఖరి అనుసరించి నిర్ణయమవుతుంది. ఉత్తమ గుణాల వెల్లడికి ఏ ఒక్కరూ జీవితాంతం నిరీక్షించాల్సిన పని లేదు. జీవన పరిస్థితి మెరుగుపడ్డాక అలవరచుకోవచ్చని వాయిదా వేసుకోవడమూ సరి కాదు.

క్షమాగుణం క్రమేణా కాలానుగుణంగా వృద్ధి చెందుతుంటుంది. మనిషి చేసే తప్పుడు పనులకు అతడి అజ్ఞానమే కారణమన్నది నిర్వివాదం. అది తెలుసుకోవాలన్నా, అతడిలో ముందుగా అవగాహన పెరగాలి. అనుక్షణం మనిషి తనను తాను సమీక్షించుకోవాలి. భిన్న పరిస్థితులు ఎదురైనప్పుడు, వాటిని తన అవగాహనా శక్తి మేరకు ఎదుర్కొంటూ ముందుకు సాగిపోవాలి.



అంతర్యామి

ఏ పరిస్థితినైనా అధిగమించేందుకు ప్రథమంగా కావాల్సింది- స్థితప్రజ్ఞత. ఆలోచనలకే మానవుడు ప్రాధాన్యమివ్వాలి. అన్నింటికీ అర్థాలు అన్వేషించే పని మానుకోవాలి. స్పృహతో కాలం గడుపుతుంటే సమస్థితి సాధ్యపడుతుంది. ప్రతిదానికీ కారణాలు అన్వేషించడం వల్ల ఉపయోగం ఉండదు. ఎందుకిలా అయింది, అలా ఎందుకు కాలేదు వంటి తర్క వితర్కాలతో మనిషి సాధించేదేదీ లేదు.

జీవితంలో అన్నీ కలిగి ఉంటేనే గుర్తింపు లభిస్తుందన్న ధోరణి నుంచి ఎంత త్వరగా బయటపడితే అంత మంచిది. అనుకూల పరిస్థితులు ఉన్నప్పుడు, అంతా మంచే జరుగుతున్నప్పుడు మనిషి తనకు దైవానుగ్రహం ఉందనుకుంటాడు. అదే దైవకృప నీడలా తన వెంట వస్తుందన్న వాస్తవాన్ని అతడు గ్రహించగలగాలి. స్వీకరించే మనసు ఉండాలే గాని, ఆధ్యాత్మిక జ్ఞానం సదా సర్వదా మానవుడి కోసమే!

ఒక ఉన్నత మానసిక స్థితికి చేరుకున్నాక, ఆధ్యాత్మిక జీవనాన్ని వివేకమే నడిపిస్తుంది. అదే, సాధకుడికి ప్రశాంతత చేకూరుస్తుంది. అతడి పెదవుల పైకి పసివాడి స్వచ్ఛమైన నవ్వును తెస్తుంది. ఎలాగైనా గమ్యం చేరుకోవాలన్న విపరీత తాపత్రయం లేనప్పుడే, జీవన యానం సుఖంగా సాగుతుంది. అందులోని ఆనందమంతా సాధకుడి సొంతమవుతుంది!

- మంత్రవాది మహేశ్వర్

ముర్రుపాలకు దూరం.. వ్యాధులతో భారం!

- ఆస్పత్రి కాన్పుల్లోనూ 30 శాతం శిశువులు తల్లిపాలకు దూరం
- పుట్టిన తొలిగంటలో ముర్రుపాలు ఇస్తేనే బిడ్డకు ఆరోగ్యం
- జబ్బుల బారిన పడుతున్న 22 శాతం మంది బిడ్డలు
- అదనపు ఆహారం విషయంలోనూ ఇదే పరిస్థితి..

ఈనాడు, సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి

ఆస్పత్రుల్లో పుట్టిన బిడ్డలకు మొదటిగంటలో చాలామందికి తల్లి ముర్రుపాలు అందడం లేదని తేలింది. దేశవ్యాప్తంగా 80 శాతం గర్భిణులకు ఆస్పత్రుల్లోనే కాన్పులు జరుగుతున్నా.. 50 శాతం మంది శిశువులకు మాత్రమే తొలి గంటలో తల్లి పాలు అందుతున్నట్లు జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) అధ్యయనంలో వెల్లడైంది. 30 శాతం మంది బిడ్డలకు వెంటనే తల్లిపాలు అందడం లేదు. తల్లిపాలు అందని వారిలో 22 శాతం మంది శిశువులు తర్వాత తీవ్ర వ్యాధుల బారిన పడుతున్నట్లు గుర్తించారు. తక్కువ బరువు, పోషకాహార లోపం వంటి సమస్యలతో మరణిస్తున్న వారి సంఖ్య కూడా అధికంగానే ఉంటున్నట్లు ఎన్ఐఎన్ అధ్యయన నివేదికలో పేర్కొంది.

చిన్నారులు జీవితాంతం ఆరోగ్యంగా ఉండాలంటే పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించాలి. తెలుగు రాష్ట్రాలతోపాటు పలు రాష్ట్రాల్లో ఈ విషయంలో ఆస్పత్రులు, తల్లులు జాగ్రత్తలు తీసుకోవడం లేదని ఎన్ఐఎన్ గుర్తించింది. ఆస్పత్రుల్లో కాన్పవగానే శిశువును తల్లి వద్దకు చేర్చి ముర్రుపాలు ఇప్పించాల్సిన బాధ్యత వైద్యులు, ఆస్పత్రులదే. కాన్పు తర్వాత చనుబాలు రావడం లేదని బిడ్డకు పాలు పట్టించడం మానేస్తున్నట్లు ఈ పరిశీలనలో తేలింది. బిడ్డతో చనుబాలు తాగించే అలవాటు చేస్తే మొదటి పది నిమిషాల్లో ముర్రుపాలు రాకపోయినా తర్వాత వస్తాయని వైద్యులు చెబుతున్నారు. ఈ ప్రయత్నం కూడా చేయకుండా పోతపాలుగానీ, పట్టిక బెల్లం, తేనె కలిపిన నీళ్లో పట్టించేస్తున్నారని తేలింది. ఆస్పత్రి కాన్పుల్లో 80 శాతం మందిలో 50 శాతం మొదటి గంటలో ముర్రుపాలు పట్టిస్తుండగా, ఇవి అందని 30 శాతం మందిలో 22 శాతం శిశువులు మరణించడమో, వివిధ రకాల వ్యాధులకు గురికావడమో జరుగుతున్నట్లు ఎన్ఐఎన్ పరిశీలనలో తేలింది. ఆరు నెలలపాటు తల్లిపాలను పట్టిచ్చిన తర్వాత ఏడో నెల నుంచి బిడ్డకు అదనపు ఆహారం ఇప్పించాలని ఎన్ఐఎన్ ప్రతినిధి తెలిపారు. దీనివల్ల బిడ్డ బరువు పెరగడంతోపాటు పోషకాలు కూడా అందుతాయి. పుట్టిన బిడ్డల్లో 20 శాతం పోషకాహార లోపంతో ఉంటే ఏడాది తర్వాత పరీక్షించినప్పుడు ఈ లోపం 40 శాతం మందిలో కన్పించినట్లు ఎన్ఐఎన్ గుర్తించింది.

మహారాష్ట్ర ఆదర్శం..


ముర్రుపాలు ఇచ్చే విషయంలో మహారాష్ట్ర ఆదర్శంగా నిలిచింది. ఈ రాష్ట్రంలో ఆస్పత్రులు, ఇళ్ల వద్ద కాన్పుల తర్వాత 76 శాతం మంది శిశువులకు పుట్టిన వెంటనే తల్లిపాలు లభ్యమవుతున్నాయి. అతితక్కువగా గుజరాత్‌లో 14.1 శాతం శిశువులకే ముర్రుపాలు అందుతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో 34.9 శాతం మంది శిశువులకు మాత్రమే తల్లిపాలు అందుతున్నట్లు గుర్తించారు.


అదనపు ఆహారం అందడం లేదు..

ఆరు నెలల తర్వాత శిశువులకు అదనపు ఆహారం అందించే విషయంలోనూ తల్లులు ముందడుగు వేయడం లేదు. ఒడిశాలో అధికంగా 64 శాతం మంది పిల్లలకు అదనపు ఆహారం అందుతుండగా.. కర్ణాటకలో 3.3 శాతం, రాజస్థాన్‌లో 7.7 శాతం మంది చిన్నారులకే అందుతున్నట్లు తేలింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో 36.3 శాతం మంది శిశువులకే అదనపు ఆహారం అందుతోంది.

మరేం చేయాలి..

రాష్ట్ర ప్రభుత్వాలు ముర్రుపాల ప్రాధాన్యాన్ని పెద్ద ఎత్తున ప్రచారం చేయాలి. ఆస్పత్రి కాన్పుల్లో తప్పనిసరిగా బిడ్డ పుట్టిన తొలిగంటలోనే తల్లి పాలు పట్టించేలా చర్యలు తీసుకోవాలి. చిన్నారులకు అయిదేళ్ల వయసు వరకు పోషకాలు అందించడంలోనూ తీసుకొనే జాగ్రత్తలపై తల్లులకు అవగాహన కలిగించాలని ఎన్ఐఎన్ నిపుణులు సూచిస్తున్నారు. ముర్రుపాల వల్ల బిడ్డలకు పలువ్యాధులు దూరమవుతాయని ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన ఎన్ఐఎన్ సీనియర్ శాస్త్రవేత్త డా. ఆవుల లక్ష్మయ్య 'ఈనాడు'తో పేర్కొన్నారు.





నేడు 112 మంది ప్రతిభావంత మహిళలకు రాష్ట్రపతి పురస్కారాలు

అవార్డులు అందుకోనున్న తెలుగు అతివలు

ఈనాడు, దిల్లీ: వివిధ రంగాల్లో విశేష ప్రతిభాపాటవాలు చూపిన 112 మంది మహిళామణులను రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ శనివారం సన్మానించి, పురస్కారాలు ప్రదానంచేయనున్నారు. వివిధ రంగాల నుంచి 227మంది మహిళల పేర్లను సేకరించి అందులో 112 మందిని మహిళా శిశుసంక్షేమ శాఖ ఎంపికచేసింది. శనివారం సాయంత్రం రాష్ట్రపతిభవన్‌లోజరిగే కార్యకార్యక్రమంలో వీరందర్నీ పురస్కారాలతో గౌరవించనున్నారు. వివిధరంగాల్లో తొలిసారి అడుగుపెట్టి చరిత్ర సృష్టించిన అతివలను ఇందుకోసం ఎంపికచేశారు. తొలి మిసైల్‌ప్రాజెక్ట్ హెడ్, శ్మశానం నిర్వహిస్తున్న తొలిమహిళ, తొలి ఒలింపిక్ పతకం సాధించినవారు.. వివిధ రంగాల్లోకి తొలిసారి అడుగులేసిన మహిళల వివరాలను సేకరించి ఈ గౌరవానికి ఎంపికచేశారు. ఇందులో తెలుగురాష్ట్రాలకు చెందిన పీవీ సింధు (ఒలింపిక్‌లో రజత పతకం గెలిచిన తొలి మహిళ), కరణం మల్లేశ్వరి (ఒలిపింక్‌పతకం గెలిచిన తొలి మహిళా వెయిట్‌లిఫ్టర్), వంకదారత్ సరిత (దిల్లీ తొలిమహిళా బస్ డ్రైవర్), సైనా నెహ్వాల్ (ఒలింపిక్ పతకం గెలిచిన తొలి మహిళా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి), టెస్సీ థామస్ (మిసైల్ ప్రాజెక్టుకు నేతృత్వం వహించిన తొలి మహిళ), కెప్టెన్ శోభా కె.మణి (నార్త్ ఈస్ట్ షటిల్స్ పేరుతో విమానయానసంస్థ ఏర్పాటుచేసిన తొలిమహిళ), మిథాలీరాజ్ (6వేల పరుగులు చేసిన తొలి మహిళాక్రికెటర్), సాజిదాఖాన్ (తొలి మహిళా మ్యాజిక్ టెక్నీషియన్), సానియామీర్జా (డబ్ల్యూటీఏ డబుల్‌ర్యాంకింగ్స్‌లో తొలి నం.1ర్యాంకర్), శోభనాకామినేని (సీఐఐకి నేతృత్వంవహించిన తొలి మహిళ), గాయని కేఎస్‌చిత్ర (బ్రిటిష్ పార్లమెంటు గౌరవం పొందిన తొలిమహిళా గాయకురాలు) ఉన్నారు.

ఎంసెట్ అయిదు రోజులు

- ఇంజినీరింగ్ 3, అగ్రికల్చర్ 2 రోజుల చొప్పున ఆన్‌లైన్లో నిర్వహణ
- ఈ నెలాఖరు నుంచి నమూనా పరీక్షలు
- ప్రవేశ పరీక్షల కన్వీనర్ల సమావేశంలో నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ఎంసెట్‌ను ఆన్‌లైన్లో మొత్తం అయిదు రోజులపాటు నిర్వహించనున్నారు. అందులో ఇంజినీరింగ్‌కు మూడు రోజులు (ఆరు పరీక్షలు)...అగ్రికల్చర్‌కు రెండు రోజులు (4 పరీక్షలు) జరుపుతారు. శుక్రవారం హైదరాబాద్‌లో ప్రవేశ పరీక్షల కన్వీనర్ల సమావేశం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ తుమ్మల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగింది. దాదాపు మూడున్నర గంటలపాటు ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణ విధి విధానాలు, సెట్ కమిటీ సమావేశాలు తదితర అంశాలపై చర్చించారు. ఐసెట్, ఎడ్‌సెట్‌లను ఒకటిన్నర రోజులు నిర్వహించాలని నిర్ణయించారు. ఈసెట్‌కు 25 వేల కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు నిర్వహిస్తారు. 25 వేల లోపు వస్తే ఒకసారే పరీక్ష జరుపుతారు. ఈ నెలాఖరులోపే ఆయా కన్వీనర్లు సెట్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసుకొని దరఖాస్తుల స్వీకరణపై కాలపట్టిక ప్రకటించాలని పాపిరెడ్డి సూచించారు. విద్యార్థులు ఆన్‌లైన్ పరీక్షలకు అలవాటు పడేందుకు.. సాధన చేసుకునేందుకు ఈ నెలాఖరులోపు నమూనా పరీక్షలను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. పాత ప్రశ్నపత్రాలను కూడా వెబ్‌సైట్లో ఉంచుతారు. ప్రశ్నపత్రాలు తెలుగు, ఆంగ్ల భాషల్లో ఉంటాయి. ప్రతి కన్వీనర్ పరీక్షా కేంద్రాల్లోని వసతులను పరిశీలించాలని పాపిరెడ్డి సూచించారు. పది పాత జిల్లా కేంద్రాల్లో పరీక్షా కేంద్రాలు ఉంటాయి. ఆన్‌లైన్ పరీక్షలు కావడంతో రెండు రోజులు ముందుగా కన్వీనర్లు ప్రశ్నపత్రాలను ఇచ్చినా సరిపోతుందని సాంకేతిక నిపుణులు తెలిపినట్లు సమాచారం.

రుసుముల పెంపు నిర్ణయం కమిటీలదే

ఆన్‌లైన్ పరీక్షల దరఖాస్తుల రుసుం కొంత పెరగనుంది. ఆయా ప్రవేశ పరీక్షల కమిటీ(సెట్)లే చర్చించుకొని తుది నిర్ణయం తీసుకోవాలని సమావేశం అభిప్రాయపడింది. గత ఏడాది కంటే కనీసం 20 శాతం రుసుం పెరిగే అవకాశం ఉందని అంచనా.

చైనా రాజ్యాంగంలో షి జిన్‌పింగ్ ఆలోచనలు

సవరణ దిశగా కసరత్తు ప్రారంభం

బీజింగ్: ఆధునిక చైనా వ్యవస్థాపకుడు మావో జెడాంగ్‌తో దాదాపు సమానమైన అత్యంత శక్తిమంత నేత (లింగ్షియూ) హోదాను పొందిన ఆ దేశ ప్రస్తుత అధ్యక్షుడు షి జిన్‌పింగ్ ఆలోచనలను అక్కడి రాజ్యాంగంలో చేర్చే ప్రక్రియ ప్రారంభమైంది. ఇటీవలే రెండో దఫా దేశాధ్యక్ష బాధ్యతలు చేపట్టిన జిన్‌పింగ్ చైనా కమ్యూనిస్టు పార్టీలోనూ, సైన్యంలోనూ పూర్తి పట్టు కలిగి ఉన్నారు. ఈ క్రమంలోనే అధికార కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ.. జిన్‌పింగ్ ఆలోచనలను 'నూతన శకంలో చైనా ప్రత్యేకతలతో సామ్యవాదం' పేరుతో తమ దేశ రాజ్యాంగంలో చేర్చాలని నిర్ణయించింది. జిన్‌పింగ్ ఆలోచనలు మార్క్సిజం-లెనినిజం- మావో ఆలోచనా విధానాన్ని మరింత ముందుకు తీసుకెళ్తాయని ఆ పార్టీ విశ్వసిస్తోంది. చైనా కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుడైన మావో, ఆయన తర్వాత అధ్యక్షుడైన డెంగ్ షియావోపింగ్ పేర్లతో పాటు వారి ఆలోచనలు రాజ్యాంగంలో ఉన్నాయి. మార్చిలో జరిగే నేషనల్ పీపుల్స్ కాన్ఫరెన్స్ (చైనా జాతీయ చట్టసభ) సమావేశాల్లో జిన్‌పింగ్ ఆలోచనలనూ రాజ్యాంగంలో చేర్చే ప్రక్రియ పూర్తవుతుందని భావిస్తున్నారు.

నమ్మిస్తారు.. అమ్మేస్తారు

- ఉద్యోగాల పేరిట అరబ్ దేశాలకు మహిళల అక్రమ రవాణా
- ఆపై పాస్‌పోర్టులు లాక్కొని షేక్‌లకు అమ్మకం
- ఉభయ రాష్ట్రాలకు చెందిన అయిదుగురు ఏజెంట్ల అరెస్టు
- దుబాయ్‌లో ఉన్న సూత్రధారి సహా పలువురిపై కేసుల నమోదు
- ఇలా వంద మందిని తరలించినట్టు సమాచారం అందిందన్న సీపీ
- 33 మంది ఏజెంట్ల జాబితా విడుదల



నిందితుల వివరాలు తెలుపుతున్న సీపీ మహేష్‌భగవత్

నాగోలు, న్యూస్‌టుడే: అరబ్ దేశాల్లో ఉద్యోగాల పేరిట అమాయక మహిళల అక్రమ రవాణాకు పాల్పడుతూ..వారిని అరబ్‌షేకుల వ్యభిచార గృహాల్లో బందీలుగా మారుస్తున్న అయిదుగురిని రాచకొండ ఎస్‌వోటీ పోలీసులు అరెస్టుచేశారు. రాచకొండ సీపీ మహేష్‌భగవత్ శుక్రవారం నిందితుల వివరాలు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా అల్లవరం మండల పరిధి కొమరగిరి పట్నం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పోతుల శ్రీనుబాబు అలియాస్ దుబాయ్ శ్రీను(35) నగరంలోని జీడిమెట్ల సమీపంలోని చింతల్‌లో ఉండేవాడు. ప్రస్తుతం దుబాయ్‌లో ఉంటున్న అతను ఓ ఏజెన్సీ ఏర్పాటుచేసి పదుల సంఖ్యలో ఏజెంట్ల ముఠాలను ఏర్పాటు చేసుకున్నాడు. వాళ్ల సాయంతో దుబాయ్, మస్కట్, కువైట్, ఖతార్‌లలో అరబ్‌షేక్‌ల ఇళ్లలో పనిమనుషులుగా ఉద్యోగాలిప్పిస్తామంటూ తెలుగు రాష్ట్రాల్లో అమాయక గ్రామీణ మహిళలకు ఎర వేసేవాడు. వారి నుంచి రూ.4 లక్షలు వరకు వసూలుచేసి, పర్యాటక వీసాతో అక్కడికి రప్పించేవాడు. అక్కడికి వెళ్లగానే అక్కడున్న అతని ఏజెంట్లు వారి పాస్‌పోర్టులు లాగేసుకుని అరబ్ షేకులకు బానిసలుగా అమ్మేసేవారు. షేకుల లైంగిక వాంఛలు తీర్చని పక్షంలో వీసాల్లేని కారణంగా ఇక్కడి చట్టప్రకారం జైళ్లలో మగ్గాల్సి వస్తుందని భయభ్రాంతులకు గురిచేసేవాడు. అందుకుగాను షేక్‌ల నుంచి నుంచి రూ. లక్షల్లో దండుకునేవాడు.

ఓ మహిళ తెగువతో వెలుగులోకి

ఇదే తరహాలో బందీగా మారిన ఓ మహిళ అక్కడి తెలుగువారి సాయంతో ఇటీవలే నగరానికి చేరుకుంది. ఆమె భర్త కూడా వీసా లేని కారణంగా దుబాయ్‌లో మరోచోట చిక్కుకున్న క్రమంలో.. అతన్ని విడిపించుకునేందుకు తొలుత ఘట్‌కేసర్ ఠాణాలో ఫిర్యాదుచేసింది. ఈ విషయం తెలుసుకున్న దుబాయ్‌శ్రీను ఆమె భర్తను నగరానికి పంపించేశాడు. ఇటీవల వారిరువురూ ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంపు కార్యాలయంలో జరిగే ప్రజాదర్బార్‌లో రాచకొండ కమిషనర్ మహేష్‌భగవత్‌ను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. ఆయన ఆదేశానుసారం ప్రత్యేక దర్యాప్తు బృందం ఉభయ రాష్ట్రాల్లో ఏజెంట్లుగా చలామణి అవుతూ మహిళల అక్రమ రవాణాకు పాల్పడుతున్న అయిదుగురిని అరెస్టు చేసింది. 'తూర్పుగోదావరి అల్లవరం మండలానికి చెందిన ప్రైవేటు ఉపాధ్యాయుడు ఉప్పే త్రిమూర్తులు అలియాస్ మూర్తి(32), పశ్చిమగోదావరి జిల్లా నర్సాపూర్ మండలానికి చెందిన ఎలక్ట్రీషియన్ మడికి తాతాజీ అలియాస్ నాని(26), అదే జిల్లా పోడూరు మండలానికి చెందిన రైతు గోగన మంద రామారావు(40), నగరంలోని చింతల్‌లో ఉంటున్న అల్లవరం వాసి పోతుల దాసు(30), కామారెడ్డి జిల్లా గాంధారి మండలానికి చెందిన సాల మురళి(37) అరెస్టయిన వారిలో ఉన్నారు. వారి నుంచి రూ.1.60 లక్షల నగదు, వీసా పత్రాలు, ఐదు చరవాణిలు స్వాధీనం చేసుకున్నాం. దుబాయ్ శ్రీను(35), మస్కట్‌లో ఉంటున్న మరియమ్మ(35), కరీమ్, దుబాయ్‌లో ఉండే ఆల్ఫా శ్రీను, సత్యవతి, లక్ష్మి, శ్రీనివాస్‌గౌడ్‌లపైనా కేసులు నమోదుచేశాం. ఈ ముఠా గత పదేళ్లుగా సుమారు 100 మందిని అక్రమంగా అరబ్‌దేశాలకు పంపినట్లు తెలిసింది.' అని సీపీ వివరించారు. ఏజెంట్లుగా మారి అమాయక మహిళల అక్రమ రవాణాతోపాటు..వారిని వ్యభిచార కూపంలోకి దింపుతున్న 33 మంది జాబితానూ విడుదల చేశారు.

ఒక్క రక్తపరీక్షతో 8 రకాల క్యాన్సర్లను పసిగట్టొచ్చు!



న్యూయార్క్: ప్రాణాంతక క్యాన్సర్లపై పోరాటంలో మరో ముందడుగు! ఎనిమిది రకాల క్యాన్సర్లను తొలిదశల్లోనే గుర్తించే సరికొత్త రక్తపరీక్షను శాస్త్రవేత్తలు తాజాగా అభివృద్ధి చేశారు. కణితులు ఏయే అవయవాల్లో విస్తరించి ఉన్నాయో కూడా తెలుసుకునేందుకు ఇది దోహదపడుతుంది. 'క్యాన్సర్ సీక్'గా పిలుస్తున్న ఈ రక్తపరీక్షను అమెరికాలోని జాన్స్ హాప్‌కిన్స్ విశ్వవిద్యాలయ పరిశోధకులు ఆవిష్కరించారు. రక్తంలో 8 రకాల క్యాన్సర్ ప్రోటీన్ల స్థాయిలను, 16 భిన్న జన్యు ఉత్పరివర్తనాలను(క్యాన్సర్ కారకమైనవి) ఏకకాలంలో గుర్తించడం ద్వారా 'క్యాన్సర్ సీక్' వ్యాధి నిర్ధారణ ప్రక్రియను పూర్తిచేస్తుంది. క్యాన్సర్ చికిత్సలో వేర్వేరు ఔషధాలను కలిపి అందిస్తున్నట్లే.. తాజా రక్తపరీక్షలోనూ తాము వ్యాధి నిర్ధారణ కోసం భిన్న జీవసూచికలను సంయుక్తంగా ఉపయోగించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. అండాశయం, కాలేయం, ఉదరం, క్లోమం, ఆహారవాహిక, పేగు, ఊపిరితిత్తులు, రొమ్ము భాగాల్లో క్యాన్సర్లను తొలిదశల్లోనే ఈ పరీక్షతో గుర్తించవచ్చునని వివరించారు.

శ్వాసతోనూ ఫ్లూ వ్యాప్తి!



వాషింగ్టన్: ఫ్లూ కారక ఇన్‌ఫ్లుయెంజా వైరస్ ఒకరి నుంచి మరొకరికి శ్వాస ద్వారా కూడా సోకుతుందని తాజా అధ్యయనమొకటి గుర్తించింది. తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు వెలువడే సూక్ష్మ బిందువుల ద్వారా మాత్రమే వైరస్ వ్యాప్తిచెందుతుందంటూ ఇప్పటివరకు ఉన్న వాదనను తోసిపుచ్చింది. శ్వాస వదిలినప్పుడు వ్యక్తుల చుట్టూ గాలిలో ఏరోసోల్స్(తుంపరలు) కనిపిస్తాయని అమెరికాలోని మేరీలాండ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు డొనాల్డ్ మిల్టన్ తెలిపారు. ఫ్లూ సోకిన వ్యక్తుల చుట్టూ శ్వాస తుంపరల్లో ఇన్‌ఫ్లుయెంజా వైరస్ అధికస్థాయిలో ఉంటున్నట్లు తాము గుర్తించామని వెల్లడించారు. తుమ్ములు, దగ్గు లేకున్నా.. ఫ్లూ బాధితుల నుంచి శ్వాస ద్వారా వైరస్ ఇతరులకు సంక్రమించే ముప్పుందని స్పష్టంచేశారు. ముఖ్యంగా వ్యక్తులు ఫ్లూ బారినపడ్డ తొలినాళ్లలో వారి శ్వాస తుంపరల్లో వైరస్ ఎక్కువ స్థాయిలో ఉంటున్నట్లు చెప్పారు. కాబట్టి ఇన్‌ఫ్లుయెంజా బాధితులు దగ్గు, తుమ్ములు లేకున్నా.. జన సమూహాల్లోకి వెళ్లకపోవడం మేలని సూచించారు.

100 శాతం పళ్లరసాలతో మధుమేహ ముప్పేమీ లేదు!



వాషింగ్టన్: ఇతర పదార్థాలేవీ కలపకుండా తయారుచేసే పళ్లరసాలు మధుమేహ ముప్పును ఏమాత్రం పెంచకపోవచ్చునని తాజా అధ్యయనమొకటి వెల్లడించింది. రక్తంలో గ్లూకోజ్ నిల్వలు, ఇన్సులిన్ స్థాయిలను 100 శాతం పళ్లరసాలు ప్రభావితం చేయడం లేదని తెలిపింది. వేర్వేరు అధ్యయనాల ఫలితాలను సంయుక్తంగా విశ్లేషించడం ద్వారా అమెరికాలోని 'రసాయన క్రమబద్ధీకరణ, ఆహార రక్షణ కేంద్రం(సీసీఆర్ఎఫ్ఎస్)' పరిశోధకులు ఈ విషయాలను గుర్తించారు. యాపిల్, దానిమ్మ, నిమ్మ, బెర్రీ, ద్రాక్ష వంటి పలు రకాల 100 శాతం పళ్లరసాలను వారు విశ్లేషించారు. ఇన్సులిన్, రక్తంలో చక్కెర స్థాయిలపై అవి ప్రతికూల ప్రభావమేమీ చూపడం లేదని కనుగొన్నారు.

ఎన్‌హెచ్ఆర్‌సీ పరిగణనలో గోసంరక్షకుల దాడులు

జస్టిస్ హెచ్.ఎల్.దత్తు

జైపుర్: గోసంరక్షణ పేరుతో జరిగిన దాడుల్లో సంభవించిన మరణాలను పరిగణనలోకి తీసుకున్నామని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) ఛైర్మన్ జస్టిస్ హెచ్.ఎల్.దత్తు అన్నారు. ఇక్కడ రెండు రోజుల పాటు జరిగిన న్యాయ శిబిరాల్లో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇలాంటి కేసులపై రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నివేదికలు అందిన తరువాత తగిన మార్గదర్శకాలు ఇస్తామని చెప్పారు. తాము ఇచ్చిన సూచనలను అమలు చేయాలని, లేదంటే తగిన సంస్థల ముందు సవాలు చేయాలని ఆయన పోలీసులకు సూచించారు. కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే జిల్లా స్థాయి మానవ హక్కుల కోర్టులు ఏర్పాటయ్యాయని చెప్పారు.

25లోగా పంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదనలివ్వాలి

- కొత్త మున్సిపాలిటీలను గుర్తించేందుకు ప్రత్యేక అధికారులు
- కలెక్టర్ల సమీక్ష సమావేశంలో సీఎస్ ఎస్పీసింగ్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటుకు ఈనెల 25లోగా ప్రతిపాదనలు అందజేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మార్గదర్శకాల మేరకు ఇచ్చిన ఫార్మాట్లలో వివరాలు, ప్రతిపాదిత గ్రామాల పటాలు(మ్యాప్‌లు) వెంటనే పంపించాలని సూచించారు. ఆయా పంచాయతీలకు స్థానికులు, స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి పేర్లకు ఆమోదం పొందాలన్నారు. నగరపాలికలు, మున్సిపాలిటీల చుట్టూ గ్రామ పంచాయతీలను విలీనం చేసే విషయాలను పరిశీలించడంతో పాటు కొత్త నగర పంచాయతీల ఏర్పాటుకు అవకాశాలున్న గ్రామాలను గుర్తించేందుకు 9మంది ప్రత్యేక అధికారులను నియమించామని చెప్పారు. శుక్రవారమిక్కడ రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి, ముఖ్య కార్యదర్శులు అథర్‌సిన్హా, అర్వింద్‌కుమార్, సునీల్‌శర్మ, రామకృష్ణారావు, రజత్‌కుమార్, వికాస్‌రాజ్, జ్యోతి బుద్ధప్రకాష్, బెనహర్ మహేష్‌దత్ ఎక్కా, వాకాటి కరుణ, సీడీఎంఏ టీకేశ్రీదేవి, సీఎంవో ప్రత్యేకాధికారి ప్రియాంక వర్గీస్, అటవీశాఖ ప్రధాన సంరక్షకుడు పీకే ఝాతో కలిసి జిల్లా కలెక్టర్లతో దృశ్యాత్మక సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీల ఏర్పాటుకు నియమించిన ప్రత్యేక అధికారులు కలెక్టర్లు, మున్సిపల్ అధికారులతో చర్చించి అవసరమైన సలహాలు ఇస్తారన్నారు. మున్సిపల్ నిబంధనల మేరకు పట్టణీకరణకు అవకాశాలు, ఆర్థిక కార్యకలాపాలు, విద్య, సాంస్కృతిక విషయాలు, ఉపాధి అవకాశాలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు.

ఘనంగా వేడుకలకు ఏర్పాట్లు

జిల్లాల్లో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు కలెక్టర్లు ఏర్పాట్లు చేయాలని సీఎస్ పేర్కొన్నారు. వేడుకల నిర్వహణకు పరేడ్ గ్రౌండ్ గుర్తింపు, అవార్డుల ప్రదానం, జాతీయ పతాకావిష్కరణ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల వారీగా 2018 హరితహార కార్యాచరణ ప్రణాళికలు వారంలోగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఎస్పీసింగ్ అన్నారు. టేకు, ప్రజలు కోరిన పండ్ల మొక్కలు అందుబాటులో ఉండేలా నర్సరీల్లో పెంపకం చేపట్టాలని, నాటిన ప్రతి మొక్కను జియోట్యాగింగ్ చేయాలని పేర్కొన్నారు.

బీజీ-3 విత్తనాలను నియంత్రించాలి

కేంద్రానికి తెలంగాణ వ్యవసాయశాఖ వినతి

ఈనాడు, హైదరాబాద్: కలుపు మొక్కలను చంపే గ్లైఫోసెట్ రసాయన మందును తట్టుకుని బతికే బీజీ-3 పత్తి విత్తనాల అమ్మకాలను నియంత్రించేందుకు చట్టపరమైన ఏర్పాట్లు చేయాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి కేంద్రానికి విన్నవించారు. ఈ విత్తనాల వినియోగంపై అధ్యయనానికి కేంద్రం నియమించిన 12 మంది శాస్త్రవేత్తల బృందం రెండురోజులుగా రాష్ట్రంలో పర్యటించింది. ఈ విత్తనాల ఉత్పత్తికేంద్రాలు, శుద్ధి కేంద్రాలను తనిఖీ చేసి గుర్తించిన వెంటనే నాశనం చేసేందుకు దేశవ్యాప్తంగా వర్తించేలా మార్గదర్శకాలు విడుదల చేయాలని కోరారు. గ్లైఫోసెట్ రసాయనాన్ని కలుపు మొక్కలను చంపడానికి పొలాల్లో విరివిగా చల్లుతున్నారని, దీన్ని నిషేధించి వాడకుండా రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ జీవశాస్త్ర సాంకేతిక విభాగం ముఖ్యాధికారి వీఎస్‌రెడ్డి మాట్లాడుతూ బీజీ-3 విత్తనాలను నియంత్రించడానికి గతంలో పత్తి సంకరజాతి విత్తనాల వినియోగానికిచ్చిన నోటిఫికేషన్ అవరోధంగా మారిందన్నారు. బీజీ-3 విత్తనాల నియంత్రణకు తీసుకున్న చర్యలను రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ సంచాలకుడు డాక్టర్ కేశవులు వివరించారు. వ్యవసాయ కమిషనర్ డాక్టర్ జగన్మోహన్, పత్తి విత్తన కంపెనీల ప్రతినిధులు తమ అభిప్రాయాలను తెలిపారు. గద్వాల, వికారాబాద్, మంచిర్యాల జిల్లాల్లో పత్తి చేలను ఈ బృందం శుక్రవారం పరిశీలించింది.

దుబాయ్‌లో ఉద్యోగాలంటూ మోసం.. నిందితుడి అరెస్ట్

ఈనాడు, హైదరాబాద్: విదేశాల్లో ఉద్యోగాలిప్పిస్తామంటూ పలువురి నుంచి రూ.లక్షల్లో వసూలు చేసిన నిందితుడిని సైబర్ క్రైమ్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. తమిళనాడు రాష్ట్రం ఈరోడ్‌కు చెందిన కర్మాగిల్ అన్బు జేమ్స్, భరత్‌లు సామాజిక మాధ్యమాల ద్వారా విదేశాల్లో ఉద్యోగాలిప్పిస్తామంటూ ప్రకటనలు ఇచ్చేవారు. దుబాయ్‌లోని షాపింగ్‌మాల్స్‌లో సేల్స్ సూపర్‌వైజర్లుగా ఉద్యోగాలిప్పిస్తామంటూ రెండేళ్ల క్రితం వీరిచ్చిన ప్రకటన ఆధారంగా హైదరాబాద్ శాంతినగర్ వాసి కాంతి ఆనంద్.. కర్మాగిల్‌ను సంప్రదించింది. సేల్స్ మేనేజర్‌గా ఉద్యోగం ఇస్తామంటూ ఆమెను నమ్మించిన అతను..రూ.50 వేలు తన ఖాతాలో జమచేస్తే రెండు వారాల్లో వీసా పంపుతానని చెప్పాడు. ఆమె ద్వారా మరో 14 మంది కూడా రూ.50 వేలు చెల్లించారు. తర్వాత రిజిస్ట్రేషన్, విమానాశ్రయంలో నిబంధనలంటూ ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల చొప్పున దాదాపు రూ.37 లక్షల వరకూ దండుకున్న తర్వాత ఇద్దరూ తమ చరవాణిలు స్విచ్ఛాఫ్ చేశారు. కర్మాగిల్‌ను గురువారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయంలోఅదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరుపరిచినట్టు డీసీపీ అవినాశ్ మహంతి తెలిపారు.

అన్నాచెల్లెళ్ల.. ఆకలి మజిలీ

- తండ్రి లేక, తల్లి దూరమై అనాథలైన చిన్నారులు
- హైదరాబాద్‌లో వదిలేసి వెళ్లిన పెదనాన్న
- రెండు రోజులపాటు బిక్కుబిక్కుమన్న పసికూనలు
- పోలీసుల చొరవతో ఆశ్రమానికి
- బాధితులది నెల్లూరు జిల్లా

మల్కాజిగిరి - న్యూస్‌టుడే



అంజి, వెంగమ్మ

తండ్రి లేడు..తల్లి మరో తోడు వెదుక్కుంది. కాపాడుతాడనుకున్న పెద్ద మనిషే వదిలించుకోజూశాడు. తప్పు ఎవరిదైనా అది అన్నాచెల్లెళ్లను కన్న ప్రేమకు దూరం చేసింది. అనాథలుగా మార్చి.. రెండు రోజులపాటు ఆకలితో అలమటించేలా చేసింది. పోలీసుల చొరవతో వారి మజిలీ ఆశ్రమానికి చేరింది. నెల్లూరు జిల్లా కనిగిరి సమీపంలోని పందుపాడు ఏసుపెంట గ్రామానికి చెందిన వెంకట రమణయ్య, అంకమ్మ దంపతులకు అంజి (11) వెంగమ్మ (6) పిల్లలు. వారి తండ్రి కొంతకాలం క్రితం చనిపోయాడు. తల్లి మరొకర్ని వివాహం చేసుకోవడంతో పిల్లలకు కష్టాలు మొదలయ్యాయి. దిక్కులేని స్థితిలో అన్నాచెల్లెళ్లు పెద్దనాన్న పుల్లయ్య పంచన చేరారు. అండ దొరికిందన్న సంతోషం వారికి ఎంతో కాలం నిలవలేదు. పని ఉందని నమ్మించిన ఆయన ఇద్దర్నీ వెంటబెట్టుకుని బుధవారం రాత్రి హైదరాబాదుకు వచ్చాడు. గుర్తుతెలియని ప్రాంతంలో వదిలి వెళ్లిపోయాడు. తాము ఏ ప్రాంతంలో ఉన్నదీ తెలుసుకోలేని స్థితిలో చిన్నారులిద్దరూ ఆకలితో అలమటిస్తూ నగరమంతా కలియదిరిగారు. చివరికి మౌలాలి సమీపంలోని ఎస్పీనగర్ హనుమాన్ ఆలయం వద్ద ఆగారు. ఓ వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు మల్కాజిగిరి సీఐ గంగాధర్ వారిని విచారించి వివరాలు తెలుసుకున్నారు. చైల్డ్‌లైన్ సహకారంతో రంగారెడ్డి జిల్లా శిశు, సంక్షేమ శాఖ అధికారులను సంప్రదించి బాలుడిని సైదాబాద్‌లోని బాలుర వసతిగృహంలో, బాలికను నింబోలి అడ్డలోని బాలికలవసతిగృహంలో చేర్చారు.

भारतीय विमानपत्तन प्राधिकरण
AIRPORTS AUTHORITY OF INDIA
Southern Region, Chennai - 600 027.

ప్రకటన సంఖ్య: AAI/SR/M/01/2008

చెన్నై, కోయంబత్తూర్, మదురై, తిరుచ్చి, బెంగళూరు, మైసూర్, హైదరాబాద్, విజయవాడ మరియు రాజమండ్రి విమానాశ్రయము లలో జాబ్ కాంట్రాక్ ప్రాతిపదికన పనిచేయడం కోసం విశ్రాంత (రిటైర్డ్) రాష్ట్ర ప్రభుత్వ భూమి / రెవిన్యూ అధికారులు / తహసీల్దారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి.
అర్హతలు, నిబంధనలు మరియు ఇతర వివరాల కోసం దయచేసి AAI వెబ్‌సైట్ www.aai.aero చూడండి. దరఖాస్తులు సమర్పించడానికి చివరి తేదీ 20.02.2018.
రీజనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

125 కోట్ల మంది గొంతుకను నేను

- వారి సంకల్పమే నా ప్రాధాన్యం
- భారత విజయగాథను దావోస్‌లో వినిపిస్తా
- అది నాకు గర్వకారణం
- ప్రధాని మోదీ వెల్లడి



దిల్లీ

ప్రజల సంకల్పాన్ని నెరవేర్చేందుకు తాను నిజాయతీతో కృషి చేస్తున్నానని ప్రధాని మోదీ చెప్పారు. అభివృద్ధే తన మంత్రమని, అందులో రాజీ లేదని స్పష్టం చేశారు. 125 కోట్ల మంది భారతీయుల విజయగాథను దావోస్‌లో నిర్వహించే ప్రపంచ ఆర్థిక సదస్సు (డబ్ల్యుఈఎఫ్)లో వివరిస్తానని, అందుకు తాను గర్విస్తానని అన్నారు. దావోస్ సదస్సుకు వెళ్తున్న నేపథ్యంలో శుక్రవారం జీన్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని వివిధ అంశాలను స్పృశించారు.

భారత్ ప్రపంచ వ్యాప్తంగా తన విజయాలతో ఒక గుర్తింపును సాధించిందని, దీని నుంచి ప్రయోజనాలను రాబట్టుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతోందని, ఈ విషయాన్ని అన్ని రేటింగ్ సంస్థలు సహా ప్రపంచం గుర్తించిందని తెలిపారు. పని చేసే వయస్సున్న వారు మన దేశంలో ఎక్కువగా ఉండడంతో ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతోందని(డెమొగ్రఫిక్ డివిడెండ్), ఇదే మన బలమని చెబుతూ ఈ బలం ఉన్న పెద్ద మార్కెట్ భారత్ కాబట్టి దావోస్ సదస్సు దేశానికి మంచి అవకాశమన్నారు. మన దేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు బాగా పెరిగాయని చెప్పారు. ఈ ప్రభుత్వానికి భిన్నమైన ఆలోచన ఉందని, దేశీయంగా భారత్ బాగా పని చేస్తోందని అంతర్జాతీయ సమాజం గుర్తించిందని, ప్రపంచ దృష్టిని ఆకర్షించడం మంచి పరిణామని అన్నారు. సామాజిక, ఆర్థిక, సుపరిపాలనకు సంబంధించి ప్రభుత్వం సాహసోపేతమయిన విధాన చర్యలను తీసుకుంటోందని వెల్లడించారు. దేశంలో సులభతర వాణిజ్యం మెరుగయిందని, ప్రపంచానికి అదేంటో తెలుసని అన్నారు. ప్రపంచం నేరుగా భారత్‌తో మాట్లాడాలనుకోవడం సహజమని, మన విధానాలు, సామర్థ్యం గురించి నేరుగా వినాలనుకుంటోందని, నాయకుడి నుంచి వినడం ముఖ్యమని చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి దావోస్ సదస్సు.. వ్యాపారవేత్తలు, ఆర్థిక సంస్థలు, విధాన రూపకర్తలతో కూడిన అతి పెద్ద సమ్మేళనమని ప్రధాని అన్నారు. ఇప్పటివరకు ఆ సదస్సుకు హాజరు కాలేకపోయానన్నారు.

స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి మందగించినప్పుడల్లా వస్తున్న విమర్శల గురించి అడగగా దేశం దృష్టి ఆర్థిక వ్యవస్థ, వృద్ధి వైపు మరలడం మంచి విషయమన్నారు. "విమర్శను చెడుగా చూడకూడదు. విమర్శ.. ప్రజాస్వామ్య బలం. మంచి విషయాలను అభినందించాలి. లోపాలను విమర్శించాలి." అని చెప్పారు. అయితే కొన్ని సార్లు విమర్శలు తక్కువగా, ఆరోపణలు ఎక్కువగా ఉంటున్నాయన్నారు. ప్రపంచంలోనే పెద్ద ప్రజాస్వామ్య దేశమయిన భారత్‌లో ప్రజా తీర్పును ప్రపంచం గుర్తించిందని, 125 కోట్ల మంది ప్రజల శక్తి, సంకల్పం తనకన్నా ముఖ్యమని స్పష్టం చేశారు. "125 కోట్ల మంది పౌరుల గొంతుకగా మారడమే నా పని. ఆ పనిని నిజాయతీగా చేయడానికి ప్రయత్నిస్తున్నా." అని చెప్పారు.

వస్తు, సేవల పన్ను(జీఎస్టీ)పై మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో చర్చలు ప్రారంభమయ్యాయని, ఆ తర్వాత వచ్చిన యూపీఏ ప్రభుత్వాలు రాష్ట్రాలను ఒప్పించడంలో విఫలమయ్యాయని అన్నారు.

జీఎస్టీ ఒక్కటే విజయం కాదు

జీఎస్టీ, పెద్ద నోట్ల రద్దుకే తన ప్రభుత్వ విజయాలు పరిమితం కాదని ప్రధాని స్పష్టం చేశారు. అందరికీ ఆర్థిక ఫలాలు అందేలా చూడడం, మరుగుదొడ్ల నిర్మాణం, గ్రామాల విద్యుద్దీకరణ వంటి విజయాలెన్నో ఉన్నాయని చెప్పారు. మూడు కోట్ల మందికి వంటగ్యాస్ కనెక్షన్లు, యూరియా సరఫరా పెంపు, పేదలకు తక్కువ ప్రీమియంతో బీమా, ఎల్ఈడీ బల్బులు తదితర అంశాలను ఏకరవు పెట్టారు. ఇంకా చాలా అంశాలను చెప్పగలనని, అందుకోసం తన ఇంటర్వ్యూను వారమంతా ఇవ్వాల్సి వస్తుందని చమత్కరించారు.

తదుపరి బడ్జెట్ సాధారణ ఎన్నికల ముందు వచ్చేది కావడంతో ప్రజాకర్షకంగా ఉండబోతోందని అంచనాలు వస్తున్న విషయాన్ని ప్రస్తావించగా ప్రధాని స్పందిస్తూ 'ఇది చివరి బడ్జెట్ అయినా, మొదటి బడ్జెట్ అయినా, ఎన్నికలు ఉన్నా, లేకున్నా అభివృద్ధి ఒక్కటే నా ప్రభుత్వం దృష్టి పెట్టే అంశం.' అని స్పష్టం చేశారు. అందరితో కలిసి అందరి అభివృద్ధి అనేది తన మంత్రమని పునరుద్ఘాటించారు. అందుకోసం అవసరమయినదంతా తన ప్రభుత్వం చేస్తోందని, భవిష్యత్తులోనూ చేస్తుందని వెల్లడించారు.

దాపరికం లేని స్వభావం నాది..

ప్రపంచ నేతలను ఆలింగనం చేసుకోవడాన్ని ప్రధాని మోదీ సమర్థించుకున్నారు. తాను సామాన్యుడినని, ప్రొటోకాల్స్ అన్నీ తనకు తెలియవని స్పష్టం చేశారు. ఇదే తన బలమన్నారు. దాపరికం లేని ఈ సామాన్యుడి స్వభావాన్ని ప్రపంచ నేతలు ఇష్టపడతారని చెప్పారు. మోదీ ఆలింగనాలపై కాంగ్రెస్ విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. ప్రపంచ నేతల పక్కన ఉన్నప్పుడు ఎలాంటి భావన కలుగుతుందని ప్రశ్నించగా "నాకు ఒక్కటే అనిపిస్తుంది. అక్కడ నిలబడింది నరేంద్రమోదీ కాదు. 125 కోట్ల మంది ప్రజల ప్రతినిధి." అని అన్నారు.

జమిలి ఎన్నికలుండాలి

లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న అభిలాషను ప్రధాని పునరుద్ఘాటించారు. పండగలలాగానే ఎన్నికలను ఒకే కాలావధిలో నిర్వహించాలన్నారు.

ఏడాదంతా ఆకస్మిక తనిఖీలు

- ఏ ఒక్క ఇంజినీరింగ్ కళాశాలనూ వదలరు
- సరిపడా బోధనా సిబ్బంది లేకున్నా అనుబంధ గుర్తింపు రద్దు
- అధ్యాపకులకు, పీజీ విద్యార్థులకు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి
- జేఎన్‌టీయూహెచ్ అనుబంధ గుర్తింపు నిబంధనావళి విడుదల

ఈనాడు, హైదరాబాద్: ముందుగానే ఎప్పుడు తనిఖీ చేస్తామో చెప్పి...ఆ రోజు ప్రయోగశాలను, అధ్యాపకులను చూపిస్తే కొత్త విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్ కళాశాలలకు అనుబంధ గుర్తింపు ఇవ్వడం పాత పద్ధతి. ఈ విధానాన్ని కొనసాగిస్తూనే సంవత్సరం మొత్తంలో ఎప్పుడైనా ఆకస్మిక తనిఖీలు చేయాలని జేఎన్‌టీయూహెచ్ నిర్ణయించింది. ఈ మేరకు విశ్వవిద్యాలయం విడుదల చేసిన అనుబంధ గుర్తింపు నియమావళిలో ఈ నిబంధనను చేర్చారు. ఏడాదంతా ఆకస్మిక తనిఖీలు ఉంటాయని, అన్ని కళాశాలలను తనిఖీ చేస్తామని పేర్కొన్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే ముందు జేఎన్‌టీయూహెచ్ ఆయా కళాశాలలకు నిజ నిర్ధారణ కమిటీల పేరిట ప్రత్యేక బృందాలను పంపి నిబంధనల ప్రకారం ప్రమాణాలను పాటిస్తున్నారో లేదో పరిశీలిస్తారు. వసతులు లేకుంటే వాటిని మెరుగుపరుచుకునేందుకు కొద్ది రోజుల సమయం ఇస్తారు. లేకుంటే అనుబంధ గుర్తింపు నిరాకరిస్తారు. అంటే ఆ కళాశాలలో ఇంజినీరింగ్ ప్రవేశాలు జరపరాదు. ముందే తేదీని ప్రకటించి తనిఖీలకు వెళ్లడం వల్ల నిబంధనల ప్రకారం చాలా వరకు ప్రయోగ పరికరాలు, కంప్యూటర్లు, అధ్యాపకులు, ఇతర బోధనేతర సిబ్బందిని సమకూరుస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి అడ్డుకట్ట వేసేందుకు విద్యా సంవత్సరంలో ఎప్పుడైనా తనిఖీలు చేసి ఆరోజు లోపాలు వెల్లడైతే కఠిన చర్యలు తీసుకునేలా నిబంధనావళిని రూపొందించారు. తనిఖీల నాడు కాలపట్టిక ప్రకారం తరగతులు జరగకున్నా...తగినంత మంది అధ్యాపకులు లేకున్నా...అనధికారికంగా ప్రిన్సిపాల్ గైర్హాజరయినా అనుబంధ గుర్తింపును రద్దు చేస్తారు.

బయోమెట్రిక్ హాజరు ఉంటేనే...

అందరు అధ్యాపకులకు, పీజీ విద్యార్థులకు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి. భవిష్యత్తులో బీటెక్ విద్యార్థులకూ దీన్ని వర్తింపజేస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ హాజరునే సాక్ష్యంగా తీసుకొని కళాశాలలపై చర్యలు తీసుకుంటారు. ఏ పనిదినంలో కూడా మొత్తం అధ్యాపకుల బయోమెట్రిక్ హాజరు తగినంత లేకున్నా...విద్యా సంవత్సరం మొత్తంలో అధ్యాపకులు, విద్యార్థుల నిష్పత్తి నిబంధనల ప్రకారం లేకున్నా అనుబంధ గుర్తింపును విరమించుకుంటారు. వీటన్నింటిపై శనివారం ఇంజినీరింగ్, ఫార్మా కళాశాలల యాజమాన్యాలకు వివరించనున్నారు.

మరిన్ని నిబంధనలు ఇవీ..

- ఏఐసీటీఈ, ఫార్మా కౌన్సిల్ ఆఫ్ ఇండియా(పీసీఐ)కి సమర్పించిన సమాచారానికి, జేఎన్‌టీయూహెచ్‌కి ఇచ్చేది ఒకటై ఉండాలి. వాటి మధ్య తేడా ఉండరాదు
- మూడేళ్లలో ఒకసారి ప్రతి అధ్యాపకుడు అకడమిక్ స్టాఫ్ కళాశాల ఇచ్చే 4 వారాల శిక్షణను పూర్తి చేసి ఉండాలి.
- అధ్యాపకుల ప్రతిభను గుర్తించేందుకు ప్రతి కళాశాల ఒక విధానాన్ని రూపొందించుకోవాలి. వారి బోధన తీరు ఎలా ఉందో విద్యార్థుల నుంచి అభిప్రాయ స్వీకరణ తీసుకొని విశ్వవిద్యాలయానికి పంపాలి.

సమస్యకు శాశ్వత పరిష్కారమే కేసీఆర్ ధ్యేయం

- తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం సమావేశంలో హరీశ్‌రావు
- కర్ణాటకలో కరెంటు ఎలా ఇస్తున్నారో చూసొద్దామని ఉత్తమ్‌కు సవాల్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంతరం శ్రమిస్తున్నారని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సీఎం దార్శనికత, కృషి, పట్టుదలతో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తోందన్నారు. 24 గంటల విద్యుత్ కాంగ్రెస్ ఘనతేనని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పడం సిగ్గుచేటని.. ఆ పార్టీ హయాంలో ఎందుకు అమలు చేయలేదో ఆయన వివరించాలన్నారు. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ ఇస్తామని చెప్పి.. అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ మాట మార్చిందన్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో ఉన్న ఉత్తమ్ అప్పట్లో ఏం చేశారని ప్రశ్నించారు. 'మనిద్దరం కర్ణాటక వెళ్లి రైతులకు ఎన్ని గంటల కరెంటు ఇస్తున్నారో చూసొద్దామా?' అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి హరీశ్‌రావు సవాల్ విసిరారు. భాజపాకు చెందిన కేంద్రమంత్రులు తెరాస పాలనను ప్రశంసిస్తుంటే ఆ పార్టీ స్థానిక నాయకులు రాజకీయాల కోసం విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన హరీశ్‌రావు మాట్లాడారు. గత పాలకులు తాత్కాలిక పనులు చేసి చేతులు దులుపుకునేవారని.. రాష్ట్రంలో ప్రతిఒక్కరూ ఆనందంగా జీవించాలన్నదే కేసీఆర్ ఆశయమన్నారు. "మిషన్ భగీరథతో తాగునీటి కష్టాలు పూర్తిగా తొలగిపోతాయి. సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే కోటి ఎకరాలకు నీరందుతుంది. కరెంటు సమస్యలుండవు. మన గురుకులాలను దేశవ్యాప్తంగా పొగుడుతున్నారు. కాంగ్రెస్ హయాంలో పరిశ్రమలకు విపరీతంగా కోతలు విధించారు. కార్మికులకు సగం జీతం కూడా వచ్చేది కాదు. తెలంగాణ ఉద్యమంలో ప్రైవేటు ఉద్యోగుల పాత్ర చిరస్మరణీయం. రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణంలో లక్ష్యసాధనకు మంత్రి కేటీఆర్ ఉత్సాహంగా పనిచేస్తున్నారు. ఈ ఇళ్ల కేటాయింపులో ప్రైవేటు ఉద్యోగులకు న్యాయం చేస్తాం. ప్రైవేటు ఉద్యోగులకు అండగా ఉంటాం" అని హరీశ్‌రావు అన్నారు. టీజీవోల ఛైర్మన్, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కేసీఆర్ పాలన వల్లే తెలంగాణకు పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. తెలంగాణపై చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, ప్రైవేటు ఉద్యోగుల సంఘం నేతలు గంధం రాములు, కరుణాకర్‌రెడ్డి తదితరులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం దైనందినిని ఆవిష్కరించారు.

మన పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

- ఎస్సీ సంక్షేమ, విద్యుత్తు శాఖల మంత్రి జగదీష్‌రెడ్డి



శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన సదస్సులో జాతీయ ఎస్సీ, ఎస్టీ హబ్ డైరెక్టరీని ఆవిష్కరిస్తున్న మంత్రులు జగదీష్‌రెడ్డి, అజ్మీరా చందూలాల్. చిత్రంలో ఐఏఎస్ అధికారి జ్యోతి బుద్ధప్రకాశ్, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ గౌరీశంకర్‌రావు తదితరులు

అమీర్‌పేట(హైదరాబాద్), న్యూస్‌టుడే: తెలంగాణ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్న ఎన్నో పథకాలను కేంద్రం, ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని రాష్ట్ర ఎస్సీ సంక్షేమ, విద్యుత్తు శాఖల మంత్రి జి.జగదీష్‌రెడ్డి అన్నారు. కొన్ని రాష్ట్రాలైతే తెలంగాణ పథకాలను యథాతథంగా అమలు చేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ, జాతీయ చిన్న తరహా పరిశ్రమల సంస్థ(ఎన్ఎస్ఐసీ)ల ఆధ్వర్యంలో జాతీయ ఎస్సీ, ఎస్టీ హబ్ రాష్ట్ర సదస్సును శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. దళితులు ఉద్యోగాలు అడిగే దశ నుంచి ఉద్యోగాలు కల్పించే దశకు చేరుకోవడం మంచి పరిణామన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి చందులాల్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను దళిత యువకులు, పారిశ్రామిక వేత్తలు అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్సీ, ఎస్టీ హబ్ డైరెక్టరీని మంత్రులు జగదీష్‌రెడ్డి, అజ్మీరా చందులాల్ తదితరులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ డైరెక్టర్ గౌరీశంకర్‌రావు, ఐఏఎస్ అధికారి డాక్టర్ జ్యోతి బుద్ధప్రకాష్, రాష్ట్ర గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అణ్వాయుధాల నిరోధక సంస్థ ఏజీలో భారత్‌కు సభ్యత్వం

దిల్లీ: అణ్వాయుధాల నిరోధానికి కృషి చేస్తున్న ప్రముఖ సంస్థ 'ఆస్ట్రేలియా గ్రూపు' (ఏజీ)లో శుక్రవారం భారత్‌కు సభ్యత్వం లభించింది. ఎగుమతి చేసిన యురేనియం వంటి అణుపదార్థాలు రసాయన, జీవ ఆయుధాల తయారీకి ఉపయోగించకుండా నిరోధించేలా ఈ సంస్థ కృషి చేస్తోంది. ఈ సంస్థలో 43వ సభ్య దేశంగా భారత్ చేరింది. ఏకాభిప్రాయంతో ఈ నిర్ణయం వెలువడిందని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ తెలిపారు. ఇలాంటి ప్రయత్నాలే చేస్తున్న క్షిపణి పరిజ్ఞాన నియంత్రణ పాలనా వ్యవస్థ (మిస్సైల్ టెక్నాలజీ కంట్రోల్ రెజీం-ఎంటీసీఆర్), వాస్సేనార్ అగ్రిమెంట్ (డబ్ల్యుఏ) సంస్థల్లోనూ భారత్‌కు ఇదివరకే సభ్యత్వం లభించింది. ఈ మూడు సంస్థల్లో చైనాకు సభ్యత్వం లేకపోవడం గమనార్హం. మరో సంస్థ అయిన అణు సరఫరాదార్ల బృందం (న్యూక్లియర్ సప్లయిర్స్ గ్రూపు-ఎన్ఎస్‌జీ)లో సభ్యత్వానికి ప్రయత్నాలు జరిగినా చైనా, పాకిస్థాన్‌లు అడ్డుకోవడంతో అది సాధ్యపడలేదు.

ఎంపీ కనిమొళిపై కేసు నమోదు

కరీంనగర్ న్యాయవార్తలు, న్యూస్‌టుడే: తమిళనాడు డీఎంకే ఎంపీ కనిమొళిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని కరీంనగర్ మొదటి అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సంపతిరావు చందన పట్టణ మూడో ఠాణా పోలీసులను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదుదారు వివరాల ప్రకారం.. ఈ నెల 6న తిరుచ్చిలో జరిగిన 'నాస్తిక సమాజం మహానాడు' కార్యక్రమంలో కనిమొళి ప్రసంగిస్తూ తిరుమల వెంకటేశ్వర స్వామిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తన హుండీని తనే కాపాడుకోలేని దేవుడు.. భక్తులను ఎలా కాపాడుతాడని వ్యాఖ్యలు చేశారు. ఈ వార్త దినపత్రికల్లో ప్రచురితం కావడంతో.. భారత రాజ్యాంగం ప్రకారం ఎంపీగా వ్యవహరించాల్సిన కనిమొళి అందుకు విరుద్ధంగా మాట్లాడారని, జాతీయ సమగ్రతను దెబ్బతీయడం, మత విశ్వాసాలను కొల్లగొట్టడం చట్టవిరుద్ధమని న్యాయవాది బేతి మహేందర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు.

కేంద్రంలో కొత్త కేడర్: అనంతకుమార్ హెగ్డే

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తరహాలో ఐఎస్ఎస్(ఇండియన్ స్కిల్ సర్వీస్) పేరిట నూతన కేడర్ సేవలను ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోందని కేంద్ర మంత్రి అనంతకుమార్ హెగ్డే పేర్కొన్నారు. బెంగళూరులోని హెచ్ఏఎల్‌లో శుక్రవారం నిర్వహించిన నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి రాష్ట్రంలో ఐఐఎం తరహాలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కిల్ ప్రీమియర్ సంస్థలు ప్రారంభిస్తున్నామన్నారు. ప్రతి విశ్వవిద్యాలయంలో నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక తరగతుల అవసరం ఉందన్నారు.

తాజాగా దర్యాప్తు చేయండి

- ఆయేషా మీరా హత్య కేసులో 'సిట్'కు హైకోర్టు ఆదేశం
- ఒత్తిళ్లు వస్తే కోర్టు దృష్టికి తీసుకురావాలని సూచన

ఈనాడు, హైదరాబాద్: ఉమ్మడి రాష్ట్రంలో సంచలనం సృష్టించిన బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసుపై తాజాగా దర్యాప్తు చేపట్టాలని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) హైకోర్టు ఆదేశించింది. ఈ క్రమంలో ఒత్తిళ్లు వస్తే తమ దృష్టికి తీసుకురావాలని స్పష్టంచేసింది. కేసు పురోగతిని ఎప్పటికప్పుడు తమకు తెలియజేయాలని, ఏప్రిల్ 20న నివేదిక సమర్పించాలని ఆదేశించింది. తమ అనుమతి లేకుండా సిట్‌లో ఉన్న ఎవరినీ బదిలీ చేయొద్దని చెప్పింది. గతంలో దర్యాప్తును సక్రమంగా నిర్వహించని అధికారులపై అపెక్స్ కమిటీ ద్వారా చర్యలు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి(ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈమేరకు కీలక తీర్పు ఇచ్చింది.

నేపథ్యమిది..

విజయవాడ శివారు ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేటు వసతిగృహంలో 2007 డిసెంబర్లో ఆయేషా హత్యకు గురైంది. విజయవాడలోని మహిళా సెషన్సు కోర్టు పిడతల సత్యంబాబు అనే వ్యక్తిని దోషిగా పేర్కొంటూ 2010 సెప్టెంబరులో తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును సత్యంబాబు హైకోర్టులో అప్పీలు చేయగా విచారించిన ధర్మాసనం అతణ్ని నిర్దోషిగా ప్రకటిస్తూ గతేడాది మార్చిలో తీర్పు ఇచ్చింది. ఈ కేసులో దర్యాప్తు సక్రమంగా జరగలేదని తీవ్రంగా ఆక్షేపించింది. సామాజిక కార్యకర్తలైన ఉస్మానియా వర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ రమా ఎస్ మేల్కొటే, పాత్రికేయురాలు కె.సజయ, సామాజిక ఉద్యమకారిణి సంధ్యారాణి వల్లూరుపల్లి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసి పునర్ దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. ప్రభుత్వం కూడా ఇందుకు సిద్ధమై సిట్ ఏర్పాటు చేసి న్యాయపరమైన అనుమతుల కోసం వేచిచూస్తోంది. ఆయేషా తల్లిదండ్రులు శంషాద్‌బేగం, సయ్యద్ ఇక్బాల్ బాషా... దర్యాప్తును కోర్టు పర్యవేక్షించాలని కోరారు. ఈ రెండు వ్యాజ్యాలపై లోతైన విచారణ చేపట్టిన ధర్మాసనం.. గత సెప్టెంబర్లో తీర్పును రిజర్వు వేసి శుక్రవారం నిర్ణయాన్ని వెల్లడించింది. సామాజిక కార్యకర్తలు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని పరిష్కరించిన ధర్మాసనం.. ఆయేషా తల్లిదండ్రులు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని అపరిష్కృతంగానే ఉంచింది.

మారుమూల ప్రాంతాల్లోనూ దంత వైద్య సేవలు



'సంచార దంత వైద్యశాల'ని జెండా ఊపి ప్రారంభిస్తున్న వైద్యారోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: మారుమూల గ్రామాల్లోని పేదలకూ మెరుగైన దంత వైద్యం అందుబాటులోకి తెస్తున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి డా.లక్ష్మారెడ్డి తెలిపారు. గ్రామాలకు వెళ్లి దంత వైద్య సేవలు అందించేలా రూపొందించిన 'మొబైల్ దంత వైద్యశాల'ని శుక్రవారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. చాలా మంది గ్రామాల్లో ఆరోగ్యం విషమించే దాకా పట్టించుకోరని, దంత సమస్యలు ఒక్కోసారి తీవ్ర అనారోగ్యాలకు కారణం అవుతున్నాయన్నారు. అందుకోసం ప్రజల్లో దంత వైద్యంపై అవగాహన కల్పించడంతో పాటు వారికి అక్కడే పరీక్షలు నిర్వహించి అవసరమైతే శస్త్రచికిత్స చేసేందుకు వీలుగా వాహనాల్లో ఏర్పాట్లు చేశామన్నారు. మారుమూల గ్రామాలకే కాకుండా సామాన్యుల ఇంటి ముంగిటకు ఈ సేవలు వెళ్లనున్నాయని చెప్పారు. కార్యక్రమంలో దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరో అదనపు జిల్లా జడ్జిపై హైకోర్టుకు ఫిర్యాదు

మహబూబాబాద్ న్యూస్‌టుడే: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కేసుల విషయంలో అక్రమాలకు పాల్పడుతున్న మహబూబాబాద్ ఆరో అదనపు జిల్లా జడ్జి పి.వి.రమణారావుపై విచారణ జరిపించాలని ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు చేసినట్లు మహబూబాబాద్ బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు తెలిపారు. శుక్రవారం స్థానికంగా నిర్వహించిన అత్యవసర సమావేశంలో బార్ సభ్యులు ఈ మేరకు ఫిర్యాదు పత్రాలను పత్రికలకు విడుదల చేశారు. కొన్ని నెలలుగా జడ్జిగా విధులు నిర్వహిస్తున్న న్యాయమూర్తి రమణారావు వివిధ కేసుల విషయంలో కొందరికి సహకరిస్తున్నారని ఆరోపించారు. న్యాయమూర్తి వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో పాటు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్, హైకోర్టు రిజిస్ట్రార్ విజిలెన్స్, వరంగల్ జిల్లా న్యాయవ్యవహారాలుచూసే హైకోర్టున్యాయమూర్తి తదితరులకు ఫ్యాక్స్ ద్వారా ఫిర్యాదు పత్రాలనుపంపించినట్లు బార్‌అసోషియేషన్ కార్యవర్గసభ్యులు, న్యాయవాదులు వెల్లడించారు.

బ్యాంకుల్లోని పాసు పుస్తకాలను ఏం చేద్దాం

దృశ్యశ్రవణ సమీక్షలో చర్చకొచ్చిన అంశం

ఈనాడు, హైదరాబాద్: భూ దస్త్రాల ప్రక్షాళనలో మిగిలి ఉన్న పనిని వేగవంతంగా పూర్తిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన దృశ్యశ్రవణ సమీక్షలో రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్ తివారీ, ఎల్ఆర్‌యూపీ డైరెక్టర్ వాకాటి కరుణతో కలిసి సీఎస్ వారితో మాట్లాడారు. భూ దస్త్రాల నవీకరణ పూర్తయిన వెంటనే సంబంధిత దస్త్రాలను అచ్చువేయించే ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. మండలాల్లో సాదాబైనామాల రిజిస్ట్రేషన్, ప్రభుత్వ భవనాల దస్త్రాలు సిద్ధం చేసే ప్రక్రియనూ పూర్తిచేయాలన్నారు. మార్చి 11వ తేదీ నాటికి అన్ని గ్రామాల్లో పట్టాదారు పాసుపుస్తకాలు సిద్ధంగా ఉంచేందుకు ఏర్పాట్లు చేయాలని మార్గదర్శనం చేశారు. పాత పాసు పుస్తకాలను రద్దుచేసి, లబ్ధిదారులకు కొత్తవి జారీచేసే పక్షంలో ఇప్పటికే బ్యాంకుల్లో ఉన్న వాటి పరిస్థితి ఏమిటన్న సందేహం ఈ సమావేశంలో చర్చకొచ్చింది. వాటి స్థానంలో కొత్తవి తీసుకొచ్చేందుకు చట్టంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉంటుందన్న అభిప్రాయాన్ని కొందరు వెలిబుచ్చారు.

రిజర్వు బ్యాంకుకు లేఖ రాయనున్న ఆర్థికశాఖ

'పెట్టుబడి'కి నగదు కొరత రాకుండా కసరత్తు

ఈనాడు, హైదరాబాద్: ఎకరానికి రూ.4 వేల పెట్టుబడి పథకానికి నగదు కొరత రాకుండా చేసేందుకు ఆర్థికశాఖ కసరత్తు చేస్తోంది. ఈ సొమ్ము ఇవ్వాలని కేంద్రం ఆర్థిక మంత్రి జైట్లీని కలిసి ఇప్పటికే రాష్ట్ర మంత్రులు దిల్లీ వెళ్లి విన్నవించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు రిజర్వుబ్యాంకును సంప్రదించినట్లు సమాచారం. వారు ఈ విషయమై స్పష్టత ఇవ్వలేదు. కానీ రాష్ట్రప్రభుత్వం తరపున అధికారికంగా లేఖ రాస్తే చర్చించి తుది నిర్ణయం చెబుతామని సమాధానమిచ్చారు. నేడో రేపో లేఖ రాసేందుకు ఆర్థికశాఖ ఏర్పాట్లు చేస్తోంది. తెలంగాణకు నగదు ఇవ్వమని కేంద్రం నుంచి ఆదేశాలొస్తే దాని ప్రకారం రిజర్వుబ్యాంకు చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి.

ఓటరు గుర్తింపు కార్డుతో ఆధార్ విలీనానికి 'సుప్రీం' నిరాకరణ

దిల్లీ: ఓటరు గుర్తింపు కార్డును ఆధార్‌లో కలిపేయాలంటూ రాజ్యసభ సభ్యురాలు శశికళ పుష్ప చేసిన విజ్ఞప్తిని సుప్రీం కోర్టు శుక్రవారం నిరాకరించింది. అయితే విశిష్ట గుర్తింపు పథకానికి సంబంధించిన చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపడుతున్న విస్తృత ధర్మాసనం ఎదుట ఈ వినతిని దాఖలు చేసుకునే స్వేచ్ఛను ఆమెకు ఇచ్చింది. శశికళ పుష్ప.. అన్నాడీఎంకే నుంచి లోగడ బహిష్కరణకు గురయ్యారు.

తెలంగాణ ప్రభుత్వం - రెవెన్యూ (భూసేకరణ) శాఖ
జిల్లా కలెక్టర్ కార్యాలయము, ఫారము - సి

గజిట్ నెం. 52/2017 తేది: 11-01-2018
కలెక్టర్ నిర్మల్ గారి ఫైల్ నెం.బి1/1489/2017 తేది: 11-01-2018
రాజస్వ మండలాధికారి నిర్మల్ గారి ఫైల్ నెం.ఎల్.ఎ./284-1/2017 తేది: -12-2017
(చట్టంలోని సెక్షన్ 11 క్రింది దీనిలో 10ఎ మినహాయింపు గలదు) (నిబంధన 6/12 చూడండి)

ప్రకటన

తెలంగాణ ప్రభుత్వము/జిల్లా కలెక్టర్, నిర్మల్ గారి ఆదేశానుసారం నిర్మల్ జిల్లా:నిర్మల్ రూరల్ మండలము తాంశ గ్రామములో విస్తీర్ణం ఎ.1-26గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం ఎస్.ఎల్.ఆర్ వంతెన కం నిమ్మల చెక్ డ్యామ్స్ స్వర్ణ ప్రాజెక్ట్ దగ్గర నిర్మాణం నిమిత్తం సదరు భూ సేకరణ ప్రకటన జారీ చేయనైనది.
కావున పైన తెలిపిన ప్రాజెక్టు నిర్మాణమునకు నిర్మల్ జిల్లా నిర్మల్ రూరల్ మం. తాంశ గ్రామములో భూముల విస్తీర్ణం ఎ.1-26 గుంటల/హెక్టార్ల నిర్దిష్ట కొలతలు, దిగువ వివరాలతో యున్న భూములు భూ సేకరణ చేయుటకు ప్రతిపాదించనైనది.

గ్రామము : తాంశ మండలము : నిర్మల్ రూరల్ జిల్లా : నిర్మల్

క్రమ సంఖ్య	సర్వే నెం.	[illegible]	[illegible]	విస్తీర్ణం ఎ.గు	భూమి పట్టేదారు/అనుభవదారు/ఆసక్తిదారు పేరు మరియు తండ్రి పేరు చిరునామా	సరి హద్దులు (సర్వే నం.) ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	[illegible]
1	23/1	ఖుష్కి	పట్టా	0.20	ఉప్పుల నిలకంటం తండ్రి రాములు ని.తాంశ	River	61	156	River	లేవు
2	60	ఖుష్కి	పట్టా	0.01	వంజరి మల్లేష్ తండ్రి రాజమల్లు ని.తాంశ	23	65	61	69	లేవు
3	61	ఖుష్కి	పట్టా	0.12	బోడికె వెంకట రమణ తండ్రి నర్సయ్య ని.తాంశ	23	65	62	60	లేవు
4	62	ఖుష్కి	పట్టా	0.08	వంజరి రాజమల్లు తండ్రి రాజమల్లు ని.తాంశ	23	63	154	61	లేవు
5	63	ఖుష్కి	పట్టా	0.04	బోడికె వెంకట రమణ తండ్రి నర్సయ్య ని.తాంశ	62	64	154	65	లేవు
6	156/అ	ఖుష్కి	పట్టా	0.11	గుల్లె రాజేందర్ తండ్రి పోశెట్టి ని.తాంశ	River	155		23	లేవు
7	156/అ	ఖుష్కి	పట్టా	0.10	గుల్లె పెద్ద రాజేశ్వర్ తండ్రి పోశెట్టి ని. తాంశ	River	155		23	లేవు
	మొత్తము			1.26						లేవు

ఈ ప్రకటన భూ సేకరణ, నష్ట పరిహారం మరియు పునరావాస మరియు పునరుపాధి కల్పన, (పారదర్శకత మరియు న్యాయబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు) చట్టం 2013 (కేంద్ర చట్టం నెం.30/2013)కు సవరించబడిన తెలంగాణ చట్టం భూ సేకరణ, నష్ట పరిహారం మరియు పునరావాస మరియు పునరుపాధి కల్పన (సవరణ తెలంగాణచట్టం-2016 (చట్టం 21/2017)లోని సెక్షన్ 11(1)లో గల అంశాల ప్రకారము ఎవరికి సంబంధించిన వారికి చెందును.
సదరు భూములకు సంబంధించిన నక్షను జిల్లా కలెక్టరు, నిర్మల్ గారి కార్యాలయము నందు ఉంచడమైనది. వాటిని ఏపని దినములలో పనివేళలయందు తనిఖీ చేసుకొనవచ్చును.
తెలంగాణ ప్రభుత్వము కలెక్టరు మరియు ప్రభుత్వ ఆదేశాల అనుసారము నియమించబడిన రాజస్వ మండల అధికారి నిర్మల్ మరియు అతను/ఆమె సిబ్బందిని, సదరు భూసేకరణ చేపట్టే భూమిని సర్వే చేసి భూమి మట్టము తెలిసికొనుటకు/భూమిని త్రవ్వటానికి, బోర్లు వేయడానికి, కేటాయించిన పనులను అమలు చేయుటకు, కావలసిన పనులను నిర్వహించు నిమిత్తము ఇందు మూలముగా అధికారము ఇచ్చినారు. సదరు చట్టము సెక్షన్ 12లో పొందుపర్చినారు.
ప్రకటన ప్రచురించిన తేది నుంచి (కలెక్టరు గారి నుంచి) ముందస్తు అనుమతి లేకుండా సదరు భూములపై ఎవ్వరూ ఎలాంటి వ్యవహారాలు అనగా అమ్మకం/కొనుగోలు మొ.నవి లేదా సదరు భూములపై ఎలాంటి తాకట్టు చేయడం లాంటి పనులు చేయరాదని సదరు చట్టములోని సెక్షన్11(4) క్రింది తెలుపడమైనది.
ఆసక్తి గల వ్యక్తుల నుంచి ఈ భూ సేకరణపై ఎలాంటి అభ్యంతరాలు మరియు ఆక్షేపణలు ఉన్నచో లేదా నష్టపరిహార సంప్రదింపుల ద్వారా పరిష్కారంలలో బాధితులున్నచో సదరు వ్యక్తులు ఈ ప్రకటన వెలువడిన తేది నుంచి60 (అరవై దినములు) దినములలోపల సంబంధిత జిల్లా కలెక్టరు/అధీకృత అధికారికి సదరు చట్టంలోని సెక్షన్ 15 క్రింద గల అంశాల ప్రకారం తమ అభ్యంతరాలను సమర్పించుకోవచ్చును.

సం/- రాజస్వ మండలాధికారి మరియు భూ సేకరణ అధికారి నిర్మల్ సం/- సంయుక్త పాలనాధికారి నిర్మల్ సం/- జిల్లా పాలనాధికారి నిర్మల్
DIPR No. 1467/LA/PP/2017-18

తెలంగాణ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ, కరీంనగర్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

T. No. 405-428/SE/Tenders/2017-18 తేది: 12-1-2018
పి.ఆర్. రీజియన్, కరీంనగర్ నందు 24 పనులను, అనగా బి.టి. రోడ్డు ఏర్పాటు పనులు, ZPHS పాఠశాలలకు ప్రహరీగోడల నిర్మాణం, వగైరాలను చేపట్టటానికి దిగువసంతకందారుచే టెండర్లు కోరబడుతున్నవి. మొత్తం అంచనా కాంట్రాక్టు విలువ: రూ. 2764.18 లక్షలు. బిడ్ అప్‌లోడింగ్ ప్రారంభ మరియు ముగింపు తేది: 24-1-2018 నుండి 31-1-2018 వరకు. తదుపరి వివరాలకు www.tenders.telangana.gov.inను చూడండి.
సం/– సూపరింటెండింగ్ ఇంజనీర్, పి.ఆర్. రీజియన్, కరీంనగర్
DIPR No. 2723/CL/ADVT/1/1/2017-18

తెలంగాణ ప్రభుత్వము
రహదారులు మరియు భవనాల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఆర్ అండ్ బి), సర్కిల్, ఖమ్మం NIT No. 31/SEK/2017-18, తేది: 12-1-2018 ద్వారా భద్రాద్రి (కొత్తగూడెం)జిల్లా వద్ద 1 ఆర్ఎస్ఏ పని కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. టెండరుదారులు టెండరు షెడ్యూళ్ళను ఇ-మార్కెట్ ప్లేస్, అనగా **www.tender.telangana.gov.in** నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. **టెండర్ల స్వీకరణకు చివరి తేది 27-1-2018, సా. 4.00 గం. వరకు.** తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్, అనగా **www.tender.telangana.gov.in** నందు చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఆర్ అండ్ బి), ఖమ్మం సర్కిల్, ఖమ్మం.
DIPR No. 2735/ CL/ADVT/1/1/2017-18

తెలంగాణ ప్రభుత్వము
రహదారులు మరియు భవనాల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

NIT No. 22/NLG/TSRDC/PLAN/DCE(R)/EE-R/DEE-1/AEE-1/2018, తేది: 17-1-2018.
సూర్యాపేట జిల్లాలో 3 పనులు (PLAN స్కీమ్ క్రింద) - 1వ పిలుపు కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. టెండరుదారులు పైన తెలిపిన పని కొరకు టెండరు షెడ్యూళ్ళను ఇ-మార్కెట్ ప్లేస్, అనగా **https://tender.telangana.gov.in/** నుండి **24–1–2018, రా 8.00 గం. నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండర్ల స్వీకరణకు చివరి తేది: 31–1–2018, మ. 3.30 గం. వరకు.** తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్, అనగా **https://tender.telangana.gov.in/** నందు చూడవచ్చును.
DIPR No. 2731/ CL/ADVT/1/1/2017-18. సం/- ఇంజనీర్–ఇన్–చీఫ్ (R&B), స్టేట్ రోడ్స్ & CRN.

తెలంగాణ ప్రభుత్వము
జిల్లా పంచాయితీరాజ్ ఇంజనీరు, పి.ఐ.యు సూర్యాపేట
టెండరు వేలము ప్రకటన నెం. డి2/16/2017–18, తేది: 18.01.2018

కోదాడ మున్సిపాలిటినందు బాలాజీనగర్‌లోని సర్వే నెంబరు 849 2BHK గృహములు నిర్మించుటకు కేటాయించిన స్థలములో వివిధ రకములైన (139) చెట్లను తొలగించి కలప తీసుకొనుటకుగాను సీల్డు టెండరు కం-వేలంలో పాల్గొనుటకు దరఖాస్తులు కోరబడుచున్నవి. నియమ నిబంధనలతోపాటు టెండరు ఫారమును జిల్లా పం.రాజ్, ఇంజనీరు, పి.ఐ.యు సూర్యాపేట గారి కార్యాలయము నుండి రూ. 1000/- టెండరు షెడ్యూలు ధర రూ. 1,09,000/-లు అదనపు దరావత్తును ఎపిఎఓ సూర్యాపేట పేరున విడివిడిగా తీసిన డిడీలను జతపర్చి **20.01.2018 నుండి 29.01.2018 సా. 5.00 గం॥ల వరకు** పొందవచ్చును. నియమ నిబంధాలకు లోబడి దరఖాస్తులను తిరస్కరించే హక్కు దిగువ సంతకముదారునికి కలదు. సీల్డ్ చేసిన టెండరు జిల్లా పంచాయితీరాజ్ ఇంజనీరు, సూర్యాపేట **కార్యాలయములో తేది: 30.01.2018 ఉదయము 10.30 గం॥ల నుండి తేది: 30.01.2018 మధ్యాహ్నం 3.00 గం॥ల వరకు స్వీకరించబడును.** పైన పేర్కొనిన నిర్ణీత కాలపరిమితి తరువాత వచ్చిన టెండర్లు స్వీకరించబడవు. **బహిరంగ వేలం తేది: 30.01.2018 రోజున సా. 3.30 గం॥ల** నుండి జిల్లా పంచాయితీరాజ్ ఇంజనీరు, సూర్యాపేటలో హాజరుకాగలరు.
టెండరు దరఖాస్తు మరియు మిగతా వివరములకు జిల్లా పంచాయితీరాజ్ ఇంజనీరు, సూర్యాపేట గారి కార్యాలయమునకు పైన తెలిపిన పని దినములనందు సంప్రదించగలరు. ఫోన్ నెం. 8099091353.
DIPR 2739/ CL/ADVT/1/1/2017-18 సం/- జిల్లా పంచాయితీరాజ్ ఇంజనీరు, పి.ఐ.యు సూర్యాపేట

సామాన్య సాగర కెరటం

ఐదేళ్ళ క్రితం అల్లరి చిల్లరిగా తిరిగే కుర్రాడతను

పాఠశాల నుంచి రాగానే గల్లీలో తోటివాళ్ళతో ఆడుకోవడమే అతనికి తెలిసిన హోంవర్క్!

నాన్న జిరాక్స్ షాపులో ఉద్యోగి. ఓ ప్రైవేటు షోరూంలో అమ్మ పని హౌస్ కీపింగ్

రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం. అసలు క్రీడలతో ఏమాత్రం సంబంధం లేని నేపథ్యం

కానీ.. ఇప్పుడతను జాతీయ సెయిలింగ్‌లో ఓ మెరుపు తీగ

సబ్ జూనియర్ విభాగంలో దేశంలోనే నంబర్‌వన్

అండర్-16 కేటగిరిలో అతణ్ణి మించిన వారు లేరు

పట్టుదలకు కృషి తోడైతే ఎవరైనా ఏదైనా సాధించొచ్చని నిరూపించాడీ హైదరాబాద్ బస్తీ కుర్రాడు..

ఎర్ర దుర్గాప్రసాద్



“సబ్ జూనియర్ విభాగంలో భారత నంబర్‌వన్‌గా నిలవడం ఆనందంగా ఉంది. ఈ విభాగంలో నేను అత్యుత్తమ సెయిలర్ అని ఎప్పుడూ నమ్మేవాడిని. ఇప్పుడది నిజమైంది. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలన్నది నా లక్ష్యం. ఆసియా క్రీడల్లోనూ దేశానికి పతకం అందిస్తా”

–దుర్గాప్రసాద్

వర్షాకాలం వచ్చిందంటే రంగురంగుల లేజర్ బోట్లు హుస్సేన్ సాగర్‌లో షికార్లు చేస్తుంటాయి. ఆటపై అవగాహన ఉన్నవాళ్ళకు తప్పిస్తే మిగతా వాళ్ళకు ఆ బోట్ల విన్యాసాలపై పెద్దగా అవగాహన ఉండదు. ఎంతోమంది పిల్లలు, పెద్దలు అటుగా వెళ్తూ పడవల్ని చూస్తారు.. వెళ్తారు అంతే! దుర్గాప్రసాద్ మాత్రం అక్కడితో ఆగిపోలేదు. రసూల్‌పురాలో ఉండే దుర్గాప్రసాద్ పదేళ్ళ వయసులో హుస్సేన్ సాగర్‌లో పడవల్ని చూశాడు. దగ్గర్నుంచి చూడాలన్న ఆత్రుతతో పడవల్ని ఆపే ప్రాంతానికి వెళ్ళాడు. దుర్గాప్రసాద్ ఆసక్తిని గమనించిన హైదరాబాద్ యాట్ క్లబ్ అధ్యక్షుడు సుహీం షేక్ “నేర్చుకుంటావా” అని అతణ్ణి అడిగాడు. అందుకు దుర్గాప్రసాద్ ఆనందంగా ఓకే చెప్పేశాడు. కానీ ఆ సమయంలో సుహీంకు కూడా తెలియదు దుర్గాప్రసాద్ భారత నంబర్‌వన్ సెయిలర్ అవుతాడని!

సెయిలింగ్‌లో జాతీయ స్థాయిలో నంబర్‌వన్‌గా నిలిచిన తొలి తెలుగు కుర్రాడు దుర్గాప్రసాదే కావడం విశేషం. ఇటీవల కృష్ణపట్నం పోర్టులో జరిగిన ఇండియా ఇంటర్నేషనల్ రెగెట్టాలో కాంస్య పతకంతో సత్తాచాటాడు. ఐర్లాండ్, స్వీడెన్, హాంకాంగ్, యూఏఈ, మలేసియా, ఇండోనేసియా, శ్రీలంక దేశాల నుంచి 250 మంది సెయిలర్లు బరిలో దిగిన ఈ పోటీల్లో దుర్గాప్రసాద్ మూడో స్థానంలో నిలవడం గొప్ప విషయమే. అదే వేదికగా జరిగిన జాతీయ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం గెల్చుకుని నంబర్‌వన్ ర్యాంకూ దుర్గాప్రసాద్ సొంతం చేసుకున్నాడు. ఆప్టిమిస్ట్ విభాగంలో సత్తాచాటుతున్న దుర్గాప్రసాద్‌కు.. తాజా ప్రదర్శనతో లేజర్ కేటగిరికి ప్రమోషన్ లభించింది. “గత నాలుగైదేళ్ళలో దుర్గాప్రసాద్ ఎన్నో సవాళ్ళను అధిగమించాడు. ఎన్ని కష్టాలు ఎదురైనా ఆటను వీడలేదు. ఇప్పుడు దేశంలోనే నంబర్‌వన్ అయ్యాడు. 15 ఏళ్ళ దుర్గాప్రసాద్ బరువు 52 కేజీలు. లేజర్ బోట్‌ను సమర్థంగా నడపాలంటే అతను మరో 10 నుంచి 12 కేజీలు బరువు పెరగాలి. అప్పుడే లేజర్ బోట్‌పై నియంత్రణ వస్తుంది. ఆసియా క్రీడల్లో లేజర్ విభాగాన్ని ప్రవేశపెట్టినందున దుర్గాప్రసాద్‌కు పతకం సాధించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి” అన్నది సుహీం షేక్ అభిప్రాయం. ఐదేళ్ళ క్రితం రసూల్‌పురా చంద్రానగర్ కాలనీలోని ఉద్భవ్ పాఠశాలలో చదువుతున్న దుర్గాప్రసాద్‌ను గుర్తించిన ఘనత సుహీం షేక్‌దే. సుహీం శిక్షణ, మార్గనిర్దేశనం దుర్గాప్రసాద్‌కు బాగా కలిసొచ్చాయి. అదుధాబి, థాయ్‌లాండ్‌లలో జరిగిన ప్రపంచ సెయిలింగ్ టోర్నీల్లో ప్రతిభ కనబరిచాడు. ఇక ప్రతి ఏడాది హుస్సేన్ సాగర్‌లో జరిగే తెలంగాణ మాన్సూన్ రెగెట్టా పోటీల్లో దుర్గాప్రసాద్‌దే హవా. ఆప్టిమిస్టిక్ విభాగంలో అతనికి ఎదురేలేదు. గత నాలుగేళ్ళుగా అండర్-16 విభాగంలో అతడే విజేత.

– వరికుప్పల రమేష్, ఈనాడు, హైదరాబాద్

ఇంట గెలిచి రచ్చ ఏడ్చి

పోరాటం ఏదైనా ఇంటా, బయటా గెలిచినప్పుడే అసలైన మజా..! క్రికెట్లో ఇప్పుడీ మాటకు కాలం చెల్లినట్లే..! టెస్టు క్రికెట్లో రచ్చ గెలవడమన్న సంగతే మరిచాయి ప్రధాన జట్లన్నీ. ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న జట్లు.. ‘మీ దేశంలో ఓడించడం కాదు.. మా దేశానికి రండి మీ సత్తా ఏంటో చూస్తాం’ అని శపథాలు చేసుకుంటూ టెస్టు పోరాటాలను ఏకపక్షంగా మార్చేస్తున్నాయి. సొంతగడ్డపై అనుకూల పరిస్థితుల్లో పర్యాటక జట్లని చిత్తు చిత్తుగా ఓడిస్తున్న ఆతిథ్య జట్లు.. విదేశీ పర్యటనల్లో తుస్సుమంటున్నాయి. ఇప్పుడు టెస్టు క్రికెట్లో దాదాపుగా అన్ని జట్లు ఇంట్లోనే పులులు.

వరుసగా తొమ్మిది సిరీస్‌ల్లో విజయం.. రెండేళ్లుగా ఎదురన్నదే లేదు.. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్.. ప్రత్యర్థి ఏదైనా ఫలితం ఒక్కటే.. గెలుపు మీద గెలుపు. ఇలా స్వదేశంలో అసాధారణ విజయాలు అద్భుత రికార్డులెన్నో సాధించింది టీమ్‌ఇండియా. ఇంటి బయట ఓ కఠిన సిరీస్ వచ్చేసిరికి తేలిపోయింది ప్రపంచ నం.1 జట్టు. ఒక్క భారత జట్టేనా ప్రపంచ క్రికెట్లో దాదాపుగా అన్ని జట్ల పరిస్థితి ఇదే. సొంతగడ్డపై తిరుగులేని విజయాలు సాధిస్తున్న జట్లు పరాయిగడ్డపై పరీక్షలో బొక్కబోర్లాపడుతున్నాయి. ఇటీవలే స్వదేశంలో ముగిసిన యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా.. ఇంగ్లాండ్‌పై 4-0తో విజయం సాధించింది. దక్షిణాఫ్రికా మరో టెస్టు మిగిలుండగానే 2-0తో భారత్‌పై సిరీస్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడు ఘన విజయాలను సాధించిన ఈ రెండు జట్లు ప్రస్తుత ప్రత్యర్థి జట్ల దేశాల్లో జరిగిన గత సిరీస్‌ల్లో ఘోర పరాజయాలను మూటగట్టుకోవడం విశేషం. వెస్టిండీస్, బంగ్లాదేశ్, జింబాబ్వే, ఇటీవల బలహీనంగా తయారైన శ్రీలంకతో పోరాటాలను మినహాయిస్తే కొన్నేళ్లుగా టెస్టు సిరీస్‌లన్నింటిలో ఆధిపత్యం దాదాపుగా ఆతిథ్య జట్లదే.

ప్రపంచ వ్యాప్తంగా పన్నెండు నెలల్లో మొత్తం 18 టెస్టు సిరీస్‌లు జరగ్గా పర్యాటక జట్లు గెలిచిన సిరీస్‌లు నాలుగే. అందులో శ్రీలంకపై భారత్, వెస్టిండీస్‌పై పాకిస్థాన్, జింబాబ్వేపై వెస్టిండీస్ విజయాలు కాకుండా.. చెప్పుకోదగ్గ విజయం ఒక్కటే. న్యూజిలాండ్‌లో 3 టెస్టుల సిరీస్‌ను దక్షిణాఫ్రికా 1-0తో గెలుచుకుంది. నిరుడు మాత్రమే కాదు దాదాపుగా ఏడెనిమిదేళ్ల నుంచి పరిస్థితి ఇదే. గత ఐదేళ్లలో ప్రధాన జట్లు.. ఇతర ప్రధాన జట్లను వారి సొంతగడ్డపై ఓడించిన సందర్భాలు ఐదే. ఇంట్లో గెలిచిన మ్యాచ్‌ల కంటే విదేశాల్లో దాదాపుగా రెండింతలు ఓటములు చవిచూశాయి జట్లన్నీ. వెస్టిండీస్, బంగ్లాదేశ్, జింబాబ్వే సిరీస్‌లను మినహాయిస్తే 2013లో ప్రధాన జట్లు గెలిచిన మ్యాచ్ ఒక్కటంటే ఒక్కటే. ఆ ఒక్క విజయాన్ని పాకిస్థాన్‌పై దక్షిణాఫ్రికా అందుకుంది.



ఎవరి పిచ్‌లు వారివే

దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్.. ఇలా ఉపఖండేతర జట్లకు స్పిన్ ఎప్పుడూ సమస్యే..! భారత్ సహా ఉపఖండ జట్లకు పేస్ పిచ్‌లపై ఆడటం ఎప్పుడూ కఠిన సవాలే. ఈ బలహీనతలను రెండు వర్గాలు సొమ్ము చేసుకోవడంపైనే ప్రధానంగా దృష్టిసారిస్తున్నాయి. స్వదేశంలో పూర్తిగా స్పిన్ పిచ్‌లను సిద్ధం చేసుకుంటున్న భారత జట్టు.. ఐదేళ్ల కాలంలో 26 మ్యాచ్‌ల్లో 20 విజయాలు సాధించింది. ఒకే ఒక్క మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. మరే జట్టుకు స్వదేశంలో ఇంత గొప్ప రికార్డు లేదు.

- **రెండేళ్లకు ముందు సొంతగడ్డపై సీమ్ బౌలింగ్‌తో కంగారూల జట్టును వణికించి యాషెస్ సిరీస్‌ను 5-0తో దక్కించుకున్న ఇంగ్లాండ్.. ఈసారి ఆస్ట్రేలియాలో జరిగిన యాషెస్‌లో కనీసం ఒక్క మ్యాచైనా గెలవలేకపోయింది. ఆస్ట్రేలియాలో పేస్, బౌన్స్‌తో కూడిన పిచ్‌పై ఆ జట్టు పసికూనను తలపించింది.**
- **ఆస్ట్రేలియా స్వదేశంలో సిరీస్ గెలిచింది కానీ.. ఉపఖండ పిచ్‌లపై ఆ జట్టు తడబాటు గురించి కొత్తగా చెప్పాల్సిన పనిలేదు.**

సన్నాహక మ్యాచ్‌లు ఏవి?

విదేశీ పర్యటనలప్పుడు జట్టు అక్కడి వాతావరణ పరిస్థితులకు అలవాటు పడటానికి గతంలో కొన్ని సన్నాహక మ్యాచ్‌లు ఆడేవారు. ఇంగ్లండ్ పర్యటనకు వెళ్తే భారత జట్టు గతంలో నెల రోజుల పాటు కౌంటీలతో తలపడేవారు. ఆ తర్వాత ప్రధాన మ్యాచ్‌లు జరిగేవి. ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలు భారత్ వచ్చినప్పుడూ అండర్-19, ఏ జట్లతో ఆడేవారు. టెస్ట్‌కూ టెస్ట్‌కూ మధ్యలోనూ కొన్ని ప్రాక్టిస్ మ్యాచ్‌లు జరిగేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నేరుగా టెస్ట్ ఆడేస్తున్నారు. దీంతో వాతావరణ పరిస్థితులకు ఆటగాళ్లు అలవాటు పడలేకపోతున్నారు. ఆటలో తడబడుతున్నారు.


పరిమిత ఓవర్ల మ్యాచ్‌లతో..

ఇటీవల కాలంలో పరిమిత ఓవర్ల మ్యాచ్‌లు ఎక్కువైపోయాయి. టీ20ల్లో ఎక్కువగా ఆడుతుండటం వల్ల... ఆటగాళ్ల మైండ్‌సెట్ దానికి అనుగుణంగా మారుతోంది. నిలకడగా బ్యాటింగ్, బౌలింగ్ చేయడం కష్టమవుతోంది. టెస్ట్‌ల్లో ఈ పరిస్థితి ఉండదు. స్థిరంగా ఆడాలి. ఫిట్‌నెస్ బాగుండాలి. అందుకే విదేశీగడ్డపై ఎక్కువగా వైఫల్యాలు కన్పిస్తున్నాయి.

ఇదిలాగైతే అన్నీ ఏకపక్షాలే

ప్రత్యర్థి జట్ల బలహీనతలను సొమ్ము చేసుకునేందుకు పోటీపడుతున్న క్రికెట్ దేశాలు తమకు అనుకూల పిచ్‌లతో సొంతగడ్డపై సిరీస్‌లను శాసిస్తున్నాయి. అరుదుగా తప్పితే సిరీస్‌లలో ముందస్తు అంచనాలకు తగ్గట్టుగానే ఫలితాలొస్తున్నాయి. గతంతో పోల్చుకుంటే టెస్టుల్లో నిస్సారమైన డ్రాల సంఖ్య తగ్గుతోంది గానీ.. ఒకప్పటిలా రసవత్తరంగా మాత్రం మ్యాచ్‌లు సాగడం లేదు. ఎక్కువ శాతం ఏకపక్ష పోరాటాలతో టెస్టులపై ఆసక్తి తగ్గుతోంది. ఇప్పుడిప్పుడే ఈ ధోరణిలో మార్పు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఎందుకంటే మ్యాచ్‌ల కోసం పిచ్‌లను రూపొందించే బాధ్యత ఆయా బోర్డులదే. తమ జట్టుకు బలాబలాలకు తగ్గట్టుగానే బోర్డులు పిచ్‌లను రూపొందిస్తాయి గానీ.. పోటీ పిచ్‌లను తయారుచేసి సొంత జట్టు ఓడిపోవాలని ఏ జట్టు కోరుకోదు..! మరి ఈ సమస్యకు పరిష్కారమేంటన్నది కాలమే చెప్పాలి.


– తమ్మినేని శ్రీనివాసులు



తప్పేముంది..?

‘సొంత బలాలకు తగట్టుగా పిచ్‌లు రూపొందించుకుంటే తప్పేముంది’ ఇప్పుడు ప్రతి జట్టు వినిపిస్తున్న వాదన ఇది. 2015లో దక్షిణాఫ్రికా భారత పర్యటనకు వచ్చినప్పుడు తొలి టెస్టు వేదిక మొహాలి పిచ్‌ను చూసి అంతా నోరెళ్లబెట్టారు. తొలి రోజు నుంచే బంతి గిర్రున తిరగడం ఖాయమంటూ నిపుణులు తేల్చేశారు. అంచనాలకు తగ్గట్టుగా ఆ సిరీస్‌ను శాసించింది స్పిన్నర్లే. స్పిన్ పిచ్‌లపై పండగ చేసుకున్న అశ్విన్, జడేజా ద్వయం 50కిపైగా వికెట్లు పడగొట్టి దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్‌ను ముప్పతిప్పలు పెట్టింది. సిరీస్‌లో 0-3తో దక్షిణాఫ్రికాకు ఘోర ఓటమి తప్పలేదు. ఓటమి బాధతో రగిలిపోయిన సఫారీ జట్టు ఈ ఏడాదిపచ్చని పిచ్‌లతో టీమ్‌ఇండియాకు ఆహ్వానం పలికింది. ఇప్పుడు భారత్ ఎలా ఆడుతుందో చూస్తామంటూ దక్షిణాఫ్రికా కెప్టెన్ డుప్లెసిస్ సిరీస్‌కు ముందే విజయ గర్వం ప్రదర్శించాడు. పేస్, బౌన్సీ పిచ్‌లపై వరుసగా రెండు విజయాలు సాధించిన ఆ జట్టు మొత్తానికి భారత్‌ను ఓడించి ప్రతీకారం తీర్చుకుంది. ఈ రెండు దేశాల్లోనే కాదు.. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇంగ్లాండ్, శ్రీలంకల్లో కూడా తమ జట్లకు అనుకూలంగా పిచ్‌లు రూపొందుతున్నాయి. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో పేస్, బౌన్సీ పిచ్‌లు.. ఇంగ్లాండ్‌లో స్వింగ్‌కు అనుకూల పిచ్‌లు తయారవడం ఎప్పటినుంచో జరుగుతోంది.

ప్రధాన జట్లలో విదేశీ రికార్డు కాస్త గొప్పగా ఉన్న జట్టు దక్షిణాఫ్రికానే. ఐదేళ్ల కాలంలో విదేశాల్లో 19 మ్యాచ్‌లు ఆడిన దక్షిణాఫ్రికా 6 మ్యాచ్‌లు గెలిచి 7 మ్యాచ్‌ల్లో ఓడింది. ఆ తర్వాతి స్థానం భారత్‌దే. ఐదేళ్లలో 26 మ్యాచ్‌ల్లో 8 మ్యాచ్‌లు గెలిచిన భారత జట్టు 10 మ్యాచ్‌ల్లో ఓడింది. 8 డ్రాగా ముగిశాయి.



పదిహేనేళ్లకే ఫెదరర్‌ను మించి..

15 ఏళ్ల అమ్మాయిలు ఏం చేస్తుంటారు..? పుస్తకాలతో కుస్తీ పట్టడమో లేక స్నేహితులతో సరదాగా గడపడమో చేస్తారు..! ఓ అమ్మాయి ఏకంగా ఒక గ్రాండ్‌స్లామ్ టోర్నీలో మూడో రౌండ్లో అడుగుపెట్టింది. ర్యాంకు చూస్తే 522.. ఆట చూస్తే అమోఘం. ఆస్ట్రేలియన్ ఓపెన్లో వందలోపు ర్యాంకున్న అమ్మాయిలను ఓడించి ప్రకంపనలు సృష్టిస్తున్న ఈ ఉక్రెయిన్ టీనేజరే మార్తా కోస్త్యుక్.

ప్రస్తుతం ఆస్ట్రేలియన్ ఓపెన్లో వరుస విజయాలు సాధించింది ఎవరంటే వెంటనే రోజర్ ఫెదరర్ గుర్తొస్తాడు. ఎందుకంటే గతేడాది ఛాంపియన్‌గా నిలిచిన దగ్గర నుంచి రోజర్‌కు ఈ టోర్నీలో తిరుగేలేదు. ఈ స్విస్ మాస్టర్ కన్నా ఎక్కువ విజయాలు సాధించిన మరొకరు ఉన్నారు ఆమే మార్తా. గతేడాది టోర్నీ నుంచి ఇప్పటిదాకా ఫెదరర్.. 8 వరుస విజయాలు సాధిస్తే.. మార్తా ఖాతాలో 11 విజయాలున్నాయి. గత టోర్నీలో బాలికల ఛాంపియన్‌గా నిలిచిన ఆమె.. ఇప్పుడు మెయిన్ డ్రాకు అర్హత సాధించడమే అద్భుతం అనుకుంటే.. ఏకంగా మూడో రౌండ్ చేరి సంచలనం సృష్టించింది. బాలికల ఛాంపియన్ హోదాలో ఆమెకు ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు ఆడేందుకు వైల్డ్‌కార్డు లభించింది. అర్హత టోర్నీలో వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచిన మార్తా.. మెయిన్‌డ్రాకు అర్హత సాధించిన పిన్న వయస్కురాలిగా నిలిచింది. 2002.. ఆ తర్వాత పుట్టిన క్రీడాకారిణుల్లో ఒక గ్రాండ్‌స్లామ్ మెయిన్ డ్రాకు అర్హత సాధించిన ఘనత ఆమెదే. అంతే కాదు తొలి రౌండ్లో ప్రపంచ 27వ ర్యాంకర్ షుయ్ పెంగ్‌ను ఓడించి.. మార్టినా హింగిస్ (1996) తర్వాత ఈ టోర్నీలో తొలి రౌండ్ దాటిన పిన్న వయస్కురాలిగా మరో రికార్డు సృష్టించింది.

పిల్లి మొగ్గలు వేసి...

గెలిచిన తర్వాత ఆమె చేసిన విన్యాసం అందర్ని భలే ఆకర్షించింది. జిమ్నాస్ట్‌లా కోర్టులో పిల్లి మొగ్గలు వేస్తూ ఆనందాన్ని పంచుకుంది మార్తా. రెండో రౌండ్లో రొగోస్కా (ఆస్ట్రేలియా)పై గెలిచిన మార్తా.. 1997లో లూసి బరోని తర్వాత ఈ దశకు చేరిన పిన్న వయస్కురాలిగా నిలిచింది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు ముందు మార్తా కెరీర్ ప్రైజ్‌మనీ 6733 డాలర్లు. ఈ టోర్నీలో మూడో రౌండ్ చేరడం ద్వారా ఆమె తన ప్రైజ్‌మనీని 1,13,000 డాలర్లకు పెంచుకుంది. విశేషం ఏమిటంటే ఫెదరర్‌కు ప్రస్తుత కోచ్‌గా ఉన్న ఇవాన్ లుబిసిచ్.. మార్తాకూ కోచ్‌గా వ్యవహరిస్తుండడం.

అమ్మ, నాన్న.. టెన్నిస్

మార్తా.. అమ్మ టాలినా, నాన్న ఒలెగ్ ఇద్దరూ టెన్నిస్‌తో అనుబంధం ఉన్న వాళ్లే. దీంతో ఆమెకు చిన్నప్పటి నుంచే టెన్నిస్‌పై మక్కువ ఏర్పడింది. 5 ఏళ్లకే రాకెట్ పట్టింది. మార్తా నాన్న.. ఉక్రెయిన్‌లో జరిగే యాంటె కప్ జూనియర్ టోర్నీకి టెక్నికల్ డైరెక్టర్.. ఆమె తల్లి ఉక్రెయిన్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఆరంభం నుంచి తల్లే మార్తాకు కోచ్. ఆ తర్వాత టారస్ బెంకో శిక్షణలో ఆమె రాటుదేలింది. ఆస్ట్రేలియన్ ఓపెనే ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. గతేడాది ఈ టోర్నీలో జూనియర్ బాలికల టైటిల్ గెలిచి సత్తా చాటిన మార్తా.. ఏడాది తిరిగేలోపే సీనియర్ విభాగంలో సంచనాలు నమోదు చేస్తోంది.



ఈనాడు సినిమా



తమన్నా

సమతూకం పాటిస్తున్నా

మన కథానాయికలు ఫ్యాషన్ పరంగా రాటుదేలిపోయారు. వేడుకల్లో అయితే వాళ్లు ధరించిన దుస్తులే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటాయి. ఆ విషయంలో తమన్నా మరో అడుగు ముందే ఉంటుంది. హిందీకి వెళ్లాక ఫ్యాషన్ పాఠాలు మరింతగా ఒంటబట్టాయని చెబుతోందామె. అయితే ఎంతగా ఫ్యాషన్‌ని అనుసరించినా... సౌకర్యాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలంటోంది తమన్నా. "ఏం ధరించామన్నది కాదు. అవి మన ఒంటికి తగ్గట్టుగా ఉన్నాయా లేదా అనేది ముఖ్యం. మనం ధరించినవి సౌకర్యంగా ఉన్నప్పుడే మనం ఆత్మవిశ్వాసంతో కనిపిస్తామనే విషయాన్ని మరిచిపోకూడదు" అంటోంది తమన్నా. పుష్కరకాలంగా చిత్ర పరిశ్రమలో కొనసాగుతున్న ఈమె ప్రస్తుతం తాను సంపాదించిన అనుభవాన్ని, తన పాత్రలపై రంగరించే ప్రయత్నం చేస్తోంది. "కెరీర్ ఆరంభంలో ఒకట్రెండు తప్పులు చేసినా చెల్లుబాటు అవుతుంది. కానీ ఇప్పుడు కుదరదు. నాపై బాధ్యత పెరిగింది. ఇన్ని సినిమాలు చేసి, ఇంత అనుభవం సంపాదించాక కూడా నేను సాదాసీదా పాత్రల్లో కనిపిస్తే దానికి అర్థం లేదు. అందుకే అటు వాణిజ్య కథలు, ఇటు నటనకి ప్రాధాన్యమున్న పాత్రల మధ్య సమతూకాన్ని పాటిస్తూ ప్రయాణం చేస్తున్నా" అని చెప్పుకొచ్చింది తమన్నా. ప్రస్తుతం ఆమె తెలుగు 'క్వీన్'తో పాటు, కల్యాణ్‌రామ్‌తో కలిసి ఓ చిత్రంలో నటిస్తోంది.



బోయపాటి శ్రీను, రిషి పంజాబీ, రామ్‌చరణ్, కైరా అద్వాణి, డి.వి.వి.దానయ్య

చరణ్ చిత్రం ప్రారంభం

రామ్‌చరణ్ కథానాయకుడిగా డి.వి.వి.ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్.ఎల్.పి పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతోంది. కైరా అద్వాణి కథానాయిక. తమిళ నటుడు ప్రశాంత్, హిందీ నటుడు వివేక్ ఒబెరాయ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తున్నారు. డి.వి.వి.దానయ్య నిర్మాత. శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైందీ చిత్రం. ఈ నెలాఖరు వరకు తొలి షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతుంది. నిర్మాత మాట్లాడుతూ "కథానాయకుల ఇమేజ్‌ని తెరపై ఆవిష్కరించడంలో బోయపాటి శ్రీను శైలి ప్రత్యేకం. రామ్‌చరణ్ కోసం ఆయనొక మంచి కథని సిద్ధం చేశారు. కొత్త తరహాలో చరణ్‌ని తెరపైన చూపించబోతున్నారు. సాంకేతిక హంగులతో తెరకెక్కనున్న ఈ చిత్రం ప్రేక్షకుల అంచనాలకి దీటుగా ఉంటుంది" అన్నారు. స్నేహ, హిమజ, ప్రవీణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి మాటలు: ఎం.రత్నం, కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు, కళ: ఎ.ఎస్.ప్రకాష్; సంగీతం: దేవిశ్రీప్రసాద్, ఛాయాగ్రహణం: రిషి పంజాబీ.

అమ్మాయిల కళాశాలలో అల్లుడుగారు


నాగచైతన్య కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. 'శైలజా రెడ్డి అల్లుడు' అనే పేరు పరిశీలిస్తున్నారు. రమ్యకృష్ణ ప్రధాన పాత్రధారి. అను ఇమ్మానియేల్ కథానాయిక. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తోంది. సూర్య దేవర నాగవంశీ నిర్మాత. శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ మహిళా కళాశాలలో చిత్రీకరణ మొదలైంది. నాగచైతన్య, అను ఇమ్మానియేల్‌లపై కొన్ని సన్నివేశాల్ని తెరకెక్కించారు. "అత్తా అల్లుళ్ల కథలన్నీ బాక్సాఫీసు దగ్గర మంచి విజయాల్ని అందుకున్నాయి. ఆ జాబితాలో మా సినిమా కూడా చేరుతుంది. వినోదం, కుటుంబ బంధాలకు ప్రాధాన్యం ఉంది. గోపీ సుందర్ బాణీలు ఆకట్టుకుంటాయ"ని చిత్రబృందం తెలిపింది. వెన్నెల కిషోర్, కల్యాణి నటరాజన్, పృథ్వీ, రఘుబాబు, రాహుల్ రామకృష్ణ తదితరులు నటిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్: రవీందర్, సమర్పణ: పిడివి ప్రసాద్.



నాగచైతన్య, అను ఇమ్మానియేల్

పెళ్లెప్పుడో ప్రభాస్‌కే తెలియాలి

నటుడిగా కృష్ణంరాజుది సుదీర్ఘ ప్రయాణం. ఈ ప్రస్థానంలో త్వరలోనే యాభై ఏళ్లు పూర్తి చేసుకుంటున్నారు. ఈ గమనంలో ఎన్నో అపురూపమైన పాత్రలు ఆయనకు దక్కాయి. నిర్మాతగానూ విజయాలు అందుకున్నారు. ఇప్పుడు ప్రభాస్ సాధిస్తున్న విజయాల్ని చూసి ఓ పెదనాన్నగా పొంగిపోతున్నారు. శనివారం కృష్ణంరాజు పుట్టిన రోజు. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు.



■ "త్వరలోనే నటుడిగా యాభై ఏళ్లు పూర్తవుతాయి. అందుకే ఈ వేడుకని ప్రత్యేకంగా జరపాలని భావిస్తున్నా. నా అభిమానుల మధ్య అయిదు దశాబ్దాల పండుగ నిర్వహిస్తా. ఎప్పుడు, ఎక్కడ? అనేది త్వరలో చెబుతా. ఈ యేడాది నటుడిగా కెమెరా ముందుకు రావాలని ఉంది. నాకు తగిన పాత్రలు లభిస్తే తప్పకుండా చేస్తా. కృష్ణంరాజు మళ్లీ నటిస్తున్నాడంటే తప్పకుండా ప్రత్యేక అంచనాలుంటాయి. 'ఎవడే సుబ్రహ్మణ్యం'లో నేను కనిపించింది కాసేపే. అయినా... ఆ పాత్ర నిలబడింది. అలాంటి సినిమాలు చేస్తా"

■ "మా గోపీకృష్ణ సంస్థలో 'ఒక్క అడుగు' చిత్రాన్ని ప్రభాస్‌తో తెరకెక్కించాలని అనుకున్నాం. అనివార్య కారణాల వల్ల ఆ ప్రాజెక్టు పక్కన పెట్టాల్సివచ్చింది. ఏప్రిల్‌లో ప్రభాస్‌తో ఓ సినిమా చేస్తాం. రాధాకృష్ణ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారు. ప్రభాస్ పెళ్లి గురించి ఇంకా ఏమీ అనుకోలేదు. మొన్నటి వరకూ 'బాహుబలి పూర్తయిన వెంటనే చేసుకుంటా' అనేవాడు. ఇప్పుడు 'సాహో అవ్వాలి' అంటున్నాడు. ఎప్పుడు చేసుకుంటాడో తనకే తెలియాలి"

■ "చరిత్రకు సంబంధించిన కథల్ని సినిమాలుగా తీస్తున్నప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకొని మరీ తీయాలి. 'పద్మావత్' చిత్రానికి సంబంధించిన వివాదాలు చూస్తూనే ఉన్నాం. చరిత్రని వక్రీకరించడం నేరం. అలాగని చరిత్రని ఉన్నది ఉన్నట్టుగానూ తీయలేం. కొన్ని మెరుగులు అద్దాల్సిందే. 'తాండ్రపాపారాయుడు' కథని సినిమాగా చేస్తున్నప్పుడు మేం కూడా అదే చేశాం"

■ "ఈ మధ్య విజయాల శాతం పెరిగింది. నిర్మాణ వ్యయమూ ఎక్కువైంది. చక్కటి ప్రణాళికతో చిత్రాల్ని తీస్తే తప్పకుండా మంచి ఫలితాలొస్తాయని చెప్పడానికి 'బాహుబలి' ఓ ఉదాహరణ. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ ప్రేమికుల్లో దాదాపు 90 శాతం మంది ఈ సినిమాని చూశారు. 'బాహుబలి లాంటి సినిమా మనమూ తీయాలి' అనే ఆలోచన రేకెత్తించారు. ఆ స్ఫూర్తితో పది సినిమాలు తీస్తే.. కచ్చితంగా రెండైనా ఆడతాయి"

■ "కృష్ణతో నాకు చాలా అనుబంధం ఉంది. ఆ రోజుల్లో 'మీ ఇద్దరు కలిసి పార్టీ పెట్టండి' అని సలహా ఇచ్చిన వాళ్లెంతమందో? కానీ అప్పట్లో మా ఇద్దరికీ రాజకీయాలంటే పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. ఆ భారం మోయడం కష్టం అనిపించేది. అందుకే అటువైపుగా ఆలోచించలేదు. ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. అందుకే.. ఈసారి రాజకీయాలపై ఇంకాస్త దృష్టి పెట్టాలని భావిస్తున్నా. ఈసారి పోటీ చేస్తానా, లేదా? అనేది ఇప్పుడే చెప్పలేను. సరైన సమయంలో నిర్ణయం వెల్లడిస్తా"

తప్పులు అందరూ చేస్తారు..
త్యాగాలు మాత్రం కొందరే చేస్తారు..

చిత్రం : శ్రీరాములయ్య

- పంపినవారు : మహ్మద్ జెయినోద్దీన్, ఉమ్మెడ, నిజామాబాద్ జిల్లా

సమతుల్యత కోసం చేసే యుద్ధం

"వ్యక్తిగత జీవితం, విధి నిర్వహణల మధ్య సమతుల్యత కోసం ఓ అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ అధికారి చేసిన యుద్ధం నేపథ్యంలో సాగే కుటుంబకథాచిత్రమే మా 'టచ్ చేసి చూడు'' అంటున్నారు విక్రమ్ సిరికొండ. ఈ సినిమా ద్వారా ఆయన దర్శకుడుగా పరిచయం అవుతున్నారు. రవితేజ కథానాయకుడు. రాశిఖన్నా, సీరత్‌కపూర్ నాయికలు. నల్లమలుపు శ్రీనివాస్(బుజ్జి), వల్లభనేని వంశీ నిర్మాతలు. ఫిబ్రవరిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో దర్శకుడు విక్రమ్ విలేకర్లతో మాట్లాడారు.



● సినిమాలో రవితేజ ఏసీపీ కార్తికేయగా నటిస్తున్నారు. ఇది అతని జీవితంలో రెండు వేర్వేరు కాలాల నేపథ్యంలో సాగే కుటుంబ కథ. కథానాయిక రాశీఖన్నా డ్యాన్స్ టీచర్. వీరి రొమాంటిక్ సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. కొన్ని చోట్ల రవితేజ పాత్ర కన్నా, రాశి పాత్రే మిన్నగా అనిపిస్తుంది. ఇది నచ్చే రవితేజ ఒప్పుకున్నారు. అలాగే సీరత్‌కపూర్ కార్తికేయకి బాల్యమిత్రురాలు. ఈ సినిమా రవితేజ పోలీస్ కథాచిత్రాల్లోనే కొత్త కోణంలో సాగుతుంది. విధినిర్వహణలో కార్తికేయ అత్యంతాధునికమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడాన్ని కొత్త తీరులో చూపించాం.

● ఈ కథ వక్కంతం వంశీది. నల్లమలుపు బుజ్జి ఈ కథ గురించి చెప్పి డైరెక్ట్ చేయమన్నారు. ఆ కథని ప్రేమ, కుటుంబపరమైన భావోద్వేగాలను మిళితంచేసి నా ఆలోచనలకి తగ్గట్టు మలిచి చిత్రించాం. ఇటీవల విడుదలైన పాటకి మంచి స్పందన లభిస్తోంది. ఇది దర్శకుడిగా నా తొలి చిత్రం. మెకానికల్ ఇంజనీరింగ్ తర్వాత సినిమాలపై ఆసక్తితో వీవీ వినాయక్ వద్ద చేరా. ఆయన 'ఠాగూర్', 'సాంబ', 'బన్ని' చిత్రాలకి పని చేశా. 'కొంచెం ఇష్టం కొంచెం కష్టం', 'రేసుగుర్రం' మరి కొన్ని చిత్రాలకి స్క్రీన్‌ప్లే రచయితగా చేశా. ఈ సినిమా విజయమే నా భవిష్యత్‌ను నిర్దేశిస్తుంది.

కొత్తగా ఆ ఆలోచన మొదలైంది



కరీనా కపూర్

కష్టపడే తత్వం, అదృష్టం జత కలిస్తే కరీనా కపూర్ కెరీర్ లాగే ఉంటుందేమో. ఆమె ఇన్నేళ్లుగా స్టార్ కథానాయికగా కొనసాగుతున్నా నటనపై తపన తగ్గలేదు. మరో విషయం ఏంటంటే ఇప్పుడు ఆమెకు పెళ్లయ్యింది... పిల్లాడున్నాడు. అయినా పాత్ర కోసం ఎంత కష్టానికైనా సిద్ధపడుతోంది కరీనా. కొంత విరామం తర్వాత 'వీరే దె వెడ్డింగ్'లో యువ కథానాయికలతో కలిసి నటిస్తోంది. ఈ చిత్రంలో కరీనా జోరు చూస్తుంటే యువ కథానాయికలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఉండేలానే ఉంది. విరామం తర్వాత ప్రయాణం ఎలా ఉంది అంటే..."నాకు ఇష్టమైన దాని కోసం ఏదైనా చేస్తాను. అదృష్టవశాత్తూ నాకు నటనే ఇష్టం. అందుకే విరామం వచ్చినా ఇబ్బంది పడకుండా చేస్తున్నాను. ఇందులో ఎలాంటి గేమ్ ప్లాన్ లేదు. కెరీర్, కుటుంబం, మిగిలిన ఇతర విషయాలు...ఇలా దేనికి దానికే ప్రాధాన్యత ఇస్తున్నాను. అందుకే ప్రయాణం సాఫీగా సాగిపోతుంద"ని చెప్పింది. ఇకపై ఎలాంటి పాత్రలు పోషించడానికి ఆసక్తి కనబరుస్తారంటే, "ప్రస్తుతానికి ఏమీ అనుకోలేదు. విరామం తర్వాత చేస్తున్న 'వీరే దె వెడ్డింగ్'కు ప్రేక్షకుల స్పందన ఎలా ఉంటుందో చూడాలి. ఆ తర్వాత కొత్త చిత్రం గురించి ఆలోచిస్తానేమో" అని చెప్పింది కరీనా కపూర్.

అంతరిక్ష యానం



జయం రవి

జయం రవి, నివేదా పేతురాజ్ జంటగా శక్తి సౌందర్‌రాజన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'టిక్ టిక్ టిక్'. శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలింస్ పతాకంపై పద్మావతి చదలవాడ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. చదలవాడ బ్రదర్స్ సమర్పిస్తున్నారు. అంతరిక్ష నేపథ్యంలో సాగే తొలి భారతీయ సినిమా ఇది. కథానాయకుడు సాయిధరమ్ తేజ్ ట్రైలర్‌ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "మన సినిమాల్లో చూడని ఓ కొత్త కాన్సెప్ట్‌తో రూపుదిద్దుకొంది 'టిక్ టిక్ టిక్'. అంతరిక్ష యానంతో కూడిన సినిమా దక్షిణాదిన తెరకెక్కినందుకు ఆనందంగా ఉంది. తమిళంలో విడుదలైన ఈ సినిమా ట్రైలర్‌ని చూశాక, తెలుగులో ఎవరు విడుదల చేస్తారా అని చూశా. నా మిత్రుడు లక్ష్మణ్ తెలుగు హక్కులు సొంతం చేసుకొని చిత్రాన్ని విడుదల చేస్తుండడం ఆనందంగా ఉంద"న్నారు. "విలక్షణమైన కథ, నేపథ్యంతో కూడిన చిత్రమిది. 'బిచ్చగాడు', '16' తర్వాత మరో మంచి చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తుండడం ఆనందంగా ఉంది. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తాం" అన్నారు చిత్ర సమర్పకుల్లో ఒకరైన లక్ష్మణ్. ఈ చిత్రానికి సంగీతం: డి.ఇమ్మాన్, ఛాయాగ్రహణం: వెంకటేష్, కూర్పు: ప్రదీప్, కళ: మూర్తి.

జీవితకథకి శ్రీకారం

మహేష్, భవ్యశ్రీ, శ్వేతన్ నటిస్తున్న చిత్రం 'బగ్గిడి గోపాల్'. 'రైట్ రైట్ టు అధ్యక్షా..?' అనేది ఉపశీర్షిక. మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్ కీలక పాత్రలో నటిస్తున్నారు. నటి కవిత ముఖ్యభూమికను పోషిస్తున్నారు. అర్జున్ కుమార్ దర్శకుడు. బగ్గిడి గోపాల్ నిర్మాత. శుక్రవారం హైదరాబాద్‌లో చిత్రీకరణ మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి తమిళనాడు రాష్ట్ర మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య క్లాప్‌నిచ్చారు. ప్రతాని రామకృష్ణ గౌడ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. సాయివెంకట్ గౌరవ దర్శకత్వం వహించారు. విలేకర్ల సమావేశంలో చిత్రనిర్మాత మాట్లాడుతూ "సామాన్యుడైన ఓ కండక్టర్ స్థాయి నుంచి శాసనసభ్యుడిగా ఎదిగిన నా నిజజీవిత కథ ఇది. అందువల్ల 'రైట్ రైట్ టు అధ్యక్షా..?' అనే ఉపశీర్షికను నిర్ణయించామ"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఈ సినిమాలో బగ్గిడి గోపాల్‌కి సంబంధించి ఎందరికో తెలియని సంఘటనలుంటాయి. ఐదు పాటలున్నాయ"న్నారు. బగ్గిడి గోపాల్ ప్రయత్నం విజయవంతం కావాలని కోరారు రోశయ్య. కార్యక్రమంలో గంగిరెడ్డి, శ్రీనివాస్ కుమార్, జయసూర్య తదితరులు పాల్గొన్నారు.



భవ్యశ్రీ, మహేష్, శ్వేతన్



ఏ ఇబ్బందీ లేదు.. కానీ పాపాయి కోసం మానేయాల్సి వచ్చింది.. కొన్నాళ్లు విరామం తీసుకుని, మళ్లీ ఉద్యోగం చేయాలనుకునే చాలామంది మహిళలు చెప్పే కారణం ఇదే. చదువూ, పెద్దవాళ్ల బాగోగులూ, అనారోగ్యం, పెళ్లి.. లాంటివన్నీ తరువాతే వస్తాయి. సరే.. కారణం ఏదయినా సెకెండ్ ఇన్నింగ్స్ ప్రారంభించాలనుకునే మహిళలు మళ్లీ ఉద్యోగంలో చేరడానికే కాదు, నిలదొక్కుకోవడం ఈ రోజుల్లో పెద్ద కష్టమేం కాదు. ఎందుకూ, ఎలాగ అంటారా.. ఇది చదవండి మీకే తెలుస్తుంది.

సెకెండ్ ఇన్నింగ్స్‌లోనూ... సత్తా చాటేద్దాం!

ఆమె పేరు నేహా బగారియా. ఫైనాన్స్ నేపథ్యం. ఒకప్పుడు ఆమె సాధారణ ఉద్యోగిని. కానీ పిల్లలు పుట్టాక వాళ్ల అవసరాలు చూసేందుకు ఉద్యోగం మానేయాల్సి వచ్చింది. పిల్లలు కాస్త పెద్దయ్యాక మళ్లీ ఉద్యోగం చేయాలనుకుంది. కొన్ని సంస్థలు నైపుణ్యాలపై దృష్టిపెడితే, మరికొన్ని అదనపు అర్హతలు అడిగాయి. చివరకు ఉద్యోగం వచ్చింది. కానీ అదే ఆమెను ఆలోచనల్లో పడేసింది. 'నాకున్న అర్హతలకు మంచి ఉద్యోగమే వచ్చింది. కానీ అందరికీ అలాంటి అవకాశాలు ఉండవు కదా.. ఇవన్నీ ఆలోచించాకే అలాంటి మహిళల కోసం ఏదయినా చేయాలనుకున్నా. అలా మూడున్నరేళ్లక్రితం ప్రారంభించిందే జాబ్స్ ఫర్ హర్. ఒక్క హైదరాబాద్ నుంచే దాదాపు పదిహేను నుంచి ఇరవైశాతం మంది మహిళలు మా సేవల్ని వినియోగించుకుంటున్నారు. అవసరం అనుకుంటే రెజ్యూమే ఎలా తయారుచేయాలో కూడా నేర్పిస్తాం' అంటూ వివరిస్తుంది నేహా. జాబ్స్ ఫర్ హర్ అనేది ఆన్‌లైన్ ద్వారా సేవలందించే సంస్థ. పలు కారణాల వల్ల ఉద్యోగాలు మానేసి సెకెండ్ ఇన్నింగ్స్ ప్రారంభించేవారికోసం ఉద్యోగాలను చూపిస్తుందీ సంస్థ. అదే సమయంలో అవసరమైన నైపుణ్యాలు పెంచుకునేందుకు నిపుణుల సలహాలూ అందిస్తుంది. ఈ సంస్థ బెంగళూరులో ఉన్నా... ముంబయి, చెన్నై, హైదరాబాద్ నుంచీ ఈ సేవలు వినియోగించుకుంటున్నవారు ఉన్నారు. ఇదొక్కటే కాదు.. అవతార్-ఐ-విన్, షిరోస్, హర్ సెకెండ్ ఇన్నింగ్స్ వంటివన్నీ ఈ తరహా సేవలు అందించేవే.

ఎలాంటి సంస్థలు..

అవసరాన్ని బట్టీ స్కూళ్లు మొదలు సాఫ్ట్‌వేర్ సంస్థల వరకూ 'విరామం తరువాత' పనిచేయాలనుకునే మహిళల్ని స్వాగతిస్తున్నాయి. అందులో బ్యాంకులూ లేకపోలేదు. ఇక జీఈ, గోద్రెజ్, కొటక్ మహీంద్రా, స్నాప్‌డీల్ లాంటి సంస్థలతోపాటు దేశంలోని దాదాపు 750 కంపెనీలు అవకాశాలు అందిస్తున్నాయి. అంతేకాదు.. ఉద్యోగినుల అవసరాలను బట్టి అయితే ఫుల్‌టైం లేదా పార్ట్‌టైం అదీ కాదనుకుంటే ఇంటినుంచి పనిచేసే సదుపాయాల్నీ కల్పిస్తున్నాయి. కేవలం ఫ్రీలాన్సింగ్ చేయాలనుకునేవారికీ, ఇంటర్న్‌షిప్ రూపంలో పనిచేయాలనుకునేవారికీ అవకాశాలు కల్పిస్తున్నాయి.



కొన్నాళ్లక్రితం నేనో ప్రముఖ సంస్థలో సేల్స్ అండ్ మార్కెటింగ్ విభాగంలో టెరిటరీ మేనేజర్‌గా చేశా. అదీ పదేళ్లు. మొదట పాప. తరువాత బాబు పుట్టాక ఉద్యోగం కష్టమైంది. కార్పొరేట్ రంగంలో ఒత్తిడి కాస్త ఎక్కువే. దానికితోడు పనులూ, నిద్రలేకపోవడం కష్టమై చివరకు మానేశా. నాలుగేళ్లు ఇంట్లోనే ఉన్నా. అప్పుడూ ఖాళీగా లేను. సాఫ్ట్‌వేర్ నుంచి మీడియా రంగంలోకి మారాలనుకుని దానికి సంబంధించిన నైపుణ్యాలు మెరగుపరచుకున్నా. నా ఒకప్పటి ఉద్యోగానుభవం, తరువాత నేర్చుకున్న నైపుణ్యాలు అన్నీ ఇప్పుడు ఉపయోగపడుతున్నాయి. మీడియాలో చేరాక మొదటి మూడు నెలలు కాస్త ఇబ్బందిగా అనిపించినా త్వరగానే అన్ని విషయాలూ నేర్చుకున్నా'.

- సత్యభావన కాదంబరి, స్క్రిప్ట్‌రైటర్, ప్రోగ్రామ్ ప్రొడ్యూసర్, డైరెక్టర్, బిజినెస్ కన్సల్టెంట్



మాది హైదరాబాద్. నా డిగ్రీ అయ్యాక దాదాపు ఏడెనిమిదేళ్లు ఓ ఎంఎన్‌సీలో చేశా. కొంతకాలం విదేశానికీ వెళ్లా. అక్కడున్నప్పుడే మరో ఉద్యోగం వచ్చింది. ఆ పనివాతావరణం నాలో ఆత్మవిశ్వాసాన్నీ పెంచింది. ఓ వైపు ఉద్యోగం చేస్తూనే వారాంతాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్‌లకు వెళ్లేదాన్ని. ఇండియన్ అసోసియేషన్స్‌లో పేరు నమోదు చేసుకుని వాలంటరీగా చేసేదాన్ని. విదేశీయుల్లో ఎక్కువ మంది ఉద్యోగం చేస్తూ చదువుకుంటారు. లేదా మరేదయినా కొత్త విషయం నేర్చుకుంటారు. నేనూ దాన్ని పాటించా. మనదేశానికి వచ్చాక ఎంబీఏ పూర్తిచేశా. ఇవన్నీ నాకెంతో ఉపయోగపడ్డాయి. ప్రస్తుతం ఫైనాన్స్ సర్వీస్‌కి సంబంధించి సొంతంగా స్టార్టప్ కంపెనీ ప్రారంభించే ప్రయత్నంలో ఉన్నా.

- ఎం.శర్వాణి, ప్రయివేట్ ఉద్యోగిని.



సెకెండ్ ఇన్నింగ్స్ ప్రారంభించేవారు వ్యక్తిగతంగా, వృత్తిగతంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏంటో చూద్దాం.

నిజాయతీ: చాలామంది మహిళలు అయిదారేళ్ల తరువాత ఉద్యోగంలో చేరేటప్పుడు మొదటగా ఎదుర్కొనే సమస్య రెజ్యూమే తయారీ. ఎక్స్‌పీరియన్స్ అనే కాలమ్‌లో 'ఇన్నేళ్లు విరామం తీసుకున్నాం' అని రాయడానికి మొహమాటపడతారు. కుటుంబ బాధ్యతల కోసం ఇలా విరామం తీసుకునే మహిళల్ని నేటి సంస్థలు స్వాగతిస్తున్నాయి. కాబట్టి అసలైన కారణాన్నే రాయడం మంచిది.

నైపుణ్యాలు పెంచుకోవాలి: ఏ ఉద్యోగానికి వెళ్తున్నారో దానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలుసుకోవాలి. అవసరమైతే నైపుణ్యాలు పెంచుకోవాలి. ఐటీ రంగాన్ని ఎంచుకుంటుంటే కొత్త కంప్యూటర్ కోర్సులూ, అందుబాటులోకి వచ్చే కొత్త సాఫ్ట్‌వేర్ల గురించి తెలుసుకోవాలి. మీడియా అయితే ప్రస్తుత విషయాలపై పట్టు ఉండటం, కొత్త ట్రెండ్లపై అవగాహన.. ఇలా రంగాన్ని బట్టి నైపుణ్యాలు పెంచుకోవాలి.

ఉద్యోగ వేట: ఇది కూడా ఓ ఉద్యోగమే. దానికోసం రోజులో రెండు మూడు గంటలు కేటాయించాలి. తెలిసినవారికి మీ రెజ్యూమే ఇవ్వడం, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడం తప్పనిసరి. మీ బంధువులూ, స్నేహితులూ, తెలిసినవారందరికీ మీ ఉద్యోగాన్వేషణ గురించి చెప్పండి. దరఖాస్తు చేసిన సంస్థలకూ ఫోను చేసి వాకబు చేస్తుండాలి.

ముఖాముఖిలో: ఇంటర్వ్యూ అనగానే కంగారు పడిపోకూడదు. ప్రతి సమాధానాన్ని నిజాయతీగానే చెప్పాలి. ఉద్యోగం చేయడానికి కారణాన్నీ తెలియజేయాలి. మీ విరామానికి కారణం కూడా చెప్పాలి. మీకు రాని, తెలియని విషయాల గురించి అడిగినప్పుడు తెలియదనే చెప్పండి

ఉద్యోగం వచ్చిందా: పని వాతావరణం, సహోద్యోగులు... అన్నీ కొత్త అయినా స్వాగతించాలి. తోటి ఉద్యోగులూ, అక్కడి వాతావరణం, పద్ధతులు అన్నీ మీరు అనుకున్నట్లుగా ఉండకపోవచ్చు. సర్దుకుపోవడం నేర్చుకోవాలి. నలుగురిలో కలిసిపోయే స్వభావాన్నీ పెంచుకోవాలి.

మెంటార్ ఉండాలి: చాలాకాలం తరువాత ఉద్యోగంలో చేరాం కాబట్టి మనకోసం ఓ మెంటార్‌ను ఏర్పాటు చేసుకోవాలి. అదే సంస్థలో పనిచేస్తున్న మీ స్నేహితులూ, సన్నిహితులను మీరు మెంటార్‌గా ఎంచుకోవచ్చు. అప్పుడే మీ లోపాలూ, బలాలూ, బలహీనతలను గురించి మీకు చెప్పగలరు.

కుంగుబాటు వద్దు: ఉద్యోగంలో చేరగానే మనం ఏదో సాధిస్తామని, ఎంతో ఎత్తుకు ఎదిగిపోతామనుకోకూడదు. అదే సమయంలో 'ఈ పని నేను చేయగలనా? అనే అధైర్యం కూడా ఉండకూడదు. ఒకటి రెండేళ్లు కొన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ ఆ తరువాత పని నల్లేరుపై నడకలా సాగుతుంది. మీకు మీరే పోటీ అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

సమన్వయం చేసుకునేలా: ప్రతిరోజూ ప్రతి పనీ వందశాతం పూర్తి చేస్తామని అనుకోకూడదు. అది అసాధ్యం కూడా. ఉద్యోగిని బాధ్యత కేవలం ఆఫీసుకే పరిమితం కాదు. ఇంటి పనుల్నీ సమన్వయం చేసుకోవాలి. అంటే రెండు ఉద్యోగాలు చేయాలన్న మాట. ఈ రెండింటినీ చేయాలంటే శక్తీ, ఓపికా, ప్రణాళికా..... ఇలా అన్ని ఉండాలి. కాబట్టి ముందు మీరు ఆహారం, ఆరోగ్యం ఇలా అన్నింటిపైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అన్నీ మీరే చేయాలని చూడకుండా ఇతరుల సాయం కూడా తీసుకోవాలి. ఇన్ని చేస్తూనే మీకోసం మీరు కొంత సమయం కేటాయించుకోగలగాలి.

– పుట్టిగారి ప్రమీల

ఫొటోల్లో కళ్లు మూస్తున్నారా?



స్నేహితులతో బయటికి వెళ్లినప్పుడు ఫొటోలు దిగడం షరా మూమూలు. ఇప్పుడు ప్రత్యేకంగా ఫొటో షూట్‌లకు వెళ్లడం కూడా సర్వసాధారణమైపోయింది. అలాంటప్పుడు కొన్ని సందర్భాల్లో అవి బాగా రాలేదని బాధ పడుతుంటాం. దానికన్నా ముందే కొన్ని చిట్కాలు తెలుసుకుంటే మీకు ఉపయోగపడతాయి..

- ఫొటోలు దిగేటపుడు మీపై వెలుతురు పడేలా చూసుకోండి. దానివల్ల చర్మం మెరిసేలా రావడమే కాదు ఏమైనా మచ్చలున్నా ఎక్కువగా కనిపించవు.
- బృందంతో కలిసి ఫొటో దిగుతున్నప్పుడు అందరం వరసలో నిలబడుతుంటాం. సాధ్యమైనంత వరకు ఆ వరసలో చివరి వ్యక్తి మీరు కాకుండా చూసుకోండి. లావుగా ఉన్నవాళ్లు కాస్త సన్నగా కనబడాలంటే మధ్యలో నిలబడటం ఒక చిన్న పరిష్కారం. అలాగే కెమెరాకు ఎదురుగా కాకుండా కాస్త పక్కకు తిరిగి నిలబడండి. దీనివల్ల కూడా కాస్త సన్నగా కనిపిస్తారు.
- కొంత మంది ముఖం ఫొటోల్లో మరీ లావుగా కనబడుతుంటుంది. అలాంటి వాళ్లు సెల్ఫీలు దిగుతున్నప్పుడు ఫోన్‌ను కాస్త ఎత్తులో ఉంచి ఫొటో తీసుకోవాలి. అలాగే గ్రూఫీ తీసుకుంటే అందరికన్నా పొడవుగా ఉన్న వ్యక్తినే తీయమనండి.
- ఫ్లాష్ వెలుతురుకు కొంతమంది ఫొటోల్లో కళ్లు మూసుకుంటారు. అలాకాకుండా ఉండాలంటే.. ఫొటో క్లిక్‌మనే కంటే రెండు సెకన్ల ముందు కళ్లు మూసి తెరవండి.
- మనం వేసుకునే ఆభరణాల విషయంలో కూడా జాగ్రత్త వహించాలి. బంగారం, వెండి.. ఏదైనా సరే మీ చర్మతత్వానికి తగ్గట్లు ఎంచుకోవాలి. లేదంటే ఫొటోలో ఎబ్బెట్టుగా కనిపిస్తాయి.

పదిహేనురోజులకోసారి అలా ఎందుకు?

డియర్ వసుంధర



డా॥ అనగాని మంజుల
గైనకాలజిస్టు

? నా వయసు నలభై. ఆరేడు నెలలుగా విపరీతమైన పొట్టనొప్పి. దానికితోడు పదిహేను రోజులకోసారి నెలసరి వస్తోంది. వైద్యుల దగ్గరకు వెళ్తే ఏవో మందులు రాసిచ్చారు కానీ.. అవి వేసుకున్నంతవరకూ బాగానే ఉండి మళ్లీ సమస్య మొదలవుతోంది. ఇలా ఎందుకు జరుగుతోందో అర్థం కావడం లేదు. దీనికి ఏదయినా పరిష్కారం ఉందంటారా..?

- ఓ సోదరి

✓ సాధారణంగా గర్భాశయానికి సంబంధించిన ఇన్‌ఫెక్షన్లు కానీ, కణుతులు కానీ, అండాశయంలో కణుతులు లేదా ఎండోమెట్రియోసిస్ ఇలా ఏదో ఒకటి ఉన్నప్పుడు ఈ సమస్య రావచ్చు. చాలా అరుదుగా ఇంతకు ముందు ఆపరేషన్లు, సిజేరియన్లు జరిగి గర్భాశయం అతుక్కుపోయినప్పుడు (ఎడ్‌హిషన్స్) లేక ఎడినోమయోసిస్ ఉన్నా ఇలా కావచ్చు. మీరు మందులు వాడటం కన్నా ముందు అల్ట్రాసౌండ్ పెల్విస్, పాప్‌స్మియర్ చేయించుకోవడం మంచిది. కారణం తెలిశాక అవసరాన్ని బట్టి అదనంగా మరికొన్ని పరీక్షలు చేయాల్సి రావచ్చు. ఒకవేళ ఇన్‌ఫెక్షన్ ఉందనుకుంటే మీరూ, మీ భర్తా ఇద్దరూ మందులు వాడాల్సి ఉంటుంది. లేదా కణుతులే ఉన్నాయనుకుంటే లాపరోస్కోపీ పద్ధతిద్వారా వాటిని తొలగించి మందులు ఇస్తారు. అప్పుడే పొట్టనొప్పి తగ్గడంతోపాటూ నెలసరి కూడా ఓ క్రమపద్ధతిలో వస్తుంది. భవిష్యత్తులో రాకుండా ఉండటానికి మరికొన్ని పరిష్కారాల్నీ సూచిస్తారు. ఒకవేళ ఎడ్‌హిషన్స్ ఉంటే ఆ సమస్య మళ్లీ ఎదురు కాకుండా ఉండేందుకు ఎడ్‌హిషన్స్ రిడక్షన్ టెక్నిక్స్ వాడతారు. కాబట్టి మీరు ఆలస్యం చేయకపోవడం మంచిది.

బంగారం వెండి

19న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,876	2,861
వెండి (గ్రా)	42.00	42.00



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమండ్రి		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	31,090	30,950	31,100	31,100	30,055	30,060	30,760	30,600	30,770	30,770
ఆర్నమెంట్	29,040	28,920	28,850	28,900	28,380	28,420	28,760	28,610	28,620	28,680
వెండి(కిలో)	40,000	39,995	40,400	40,400	39,900	40,000	39,300	39,400	40,500	40,500

నజరానా

కొబ్బరినూనె, కలబంద రసాన్ని కలిపి జుట్టుకు తరచూ పట్టించడం వల్ల.. చుండ్రు సమస్య తగ్గుముఖం పడుతుంది.

'సరస్వతీ నమస్తుభ్యమ్'



సరస్వతీ దేవితోపాటు సరస్వతీ ఆకు కూడా పూజనీయమే. ఆ ఆకుకు అంతటి విలువ ఉంది మరి. సరస్వతీ ఆకు అనగానే అది ఔషధ మొక్క అనే విషయం మనలో చాలామందికి గుర్తొస్తుంది. కానీ దాన్ని చక్కని అలంకరణ మొక్కగా కూడా పెంచుకోవచ్చు.

సరస్వతీ ఆకును 'సెంటెల్లా', 'గోటుకోలా', 'ఫౌంటేన్ ఆఫ్ యూత్' అని రకరకాలుగా పిలుస్తారు. సంస్కృతంలో దీన్ని మండూక పర్ణి అంటారు. దీని శాస్త్రీయ నామం 'సెంటెల్లా ఏషియాటికా'. ఇది మన ఆసియా ఖండానికి చెందిన మొక్క.

సరస్వతీ ఆకు తడినేలలో పెరిగే బహువార్షికం. నేలమీద పాకే కాండంతో, ప్రతి కణుపు వద్దా వేర్లతో అల్లుకుపోతుంది. ఈ మొక్క తేమగా ఉండే నేలలో, చల్లని వాతావరణంలో చక్కగా పెరుగుతుంది. ఇది చిన్నగా ఆరు అంగుళాలు మించని ఎత్తులో నేలమీద నుంచి మొదలై విసనకర్ర ఆకారపు ఆకులతో ఉంటుంది. ఈ ఆకులు లేతాకుపచ్చ రంగులో ఉంటాయి. ఎండ కంటే కొద్దిపాటి నీడ సరస్వతీ ఆకుకు అనువుగా ఉంటుంది. నీడ ఎక్కువైనా దీనికి పెద్ద ఇబ్బంది ఉండదు. ఇంట్లో పెంచుకునేటప్పుడు అంత తేమ నేలలు ఉండవు కాబట్టి క్రమం తప్పకుండా నీళ్లు పోస్తుంటే సరిపోతుంది. దీనికి నేల సారవంతంగా, నీరు నిలవకుండా తేమగా ఉండాలి కాబట్టి కంపోస్టు, కోకోపీట్, ఇసుక కలిపిన మట్టి మిశ్రమం అనువుగా ఉంటుంది. దీనికి చీడపీడల ప్రమాదం దాదాపు లేనట్లే. రసాయన ఎరువులు కాకుండా జీవామృతం లేదా ఇతర సేంద్రియ ఎరువులు వాడటం మంచిది.



వెడల్పు కుండీల్లో... సరస్వతీ ఆకు చక్కని గ్రౌండ్ కవర్‌లా పనిచేస్తుంది. ఇది వేలాడే కుండీల్లో/చెట్ల కింద నీడలో పెంచుకోవడానికి అనువుగా ఉంటుంది. లోతు తక్కువగా, వెడల్పుగా ఉండే కుండీల్లో పెంచుకుని వరండాల్లోనూ, బాల్కనీల్లోనూ అమర్చుకోవచ్చు. మిశ్రమ అమరికల్లో గ్రౌండ్ కవర్‌గా వాడుకోవచ్చు. బాట పక్కన బోర్డరు మొక్కల మొదట్లో కూడా నాటుకోవచ్చు.

ఆయుర్వేదంలో దశాబ్దాలుగా దీన్ని మెదడుకు సంబంధించిన మందుగా వాడుతున్నారు. జ్ఞాపకశక్తి, తెలివి పెరగడానికి విరివిగా ఉపయోగిస్తారు. జలుబూ, జ్వరం, విరేచనాలూ, కామెర్లు.. మూర్ఛ, మూత్రకోశ వ్యాధులు, నిద్రలేమీ- ఒకటేమిటి దీన్ని సర్వరోగనివారిణిగా నమ్ముతారు. ఇప్పుడిప్పుడే ప్రపంచ వ్యాప్తంగా దీని ఔషధ విలువలకు ప్రాచుర్యం లభిస్తోంది.

పోషకాలూ ఎక్కువే... సరస్వతీ ఆకులో పోషక విలువలు కూడా ఎక్కువే. దీనిలో అనేక విటమిన్లూ, ఖనిజ లవణాలూ, శరీరానికి ఉపయోగపడే రసాయనాలు ఉంటాయి. దీన్ని సలాడ్‌గా కూడా వాడతారు. బర్మా, శ్రీలంకా, ఇండోనేషియా, మలేషియా లాంటి దేశాల్లో దీని వాడకం ఎక్కువ. శ్రీలంకలోనైతే దీని ఆకులను ఇతర ఆకుకూరలతోపాటు మార్కెట్‌లో అమ్ముతుంటారు.

అతిగా వద్దు... సరస్వతీ ఆకుకు ఇన్ని సుగుణాలున్నా దీన్ని అదేపనిగా వాడకూడదు. ఆరువారాలు వాడిన తరువాత కొంత విరామం ఇచ్చి తిరిగి వాడుకోవచ్చు. అలాగే కాలేయ సంబంధ వ్యాధులున్నవారు వైద్యుల సలహా మేరకు ఈ ఆకులను వాడటం మంచిదట. కణుపు మొక్కలను విడదీసి నాటుకుని సరస్వతీ ఆకును సులువుగా ప్రవర్ధనం చేయొచ్చు. అయితే కలుషితమైన నీటిలో పెరిగినప్పుడు ఆ కాలుష్య కారక రసాయనాలను గ్రహించుకునే శక్తి దీనికి ఎక్కువ. అందువల్ల అలాంటి ప్రాంతాల నుంచి మొక్కలను సేకరించుకోవద్దు. అందం, ఆరోగ్యం, పోషకాలు మూడూ విరివిగా ఉండే సరస్వతీ ఆకును మీ తోటలో భాగస్వామిని చేసేందుకు ఇంకా ఆలస్యం ఎందుకు?

- బోడెంపూడి శ్రీదేవి, ల్యాండ్‌స్కేప్ కన్సల్టెంట్

కొడుకు బాధే... ఉపాధి చూపింది

ఆ అబ్బాయి వయసు అప్పుడు ముప్పయి రోజులు. సరిగ్గా చెప్పాలంటే నెల బాలుడు. ఆ సమయంలో ఆ చిన్నారికి విరేచనాలు మొదలయ్యాయి. ఆ వయసులో సహజమే అనుకుందా తల్లి శీతల్ దాగే. అవి ఒక పట్టాన తగ్గకపోవడంతో వైద్యుడి దగ్గరకు తీసుకువెళ్లింది. పిల్లాడికి సెలైన్ పెట్టారు. సూది గుచ్చిన ఎడమచేయి విపరీతంగా వాచిపోయింది. అప్పుడే డాక్టర్‌కి అనుమానం వచ్చింది. హీమోఫీలియా వ్యాధి లక్షణాల్లో వాపు కూడా ఒకటి. చివరకు అదే తేలింది. తన చిన్నారికి హీమోఫీలియా ఉన్నట్లు తెలుసుకున్న ఆ తల్లి గుండె లవిసేలా ఏడ్చింది. ఇప్పుడు వివేక్‌కి పదేళ్లు. ఇన్నేళ్లలో అతడిని ఆస్పత్రుల చుట్టూ తిప్పుతూనే ఉన్నారు శీతల్. గాయం తగలగానే రక్తం గడ్డకట్టడానికి ఇన్నేళ్లుగా ఇంజెక్షన్లు చేయిస్తూనే ఉన్నారు. అప్పుడో సారి అక్కడి వైద్యుడు శీతల్‌కి ఓ సలహా ఇచ్చారు. కిందపడినప్పుడు గాయాలు కాకుండా ప్యాడ్‌లను వాడమని చెప్పారు. వీటిని వేసుకోవడం వల్ల దెబ్బలు తగలకుండా చూసుకోవచ్చు అని చెప్పారు. ఆ ప్యాడ్లు బజారులో దొరుకుతాయి. అయితే వీటి ధర రూ. 1000 నుంచి రూ. 1500 వరకు ఉంటుంది. ఆ ధర శీతల్‌కి తలకు మించిన భారమే. అది చూశాకే తానే వాటినెందుకు తయారు చేయకూడదనుకుంది. మెత్తటి నూలు వస్త్రం, ఫోమ్‌తో ఇంట్లోనే వాటిని కుట్టడం ప్రారంభించింది. హీమోఫీలియా బాధితుల కోసం వాడే ప్రత్యేక ప్యాడ్‌లు ఇవి. ఇవి వివేక్‌కే కాదు.. మరెందరో హీమోఫీలియా రోగులకు ఉపయోగపడ్డాయి. ఒక్కోదాన్ని యాభైరూపాయలకు అమ్మే ఆమె.. కొన్నిసార్లు ఉచితంగానూ ఇస్తుంటారు. 'పిల్లలు ఈ జబ్బు బారిన పడ్డారని తెలిసినప్పుడు ఆ తల్లులు పడే ఆవేదన నాకు తెలుసు. అందుకే కాస్త పేదవాళ్లనుకుంటే ఉచితంగా ఇచ్చేస్తున్నా..' అని చెబుతుంది శీతల్. వీటిని అమ్మగా వచ్చిన డబ్బుతో వాళ్లబ్బాయి మందులకు ఖర్చు చేస్తోంది.





ఆ బ్రష్‌లు శుభ్రం చేస్తున్నారా

అలంకరణ ప్రత్యేక సందర్భాల్లో చేసుకుంటున్నా సరే.. ఎప్పటిప్పుడు మేకప్ బ్రష్‌లను శుభ్రం చేస్తేనే వాటిపై క్రిములు పేరుకోకుండా ఉంటాయి. అయితే వాటిని శుభ్రం చేయడానికీ ఓ పద్ధతుంటుంది. అదెలాగో తెలుసుకోండి మరి.

- సగం కప్పు గోరువెచ్చని నీటిలో రెండు చెంచాల బేబీ షాంపూ, చెంచా ఆలివ్ నూనె కలిపి అందులో బ్రష్‌లను కాసేపు ఉంచాలి. కాసేపయ్యాక ఇవతలకు తీసి చల్లనినీటితో కడగాల్సి ఉంటుంది.
- క్రీమ్‌లు, లిక్విడ్ ఫౌండేషన్ల కోసం బ్రష్ ఉపయోగిస్తున్నారా... ఒక టిష్యూపేపర్ తీసుకుని దానిమీద రెండు చుక్కల ఆలివ్ లేదా బాదంనూనె వేయాలి. దాంతో బ్రష్‌ను శుభ్రం చేయాలి. ఆ తరువాత షాంపూ కలిపిన చల్లని నీటితో కడిగేస్తే చాలు.
- ఇప్పుడు బజార్లో ప్రత్యేకంగా బ్రష్‌లను శుభ్రం చేసే గ్లవుజులు దొరుకుతున్నాయి. వాటిపై కొద్దిగా షాంపూ వేసి బ్రష్‌లను శుభ్రం చేసినా పేరుకున్న మురికి అంతా పోతుంది. బ్లెండర్లు, స్పాంజిలకు కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. వీటిలో కొన్ని తిరిగి వాడుకోవడానికి వీలయ్యేవి ఉంటాయి. మరికొన్నింటిని ఒక్కసారి మాత్రమే ఉపయోగించుకోవచ్చు. ఆ వివరాలను చూశాకే ఉపయోగించుకోవాలి.
- సాధారణంగా మేకప్ బ్రష్‌లను వాడిన ప్రతిసారీ శుభ్రం చేసుకోవడం ఉత్తమం. వీలుకాకపోతే కనీసం వారానికి ఒకసారైనా శుభ్రం చేసుకోవాలి. స్పాంజిని వాడితే దాంట్లో చర్మంపై ఉండే మృతకణాలూ, జిడ్డు పేరుకొని ఉంటాయి. అందుకే దీన్ని ఒకసారి వాడాక శుభ్రం చేయడం మంచిది.

ఎంటర్‌ప్రెన్యూర్ కావడమంటే మాటలా? చేతినిండా డబ్బుండాలి.. అదిరిపోయే ఐడియా తట్టాలి.. అదే కదూ మీ అభిప్రాయం? అపసోపాలు పడక్కర్లేదు.. అవసరాల్ని కనిపెడితే చాలు.. అది మీ సొంతూరు కావొచ్చు.. మండల కేంద్రం అవ్వొచ్చు.. ఏం ఫర్లేదు.. ఇల్లు కట్టేవాళ్లకు సరంజామా సరఫరా.. పల్లెలకు శుద్ధజలం పంపిణీ.. కూలీలను ఏర్పాటు చేసే పని.. ఏదైతేనేం? ప్రతి పనీ ఒక స్టార్టప్‌కు పనికొచ్చే ఐడియానే! చూసే కళ్లుంటే చుట్టూ ఉపాధే! ఆలోచన మీకుంటే.. దారిచూపి ధైర్యం నూరిపోసే సంస్థ ఒకటుంది. అదే 1ఎం1బి..

చూసే కళ్లుంటే చుట్టూ ఉపాధే



చాలా మంది యువతకు ప్రపంచంలో ఉన్న అవకాశాల గురించి తెలియదు. ఉపాధి అంటే ఏ వెబ్‌సైట్ ప్రారంభించడమో, స్టార్టప్ అంటే ఓ యాప్ అభివృద్ధి చేయడమో అనుకుంటారు. ఇది అందరికీ సాధ్యమయ్యే పనికాదు. పరిశ్రమంటే పెద్ద పెట్టుబడి కావాలి కదా? అని కొందరు వెనకడుగు వేస్తారు. ఇలా ఆలోచించే యువతకు దిశానిర్దేశం చేసి, వారిలో నమ్మకం పెంచి, సొంతంగా ఎదగడానికి మార్గాలు చూపే సంస్థే 1ఎం1బీ. వాస్తవానికి ఇది సంస్థ కాదు... ఓ వ్యక్తి లక్ష్యం. పది లక్షల మందిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది వారి ద్వారా వంద కోట్ల మందికి ఉపాధి చూపాలనేది మనవ్‌సుబోధ్ ఉద్దేశం. 18 నుంచి 25 ఏళ్ల యువతలో చైతన్యం కల్పించే దిశగా మనవ్ సుబోధ్ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటికే 30 దేశాల్లో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న 1ఎం1బీ ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోనూ ముందడుగు వేస్తోంది.

బెంగళూరుకు చెందిన మనవ్ ఇంటెల్‌లో గ్లోబల్ మేనేజర్‌గా పనిచేశారు. అంతకుముందూ అనేక సంస్థల్లో పని చేసిన అనుభవం ఉంది. చాలా చోట్ల యువతలో నైరాశ్యం కనిపించింది. ఇలాంటి వాళ్లలో చైతన్య కాంతులు నింపే బాధ్యతను స్వీకరించారు. అనుకున్నదే తడవుగా 1ఎం1బీకి బీజం పడింది. ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న ఉపాధి అవకాశాలపై యువతకు అవగాహన కల్పించాలని నిర్ణయించుకున్నారు. ఇదే విషయాన్ని ఇంటెల్ కంపెనీలో తన బాస్‌కు చెప్పారు. అది ఆయనకు ఎంతో నచ్చింది. దీన్ని నీవు ఉద్యోగం వదిలి చేయొద్దు... మన కంపెనీ నీ ఆశయానికి సహాయం అందిస్తుంది... డూఇట్ అన్నారు. ఆదే ఉత్సాహంతో తొలుత ఈజిప్టులో తన కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. అక్కడున్న ఓ కళాశాలకు వెళ్లి శిక్షణ మొదలు పెట్టారు. అక్కడి యువతలో నమ్మకం ఏర్పడింది. సొంత కాళ్ల మీద నిలదొక్కుకునేందుకు పలు అవకాశాలు ఉన్నాయని గ్రహించారు. అక్కడ లభించిన స్పందనతో.. అమెరికా, ఈజిప్ట్, కోస్టారికా, ఐర్లాండ్, జోర్డాన్, కరేబియన్ దీవులు... ఇలా 30 దేశాల్లో మనవ్ మరికొంత మంది ప్రతినిధులు కలిసి శిక్షణలు ఇస్తున్నారు.

గ్రామీణ యువతే లక్ష్యం

గ్రామాల్లో చాలా మంది ఎలాగోల డిగ్రీ వరకూ చదువుతారు. ఆ తర్వాత ఏం చేయాలో అర్థం కాదు. దగ్గరలోని నగరాలకు వలస వెళ్లి... తమ చదువుకు సంబంధం లేని ఉద్యోగం చేస్తూ... అరకొర జీతానికి పనిచేస్తుంటారు. దీనివల్ల వారి జీవనానికే కష్టంగా ఉంటుంది. ఇలా దిశానిర్దేశం లేని గ్రామీణ యువతను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మార్చాలనే లక్ష్యంతో 1ఎం1బీ అడుగులు వేస్తోంది. గ్రామాల్లో వ్యవసాయం, తాగునీరు, ఆరోగ్యం, విద్య వంటి విషయాల్లో ఉన్న ఉపాధి అవకాశాలను వారికి తెలియజెప్పి, స్థానికంగా ఉన్న వనరులు ఉపయోగించుకొనేలా చైతన్యం చేస్తోంది. ప్రభుత్వాలు కల్పిస్తున్న భరోసా, రాయితీలనూ వివరిస్తోంది. టాటా కంపెనీ ప్రోత్సాహంతో ఉత్తరాఖండ్, కర్ణాటక, ఝార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో శిక్షణ కేంద్రాలు నెలకొల్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని మోరీ గ్రామంలో ఇప్పటికే టెలీ హెల్త్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో శిక్షణ కార్యక్రమాలు నడుస్తున్నాయి.

గురుకుల్

రెండు తెలుగు రాష్ట్రాల్లో గురుకుల్ పేరుతో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణలో హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లో భీమవరంలలోని యువతకు ఇవి చేదోడుగా ఉంటాయి. నైపుణ్యాలకు మెరుగులద్దడం, పరిశ్రమలు స్థాపించడానికి అవసరమైన వనరులు సమకూర్చడం వీటి లక్ష్యం. స్థానిక వనరుల గుర్తింపు, ప్రభుత్వ సహకారం అందేట్లు చేయడం తద్వారా పలువురికి ఉపాధి చూపడమే ధ్యేయంగా సాగుతోంది.

చిన్ని చిన్ని ఆశ.. పెద్ద భరోసా!

నేను ప్రపంచ వ్యాప్తంగా చాలా ప్రాంతాలు తిరిగాను. ముఖ్యంగా మన దేశంలో యువతకు కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నా... కమ్యూనికేషన్ స్కిల్స్, ఫైనాన్సింగ్, మార్కెటింగ్, అకౌంటింగ్‌లలో అవగాహన తక్కువ. అందరూ కంప్యూటర్లనే నమ్ముకుంటే ఈ రంగంలో ఎంత మందికి ఉపాధి లభిస్తుంది? మిగతా రంగాలనూ పరిశీలించాలి. ఉదాహరణకు గ్రామాల్లో ఒక ఇల్లు కట్టుకోవాలంటే ఎంతో కష్టం... అవసరమైన ఇనుము, ఇసుక, ఇటుక, తలుపులు, కిటికీలను సమకూర్చుకోవడం పెద్ద పని. దీనికి పరిష్కారంగా 20 గ్రామాలకు అందుబాటులో ఉండే మనం ఈ వస్తువులను సరఫరా చేస్తే... మనతో పాటు మరికొంత మందికి ఉపాధి లభిస్తుంది. గ్రామాల్లో సురక్షిత జలాలు దొరకవు. దీన్నొక అవకాశంగా చేసుకొని తక్కువ ధరలో శుద్ధజలం అందించే పరిశ్రమ పెట్టొచ్చు. చాలామంది యువతకు ఆంగ్లభాషపై పట్టు లేకపోవడం ఒక సమస్య. ఇది కూడకొక ఉపాధి మార్గమే! ఇలా మన చుట్టూ ఉన్న చిన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలి. ఒక్కో ప్రాంతానికి ఒక్కో సమస్య ఉంటుంది. ప్రతి సమస్యకు కచ్చితంగా పరిష్కారం దొరుకుతుంది. పరిష్కారమే మన పరిశ్రమ అని గుర్తించాలి. ఈ విషయాలను యువతకు చెప్పడానికే 1ఎం1బీ పనిచేస్తోంది. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, తెలంగాణ సీఎం కేసీఆర్ అంకుర పరిశ్రమలకు ప్రోత్సాహం ఇస్తున్నారు.



వీరు అందిస్తున్న రాయితీలను మేం యువతకు వివరిస్తాం. వాటిని అందిపుచ్చుకోవడానికి ఏంచేయాలో చెబుతాం. గురుకుల్ శిక్షణ కేంద్రాల లక్ష్యమిదే..!

– మనవ్‌సుబోధ్, సహ వ్యవస్థాపకులు, 1ఎం, 1బీ.



శ్రీరామకుమార్‌ది పశ్చిమగోదావరి జిల్లా అనాకోడేరు. ఈయనకున్న 3ఎకరాల్లో రొయ్యల పెంపకం చేసేవారు. దీనికి అత్యంత శ్రద్ధ అవసరం. చెరువు నీటిలో ఉష్ణోగ్రత, పీహెచ్ విలువ, ఆక్సిజన్ శాతం, అమ్మోనియా స్థాయిలను నిరంతరం పర్యవేక్షిస్తుండాలి. ఇందుకు కూలీలు అవసరం. పైగా ఆక్సిజన్ తగిన శాతంలో ఉందో లేదో తెలియక... గాలి యంత్రాలు నిరంతరం ఆడించేవారు. దీనికి విద్యుత్తు-డీజిల్ బిల్లు విపరీతంగా వచ్చేది. నెలకు రూ.40,000 వరకూ వెచ్చించాల్సి రావడం భారంగా మారింది. భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 1ఎం 1బీ ఆధ్వర్యంలో గురుకూల్ పేరుతో నిర్వహించిన సదస్సులో యువతకు ఈ విషయం తెలియజెప్పారు. పరిష్కారం కనుక్కొనే మార్గముందని అర్థమైంది. అక్కడి కళాశాలలోని ప్రయోగశాలను ఉపయోగించుకొని ఐఎస్ఎఫ్ టెక్నాలజీని రూపొందించారు. మొదట రామకుమార్ రొయ్యల చెరువులోనే పరీక్షించారు. ఈ టెక్నాలజీతో చెరువులోని నీటిలో ఏవి ఎంత స్థాయిల్లో ఉన్నాయో సెల్‌ఫోన్‌కు సంక్షిప్త సందేశ రూపంలో వస్తుంది. ఇది ఎప్పటికప్పుడు తెలుస్తుంటుంది. దీని వల్ల గాలిమరలు నిరంతరం ఆడాల్సిన పనిలేదు. విద్యుత్తు బిల్లు కూడా రూ.20,000 కు తగ్గింది. ఈ ప్రయోగం ఎంతోమంది రైతులకు ఉపయోగపడుతోంది. ఇలా ఇదో అంకుర పరిశ్రమగా అవతరిస్తోంది.

మనసులో మాట

ప్లీజ్.. నన్ను మరిచిపో..!

నా పేరు అవినాష్ (అసలు పేరు కాదు). మాది కరీంనగర్‌లోని ఓ పల్లెటూరు. పీజీ పూర్తయింది. ప్రభుత్వ ఉద్యోగ వేటలో ఉన్నానప్పుడు. మా ఊళ్లోనే స్నేహ (పేరు మార్చాం) అనే అమ్మాయి ఉండేది. సొంతూర్లో స్నేహితులయ్యాం. స్నేహ వాళ్ల అన్నయ్య కూడా నాకు మంచి ఫ్రెండ్. ఆమెకు నేనంటే చాలా ఇష్టం. ఆ ప్రేమను వ్యక్తపరచడానికి ఏడాది పట్టింది. అది జులై మాసం. ఒక రోజు మెసేజ్ వచ్చింది. అందులో 'ఐ లవ్ యు అవినాష్. నువ్వంటే నాకు చాలా చాలా ఇష్టం. అయినా సరే ఇన్ని రోజులు చెప్పలేకపోయాను..' అని చెప్పింది. నేను వెంటనే రిప్లై ఇచ్చాను. అందులో 'స్నేహ.. మీ అన్నయ్య నాకు మంచి స్నేహితుడు. మనిద్దరిదీ ఒకే కులం కాదు. పెద్దలు ఒప్పుకోరు. గొడవలు అవుతాయి. ప్రేమ పెళ్లి సాధ్యం కాదేమో"నని మెసేజ్ పంపించాను. మళ్లీ తనే 'నువ్వంటే నాకు ప్రాణం. ఎలాగోలా మా అన్నయ్యకు చెప్పి ఒప్పించు. తల్లిదండ్రులకు కూడా అన్నయ్యే సర్దిచెబుతాడు. మనం పెళ్లి చేసుకునే తీరాలి' అంది. ఆ మెసేజ్‌లు చూసేసరికి.. నా మనసులోనూ ప్రేమ భావన బలంగా నాటుకుంది. ఆలోచనలో పడ్డాను. ఆమె మీద ఇష్టం రెట్టింపు అయ్యింది. తను డిగ్రీ ఫైనల్ ఇయర్. పీజీ పూర్తయ్యాక ఇద్దరం పెళ్లి చేసుకుందాం అనుకున్నాం. నాలుగేళ్లు సంతోషంగా సాగిపోయింది మా ప్రేమ. ఎక్కడున్నా



పూలవనంలో ఉన్నట్లు ఉండేది. మాఇద్దరి మధ్య నడిచిన మాటలు కొలిస్తే... ఆకాశంలో నక్షత్రాలు సరిపోవేమో. హాయిగా సాగిపోతున్న మా ప్రేమ నావను ఓ అల కుదిపేసింది. గత ఏడాది తనకు పెళ్లి సంబంధం కుదిరింది. తను విషయం చెప్పి.. ఏడ్చింది. అదే రోజు వాళ్ల అన్నయ్యకు ఫోన్ చేసి.. మా ప్రేమ విషయాన్ని చెప్పాను. అప్పుడు వాళ్ల అన్నయ్య 'మా ఇంట్లో కులాంతర వివాహం ఒప్పుకోరు. నువ్వు మా చెల్లిని మరిచిపో. లేదంటే నేను బతకను. మన స్నేహం ఇంతటితో తెగిపోతుంది' అన్నాడు. మా ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పి.. ఒప్పించాను. స్నేహ వాళ్ల అన్నయ్యకు చాలాసార్లు ఫోన్లు చేసి.. బతిమాలాను. కానీ ప్రయోజనం లేదు. ఆ అలే మా ప్రేమ నావను ముంచెత్తే ఉప్పెనైంది. స్నేహతో 'మా ఇంట్లో అమ్మానాన్నలు ఒకే. మీ ఇంట్లో అంగీకరించకపోయినా బయటికి వెళ్లిపోయి.. గుడిలో పెళ్లి చేసుకుందాం..' అన్నాను. 'వద్దు వద్దు.. మా అన్నయ్యను ఎలాగైనా కన్విన్స్ చేసి పెళ్లి చేసుకుందాం..' అంది. రోజులు గడిచాయి. ఆ టెన్షన్‌ను భరించలేకపోయాను. ఎంగేజ్‌మెంట్ రోజున తన నుంచి మెసేజ్ వచ్చింది. ఫోన్‌లో ఏడ్చింది. ఆ విషయాన్నే వాళ్ల అన్నకు చెప్పాను. అతను 'మాకు కులమే ముఖ్యం. నేనేమీ చేయలేను' అన్నాడు. పెళ్లి రోజు కూడా ఫోన్ చేసి.. కన్నీళ్లు పెట్టుకుందామె. పెళ్లి జరిగిపోయింది. 'నన్ను మరిచిపో. నువ్వు హ్యాపీగా ఉండు' అని ఆఖరి మెసేజ్ పెట్టింది స్నేహ. తను లేని జీవితం నేను ఊహించుకోలేకపోతున్నాను. నాకు నేను నచ్చజెప్పుకొంటున్నాను. ఈ కుల జాడ్యం ప్రేమను ఓడించే రోజులు ఎప్పుడుపోతాయి? **– అవినాష్, కరీంనగర్**

రిప్డ్ జీన్స్ ఇప్పుడు ఎంత ఫ్యాషనో అది ధరించిన యువత మోమే చెబుతుంది. మరి అలాంటి రిప్డ్ జీన్స్‌ను మీరే సొంతంగా తయారుచేసుకోవచ్చు. మీకు కావాల్సింది చాక్‌పీస్, కొలబద్ద, కత్తెర, పట్టకర, జీన్స్ అంతే. కొంచెం సృజనాత్మకతతో ఆలోచించి పనిచేస్తే మీ పాత జీన్స్‌ను కూడా ట్రెండీగా మార్చుకోవచ్చు. ఇంకెందుకు ఆలస్యం... మీ జీన్స్‌కు మీరే డిజైనర్...

నీ జీన్స్‌కు నువ్వే డిజైనర్

బ్రిజిల్స్ జీన్



సై..సై..స్టైలే

జీన్స్ కింది అంచు నుంచి 2 అంగుళాల పైకి చాక్‌పీస్‌తో మార్క్ చేయండి. కత్తెరతో నిలువునా చిన్న చిన్న పోగుల్లా కత్తిరించండి. మధ్యలో నిలువునా వేలాడుతున్న తెల్లటి దారాలను కొన్నింటిని అక్కడక్కడ పట్టకరతో లాగేయండి. ఈ జీన్స్ వేసి నడుస్తుంటే బ్రిజిల్స్ (పోగులు) గాలికి మడమలపైన కదులుతుంటే మీ నుంచి ఎవరూ కళ్లు తిప్పుకోలేరు.

ఆఫ్‌కట్

జీన్స్ కింది అంచు నుంచి 2.5 ఇంచుల పైకి మార్క్ చేయండి. జీన్స్ లెగ్స్‌కు కుట్టు ఉంటుంది కదా... అక్కడ నుంచి ముందు భాగాన్ని కత్తిరించి తీసివేయండి. అప్పుడు ఇదిగో ఈ చిత్రంలోలా మన జీన్స్ ట్రెండీగా మారుతుంది.



ట్రైయాంగిల్ కట్



బూట్‌కట్ జీన్స్ తీసుకోవాలి. కింది అంచు నుంచి 8 అంగుళాలు కొలిచి మార్క్ చేసుకోండి. కింది వైపు కొంచెం వెడల్పుగా... పైకి వెళ్లే కొద్ది త్రిభుజాకృతిలో జీన్స్‌ను కత్తిరించండి. వాటి అంచులను కొద్దిగా పోగుల్లా కత్తిరించుకుంటే మీ ఫ్యాషన్‌కి ఫిదా అవ్వని వారుండరు. అబ్బాయిలు, అమ్మాయిలకిద్దరికీ ఈ ఒరవడి నప్పుతుంది.

ఆవిష్క'రణ ధీరులు'

నుసి... మసి... కాదేది ఆవిష్కరణకు అనర్హం. కొవ్వొత్తిని మండిస్తే వచ్చే నుసి... బ్యాటరీ పనితీరును మెరుగుపరుస్తుంటే నమ్ముతారా? అల్లనేరేడు గింజలతో నీటిలో ఫ్లోరైడ్ తొలగించవచ్చంటే ఆశ్చర్యపోకుండా ఉంటారా?



కొత్త కెరటాలు

ఇలా ప్రకృతిలోనే ఎన్నో సమస్యలకు పరిష్కాలున్నాయంటున్నారు హైదరాబాద్ ఐఐటీ విద్యార్థులు. సురేష్, మయూర్, పూనమ్, రీతూ, అనన్య, రవి, శ్రీనాథ్, శీతల్, రమ్య, మనోహర్... ప్రకృతిని స్ఫూర్తిగా తీసుకొని పర్యావరణహిత ఆవిష్కరణలకు ప్రాణం పోస్తున్నారు..

ఐఐటీ హైదరాబాద్ కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలోని కార్బన్ బృందం ప్రకృతే మూలంగా నూతన ఆవిష్కరణలు చేస్తోంది. వారి ఆలోచనలు, ఉత్పత్తులు ఇప్పటికే ఎందరి మన్ననలో పొందాయి. నానో మెటీరియల్స్ ఉపయోగిస్తూ వీరు ఆవిష్కరించిన శానిటరీ న్యాప్‌కిన్స్, థర్మాకోల్ వ్యర్థాల నుంచి చమురు పీల్చే ఫ్యాబ్రిక్‌ను తయారు చేసిన యంత్రానికి ఈ ఏడాది జర్మనీ, చైనాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఇన్నొవేషన్ ఫెయిర్‌లలో పతకాలు లభించాయి. పర్యావరణహితంగా ఉండే న్యాప్‌కిన్ల ఆవిష్కరణకు గాను పరిశోధక విద్యార్థిని శీతల్ యాదవ్‌ను 'గాంధియన్ యంగ్ టెక్నొలాజికల్ ఇన్నొవేషన్ అవార్డు' వరించింది.

కార్బన్ బృందానికి మార్గదర్శనం చేస్తున్న సహాయ ఆచార్యులు డాక్టర్ చంద్రశేఖర్‌శర్మ నేతృత్వంలో పరిశోధక విద్యార్థులు కొవ్వొత్తిని మండించడం ద్వారా వచ్చే నుసిని లిథియం అయాన్ బ్యాటరీల్లో ఉపయోగిస్తే ఎన్నో ప్రయోజనాలుంటాయని కనుగొన్నారు. పదే పదే రీఛార్జి చేసే సమస్య తప్పడంతో పాటు బ్యాటరీల పనితీరు గణనీయంగా మెరుగుపడుతుందని వీరి పరిశోధనల్లో గుర్తించారు. తాజాగా కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఇంప్రింట్ పథకం ద్వారా ఈ ఆవిష్కరణను సాకారం చేయడానికి నిధులను అందించింది. రూ.2.6 కోట్లతో మూడేళ్ల పాటు మరిన్ని పరిశోధనలు సాగించేందుకు వీలు కలిగింది. చాలా తక్కువ ఖర్చుతో, గ్రామీణ ప్రాంతాల్లో సులువుగా ప్రాథమిక రక్త పరీక్షలు నిర్వహించే ఒక పరికరాన్ని వీరు అందుబాటులోకి తెచ్చేలా పరిశోధనలు సాగించనున్నారు. ఐఐటీ ఖరగ్‌పూర్, సీఎస్ఐఆర్ కోల్‌కతా, ఐఐఈఎస్‌టీ కోల్‌కతా, కాలిఫోర్నియా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ మార్క్ మోడే, కోల్‌కతాకు చెందిన వైద్యుడొకరు ఈ ఆవిష్కరణను సాకారం చేయడంలో నిమగ్నమయ్యారు. ఇలా చక్కని పరిశోధనలు చేస్తూ పరిశోధక విద్యార్థులను ప్రోత్సహిస్తున్న చంద్రశేఖర్ శర్మకు 2017 సంవత్సరానికి గాను 'యువ శాస్త్రవేత్త' అవార్డు వచ్చింది

– రాజేందర్ సురకంటి, ఈనాడు, సంగారెడ్డి

పరిశోధనల్లో కొన్ని..

- నారింజ తొక్కల నుంచి తీసిన రసంలో థర్మాకోల్‌ను ఉంచితే అది చిక్కని ద్రావణంగా మారుతుంది. దీనిలో నుంచి చమురు పీల్చే ఫ్యాబ్రిక్‌ను తయారు చేసే యంత్రానికి వీరు రూపునిచ్చారు.
- అల్లనేరెడు గింజలను ఉపయోగించి నీటిలోని ఫ్లోరైడ్‌ను తగ్గించేలా పరిశోధనలు చేశారు. గింజల నుంచి సేకరించిన కార్బన్ ద్వారా నీటిలో కరిగిన ఫ్లోరైడ్ లవణాలను సంగ్రహించేలా పరీక్షలు చేసి మంచి ఫలితాలను సాధించారు.
- రెస్ట్రైరో టెక్నాలజీస్ పేరిట అంకుర సంస్థను ప్రారంభించారు. పర్యావరణ హిత ఉత్పత్తులను దీని ద్వారా మార్కెట్లోకి తేనున్నారు.
- 'రాత్రివేళ కారులో ప్రయాణిస్తుంటే ఎదురుగా వచ్చే వాహనాల దీపాల కాంతి వల్ల కళ్లు మసకబారిపోతాయి. ముందు ఏముందో కనిపించదు. ఇందుకు కారు అద్దంపై పడిన కాంతి... పరావర్తనం చెందడమే కారణం. ఈ సమస్యకు ప్రకృతే ఆధారంగా పరిష్కారం కనుక్కొన్నారు కార్బన్ బృంద సభ్యులు. నీట తడవని, కాంతి పరావర్తనం చెందని వస్తువుల తయారీ అంశమై వీరు చేసిన పరిశోధనలు ఫలించాయి.
- గ్రామీణ మహిళలు నెలసరి సమయంలో శానిటరీ న్యాప్‌కిన్స్ ఉపయోగించలేని దుస్థితి. వీటి ధర ఎక్కువగా ఉండటమే ఇందుకు కారణం. పైగా వీటి తయారీలో రసాయనాల మోతాదు ఎక్కువగా ఉంటుందనే వాదనా లేకపోలేదు. ఒక ఆవిష్కరణతో వీటన్నింటికీ మెరుగైన పరిష్కారం చూపగల సత్తా ఈ సభ్యుల సొంతం. తక్కువ ధరకు ప్రకృతి హిత న్యాప్‌కిన్ తయారు చేశారు.

'సీతారామ ఎత్తిపోతల'కు ముందడుగు

- తొలిదశ అటవీ అనుమతులకు మార్గం సుగమం
- సిఫార్సు చేయాలని అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ ప్రాంతీయ కార్యాలయం నిర్ణయం
- మంత్రి హరీశ్‌రావు హర్షం

ఈనాడు - హైదరాబాద్

సీతారామ ఎత్తిపోతల పథకం తొలి దశ అటవీ అనుమతులకు మార్గం సుగమమైంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన అటవీ భూమి బదిలీ, ప్రత్యామ్నాయ అటవీ అభివృద్ధి ప్రణాళికలపై చెన్నైలోని కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ ప్రాంతీయ కార్యాలయం సానుకూలత వ్యక్తంచేసింది. మొదటి దశ అటవీ అనుమతుల కోసం కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖకు సిఫార్సు చేయనుంది. శుక్రవారం చెన్నైలో జరిగిన ప్రాంతీయ కార్యాలయ సమావేశం ఈ మేరకు



భద్రాద్రి కొత్తగూడెంజిల్లా టేకులపల్లి మండలంలోని రోళ్లపాడువద్ద సీతారామ ఎత్తిపోతలు నిర్మించనున్న ప్రదేశం

నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం పట్ల తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు హర్షం వ్యక్తంచేశారు. ఈ పథకం పనులను వేగంగా చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గోదావరిపై దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నుంచి నీటిని మళ్లించి 6.74 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని అందించేందుకు సీతారామ ఎత్తిపోతల పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టింది. ఈ ప్రాజెక్టు కాలువలు, ఇతర పనులకు 3781 ఎకరాల అటవీ భూమి అవసరం. ఈ భూమికి ప్రత్యామ్నాయంగా 4050 ఎకరాలను కొత్తగూడెం, ఖమ్మం, జగిత్యాల జిల్లాల్లో ప్రభుత్వం గుర్తించింది. దీన్ని అటవీ శాఖ అధికారులు కూడా పరిశీలించారు. ఈ అంశంపైనే శుక్రవారం చెన్నైలోని అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ ప్రాంతీయ కార్యాలయంలో సమావేశం జరిగింది.

ప్రాంతీయ కార్యాలయం అదనపు ప్రధానాధికారి ఎం.ఆర్.జి.రెడ్డి ఛైర్మన్‌గా, మరో ఏడుగురు సభ్యులుగా గల కమిటీ సమగ్రంగా చర్చించింది. సానుకూలత వ్యక్తం చేసిన కమిటీ.. సీతారామ ప్రాజెక్టు మొదటి దశ అటవీ అనుమతుల కోసం కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖకు సిఫార్సు చేయనున్నట్లు తెలిసింది. ఈ సమావేశంలో తెలంగాణ అటవీ శాఖ అదనపు ప్రధానాధికారి శోభ, సీతారామ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి దశ అనుమతిలో ప్రాంతీయ కార్యాలయం సిఫార్సే కీలకం. ఈ సిఫార్సును కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ పరిశీలించి మొదటి దశ అనుమతి ఇచ్చిన తర్వాత, కోల్పోయిన అటవీ భూమికి పరిహారం, ప్రత్యామ్నాయ అటవీ ప్రాంతం అభివృద్ధికి అయ్యే మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. తర్వాత తుది అనుమతి వస్తుంది. మరో 275 హెక్టార్లలో ఎకో సెన్సిటివ్ జోన్ ఉంది. దీనికి జాతీయ వన్యమృగ సంరక్షణ బోర్డు నుంచి అనుమతి రావలసి ఉంటుంది. కమిటీ సిఫార్సు చేసిన అటవీ భూమిలో అత్యధికంగా 1366.328 హెక్టార్లు కాలువలకు, స్ట్రక్చర్లకు కాగా, మిగిలింది ప్రెషర్‌మెయిన్, విద్యుత్తు లైన్లు, పిల్లకాలువలు, సొరంగ మార్గాలకు. అనుమతించిన అటవీ ప్రాంతంలో 5696 టేకు చెట్లు, 242928 ఇతర చెట్లు ఉన్నట్లు గుర్తించారు.

పెరిగిన ప్రాజెక్టు అంచనా వ్యయం

సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి పరిపాలనా అనుమతి ఇచ్చినపుడు అంచనా వ్యయం సుమారు రూ.8000 కోట్లు కాగా, కొంత కాలం క్రితం కేంద్రానికి పంపిన నివేదికలో రూ.11,931 కోట్లుగా రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుతం అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ ప్రాంతీయ కార్యాలయం మినిట్స్ ప్రకారం ఈ పథకం అంచనా వ్యయం రూ.13,263 కోట్లుగా ఉంది.

తెలంగాణలో జాతీయ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ పర్యటన

ఈనాడు, హైదరాబాద్: జాతీయ ఎస్టీ కమిషన్ ఛైర్మన్, సభ్యులు శని, ఆదివారల్లో రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఛైర్మన్ నందకుమార్ సాయితో కూడిన బృందం శనివారం హైదరాబాద్ చేరుకుని రంగారెడ్డి జిల్లాలోని ఆమన్‌గల్ చెంచుగూడేన్ని సందర్శిస్తుంది. మధ్యాహ్నం రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమం, దక్షిణ మధ్యరైల్వే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం సమావేశంలో పాల్గొని కాచిగూడలోని జాగృతి భవన్‌లో బసచేస్తుంది. ఆదివారం హైదరాబాద్‌లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొని రాత్రికి దిల్లీకి బయలుదేరి వెళ్తుంది.

మా లెక్కలే పరిగణనలోకి!

తెలుగు రాష్ట్రాల నీటి వినియోగానికి అవే ప్రామాణికమన్న కృష్ణా బోర్డు

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా బేసిన్‌లో నీటి వినియోగానికి సంబంధించి రెండు రాష్ట్రాల లెక్కలకు పెద్ద తేడా లేదని.. అయితే, తాము నిర్ధరించిన లెక్కలనే పరిగణనలోకి తీసుకుంటున్నామని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు పేర్కొంది. మొత్తం 354.51 టీఎంసీల వినియోగం జరగ్గా.. ఇందులో ఆంధ్రప్రదేశ్ 252.79 టీఎంసీలు, తెలంగాణ 101.72 టీఎంసీలు వినియోగించుకున్నట్లు బోర్డు పేర్కొంది. ఈ లెక్కలను రెండు రాష్ట్రాలు అంగీకరించ లేదు. ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రాల ఇంజినీర్లు, బోర్డు అధికారులు ఈ నెల 17న సమావేశమై చర్చించారు.

- పోతిరెడ్డిపాడు ద్వారా 85.163 టీఎంసీలు వాడుకున్నట్లు బోర్డు పేర్కొనగా, 83.423 టీఎంసీలు తీసుకున్నట్లు ఆంధ్రప్రదేశ్, అది 85.17 టీఎంసీలని తెలంగాణ పేర్కొన్నాయి. డిసెంబరులో టెలిమెట్రీ పరిశీలన సమయంలో పోతిరెడ్డిపాడు నుంచి తీసుకొన్న నీటిని లెక్కగట్టలేదని ఆంధ్రప్రదేశ్ పేర్కొనగా, ఇలా జరిగినట్లు తమకు ఎలాంటి సమాచారం లేదని బోర్డు పేర్కొంది.
- జూరాల వద్ద నుంచి తీసుకున్న నీటికి సంబంధించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు ఇచ్చిన లెక్కల్లో 1.941 టీఎంసీల వ్యత్యాసం ఉంది. రెండు రాష్ట్రాల ఇంజినీర్లు సంయుక్తంగా ధ్రువీకరించిన లెక్కలను తాము పరిగణనలోకి తీసుకున్నామని ఆంధ్రప్రదేశ్ పేర్కొనగా, తమ వెబ్‌సైట్ సమాచారాన్ని ఆధారం చేసుకొన్నామని బోర్డు అధికారులు పేర్కొన్నారు.
- నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద 8.337 టీఎంసీలు ఏపీ వాడుకున్నట్లు తెలంగాణ చెప్పగా.. అది 5.376 టీఎంసీలు మాత్రమేనని ఆంధ్రప్రదేశ్ పేర్కొంది. బోర్డు కూడా 8.337 టీఎంసీలుగానే పేర్కొంది. 20 శాతం నీటి నష్టాన్ని పరిగణనలోకి తీసుకున్నామని ఆంధ్రప్రదేశ్ పేర్కొంది. నష్టాలను అంచనా వేయడానికి కమిటీ ఏర్పాటు చేసినందున, ఈ నివేదిక వచ్చే వరకు సాగర్ ఎడమ కాలువకు సంబంధించి తెలంగాణ ఇచ్చిన లెక్కలనే పరిగణనలోకి తీసుకొంటున్నట్లు బోర్డు సభ్యకార్యదర్శి పరమేశం రాసిన లేఖలో స్పష్టం చేశారు.
- ప్రాజెక్టుల వినియోగానికి సంబంధించిన సమాచారం రాలేదని, ప్రస్తుతం రెండు రాష్ట్రాలు ఇచ్చిన లెక్కల్లో పెద్ద తేడా లేనందున కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఇచ్చిన నీటి వినియోగ లెక్కలనే పరిగణనలోకి తీసుకొంటున్నట్లు సభ్యకార్యదర్శి స్పష్టం చేశారు.

సైనిక సంక్షేమానికి ప్రభుత్వ ఉద్యోగుల ఒకరోజు మూలవేతనం విరాళం

ఈనాడు, హైదరాబాద్: సైనిక సంక్షేమ నిధికి రాష్ట్రంలోని 3.65 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, పింఛనర్లు తమ ఒక రోజు మూలవేతనాన్ని విరాళంగా ఇచ్చారు. ఐకాస నేతలు శ్రీనివాస్‌గౌడ్, దేవీప్రసాద్, కారెం రవీందర్‌రెడ్డి, మమత, సత్యనారాయణ, రాజేందర్‌లు శుక్రవారం సచివాలయంలో సీఎస్‌ను కలిసి వేతన విరాళ పత్రం అందజేశారు. ఫిబ్రవరి 1న చెల్లించే వేతనం నుంచి ఈ విరాళాన్ని మినహాయించి, సైనిక సంక్షేమనిధిలో జమ చేయాలని ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా తనను కలిసిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులను మంత్రి హరీశ్‌రావు అభినందించారు. మంత్రులు రూ.25 వేలు, ఎమ్మెల్యేలు రూ.10 వేల చొప్పున విరాళం ఇవ్వాలని నిర్ణయించారని హరీశ్‌రావు తెలిపారు. మొత్తంగా రూ.50 కోట్ల మేరకు సంక్షేమ నిధికి జమ అవుతాయన్నారు.

రెండో రాజధాని అంశంపై చర్చ జరగాలి: దాసోజు శ్రవణ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్ దేశ రెండో రాజధాని అంశంపై చర్చ జరగాలని టీపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇదే అంశాన్ని గట్టిగా వ్యతిరేకించిన కేసీఆర్.. ఇప్పుడు దాన్ని మరిచిపోయారని విమర్శించారు. శుక్రవారం మాజీ ఎంపీ రవీంద్రనాయక్‌తో కలిసి ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇండియాటుడే నిర్వహించిన సదస్సులో ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలే అని అన్నారు. గతంలో తెలంగాణ ఉద్యమానికి గండికొట్టిన వారే ఇప్పుడు కేసీఆర్ పక్కన చేరి కాంట్రాక్టుల రూపంలో దోచుకుంటున్నారన్నారు. తెలుగు వేరు, తెలంగాణ వేరు అన్న కేసీఆర్.. ప్రపంచ తెలుగు మహాసభలను ఎందుకు నిర్వహించారని శ్రవణ్ ప్రశ్నించారు.

ఆ వ్యాఖ్యలు చిచ్చు పెట్టేలా ఉన్నాయి.. వెనక్కి తీసుకోండి: పొంగులేటి

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వానికి చెల్లిస్తున్న పన్నులను ఏపీ ప్రభుత్వానికే కడితే... ఆంధ్రప్రదేశ్ ఆర్థిక స్థితి ఇతర రాష్ట్రాలకు అప్పులిచ్చే స్థాయికి చేరుకుంటుందని నీతిఆయోగ్ వైస్‌ఛైర్మన్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తుందని మండలిలో విపక్ష ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. అమరావతిలో జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న నీతిఆయోగ్ వైస్‌ఛైర్మన్ రాజీవ్‌కుమార్ తనకు అవసరంలేని విషయాలు ప్రస్తావించి తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేశారని, ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్న తెలుగు వారంతా ఇక్కడికి వచ్చి పన్నులు కడుతారా? అని ఆయన ప్రశ్నించారు.

ఉపాధ్యాయ ఖాళీలపై తప్పుడు లెక్కలా?

ఆర్.కృష్ణయ్య ధ్వజం

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఉపాధ్యాయ ఖాళీలపై ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి తప్పుడు లెక్కలు చెబుతూ.. తాము అవాస్తవాలు చెబుతున్నట్లు ప్రచారం చేస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఆక్షేపించారు. రాష్ట్రంలో 40 వేలకుపైగా ఉపాధ్యాయ ఖాళీలున్నాయని, బహిరంగ చర్చకు వస్తే ఆ లెక్కలను చెబుతామని స్పష్టంచేశారు. గ్రూప్-2 ఫలితాల విడుదలకు ఉన్న అడ్డంకులను తొలగించి..ఎంపిక ప్రకియ పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ గ్రూప్-2కు ఎంపికైన అభ్యర్థుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం తొలుత 25 వేల ఉపాధ్యాయ ఖాళీలను ప్రకటించిందని, ఆ తర్వాత 16 వేల ఖాళీలున్నట్లు మంత్రివర్గ సమావేశంలో తేల్చిందని గుర్తుచేశారు. తాజాగా ఉప ముఖ్యమంత్రి 8,700 ఖాళీలే ఉన్నట్లు ప్రకటించడాన్ని బట్టి ఇవన్నీ తప్పుడు లెక్కలేనన్నది స్పష్టమవుతోందన్నారు. గ్రూప్-2 పరీక్షల ప్రక్రియను మూడేళ్లపాటు కొనసాగించడం ఏమిటని ప్రశ్నించారు. గ్రూప్-2 ఫలితాల విడుదలపై ఎనిమిది రోజుల్లోపు చర్యలు తీసుకోవాలని టీఎస్‌పీఎస్సీని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, తెలంగాణ నిరుద్యోగ ఐకాస ఛైర్మన్ నీల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే గోదావరి-పెన్నా తొలిదశ

- రూ.20వేల కోట్లతో ప్రణాళిక సిద్ధం
- ఇందులో భాగంగానే ప్రకాశం ఎత్తిపోతల
- గోదావరి పెన్నా అనుసంధాన దిశలోనే తొలిదశగా నిర్మాణం
- ఆ ప్రాజెక్టుకూ కలిసొచ్చేలా పనులు
- రెండు మూడు నెలల్లోనే ప్రారంభించేలా ఏర్పాటు

ఈనాడు, అమరావతి: నాగార్జునసాగర్ కుడి కాలువ ఆయకట్టుకు గోదావరి నీళ్లు ఇచ్చేలా ఏపీ ప్రభుత్వం ఒక బృహత్తర పథకానికి శ్రీకారం చుడుతోంది. గోదావరి-పెన్నా అనుసంధాన తొలిదశగా అతి త్వరలోనే దీన్ని చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తోంది. పోలవరం కుడి కాలువ నుంచే పట్టిసీమ, చింతలపూడి ఎత్తిపోతల ద్వారా దాదాపు 14 వేల క్యూసెక్కుల వరకు ప్రకాశం బ్యారేజికి తీసుకొస్తారు. ఆ అదనపు నీటిని ప్రకాశం బ్యారేజి ఎగువ నుంచి ఎత్తిపోసి సాగర్ కుడి కాలువకు చేరుస్తారు. గోదావరి-పెన్నా అనుసంధాన ప్రణాళికలో భాగంగా...ఆ ప్రాజెక్టు ఏ ఎలైన్‌మెంట్‌లో చేపడుతున్నారో ఆ దిశలోనే ఈ పనులుంటాయి. ఇప్పుడు చేసే పనులు ఆ అనుసంధాన పనులకు ఉపయోగించుకునేందుకు అనువుగా ఉంటాయి. రాబోయే రెండు మూడు నెలల్లో ఈ ప్రాజెక్టు పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.20 వేల కోట్లు ఖర్చు కానుంది. ఎంత మేర నీటిని ఎత్తిపోయాలి, తొలిదశలో ఎంత మేర ఖర్చు తగ్గించుకోవచ్చో అనే అంశంపై జలవనరులశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. తుది ప్రణాళిక రూపుదిద్దుకోవాల్సి ఉంది.



ఈ ప్రాజెక్టు ఎలా....: ప్రస్తుతం పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా గోదావరి వరద కాలంలో పోలవరం కుడి కాలువ నుంచి 80 టీఎంసీలకు పైగా నీటిని ప్రకాశం బ్యారేజికి మళ్లిస్తున్నారు. పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా ఆ కాలంలో రోజూ 8000 క్యూసెక్కులు మళ్లిస్తున్నారు. పోలవరం కుడి కాలువ 17000 క్యూసెక్కుల ప్రవాహానికి వీలుగా నిర్మించారు. ఈ కాలువలో పట్టిసీమ నుంచి అదనంగా వచ్చే నీటి కన్నా ఎక్కువగా మళ్లించే ఏర్పాటు ఇప్పటికే పూర్తయింది. మరో వైపు పట్టిసీమ సమీపంలో గోదావరిపై చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభమయ్యాయి. వచ్చే ఖరీఫ్ కాలానికల్లా పూర్తి చేసేలా ఇప్పటికే ఏర్పాట్లు జరిగాయి. అయితే చింతలపూడి కాలువలు, ఇతర పనులు ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో చింతలపూడి నుంచి 6000 క్యూసెక్కుల వరకు పోలవరం కుడి కాలువకు మళ్లించి మొత్తం ప్రకాశం బ్యారేజికి రమారమి 14000 క్యూసెక్కుల వరకు మళ్లించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇందుకు కుడి కాలువలో ఎక్కడైనా కాలువ కట్ట ఎత్తు పెంచాల్సి ఉంటే ఆ మేరకు పనులు చేసుకుని గోదావరి నీటిని అదనంగా ప్రకాశం బ్యారేజికి మళ్లిస్తారు. ఆ నీరు ప్రకాశం బ్యారేజిలో చేరితే దాదాపు వైకుంఠపురం వరకు నీరుంటుంది. వైకుంఠపురం బ్యారేజి నిర్మాణం చేపట్టకముందే అక్కడి నుంచి నీటిని ఎత్తిపోసుకోవచ్చు.

120 రోజుల్లో 73 టీఎంసీలు మళ్లించాలని..

- 120 రోజుల్లో మొత్తం 73 టీఎంసీలు మళ్లించాలని ప్రాథమిక భావన. రోజుకు 7000 క్యూసెక్కుల మళ్లింపు.
- ఆరుదశల్లో ఎత్తిపోతల సాగుతుంది. మొత్తం 16.58 కిలోమీటర్ల మేర పైపులైను ఏర్పాటు చేస్తారు.
- 50.72 కిలోమీటర్లమేర గ్రావిటీ కాలువ నిర్మిస్తారు.
- + 15 మీటర్ల వద్ద కృష్ణా నది నుంచి నీటిని ఎత్తిపోసి... + 140 మీటర్ల వద్ద సాగర్ కుడి కాలువలో పోస్తారు. దాదాపు కారంపూడి వద్ద కాలువలో నీళ్లు కలుస్తాయి.
- 28.20 మెగావాట్ల విద్యుత్తు అవసరమవుతుంది.


కొత్త నగర పంచాయతీల కోసం ప్రత్యేకాధికారులు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో కొత్త నగర పంచాయతీల ఏర్పాటుకు సంబంధించి 9 మంది ప్రత్యేకాధికారులను నియమిస్తూ పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల, వనపర్తిలకు జీహెచ్‌ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఎస్.దేవేందర్ రెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్‌లకు పురపాలక ప్రణాళిక సంచాలకుడు ఎస్.బాలకృష్ణ, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్‌లకు తెలంగాణ డీటీసీపీ కె.విద్యాధర్, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లలకు ఏడీఎంఏ పి.అనూరాధ, ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు మెప్మా ఏఎండీ ఎల్.వందన్‌కుమార్, నిజామాబాద్, కామారెడ్డిలకు వరంగల్ ఆర్డీఎంఏ జె.శ్యాంసన్, నల్గొండ, యాదాద్రి, సూర్యాపేటలకు జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ ఎన్.రవికిరణ్, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేటలకు జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ డి.జయరాజ్ కెన్నడీ, వరంగల్ గ్రామీణ, నగర జిల్లాలు, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్‌లకు హైదరాబాద్ ఆర్డీఎంఏ షాహిద్ మసూద్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించారు.


రైలు ఢీకొని ముగ్గురి దుర్మరణం

- పట్టాలు దాటుతుండగా ప్రమాదం
- మృతుల్లో విద్యార్థిని, మూడేళ్ల చిన్నారి, వృద్ధురాలు

ఈనాడు డిజిటల్, కామారెడ్డి: పట్టాలు దాటుతుండగా..గూడ్సు రైలు ఢీకొన్న ఘటనలో డిగ్రీ విద్యార్థిని సహా.. ముగ్గురు మరణించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ఈ ఘటన జరిగింది. భిక్కనూరు మండలం తిప్పాపూర్‌కు చెందిన డిగ్రీ విద్యార్థిని బోయిని నవ్య(19) కామారెడ్డిలోని కళాశాలకు వెళ్లే నిమిత్తం.. కాచిగూడ నుంచి మన్మాడ్ వెళ్లే ప్యాసింజర్ ఎక్కారు. లింగంపేట్‌కు చెందిన బాలవ్వ(60), మెదక్ జిల్లా జాన్సిలింగాపూర్‌కు చెందిన మనవడు(కుమార్తె కుమారుడు) సర్వేంద్ర(03)తో ఇదే రైలులో ప్రయాణించారు. ముగ్గురూ కామారెడ్డి రైల్వేస్టేషన్‌లో దిగారు. తమ గమ్యాలకు చేరుకోవాలనే ఆతృతలో పట్టాలు దాటుతుండగా.. నిజామాబాద్ వైపు వెళ్లే గూడ్స్‌రైలు ఢీకొంది. నవ్య, సర్వేంద్ర ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోగా..బాలవ్వ చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మరణించింది.



సర్వేంద్ర, బోయిని నవ్య (పాతచిత్రాలు)



మృతురాలు బాలవ్వ

కేంద్ర సమాచార శాఖ తెలంగాణ ఏడీజీగా మరియప్పన్

ఈనాడు, హైదరాబాద్: పత్రికా సమాచార, కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తెలంగాణ ప్రాంతీయ అదనపు డైరెక్టర్ జనరల్‌గా ఇ.మరియప్పన్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. తిరువనంతపురం పత్రికా సమాచార కార్యాలయ అదనపు డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్‌పేపర్స్ ఫర్ ఇండియా అదనపు ప్రెస్ రిజిస్ట్రార్‌గా, ప్రాంతీయ అవుట్ రీచ్‌బ్యూరో అధిపతిగా ఆయన వ్యవహరిస్తారు. కేంద్ర ప్రచురణల విభాగమూ ఆయన ఆధ్వర్యంలో పనిచేస్తుంది. హైదరాబాద్ పత్రికా సమాచార కార్యాలయం ఆర్‌ఎన్‌ఐగా పనిచేస్తుందని, పత్రికల సర్క్యులేషన్ పరిశీలనకు ఇక నుంచి దిల్లీ వెళ్లాల్సిన పనిలేదని, ఇక్కడే తాము చేపడతామని ఈ సందర్భంగా మరియప్పన్ వెల్లడించారు. న్యూస్‌ప్రింట్ కావాల్సిన వారు స్వీయ ధ్రువీకరణ దరఖాస్తును ఇక్కడే ఇవ్వాలని, డీఏవీపీ నియంత్రణ దరఖాస్తులను ప్రతినెలా 15లోగా అందించాలని సూచించారు.

వెయిటేజీ వ్యవహారం మళ్లీ మొదటికి

- వేర్వేరు సందర్భాల్లో భిన్న తీర్పులు వెలువరించిన హైకోర్టు
- ప్రస్తుతం మరో వ్యాజ్యం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ట్రాన్స్‌కోలో సబ్ ఇంజినీరు/ఎలక్ట్రికల్ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగులకు 20 మార్కులు వెయిటేజీ ఇవ్వడానికి సంబంధించిన వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. వెయిటేజీ ఇవ్వడాన్ని సవాలు చేస్తూ వరంగల్ జిల్లాకు చెందిన ఎం.రఘుమోహన్, నిజామాబాద్‌కు చెందిన సి.క్రాంతి కిరణ్‌లు వ్యాజ్యం దాఖలు చేయడంతో వివాదం తెరపైకొచ్చింది. ఇదే వ్యవహారంపై హైకోర్టు గతంలో వేర్వేరు సందర్భాల్లో వేర్వేరుగా తీర్పులు వెలువరించింది. ఒక ధర్మాసనం వెయిటేజీ మార్కులను సమర్థిస్తూ ఉత్తర్వులు ఇవ్వగా.. మరో ధర్మాసనం వెయిటేజీ చెల్లదని, ఇద్దరికీ ఒకే మార్కులు వచ్చినపుడే దాన్ని పరిశీలించవచ్చని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది ఎస్.సత్యంరెడ్డి వాదనలు వినిపిస్తూ ట్రాన్స్‌కో గత డిసెంబరు 28న 174 సబ్‌ఇంజినీరు/ఎలక్ట్రికల్ ఇంజినీరు పోస్టుల భర్తీ నిమిత్తం నోటిఫికేషన్ జారీ చేసిందని, ఇందులో వెయిటేజీ కింద ఆరునెలలకు అర మార్కు చొప్పున 20 మార్కుల వరకు ఇస్తున్నట్లు ప్రకటించిందన్నారు. దీని వల్ల పదేళ్ల సీనియారిటీ ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులుంటే. నేరుగా పరీక్షకు హాజరై 59 మార్కులు తెచ్చుకున్న అభ్యర్థికి అవకాశం దక్కదన్నారు. వెయిటేజీ ఇవ్వరాదంటూ ఇటీవల ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. అయితే ట్రాన్స్‌కో తరఫున సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ గతంలో వెయిటేజీని సమర్థిస్తూ ధర్మాసనం వెలువరించిన ఉత్తర్వుల ఆధారంగానే నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి వెయిటేజీకి సంబంధించి రెండు ధర్మాసనాలు వేర్వేరుగా ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. సంబంధిత ధర్మాసనానికి నివేదించడానికి వీలుగా ఈ పిటిషన్‌ను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ముందుంచాలంటూ హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించారు.

బస్సులు, అంబులెన్స్‌లకు ప్రత్యేక లైన్లు!

పరిశీలిస్తున్నట్లు ఆర్టీసీ ఛైర్మన్ వెల్లడి



పంజాగుట్ట, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులు, అగ్నిమాపక వాహనాలు, అంబులెన్స్‌లు వెళ్లేందుకు రహదారులపై ప్రత్యేక లైన్లు ఏర్పాటుచేస్తే అనుకున్న సమయానికి గమ్యానికి చేరుకోవచ్చని ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ అన్నారు. ఈ విషయమై జీహెచ్‌ఎంసీతో పాటు పలు అనుబంధ సంస్థలతో మాట్లాడినట్లు తెలిపారు. ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో ఐఈఐ కేంద్రం శత వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా 'పట్టణ ప్రాంత అభివృద్ధిలో ప్రజా రవాణా సాయం' అనే అంశంపై శుక్రవారమిక్కడ జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం సోమారపు మాట్లాడుతూ.. ట్రాఫిక్ సమస్యతో వాహనాలు నెమ్మదిగా నడవడం వంటివాటితో ఆర్టీసీ నగరంలో ఏడాదికి రూ.400 కోట్లు నష్టపోతోందన్నారు. రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, ఎల్‌అండ్‌టీ జీఎం రవిశంకర్, సదస్సు కోకన్వీనర్ నాగభూషణం, ఐఈఐ ఛైర్మన్ సత్యనారాయణ, ఐఈఐ కార్యదర్శి రామేశ్వరరావు తదితరులు ప్రసంగించారు. సదస్సులో అందిన సూచనలను ఓ నివేదికగా ప్రభుత్వానికి అందజేయనున్నట్లు రామేశ్వరావు తెలిపారు.

మైనార్టీ కమిషన్ వైస్ ఛైర్మన్ పదవిని తిరస్కరించిన ప్రతాప్

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: రాష్ట్ర మైనార్టీ కమిషన్ వైస్ ఛైర్మన్ పదవిని రాజారపు ప్రతాప్ తిరస్కరించారు. ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి ఈ విషయాన్ని వివరించినట్లు గురువారం ప్రతాప్ 'న్యూస్‌టుడే'కు వివరించారు. సీఎం నాయకత్వంలో పని చేసేందుకే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం జనవరి 2న మైనార్టీ కమిషన్ వైస్ ఛైర్మన్‌గా ఆయన్ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా..ఆయన బాధ్యతలు చేపట్టలేదు.

13 మంది కానిస్టేబుళ్ల అరెస్టు

సీఐడీ అదనపు డీజీ గోవింద్‌సింగ్

ఈనాడు, హైదరాబాద్: అపరిష్కృత కేసుల దర్యాప్తు మళ్లీ మొదలైంది. దాంతో ఇంతకాలం చట్టం నుంచి తప్పించుకొని తిరుగుతున్న నిందితుల ఆట కట్టవుతోంది. ఎప్పుడో తొమ్మిదేళ్ల క్రితం నాటి కేసులో నిందితులుగా ఉన్న కానిస్టేబుళ్లను సీఐడీ అధికారులు గురువారం అరెస్టు చేశారు. ఈ మేరకు సీఐడీ అదనపు డీజీ గోవింద్ సింగ్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రస్థాయి పోలీసు నియామక మండలి 2009లో నిర్వహించిన కానిస్టేబుల్ పరీక్షల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయి. నల్గొండ జిల్లాలో ఒకరికి బదులు మరొకరు పరీక్షలు రాసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై అప్పట్లోనే నల్గొండ జిల్లా తిప్పర్తి పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. అప్పటి నకిరేకల్ సీఐ రాములు నాయక్..9 మంది అభ్యర్థులు, వారికి బదులుగా పరీక్ష రాసిన అభ్యర్థులు ఇద్దరు, ముగ్గురు మధ్యవర్తులు మొత్తం 14 మందిని అరెస్టు చేశారు. 2010లో ఆ కేసు సీఐడీకి బదిలీ అయింది. సీఐడీ డీఎస్పీలు కె.జె.సోమశేఖర్ మరో 25 మందిని, మహేష్, రామచంద్రుడు ఒక్కొక్కరు చొప్పున నిందితులను అరెస్టు చేశారు. ఆ తర్వాత కేసు దర్యాప్తు నెమ్మదించింది. తాజాగా డీజీపీ మహేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పాత కేసులకు ముగింపు పలుకుతున్నారు. ఈ నేపథ్యంలో కానిస్టేబుల్ పరీక్షల్లో అవకతవకల కేసు దర్యాప్తును కొనసాగించిన సీఐడీ అధికారులు డీఎస్పీ మోహనరాజ ఆధ్వర్యంలో మొత్తం 13 మంది కానిస్టేబుళ్లను అరెస్టు చేశారు. వారిలో యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మర్తనపల్లి వెంకట సత్యనారాయణ, మోత్కూరు ఠాణాకు చెందిన వి. రమేష్, ఇదే జిల్లా రాజాపేట ఠాణాలో పనిచేస్తున్న దనియాకుల శ్రీకాంత్, హైదరాబాద్ కొండాపూర్ 8వ బెటాలియన్‌కు చెందిన గుండు వీరప్రసాద్, కరీంనగర్ పోలీసు శిక్షణ కళాశాలలో సివిల్ కానిస్టేబుల్‌గా శిక్షణ పొందుతున్న అత్తూరి సత్యనారాయణ రెడ్డిలతోపాటు మరో 8 మందిని గురువారం అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు కొనసాగుతుందని, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నుంచి ఆధారాలు వచ్చిన తర్వాత మరికొన్ని అరెస్టులు ఉంటాయని సీఐడీ అదనపు డీజీ వెల్లడించారు.

న్యాయవ్యవస్థను గుప్పిట్లో తెచ్చుకునే కుట్ర

భాజపాపై సురవరం సుధాకర్‌రెడ్డి విమర్శ

హిమాయత్‌నగర్(హైదరాబాద్), న్యూస్‌టుడే, ఈనాడు, హైదరాబాద్: న్యాయవ్యవస్థలో నెలకొన్న సంక్షోభాన్ని అడ్డుపెట్టుకొని భాజపా రాజకీయాలకు పాల్పడుతోందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డితో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తుల విలేకరుల సమావేశం తర్వాత తమ నాయకుడు రాజా జస్టిస్ చలమేశ్వర్‌ను కలిసిన ఉదంతాన్ని రాజకీయం చేసి, ఈ సందర్భంగా లేవనెత్తిన అంశాలను వెనక్కునెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. న్యాయమూర్తుల నియామక అధికారం ప్రధాని చేతుల్లో పెట్టేందుకు భాజపా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అనేక విషయాలపై స్పందించే ప్రధాని ప్రస్తుత సంక్షోభం, లోక్‌పాల్ బిల్లు వంటి వాటిపై నోరు విప్పడం లేదని దుయ్యబట్టారు. వీటిపై చర్చ జరగాల్సిందేనన్నారు. తెలంగాణ అభివృద్ధిని హైదరాబాద్‌ను మినహాయించి చూడాలని, ఈ అభివృద్ధిలో కేసీఆర్ పాత్ర ఏముందో చెప్పాలని సురవరం డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సురవరం సుధాకర్‌రెడ్డి. చిత్రంలో చాడ వెంకట్‌రెడ్డి

సురవరంతో కోదండరాం భేటీ: తెలంగాణలో వ్యవసాయం సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, రైతాంగ సమస్యలపై చేపట్టనున్న క్షేత్రస్థాయి ఉద్యమంలో తమతో కలిసి పోరాడాలని తెఐకాస ఛైర్మన్ కోదండరాం.. సురవరం సుధాకరరెడ్డిని కోరారు. శుక్రవారం పలువురు ఐకాస నేతలతో కలిసి ఆయన సురవరం, చాడ వెంకటరెడ్డిలతో భేటీ అయ్యారు. కోదండరాం అభ్యర్థనపై సురవరం సానుకూలంగా స్పందించారు. కోదండరాం నాయకత్వంలో కొత్త పార్టీ ఆవిర్భావంపై జరుగుతున్న ప్రచారం పైనా చర్చించినట్లు తెలిసింది. వివిధ వర్గాల నుంచి కొత్త పార్టీని ఏర్పాటుచేయాలనే ఒత్తిడి పెరిగిపోతోందని, త్వరలోనే దీనిపై నిర్ణయాన్ని ప్రకటిస్తానని కోదండరాం వారికి తెలిపినట్లు సమాచారం.

27 నుంచి ఎక్సైజ్ కానిస్టేబుల్ అభ్యర్థుల ధ్రుపత్రాల పరిశీలన

ఈనాడు, హైదరాబాద్: ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నిర్వహించిన రాతపరీక్షలో అర్హులైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 2 వరకు ఉంటుందని టీఎస్‌పీఎస్సీ తెలిపింది. మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. మరోవైపు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలో సహాయ పర్యావరణ ఇంజినీర్ల పోస్టుల భర్తీకి ఈ నెల 24న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కమిషన్ తెలిపింది. మరింత సమాచారం కోసం టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.

సీసీఎల్ఏ కార్యాలయాన్ని ముట్టడించిన వీఆర్ఏలు

ప్రత్యక్ష పద్ధతిలో ఎంపిక చేసిన గ్రామ రెవెన్యూ సహాయకు(వీఆర్ఏ)లను క్రమబద్ధీకరించాలని కోరుతూ శుక్రవారం వీఆర్ఏలు భూ పరిపాలన ప్రధాన కార్యాలయం ముందు బైటాయించారు. వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరి ఈశ్వర్ నేతృత్వంలో పెద్ద ఎత్తున తరలివచ్చి శాంతియుత నిరసన తెలిపారు. గతేడాది జనవరిలో ముఖ్యమంత్రి తమ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నేటికీ నెరవేర్చలేదని, ఇప్పటికైనా దృష్టిసారించాలని కోరారు. దశలవారీ ఉద్యమంలో భాగంగా చేపట్టిన ఆందోళన కార్యాక్రమాలను ఉద్ధృతం చేయనున్నట్లు ఈశ్వర్ ఈ సందర్భంగా విలేకరులకు తెలిపారు.



సీసీఎల్ఏ కార్యాలయం ముందు బైటాయించిన వీఆర్ఏలు



శుక్రవారం ముంబయిలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆకాశ్ అంబానీ

ఈనాడు బిజినెస్

రాణించిన ఎన్ఐఐటీ టెక్నాలజీస్

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఎన్ఐఐటీ టెక్నాలజీస్ ఏకీకృత ప్రాతిపదికన రూ.75.6 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.62.4 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 21.2 శాతం అధికం. మొత్తం ఆదాయం రూ.693.8 కోట్ల నుంచి 9 శాతం వృద్ధితో రూ.756.5 కోట్లకు చేరింది. ఐరోపా, మధ్యప్రాచ్య, ఆఫ్రికా దేశాల నుంచి ఆదాయం 7.2 శాతానికి పెరిగిందని కంపెనీ తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీలో కొత్తగా 59 మంది చేరారు. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 9,081కు చేరింది. కంపెనీ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా సుధీర్ సింగ్ నియామకానికి బోర్డు ఆమోదం తెలిపిందని కంపెనీ తెలిపింది. ఉపాధ్యక్షుడు, మేనేజింగ్ డైరెక్టర్‌గా అరవింద్ ఠాకూర్‌కు పదోన్నతి కల్పించినట్లు వివరించింది.

బీఎస్ఈలో షేరు 5.19 శాతం లాభంతో రూ.728 వద్ద ముగిసింది.

రిలయన్స్ గణాంకాల గర్జన

అత్యధిక త్రైమాసిక లాభం నమోదు

- 25% వృద్ధితో రూ.9423 కోట్లకు
- కలిసొచ్చిన రిఫైనింగ్ మార్జిన్లు
- ఆదాయం రూ.1,09,905 కోట్లు
- జియోకు తొలి లాభాలు

దిల్లీ

రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆర్థిక ఫలితాల్లో గర్జించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (అక్టోబరు-డిసెంబరు)లో అత్యధిక ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. అంతక్రితం ఏడాది ఇదే మూడు నెలలతో పోలిస్తే కంపెనీ నికర లాభం రూ.7,533 కోట్ల నుంచి 25.1 శాతం వృద్ధి చెంది రూ.9,423 కోట్లకు చేరింది. కంపెనీ మొత్తం ఆదాయం కూడా 30.5 శాతం పెరిగి రూ.1,09,905 కోట్లకు చేరుకుంది. స్టాండలోన్ పద్ధతిలో నికర లాభం 5.4 శాతం హెచ్చి రూ.8,454 కోట్లకు చేరుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. పెట్రోరసాయనాల ప్రాజెక్టుల్లో ఉత్పత్తి వృద్ధి చెందడం.. అదే సమయంలో రిఫైనింగ్, పెట్రో రసాయనాల వ్యాపారంలో ధరలు పెరగడం కలిసొచ్చింది. స్థూల రిఫైనింగ్ మార్జిన్(జీఆర్ఎమ్) ఒక్కో బారెల్‌కు 11.6 డాలర్లుగా నిలిచింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో ఇది 10.8 డాలర్లే.

జియోకు రూ.504 కోట్ల లాభం

డిసెంబరు చివరకు 16.01 కోట్ల మంది వినియోగదార్లను కలిగి ఉన్న జియో ఇన్ఫోకామ్, వాణిజ్య కార్యకలాపాలు మొదలుపెట్టిన రెండో త్రైమాసికంలోనే లాభాల్లోకి వచ్చింది. జులై-సెప్టెంబరు త్రైమాసికంలో రూ.271 కోట్ల నష్టాన్ని ప్రకటించిన ఈ సంస్థ అక్టోబరు-డిసెంబరులో రూ.504 కోట్ల లాభాన్ని ప్రకటించింది. అంతక్రితం త్రైమాసికంతో పోలిస్తే ఆదాయం 11.9 శాతం హెచ్చి రూ.6,879 కోట్లకు చేరింది. 'మా వ్యాపార మూలాల్లోని బలమే జియో ఫలితాల్లో ప్రతిఫలించింది. బలమైన ఆర్థిక పనితీరు కొనసాగించగలదని జియో నిరూపించింద'ని జియో మాతృ సంస్థ అయిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీ అన్నారు.

రిటైల్‌లో రెట్టింపు ఆదాయం

రిలయన్స్ రిటైల్ వ్యాపార విభాగంలో ఆదాయం రెట్టింపై రూ.18,798 కోట్లకు చేరుకుంది. పన్నుకు ముందు లాభం 81.98 శాతం పెరిగి రూ.606 కోట్లుగా నమోదైంది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో కంపెనీ 72 విక్రయశాలలను జత చేసింది. వినియోగదారు ఎలక్ట్రానిక్స్‌లో పంపిణీ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసింది. డిసెంబరు 31, 2017 నాటికి కంపెనీ దేశవ్యాప్తంగా మొత్తం 750 నగరాల్లో 3751 విక్రయశాలలను సంస్థ నిర్వహిస్తోంది.

ఎగుమతులు రూ.46,151 కోట్లు

ప్రపంచంలోనే అతిపెద్ద రిఫైనరీ ఆఫ్ గ్యాస్ క్రాకర్(ఆర్ఓజీసీ) కాంప్లెక్స్‌ను రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇటీవలే ప్రారంభించింది. దీనితో పాటు జామ్‌నగర్‌లోనే డౌన్‌స్ట్రీమ్ ప్లాంట్ల కార్యకలాపాలనూ ప్రారంభించింది. కంపెనీ భారత్ నుంచి చేసిన ఎగుమతులు 21.3 శాతం పెరిగి రూ.46,151 కోట్ల(7.2 బిలియన్ డాలర్లు)కు చేరుకున్నాయి. పెట్రోరసాయనాల ఉత్పత్తుల ఎగుమతులు అధికంగా కావడంతో పాటు.. ధరలు పెరగడంతో ఇది సాధ్యమైంది.


- ✦ రిఫైనింగ్, మార్కెటింగ్ వ్యాపారంలో లాభం అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే రూ.6194 కోట్ల నుంచి రూ.6165 కోట్లకు తగ్గింది.
- ✦ చమురు-గ్యాస్ వ్యాపారం రూ.291 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది.
- ✦ డిసెంబరు 31, 2017 నాటికి కంపెనీ రుణాలు రూ.2,13,206 కోట్లుగా నమోదయ్యాయి. అదే సమయానికి రూ.78,617 కోట్ల నగదు, నగదు సమాన నిల్వలున్నాయి. సెప్టెంబరు 30, 2017 నాటికి నగదు నిల్వలు రూ.77,014 కోట్లుగా ఉన్నాయి.

ఇతర వ్యయాలు రూ.14,169 కోట్లు

ఇతర వ్యయాలు 38.4 శాతం పెరిగి రూ.14,169 కోట్ల(2.2 బి. డాలర్లు)కు చేరుకున్నాయి. నెట్‌వర్క్ వ్యయాలు, డిజిటల్ సేవలకు సంబంధించిన రెగ్యులేటరీ ఛార్జీలు, విద్యుత్, ఇంధన ఛార్జీలు, జామ్‌నగర్‌లో కొత్త ప్రాజెక్టుల ఏర్పాటు తదితరాలకు ఖర్చు అయ్యాయి.

బీఎస్ఈలో షేరు 1.09% పెరిగి రూ.929.35 వద్ద ముగిసింది.

(ఫలితాలు ట్రేడింగ్ ముగిశాక వెలువడ్డాయి.)



మూడో త్రైమాసికంలో పెట్రో రసాయనాల విస్తరణ ప్రాజెక్టులు ప్రారంభించాం. పెట్రో రసాయనాల వ్యాపారంలో భారీ పెట్టుబడులు ఇపుడు ప్రయోజనాలు చూపిస్తున్నాయి. మా రిఫైనింగ్ వ్యాపారం వరుసగా 12వ త్రైమాసికంలోనూ రెండంకెల మార్జిన్ నమోదు చేసింది. తద్వారా పరిశ్రమ మూలాల్లో, నిర్వహణలో బలం ఉందని చాటింది. జియో తొలిసారిగా లాభాలు ఆర్జించింది.. అందుకే అత్యధిక త్రైమాసిక లాభాన్ని పొందగలిగాం.

- ఫలితాల వెల్లడి సందర్భంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీ

సాంకేతిక సాధికారతే జియో లక్ష్యం

- ప్రజలకు మెరుగైన జీవితానికి కట్టుబడి ఉన్నాం
- పబ్లిక్ క్లౌడ్‌కు ఉజ్వల భవిత
- 2020 కల్లా 53% వృద్ధితో 4 బి. డాలర్లకు: ఆకాశ్ అంబానీ

ముంబయి: వంద కోట్ల మంది భారతీయుల్లో సానుకూలత నింపే ఏ పనికైనా రిలయన్స్ జియో సిద్ధంగా ఉందని ముకేశ్ అంబానీ తనయుడు, సంస్థ డైరెక్టర్ అయిన ఆకాశ్ అంబానీ తెలిపారు. కొత్త తరం సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతి ఒక్కరికీ అందజేస్తామని పేర్కొన్నారు. పబ్లిక్ క్లౌడ్ విపణికి ఉజ్వల భవిష్యత్ ఉందని తెలిపారు. దేశీయంగా ఈ విపణి ఈ ఏడాది 1.81 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉందని, 2020 కల్లా 53 శాతం పైగా పెరిగి 4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.26,000 కోట్ల)కు చేరుకోవచ్చని ఆయన అంచనా వేశారు. అప్పటికి మన ఆర్థిక వ్యవస్థ మరింతగా డిజిటలీకరణ అయి ఉంటుందని పేర్కొన్నారు. శుక్రవారమిక్కడ జరిగిన 'ఇండియా డిజిటల్ ఓపెన్ సమిట్'లో ఓపెన్ సోర్స్, కృత్రిమ మేధ, బ్లాక్ చైన్, ఓపెన్ స్టాక్ తదితర సాంకేతికతలపై ఆకాశ్ మాట్లాడారు. తల్లిదండ్రులు లేకుండా బహిరంగ కార్యక్రమంలో ఆకాశ్ ప్రసంగించడం ఇదే తొలిసారి. పబ్లిక్ క్లౌడ్ ద్వారా కంపెనీలు తమ సంస్థకు వెలుపల ఉన్న వినియోగదార్లకూ సేవలు అందించవచ్చు. వివిధ అంశాలపై ఆకాశ్ అంబానీ ఏమన్నారంటే..

ఓపెన్ సోర్స్‌పై: ద ఓపెన్ నెట్‌వర్క్ ఆటోమేషన్ ప్లాట్‌ఫాం(ఒనాప్)తో పాటు పలు ప్రాజెక్టుల్లో పాలుపంచుకుంటున్న జియోకు ఓపెన్ సోర్స్ చాలా ముఖ్యం. అంతర్జాతీయంగా పలు రంగాల్లో సాంకేతికతను ముందుకు తీసుకెళ్లడంలో ఈ ఓపెన్ సోర్స్ ఉపయోగపడుతుంది. ఇక కృత్రిమ మేధ అందరికీ ముఖ్యం కానుంది. ప్రపంచంలోనే పూర్తి స్థాయి ఓపెన్ సోర్స్ క్లౌడ్ ప్రాజెక్ట్ అయిన ఓపెన్‌స్టాక్ ద్వారా రిలయన్స్ జియో సహా ప్రపంచంలో 60కి పైగా డాటా కేంద్రాల్లో నడుస్తున్న పలు ప్రాజెక్టులకు సేవలు అందుతున్నాయి.

బ్లాక్‌చైన్‌పై: 2017ను బ్లాక్‌చైన్, డిజిటల్ ఏడాదిగా అనుకోవచ్చు. క్రిప్టోకరెన్సీ బ్లాక్‌చైన్ కంటే పైన అంటే ఒక ఓపెన్ సోర్స్ ప్లాట్‌ఫాం వల్ల భద్రమైన లావాదేవీలు జరిగే వ్యవస్థను మనం గమనించవచ్చు. బిట్‌కాయిన్ విషయాన్ని పక్కనపెడితే మనం ఈ వ్యవస్థను బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, ఆరోగ్య సంరక్షణ, స్థిరాస్తి, విద్య, 5జీ, ఐఓటీ, వ్యవసాయ రంగాల్లో ఉపయోగించుకోవచ్చు. ఇవన్నీ ప్రతీ భారతీయుడి జీవితాన్ని ప్రభావితం చూపే రంగాలే. వంద కోట్లకు పైగా భారతీయుల జీవితాల్లో సానుకూలతను నింపే ఏ పనికైనా జియో సిద్ధంగా ఉంది. ఈ కొత్త తరం సాంకేతికతను ప్రతి వినియోగదారుడికీ అందజేస్తాం.

కోటక్ మహీంద్రా బ్యాంక్

నికరలాభంలో 28 శాతం వృద్ధి

ముంబయి: ప్రైవేటురంగ కోటక్ మహీంద్రా బ్యాంక్, అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి రూ.1,624 కోట్ల ఏకీకృత నికరలాభాన్ని నమోదు చేసింది. బ్రోకరేజీ, వాహన రుణాలు అందించే అనుబంధ సంస్థలు బాగా రాణించడం వల్ల ఏడాది క్రితం నికరలాభంతో పోలిస్తే, ఈసారి 28 శాతం పెరిగింది. సమీక్షా త్రైమాసికంలో స్టాండలోన్ ప్రాతిపదికన బ్యాంక్



నికరలాభం 20 శాతం పెరిగి రూ.1,053 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం 17 శాతం పెరిగి రూ.2,394 కోట్లకు, వడ్డీయేతర ఆదాయం 14 శాతం అధికమై 1,040 కోట్లకు చేరింది. పొదుపు-కరెంటు ఖాతాల్లోని నగదు నిల్వలు 46.7 శాతానికి చేరినా, నికరవడ్డీ మార్జిన్ 0.30 శాతం తగ్గి 4.2 శాతానికి పరిమితమైనట్లు బ్యాంక్ తెలిపింది. బ్రోకరేజీ సంస్థ నికరలాభం రూ.154 కోట్లు, వాహన రుణ సంస్థ కోటక్ మహీంద్రా ప్రైమ్ లాభం రూ.148 కోట్లకు చేరినట్లు సంస్థ వెల్లడించింది. ఐ బ్యాంకింగ్ విభాగ లాభం 6 రెట్లు పెరిగి రూ.36 కోట్లకు చేరింది. రుణాల్లో 23 శాతం వృద్ధి లభించిందని, ఇందుకు కార్పొరేట్ రుణాల్లో 20 శాతం వృద్ధి దోహద పడిందని సంస్థ సంయుక్త మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ గుప్తా పేర్కొన్నారు. నిధుల వ్యయం పెరగడం వల్లే, రుణ రేట్లను పెంచాల్సి వస్తోందన్నారు. స్థూల నిరర్థక ఆస్తులు 2.31 శాతానికి తగ్గినా, రుణాలు అధికంగా ఇవ్వడం వల్ల, కేటాయింపులు కూడా రూ.226.29 కోట్లకు పెరిగాయన్నారు.

బీఎస్ఈలో బ్యాంక్ షేరు 1.39 శాతం లాభపడి, రూ.1,059.95 వద్ద స్థిరపడింది.

ఐడీఎఫ్‌సీ బ్యాంక్

24% తగ్గిన లాభం

దిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.146.11 కోట్ల నికరలాభాన్ని ప్రైవేటు రంగ ఐడీఎఫ్‌సీ బ్యాంక్ నమోదు చేసింది. 2016-17 ఇదేకాలంలో ఆర్జించిన లాభం రూ.191.26 కోట్లతో పోలిస్తే, ఈసారి 23.60 శాతం తగ్గింది. ఇదే సమయంలో మొత్తం ఆదాయం కూడా రూ.2585.07 కోట్ల నుంచి 2.72 శాతం తగ్గి, రూ.2,514.5 కోట్లకు పరిమితమైంది. స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 7.03 శాతం నుంచి 5.62 శాతానికి, నికర ఎన్‌పీఏలు 2.57 శాతం నుంచి 2.52 శాతానికి తగ్గాయి. ఫలితంగా కేటాయింపులు కూడా రూ.231.75 కోట్ల నుంచి రూ.108.6 కోట్లకు పరిమితమయ్యాయి.

బ్యాంక్ షేర్ బీఎస్ఈలో 0.69 శాతం లాభపడి రూ.58.60 వద్ద స్థిరపడింది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభంలో 20% వృద్ధి

- అక్టోబరు- డిసెంబరులో రూ.4,642 కోట్లు
- 24 శాతం పెరిగిన నికర వడ్డీ ఆదాయం
- కేటాయింపులు రెండింతలు

ముంబయి

అక్టోబరు- డిసెంబరు త్రైమాసికంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నికర లాభం 20% పెరిగి రూ.4,642.60 కోట్లకు చేరింది. మొండి బకాయిలకు కేటాయింపులు పెరిగినా, నికర వడ్డీ ఆదాయంలో వృద్ధి కారణంగా లాభంపై ఆ ప్రభావం పరిమితమయ్యింది. ఏడాది క్రితంతో పోలిస్తేనికర వడ్డీ ఆదాయం రూ.8,309.10 కోట్ల నుంచి 24% వృద్ధితో రూ.10,314.30 కోట్లకు చేరింది. ఇతర ఆదాయం 23% పెరిగి రూ.3869 కోట్లుగా నమోదైంది. దీంతో మొత్తం ఆదాయం కూడా రూ.20,750 కోట్ల నుంచి రూ.24,450 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ మార్జిన్ 4.3 శాతంగా నమోదైంది. కేటాయింపులు, ఇతర అత్యవసర వ్యయాలు (కాంటిజెన్సీస్) దాదాపు రెండింతలు పెరిగి రూ.1,351.40 కోట్లకు చేరాయి. ఏడాదిక్రితం ఇదే సమయంలో కేటాయింపులు రూ.715.80 కోట్లు మాత్రమే. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.05% నుంచి 1.29 శాతానికి, నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి 0.32% నుంచి 0.44 శాతానికి చేరాయి. డిసెంబరు 31 నాటికి కాసా డిపాజిట్ల నిష్పత్తి 43.9 శాతంగా ఉంది. రుణాల మంజూరు 27.5 శాతం పెరిగి రూ.6,31,215 కోట్లకు చేరగా.. డిపాజిట్లు 10.



1 శాతం వృద్ధితో రూ.6,99,026 కోట్లుగా నమోదయ్యాయి. 'నికర వడ్డీ ఆదాయం 24% పెరిగింది. ఇతర ఆదాయంలోనూ ఇంచుమించు ఇదే స్థాయిలో వృద్ధి ఉంది. అయితే అధిక కేటాయింపులు ఆదాయ వృద్ధిపై ప్రభావం చూపాయి. అయినప్పటికీ పెద్దగా ఇబ్బంది లేద'ని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ పరేశ్ సుక్తాంకర్ తెలిపారు.

అవును.. లాభాన్ని ఎక్కువగా చూపాం: 2016-17లో మూడు ఖాతాల స్థితిపై బ్యాంకుల మధ్య పూర్తి స్పష్టత లేకపోవడంతో కేటాయింపుల విషయాన్ని నివేదించలేదని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పేర్కొంది. అదే కారణం వల్లే ఆ ఆర్థిక సంవత్సరానికి లాభాన్ని ఎక్కువగా చూపించామని తెలిపింది. 2016-17కు రూ.14,549.66 కోట్ల నికర లాభాన్ని బ్యాంకు ప్రకటించింది. వాస్తవంగా ఇది రూ.14,028.24 కోట్లు మాత్రమే. 'పర్యవేక్షణ ప్రక్రియలో భాగంగా 2017 మార్చి వరకు మూడు ఖాతాలకు సంబంధించి నిరర్థక ఆస్తుల వర్గీకరణలో వ్యత్యాసాన్ని ఆర్‌బీఐ గుర్తించింద'ని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పేర్కొంది. ఆ మూడు ఖాతాల వివరాలను వెల్లడించలేదు. అయితే ఈ మూడు ఖాతాల్లో ఒక దానిని సమీక్షా త్రైమాసికంలో స్టాండర్డ్ ఖాతాకు బ్యాంకు మార్చింది. 'నిరర్థక ఆస్తులుగా ప్రకటించడానికంటే ముందే వాటికి కేటాయింపులు చేయడం వల్లే ఈ వ్యత్యాసం కనిపించింది. ఇప్పుడు ఈ లెక్కల ప్రక్రియ పూర్తి కావడంతో మొత్తం ఎన్‌పీఏల్లో వ్యత్యాసాన్ని ప్రకటించామ'ని సుక్తాంకర్ తెలిపారు. నికర లాభాన్ని ఎక్కువగా ప్రకటించడానికి కూడా కేటాయింపుల్లో వ్యత్యాసమే కారణమని పేర్కొన్నారు. మున్ముందు రుణ, డిపాజిట్ల రేట్లు పెరిగేందుకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

బీఎస్ఈలో షేరు 1% పెరిగి రూ.1,951.20 వద్ద ముగిసింది.

విమానంలో ప్రయాణిస్తూ కాల్స్, వాట్సాప్, ఫేస్‌బుక్!

దిల్లీ: విమానాల్లో ప్రయాణిస్తూ కూడా మొబైల్ ద్వారా కాల్స్ చేసుకునేందుకు, వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా సన్నిహితులతో చాటింగ్ కొనసాగించే అవకాశం త్వరలో అందుబాటులోకి రానుంది. దేశీయ పరిధిలో, విమానాల్లో



మొబైల్ , ఇంటర్నెట్ సేవలు అనుమతించాలని, టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ సిఫారసు చేయడమే ఇందుకు కారణం. శాటిలైట్‌తో దేశీయ నెట్‌వర్క్‌లను ఇందుకోసం వినియోగించుకోవచ్చని తెలిపింది. దేశీయ, అంతర్జాతీయ విమానాల్లో వాయిస్, డేటా, వీడియో సేవలను అనుమతించవచ్చా అనే అంశంపై సూచనలు చేయాలని, టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్‌ను టెలికాం విభాగం 2017 ఆగస్టు 10న కోరింది. 'సాంకేతికంగా సాధ్యమైనపుడు, భద్రతా పరమైన ఆందోళనలు లేనపుడు, మొబైల్-ఇంటర్నెట్ సేవలను విమానాల్లో అందించేందుకు నియంత్రణలు అవసరం లేదు. వీటిని అనుమతించాలనే సిఫారసు చేస్తున్నాం' అని ట్రాయ్ పేర్కొంది. దేశీయ నెట్‌వర్క్‌లకు సంబంధించి కనీసం 3,000 మీటర్ల ఎత్తున విమానం ప్రయాణిస్తున్నపుడు మొబైల్ సేవలను అనుమతించాలని పేర్కొంది. విమానాల్లో సేవలకు వార్షిక లైసెన్స్ రుసుముగా ప్రారంభంలో రూపాయి మాత్రమే ఉండాలని నిర్దేశించింది. మొబైల్‌ను ఎయిర్‌ప్లేన్ మోడ్‌లో ఉంచాలని ఆదేశించినపుడు, వైఫై ద్వారా ఇంటర్నెట్ సేవలు అనుమతించవచ్చని సూచించింది.

ఎయిరిండియా వేలానికి ప్రాథమిక బిడ్లు ఫిబ్రవరిలో!

ఎయిరిండియా, దాని 5 అనుబంధ సంస్థల్లో వాటా విక్రయానికి ప్రాథమిక బిడ్లను ప్రభుత్వం వచ్చే నెలలో ఆహ్వానించవచ్చని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ఆసక్తి కలిగిన సంస్థల వ్యక్తీకరణ (ఈఓఐ) వచ్చేనెలలో ఉంటుందని పేర్కొన్నారు.

సిగరెట్ అమ్మకాలపై ఒత్తిడి

- లాభం రూ.3,090 కోట్లు
- ఆదాయం రూ.10,579 కోట్లు

దిల్లీ: అక్టోబరు- డిసెంబరు త్రైమాసికానికి ఐటీసీ రూ.3,090 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2016-17 ఇదేకాలంలో సంస్థ ఆర్జించిన రూ.2,646.73 కోట్లతో పోలిస్తే నికర లాభం ఈసారి 16.75% పెరిగింది. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.14,257.90 కోట్ల నుంచి రూ.10,579.11 కోట్లకు తగ్గింది. మొత్తం వ్యయాలు కూడా రూ.10,303.71 కోట్ల నుంచి రూ.6,362.40 కోట్లకు తగ్గడం వల్ల, లాభం పెరగడానికి దోహదం చేసింది. తమిళనాడుకు కొన్నేళ్లుగా చెల్లించిన ప్రవేశ పన్నుపై సుప్రీం కోర్టు నుంచి సంస్థకు అనుకూల తీర్పు రావడంతో రూ.412.90 కోట్లను తిరిగి పొందడం కూడా కలిసొచ్చింది. జీఎస్‌టీ అమల్లోకి వచ్చినందున ఏడాది క్రితం గణాంకాలతో తాజా ఫలితాలను పోల్చి చూడొద్దని ఐటీసీ పేర్కొంది. 'సిగరెట్ల అమ్మకాలపై తీవ్ర ఒత్తిడి, వ్యవసాయ వ్యాపారంలో అమ్మకాలు పరిమితంగా ఉండటం లాంటి నిర్వహణపరమైన సవాళ్లు ఉన్నప్పటికీ.. స్థిరమైన పనితీరు కనబరచాం. జీఎస్‌టీ ప్రతికూలతల నుంచి ఎఫ్ఎమ్‌సీజీ పరిశ్రమ క్రమక్రమంగా బయటపడుతోంద'ని ఐటీసీ తెలిపింది.

ఐటీసీ

20% అదనపు పన్ను భారం: సిగరెట్లపై ఎక్సైజ్ సుంకం, జీఎస్‌టీ పరిహార సెస్సును పెంచడం వల్ల 20% అదనపు భారం పడిందని ఐటీసీ తెలిపింది. తాజా పన్ను రేట్ల పెరుగుదలతో కలుపుకుంటే గత ఆరేళ్లలో సిగరెట్లపై పన్నులు 202% పెరిగాయని పేర్కొంది. ఇందువల్ల సిగరెట్ అమ్మకాలపై తీవ్ర ఒత్తిడి కొనసాగుతోందని తెలిపింది. అక్టోబరు-డిసెంబరులో సిగరెట్ల ఆదాయం రూ.8,287.97 కోట్ల నుంచి రూ.4,629.19 కోట్లకు తగ్గింది.

- ✦ అక్టోబరు- డిసెంబరులో సిగరెట్లు సహా ఎఫ్ఎమ్‌సీజీ ఉత్పత్తుల విభాగం ద్వారా రూ.7,500.97 కోట్ల ఆదాయం వచ్చింది. 2016 ఇదే కాలంలో ఈ విభాగ ఆదాయం రూ.10,857.23 కోట్లుగా నమోదైంది.
- ✦ హోటళ్ల విభాగం నుంచి రూ.404.44 కోట్లు.. వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా రూ.1,530.86 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది.
- ✦ కాగితం బోర్డులు, కాగితం, ప్యాకేజింగ్ వ్యాపారాదాయం రూ.1,279.60 కోట్లు కాగా.. 2016 అక్టోబరు- డిసెంబరులో రూ.1,335.82 కోట్లుగా ఉంది.

బీఎస్ఈలో షేరు 0.24% పెరిగి రూ.273.50 వద్ద ముగిసింది.

అంచనాలు అందుకోలేదు

- 8% తగ్గిన నికర లాభం
- మధ్యంతర డివిడెండు రూ.1

బెంగళూరు: దేశంలో మూడో అతిపెద్ద సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ విప్రో అంచనాలకు అనుగుణంగా రాణించలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ.1,931.3 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ నికరలాభం రూ.2,109.6 కోట్ల కంటే ఇది 8.4 శాతం తక్కువ. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.13,687.8 కోట్ల నుంచి స్వల్పంగా తగ్గి రూ.13,669 కోట్లకు చేరింది. ఐటీ సేవల విభాగ ఆదాయం 5.8 శాతం అధికమై రూ.13,000 కోట్ల (2.013 బిలియన్ డాలర్లు)కు చేరింది. రెండో త్రైమాసికంతో పోలిస్తే ఈ ఆదాయంలో పెద్దగా మార్పులేదు. సమీక్షిస్తున్న త్రైమాసికంలో కంపెనీ ఆదాయం అంచనాలను అందుకోలేదు. ఆదాయం 2.014 బిలియన్ డాలర్ల నుంచి 2.054 బిలియన్ డాలర్ల మధ్య ఉండొచ్చని అంచనా వేసింది. మార్చితో ముగిసే నాలుగో త్రైమాసికంలో ఐటీ సేవల విభాగ ఆదాయం 2,033 మిలియన్ డాలర్ల నుంచి 2073 మిలియన్ డాలర్ల మధ్య ఉండొచ్చని కంపెనీ అంచనా వేస్తోంది. ఐటీ సేవల మార్జిన్ 14.8 శాతం ఉందని కంపెనీ తెలిపింది. ఒక ఖాతాదారుకు సంబంధించి రూ.317.5 కోట్లు (49.7 మిలియన్ డాలర్లు) కేటాయించడం మార్జిన్‌పై ప్రభావం చూపిందని వివరించింది. లేకుంటే ఐటీ సేవల మార్జిన్ 17.2 శాతం వద్ద మెరుగ్గా ఉందని వెల్లడించింది. రూ.2 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.1 (50 శాతం) మధ్యంతర డివిడెండు చెల్లించేందుకు కంపెనీ ఆమోదం తెలిపింది.



విప్రో

బీఎస్ఈలో షేరు 0.74% లాభంతో రూ.328.45 వద్ద ముగిసింది.

మధ్యంతర డివిడెండు రూ.2

- లాభం రూ.2194 కోట్లు
- 8 శాతం పెరిగిన ఆదాయం

దిల్లీ: అక్టోబరు- డిసెంబరు త్రైమాసికానికి హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ రూ.2,194 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ ఆర్జించిన రూ.2,070 కోట్లతో పోలిస్తే ఇది 6% ఎక్కువ. మొత్తం ఆదాయం రూ.11,814 కోట్ల నుంచి 8.4 శాతం వృద్ధితో రూ.12,808 కోట్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆదాయం, మార్జిన్ అంచనాలను చేరుకుంటామని కంపెనీ ధీమా వ్యక్తం చేయడం గమనార్హం. స్థిర మారకంలో ఆదాయం 10.5- 12.5 శాతం, నిర్వహణ మార్జిన్ 19.5-20.5 శాతం వృద్ధి చెందొచ్చని కంపెనీ గత ఏడాది జులైలో అంచనా వేసింది. డాలర్ల ప్రాతిపదికన చూస్తే.. కంపెనీ నికర ఆదాయం 11.2 శాతం వృద్ధితో 340.3 మిలియన్ డాలర్లకు, ఆదాయం 13.9 శాతం వృద్ధితో 1.98 బిలియన్ డాలర్లకు చేరాయి. రూ.2 ముఖవిలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.2 మధ్యంతర డివిడెండును కంపెనీ ప్రకటించింది. సమీక్ష త్రైమాసికంలో కంపెనీలో కొత్తగా 251 మంది చేరారు. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 1,19,291 కు చేరింది. ఐటీ సేవల విభాగంలో వలసలు 15.2 శాతం నమోదయ్యాయి. అమెరికా వ్యాపారాదాయంలో 16.6%, ఐరోపా, ఇతర దేశాల వ్యాపారాదాయంలో 2.5% చొప్పున వృద్ధి ఉంది. ఆర్థిక సేవలు 10.6%, తయారీ 21%, లైఫ్‌సైన్సెస్, ఆరోగ్య సంరక్షణ 9.7%, రిటైల్, సీపీజీ 13.1% మేర ఆదాయ వృద్ధి సాధించాయి. పబ్లిక్ సర్వీసెస్ విభాగం స్వల్పంగా పెరగ్గా, టెలి కమ్యూనికేషన్స్, మీడియా, పబ్లిషింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ 6.8% మేర క్షీణించాయి. 'గత త్రైమాసికాన్ని మెరుగ్గా ముగించాం. స్థిర మారక విలువ ప్రకారం.. రెండో త్రైమాసికంతో పోలిస్తే 3.3 శాతం, గత ఏడాదితో పోలిస్తే 11.2 శాతం వృద్ధి నమోదు చేశాం' అని హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ అధ్యక్షుడు, సీఈఓ సి. విజయ్ కుమార్ పేర్కొన్నారు. అన్ని సేవా విభాగాల్లోనూ డిసెంబరు త్రైమాసికంలో 20 ఒప్పందాలను కుదుర్చుకున్నామని తెలిపారు.



హెచ్‌సీఎల్ టెక్

బీఎస్ఈలో షేరు 0.30% లాభంతో రూ.957.75 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ ▲ 251
35512

నిఫ్టీ ▲ 78
10895

రూపాయి 64.84 ▲ (ఒక అమెరికా డాలరుకు) 02 పైసలు

బంగారం 30,175 ▲ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 120

వెండి 38,885 ▼ ముంబయిలో కిలో రూ.లలో 05

ముడి చమురు 68.66 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)

ప్రధాన ప్రపంచ మార్కెట్లు


సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	25,975	−43
నాస్‌డాక్	7,320	+24
నిక్కీ 225 (జపాన్)	23,808	+45
హాంగ్‌సెంగ్ (హాంకాంగ్)	32,255	+133
షాంఘై(చైనా)	3,489	+14
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,731	+30
డాక్స్ (జర్మనీ)	13,433	+153

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	57.93	67.17
పౌండ్ స్టెర్లింగ్	80.58	93.44
యూరో	71.02	82.37
జపనీస్ యెన్/100	52.22	60.56
ఆస్ట్రేలియా డాలరు	46.41	53.71
సింగపూర్ డాలరు	43.91	52.02
థాయ్ బాత్/100	18.18	217.47
బహ్రెయిన్ దీనార్	156.87	179.77
కువైట్ దీనార్	175.05	218.06
సౌదీ రియాల్	15.40	18.26
యూఏఈ దిర్హమ్	15.76	18.43
మలేసియా రింగిట్	14.41	17.71
చైనీస్ యువాన్	7.04	11.42



శుక్రవారం నిఫ్టీ కదలికలు



ఈనాడు బిజినెస్

ఐఎస్‌బీ బోర్డు కొత్త ఛైర్మన్ హరీశ్ మన్వానీ



ఈనాడు, హైదరాబాద్: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ఎగ్జిక్యూటివ్ బోర్డు కొత్త ఛైర్మన్‌గా హరీశ్ మన్వానీ నియమితులయ్యారు. 2018 ఏప్రిల్ నుంచి ఆయన ఈ బాధ్యతలు చేపడతారు. 2011 ఏప్రిల్ నుంచి ఐఎస్‌బీ బోర్డు ఛైర్మన్‌గా ఆది గోద్రేజ్ ఉన్నారు. ఆయన పదవీ కాలం ముగియడంతో ముంబయిలో శుక్రవారం సమావేశమైన ఐఎస్‌బీ బోర్డు హరీశ్ మన్వానీని నియమించింది. హిందుస్థాన్ యునిలీవర్‌కు హరీశ్ మన్వానీ నాన్-ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా పని చేస్తున్నారు. 2006 ఏప్రిల్ నుంచి ఆయన ఐఎస్‌బీ బోర్డులో సభ్యుడిగా ఉన్నారు. ఛైర్మన్ బాధ్యతలను అప్పగించడం తనకు లభించిన గౌరవంగా భావిస్తున్నానని, ఐఎస్‌బీని మరింత ఉన్నత స్థితికి తీసుకువెళ్లడానికి బోర్డు సభ్యులు, డీన్‌తో కలిసి పని చేస్తానని మన్వానీ అన్నారు.

ఏడో వారమూ లాభాలే

- కొత్త రికార్డు స్థాయిలకు సూచీలు
- కలిసొచ్చిన ఆర్థిక ఫలితాలు

సమీక్ష



సూచీల రికార్డుల జోరు కొనసాగింది. కంపెనీల త్రైమాసిక ఫలితాలు అంచనాల కంటే మిన్నగా వెలువడుతుండటం, 29 వస్తువులు, 54 విభాగాల్లో సేవలపై జీఎస్‌టీ రేట్లను జీఎస్‌టీ మండలి తగ్గించడంతో సెంటిమెంటు సానుకూలంగా మారింది. బ్యాంకింగ్ షేర్ల దూకుడు కొనసాగడంతో నిఫ్టీ ఇంట్రాడేలో 10,900 పాయింట్ల మైలురాయిని అధిగమించింది. మొత్తంమీద మార్కెట్లు జోరు వరుసగా ఏడో వారమూ కొనసాగింది. సెన్సెక్స్ 919.19 పాయింట్లు, నిఫ్టీ 213.45 పాయింట్లు చొప్పున లాభాలు నమోదు చేశాయి. ఆసియా మార్కెట్లు సానుకూలంగా ముగియగా, ఐరోపా మార్కెట్లు లాభాల్లో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 35,399.11 పాయింట్ల వద్ద లాభాల్తో ప్రారంభమైంది. వెంటనే నష్టాల్లోకి జారుకున్న సూచీ.. 35,221.16 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. అనంతరం కొనుగోళ్ల మద్దతుతో బలంగా పుంజుకున్న సెన్సెక్స్.. ఇంట్రాడేలో 35,542.17 పాయింట్ల వద్ద జీవనకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 251.29 పాయింట్లు పెరిగి 35,511.58 వద్ద ముగిసింది. సెన్సెక్స్ గత అత్యధిక ముగింపు 35,260.29 పాయింట్లను అధిగమించింది. గత మూడు సెషన్లలో సెన్సెక్స్ ఏకంగా 740.53 పాయింట్లు లాభపడటం విశేషం. నిఫ్టీ సైతం 10,906.85 దగ్గర జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. చివరకు 77.70 పాయింట్ల లాభంతో 10,894.70 దగ్గర స్థిరపడింది. నిఫ్టీకి ఇది రికార్డు ముగింపే.

✦ బయోసిమిలర్ల తయారీ, అభివృద్ధి కోసం సాండోజ్‌తో భాగస్వామ్యం కుదురుకున్న నేపథ్యంలో బయోకాన్ షేరు దూసుకెళ్లింది. ఇంట్రాడేలో 6.61 శాతం లాభంతో రూ.575.30 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని తాకిన షేరు.. చివరకు 5.61 శాతం లాభంతో రూ.569.85 వద్ద ముగిసింది.

✦ ఆకర్షణీయ ఫలితాల నేపథ్యంలో ఐటీ సంస్థ సైయెంట్ ఇంట్రాడేలో 16.18 శాతం పరుగులు తీసింది. చివరకు 12.42 శాతం లాభంతో రూ.653.10 దగ్గర స్థిరపడింది.

✦ మెరుగైన త్రైమాసిక ఫలితాలు ప్రకటించడంతో అదానీ పోర్ట్స్ షేరు 4.68 శాతం పెరిగి రూ.433.75 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 22 లాభాలతో ముగిశాయి. అదానీ పోర్ట్స్ 4.68%, యెస్ బ్యాంక్ 2.37%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.15%, ఎస్‌బీఐ 2.08%, టీసీఎస్ 1.53%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.39%, యాక్సిస్ బ్యాంక్ 1.12%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.09%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1%, ఎల్ అండ్ టీ 0.97%, డాక్టర్ రెడ్డీస్ 0.89%లు రాణించిన వాటిల్లో ఉన్నాయి. ఇన్ఫోసిస్ (0.82%), సన్‌ఫార్మా (0.79%), పవర్‌గ్రిడ్ (0.61%), మారుతీ సుజుకీ (0.40%)లు నష్టాలు చవిచూశాయి. రంగాల వారీ సూచీల్లో బ్యాంకింగ్ 1.52%, స్థిరాస్తి 1.26%, మౌలిక 1.19%, పీఎస్‌యూ 1.06%, యంత్ర పరికరాలు 0.92%, లోహ 0.91% చొప్పున రాణించాయి.

ప్రైస్ వాటర్‌హౌస్‌పై సెబీ నిషేధం..
స్టేకు శాట్ నిరాకరణ
ప్రస్తుత ఖాతాదార్లకు సేవలందించొచ్చు

ముంబయి: ప్రైస్ వాటర్‌హౌస్(పీడబ్ల్యూ)పై సెబీ విధించిన రెండేళ్ల నిషేధంపై స్టే ఇవ్వడానికి సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రైబ్యునల్(శాట్) నిరాకరించింది. కొత్త ఖతాదార్లకు సేవలు అందించడానికి కూడా అనుమతులు ఇవ్వలేదు. అయితే ప్రస్తుత ఖాతాదార్లకు ఈ ఆర్థిక సంవత్సరానికి సేవలు కొనసాగించవచ్చు. సత్యం కుంభకోణంలో ఈ ఆడిటింగ్ కంపెనీ పాత్ర నేపథ్యంలో ఈనెల 10న సెబీ నిషేధ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి విదితమే. దీనిపై శాట్‌ను పీడబ్ల్యూ ఆశ్రయించగా, సెబీ నిషేధంపై స్టే ఇవ్వడానికి నిరాకరిస్తూ తదుపరి విచారణను ఫిబ్రవరి 13కు వాయిదా వేసింది.

పీడబ్ల్యూ, ఆ సంస్థ నెట్‌వర్క్‌లోని ఇతర సంస్థలు 2017-18కి చేపడుతున్న ఆడిట్ వ్యవహారాలపై సెబీ అలా ఆదేశాలు ఇచ్చి ఉండకూడదని శాట్ ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలోనే జనవరి 1, 2018తో ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరాన్ని పాటించే ఖాతాదార్లపై సెబీ ఆదేశాలు ప్రభావం చూపవని కూడా శాట్ స్పష్టం చేసింది. ఇప్పటికే తమ వద్ద ఉన్న సర్టిఫికేషన్ పనులను(ఆడిట్ మినహా) పూర్తి చేయడానికి పీడబ్ల్యూకు స్వేచ్ఛ ఉందని శాట్ తెలిపింది. అయితే కొత్త ఖాతాదార్లు, కొత్త సేవలను చేపట్టడానికి వీలులేదని వివరించింది. ప్రస్తుతం తన వద్ద ఉన్న ఖాతాదార్ల వివరాలను తమకు, సెబీకి అందజేయాలని ఆదేశించింది. సెబీకి వ్యతిరేకంగా చేసిన పిటిషన్‌పై పరిష్కారాన్ని సాధ్యమైనంత త్వరగా చూపుతామని శాట్ పేర్కొనడంపై పీడబ్ల్యూ హర్షం వ్యక్తం చేసింది.

ఐసీఎస్ఐ ఉపాధ్యక్షుడు ఆహ్లాదరావు



ఈనాడు, హైదరాబాద్: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) అధ్యక్షుడిగా మకరంద్ లీలే, ఉపాధ్యక్షుడిగా హైదరాబాద్‌కు చెందిన వి.ఆహ్లాదరావు ఎన్నికైనట్లు ఐసీఎస్ఐ వెల్లడించింది. శుక్రవారం వీరు బాధ్యతలు స్వీకరించారు. 2018కి ఈ పదవుల్లో ఉంటారు. మకరంద్ 1992 నుంచి కంపెనీ సెక్రటరీగా సేవలు అందిస్తున్నారు. ఆహ్లాదరావు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి సైన్స్‌లో పట్టా పొందారు. అక్కడే మాస్టర్ ఆఫ్ లా చేశారు. పాండిచ్చేరి విశ్వవిద్యాలయంలో ఫైనాన్షియల్ మేనేజిమెంట్‌లో ఉన్నత విద్యను అభ్యసించారు.

హైదరాబాద్ చాప్టర్‌కు..: హైదరాబాద్ చాప్టర్ ఛైర్‌పర్సన్‌గా శాఖమూరి. కవితా రాణి ఎన్నికయ్యారు. ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీగా ఆమెకు 14 సంవత్సరాల అనుభవం ఉందని ఐసీఎస్ఐ, హైదరాబాద్ చాప్టర్ పేర్కొంది. ఇటీవల జరిగిన మేనేజింగ్ కమిటీ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. కవితా రాణి గత ఏడేళ్లుగా మేనేజింగ్ కమిటీలో సభ్యురాలిగా ఉన్నారు. వైస్ ఛైర్‌పర్సన్, కార్యదర్శి, కోశాధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. వైస్ ఛైర్మన్‌గా రాహుల్ జైన్, కార్యదర్శిగా కె.పి.సి.రావు ఎన్నికయ్యారు.

22,834 హోండా కార్లు వెనక్కి
జాబితాలో అకార్డ్, సిటీ, జాజ్

దిల్లీ: హోండా దేశవ్యాప్తంగా వివిధ మోడళ్లకు చెందిన 22,834 కార్లను వెనక్కి పిలిపించింది. తకాటా కంపెనీ తయారు చేసిన ఎయిర్‌బ్యాగ్‌లను సరి చేసేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో భారత్‌లో ఇప్పటిదాకా కంపెనీ 3.13 లక్షల వాహనాలను రీకాల్ చేసినట్లయింది. ప్రస్తుతం హోండా భారత్‌లో తన పూర్తి స్థాయి అనుబంధ సంస్థ హోండా కార్స్ ఇండియా(హెచ్‌సీఐఎల్) ద్వారా విక్రయాలు జరుపుతోంది. తాజాగా వెనక్కి పిలిపించిన కార్లన్నీ 2013లో తయారైన మోడళ్లే. కంపెనీ వివరాల ప్రకారం.. 510 అకార్డ్, 22,084 సిటీ, 240 జాజ్ కార్లు రీకాల్ చేసిన జాబితాలో ఉన్నాయి.

రీట్స్, ఇన్విట్స్‌లో 25% దాకా పెట్టుబడులు పెట్టొచ్చు
వ్యూహాత్మక మదుపర్లకు సెబీ అనుమతులు

దిల్లీ: స్థిరాస్తి పెట్టుబడుల ట్రస్టులు(రీట్స్), మౌలిక పెట్టుబడుల ట్రస్టు(ఇన్విట్స్)లను మరింత ఆకర్షణీయంగా మార్చడం కోసం నమోదిత బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు), అంతర్జాతీయ ఆర్థిక సంస్థల వంటి వ్యూహాత్మక పెట్టుబడుదారులు వాటిలో 25 శాతం దాకా పెట్టుబడులు పెట్టడానికి సెబీ అనుమతించింది. అంటే ఆయా స్థిరాస్తి, మౌలిక ట్రస్టుల మొత్తం పరిమాణంలో 25 శాతం దాకా వ్యూహాత్మక పెట్టుబడుదార్లు పెట్టుబడులు పెట్టొచ్చు. 'వ్యూహాత్మక పెట్టుబడిదారు(లు), సంయుక్తంగా లేదా పలువురు కలిసి 5 శాతానికి తక్కువ కాకుండా.. 25 శాతానికి మించకుండా(ఆఫర్ పరిమాణంలో) పెట్టుబడులు పెట్టొచ్చ'ని సెబీ పేర్కొంది.

మార్కెట్ కబుర్లు

✦ ఎయిర్ కండీషనర్ల తయారీ సంస్థ **అంబర్ ఎంటర్‌ప్రైజెస్** తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు చివరి రోజున 165.31 రెట్ల స్పందన లభించింది. గురువారం వరకు 3.61 రెట్లు మాత్రమే స్పందన కనిపించగా.. ఆఖరి రోజు ఇది 165.31 రెట్లకు పెరగడం గమనార్హం. సంస్థాగత మదుపర్ల విభాగంలో 175.82 రెట్లు, సంస్థాగతేతర మదుపర్ల విభాగంలో 521.71 రెట్లు, చిన్న మదుపర్ల నుంచి 11.42 రెట్లు చొప్పున స్పందన లభించింది.

✦ ఇర్కాన్ ఇంటర్నేషనల్ నుంచి రూ.360.58 కోట్ల విలువైన ఆర్డరు లభించిందని **దిలీప్ బిల్డ్‌కాన్** తెలిపింది.

✦ డీటీహెచ్ సంస్థ భారతీ టెలి మీడియాలో 25 శాతం వాటాను తన పూర్తి స్థాయి అనుబంధ సంస్థ నెట్టెల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు **భారతీ ఎయిర్‌టెల్** బదిలీ చేయనుంది. ఈ లావాదేవీ జరిగే తేదీపై ఇంకా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని కంపెనీ తెలిపింది.

✦ **గెలాక్సీ సర్ఫేక్టెంట్స్** తొలి పబ్లిక్ ఆఫర్‌కు (ఐపీఓ) రూ.1,470- 1480ను ధరల శ్రేణిగా నిర్ణయించారు. ఈ నెల 29న ఈ ఐపీఓ ప్రారంభమై 31న ముగుస్తుంది.

✦ స్పెక్ట్రమ్, టవర్లు, ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్, వైర్‌లెస్ మౌలిక సదుపాయాల విక్రయానికి అనుమతివ్వాలని వాటాదార్లకు **ఆర్‌కామ్** విజ్ఞప్తి చేసింది.

✦ ట్రావెల్ న్యూస్ సర్వీసెస్ ఇండియాను రూ.100 కోట్లకు కొనుగోలు చేయనున్నట్లు కిశోర్ బియానీ నేతృత్వంలోని **ఫ్యూచర్ రిటైల్** వెల్లడించింది. రిటైల్ వ్యాపార కార్యకలాపాల విస్తరణకు ఈ లావాదేవీ దోహదం చేస్తుందని తెలిపింది.

✦ **టాటా స్టీల్** రూ.12,800 కోట్ల రైట్స్ ఇష్యూ వచ్చే నెల 14న ప్రారంభమై 28న ముగుస్తుంది.

వినియోగించని మొత్తాలను వాపసు ఇవ్వండి
ఆర్‌కామ్‌కు ట్రాయ్ ఆదేశాలు

దిల్లీ: మొబైల్ ప్రీపెయిడ్ చందాదార్లు నగదు చెల్లించీ, వినియోగించని మొత్తాలను, పోస్ట్‌పెయిడ్ చందాదార్లు సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించిన నగదును వాపసు చేయాలని రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్), దాని అనుబంధ సంస్థ రిలయన్స్ టెలికాంలను టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ ఆదేశించింది. డిసెంబరు 29 నుంచి 2జీ జీఎస్ఎం, సీడీఎంఏ సేవలను ఈ సంస్థలు నిలిపిన సంగతి విదితమే. నవంబరులోనే ఈ విషయాన్ని ప్రకటించడంతో, 2.58 కోట్ల మంది చందాదార్లు వేరే నెట్‌వర్క్‌లకు మొబైల్ నెంబరు పోర్టబులిటీ ద్వారా మారారు. ఆ నెలాఖరుకు ఆర్‌కామ్‌కు 3.55 కోట్ల మంది చందాదార్లు మిగిలారు. వేరే నెట్‌వర్క్‌లకు వెళ్లిన వారికి, ఇతరులకు కూడా మిగిలిన నగదు చెల్లించాలని ట్రాయ్ ఆదేశించింది. ప్రీపెయిడ్ వారికి ఫిబ్రవరి 15 లోగా, పోస్ట్‌పెయిడ్ చందాదార్లకు మార్చి 31లోగా తిరిగివ్వాలి.

చిన్న పరిశ్రమ పెట్టాలనుకుంటున్నారా..

ఈనాడు, హైదరాబాద్: జౌళి సంచులు, పేపర్ ప్లేట్లు, ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ పరికరాల వంటి ఉత్పత్తులు తయారు చేయడానికి చిన్న, మధ్య స్థాయి పరిశ్రమ ఏర్పాటు చేయాలనుకునే వారికి యూనిట్ ఏర్పాటు, రుణ సమీకరణ, సంబంధిత పరిశ్రమల నుంచి సలహాలు, సూచనలు ఇచ్చేందుకు సన్‌రియో అఖిల భారత ఎంఎస్ఎంఈ వరల్డ్ ఎక్స్‌పో 2018 పేరుతో 'ఎంఎస్ఎంఈ వరల్డ్' ప్రదర్శన నిర్వహించనుంది. హైదరాబాద్ ఈసీఐఎల్‌లోని జాతీయ చిన్న పరిశ్రమల కార్పొరేషన్‌లో ఈనెల 27, 28 తేదీల్లో ఈ ప్రదర్శన జరుగుతుందని ఎంఎస్ఎంఈ వరల్డ్ వ్యవస్థాపకుడు గంపా శ్రీకాంత్ తెలిపారు. కొత్తగా సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి (ఎంఎస్ఎంఈ) పరిశ్రమ ఏర్పాటు చేయాలంటే.. అందుకు కావాల్సిన సమాచారం అంతా ఇస్తామన్నారు. చిన్న పరిశ్రమల ఏర్పాటులో మహిళల సాధికారత, చిన్న పరిశ్రమలకు క్రెడిట్ రేటింగ్ ఆవశ్యకత వంటి అంశాలపై చర్చలు జరుగుతాయి.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు

(కోట్ల రూపాయల్లో)


కంపెనీ	నికర లాభం/(నష్టం) 2017–18	నికర లాభం/(నష్టం) 2016–17	మొత్తం ఆదాయం 2017–18	మొత్తం ఆదాయం 2016–17
హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్	207.32	180.63	5,419.99	4,534.79
జేఎం ఫైనాన్షియల్(కన్సా)	168.10	118.60	837.73	593.97
కన్సాయ్ నెరోలాక్	125.15	123.96	1,164.77	1,168.44
జుబిలెంట్ ఫుడ్‌వర్క్స్	66.02	19.97	798.50	662.37
పీసీ జువెలర్	162.71	106.97	2,690.42	2,121.28
జేపీ అసోసియేట్స్	148.10	1,095.02	1,139.21	1,648.87
ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్	452.10	450.00	6,855.63	5,746

ఇండియాబుల్స్ హౌసింగ్



రూ.1250.95 వద్ద ప్రారంభమై రూ.1244.30- 1308.80 మధ్య కదలాడి, క్రితం ముగింపు రూ.1243.70తో పోలిస్తే రూ.58.10 (4.67%) లాభంతో రూ.1301.80 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 23,23,606.

అంబుజా సిమెంట్స్




రూ.276 వద్ద మొదలై రూ.266.40- 276.55 మధ్య చలించి, క్రితం ముగింపు రూ.275.65తో పోలిస్తే రూ.7.05 (2.56%) నష్టంతో రూ.268.60 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 19,42,776 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)		52 వారాల కనిష్ఠం (రూ.లలో)	
టీసీఎస్	2982.00	సీఎల్ ఎడ్యుకేట్	277.00
జుబిలెంట్ ఫుడ్‌వర్క్స్	2112.90	బలరామ్‌పూర్ చీనీ	121.75
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1959.90	మాక్స్ ఇండియా	113.50
హెచ్‌సీఎల్ టెక్నాలజీస్	967.00		

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

తేదీ	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	దేశీయ మదుపర్లు (డీఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
19/01	6,015	5,117	988	3,716	3,506	210
18/01	9,015	7,120	1,895	4,396	5,053	−657
17/01	7,883	7,258	625	4,688	4,520	169

19వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	402	వరంగల్	404
చిల్లరగా(ఒక గుడ్డు)	4.60	విశాఖపట్నం	412
బెంగళూరు	405	చెన్నై	410
20న		చిత్తూరు	403
విజయవాడ/గోదావరి	412	నమక్కల్	395

ఎన్ఎస్ఈ

శుక్రవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 433.45 (416.25) 7588904
AMBUJA CEMEN 268.60 (275.65) 1942776
ASIAN PAINTS 1189.90 (1188.25) 722692
AUROBIND PHA 643.20 (645.85) 3438426
AXIS BANK LT 590.25 (584.80) 3897048
BAJAJ AUTO L 3210.40 (3201.20) 143928
BAJAJ FINANC 1701.90 (1660.70) 974597
BHARTI AIRTE 497.90 (495.00) 8982201
BHARTI INFRA 346.05 (343.80) 7653870
BOSCH LTD 19976.15 (19903.70) 15241
BPCL 477.30 (470.25) 3908165
CIPLA 602.75 (603.65) 818518
COAL INDIA L 284.00 (283.05) 2574759
DR. REDDYS 2490.35 (2461.50) 240896
EICHER MOTOR 28009.45 (27954.40) 32459
GAIL 468.75 (468.50) 3365073
HCL TECH 958.30 (954.25) 2374219
HDFC 1901.25 (1896.80) 2833442
HDFC BANK 1952.20 (1934.30) 2863997
HERO MOTOCOR 3589.75 (3593.35) 295410
HINDALCO IND 258.00 (253.90) 5898314
HINDUSTAN UN 1362.45 (1356.95) 1491194
HPCL 416.20 (411.75) 2808244
ICICI BANK 353.60 (346.15) 18812611
INDIABULLS H 1301.80 (1243.70) 2323606
INDIAN OIL 385.95 (378.05) 4136950
INDUSINDBANK 1684.00 (1680.10) 497099
INFOSYS LTD 1143.45 (1152.70) 2994139
ITC 274.55 (273.40) 25710521
KOTAK MAHIND 1060.55 (1046.50) 4304314
LARSEN & TOU 1371.45 (1360.80) 2127776
LUPIN 924.10 (921.05) 1343268
M&M 765.40 (759.25) 2005133
MARUTI SUZIK 9323.95 (9368.70) 542339
NTPC LTD 172.75 (172.15) 3197248
ONGC 193.70 (194.10) 5046015
POWER GRID C 196.10 (197.00) 4546247
RELIANCE IND 931.30 (919.70) 4559564
SBI 309.25 (303.25) 18461642
SUN PHARMA 572.10 (576.70) 4693971
TATA CONSULT 2959.30 (2918.20) 910000
TATA MOTORS 418.05 (418.95) 3894062
TATA STEEL L 753.00 (751.75) 3217972
TECH MAHINDR 552.90 (552.65) 1951962
ULTRATECH 4300.00 (4408.65) 311100
UPL LIMITED 802.35 (800.50) 1023467
VEDANTA LIMI 331.65 (326.70) 7650044
WIPRO 328.95 (325.35) 1608101
YES BANK LTD 349.35 (341.20) 21425789
ZEE ENTERTAI 600.35 (595.85) 1852650

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1585.85 (1541.90) 105094
ACC 1829.50 (1839.00) 267132
ASHOK LEYLAN 121.05 (120.90) 9786893
AVENUE SUPER 1144.35 (1135.45) 240807
BAJAJ FINSER 4973.05 (4922.60) 110406
BANK OFBAROD 165.40 (162.35) 8533716
BEL 172.75 (171.10) 1848347
BHEL 97.55 (97.45) 4371119
BRITANNIA 4684.45 (4631.50) 65593
CADILA HEALT 441.55 (437.60) 1331752
COLGATE PALM 1150.95 (1159.20) 135295
CONTAINER 1473.65 (1439.10) 457207
CUMMINS INDI 903.30 (906.20) 200329
DABUR INDIA 363.80 (364.65) 565302
DLF LIMITED 249.30 (250.20) 6511361
EMAMI LIMITE 1262.25 (1261.15) 31629
GLAXOSMI CON 6641.40 (6625.65) 12242
GLAXOSMI PHA 2473.60 (2473.25) 15802
GLENMARK PHA 624.30 (625.75) 320742
GODREJ CONSU 1050.95 (1035.15) 641915
HAVELLS INDI 547.60 (552.10) 977335
HINDUSTAN ZI 299.35 (308.30) 2349471
ICICI PRU LI 429.70 (412.45) 7344109
IDEA CELLULR 102.30 (101.10) 10480663
INTERGLOBE A 1210.60 (1191.30) 209948
JSW STEEL LT 282.10 (279.80) 3291487
LIC HOUS.FIN 562.00 (551.85) 1239016
MARICO LIMIT 314.10 (311.00) 488384
MCDOWELL 3713.95 (3683.50) 350646
MOTHERSON 382.30 (378.80) 1094491
MRF 69156.00 (68804.45) 7715
NHPC LTD 29.85 (29.45) 5989066
NMDC LTD 146.40 (143.80) 2747379
OIL INDIA 374.65 (376.00) 377289
ORACLE FIN S 4094.05 (4026.65) 16975
P&G HYG&HEAL 9415.90 (9394.30) 8893
PETRONET LNG 237.05 (235.85) 3574679
PIDILITE IND 890.35 (893.20) 185507
PIRAMAL ENTE 2793.95 (2758.70) 113371
PNB 176.40 (170.50) 21519974
POWER FIN CO 120.20 (119.25) 5320281
RURAL ELEC C 156.45 (152.95) 5260279
SAIL 93.30 (92.30) 12912880
SHREE CEMENT 18354.60 (18421.60) 14943
SHRIRAM TRAN 1428.00 (1456.30) 553986
SIEMENS 1299.35 (1297.40) 240579
SUN TV LTD 1050.20 (1039.00) 1066033
TATA POWER 92.20 (90.60) 4545029
TITAN IND 891.45 (885.85) 1483177
TORRENT PHAR 1430.50 (1430.90) 84651

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 230.05 (232.90) 2444981
ADANI ENTERP 199.70 (195.25) 14032888
ADANI POWER 38.05 (36.95) 15908701
ALL BANK 70.80 (69.90) 2265859
AMARA RAJA 825.00 (832.70) 265376
ANANT RAJIND 71.30 (71.90) 2277589
ANDHRA BANK 56.50 (55.75) 1904482
APOLLO HOSPI 1139.40 (1116.45) 152932
APOLLO TYRES 264.80 (261.85) 1621095
APTECH 346.15 (351.95) 315861
BAJAJ ELECT. 530.75 (529.70) 341618
BAJAJ HIND 14.75 (14.70) 4979312
BAJAJ HOLDIN 2800.50 (2724.70) 27815
BALAJI TELE 155.25 (156.30) 199277
BALLARPUR IN 16.30 (16.40) 2000414
BALRAMPUR CH 122.70 (125.95) 2225060
BANK OF MAHA 21.00 (21.15) 1232404
BANK OFINDIA 164.95 (160.50) 3467324
BATA INDIA 716.25 (720.80) 553594
BGR ENERGY S 135.65 (135.80) 156833
BHARAT FORGE 735.75 (720.90) 688556
BHUSHAN STEE 64.95 (66.45) 2162348
BIOCON LTD 569.35 (539.60) 8746829
BOMBAY DYE 254.50 (250.10) 6367073
CANARA BANK 362.70 (349.30) 3213833
CEAT LIMITED 1866.85 (1872.35) 329218
CENTRAL BANK 73.80 (73.70) 328477
CHAMBAL FERT 154.40 (157.40) 284811
CHENNAI PETR 446.50 (437.40) 454052
CITY UNIBANK 175.90 (176.80) 408638
CORPO BANK 39.35 (39.55) 208592
COX & KINGS 262.25 (260.50) 168859
D B REALTY L 71.70 (68.40) 1535193
DELTA CORP L 337.30 (324.15) 4695678
DENA BANK 26.10 (25.90) 3014394
DHANALAKBANK 28.75 (29.10) 754078
DIVIS LAB 1098.30 (1090.40) 322347
EDELWEISS CA 280.05 (274.30) 2167017
EID PARRY 358.75 (357.25) 74361
EIH 198.75 (202.60) 235031
ESSAR SHIPPI 28.70 (28.80) 92413
ESTER INDUST 59.60 (62.20) 278840
EXIDE INDUST 221.20 (222.25) 1192245
FEDERAL BANK 103.15 (102.15) 13469524
FINOLEX CABL 741.75 (711.15) 97311
G E SHIP LTD 450.95 (446.65) 118309
GAMMON INFRA 3.95 (3.85) 9669207
GATI LIMITED 137.65 (139.35) 1630314
GAYATRI PROJ 218.70 (214.35) 381388
GITANJALIGEM 68.40 (70.00) 3590855
GMR INFRASTR 22.65 (22.75) 68548824
GODREJ IND 621.85 (609.75) 323086
GRASIM IND 1223.55 (1217.60) 743167
GUJ ALK&CHEM 876.00 (871.40) 85159
GUJ NRE COKE 1.30 (1.35) 1440387
HCL INFOSYS 58.50 (55.85) 3687269
HEXA TECH 350.40 (347.00) 640391
HIMACHAL FUT 32.50 (31.05) 10465278
HOUSING DEV 60.90 (61.60) 14005100
IDBI 60.55 (60.15) 3092832

ఘనం (+)

నిఫ్టీ	19న	మార్పు %
INDIABULLS HSG	1301.80	4.67
ADANI PORT	433.45	4.13
BAJAJ FINANCE	1701.90	2.48
YES BANK	349.35	2.39
ICICI BANK	353.60	2.15
INDIAN OIL CORP	385.95	2.09
SBI	309.25	1.98

గ్రహణం (-)

నిఫ్టీ	19న	మార్పు %
AMBUJA CEM	268.60	-2.56
ULTRATECH CEM	4300.00	-2.46
SUN PHARMA	572.10	-0.80
INFOSYS	1143.45	-0.80
MARUTI SUZUKI	9323.95	-0.48
POWER GRID CORP.	196.10	-0.46
AUROBINDO PHA	643.20	-0.41

IDFC 58.00 (58.90) 19144603
IFCI 30.30 (30.00) 18861440
IL&FS TRANS 81.35 (79.85) 356620
INDBULLS REL 241.40 (230.20) 5406141
INDIA CEM 184.70 (182.45) 6787732
INDIAN BANK 381.25 (376.60) 727977
INDO RAMA SY 48.00 (49.20) 522942
INDRAPRASTHA 311.50 (305.45) 1677440
INGERSOLL-R 819.75 (822.70) 17196
IOB 23.15 (23.10) 766431
IPCA LAB 579.80 (584.75) 115956
IRB INFRA DE 236.85 (239.20) 1624990
J&K BANK 76.15 (76.50) 421849
JAI CORP 187.65 (188.00) 1808817
JAIN IRRIGAT 136.00 (133.10) 14359560
JAYPEE INFRA 15.75 (16.55) 5134545
JET AIRWAYS 793.20 (791.25) 3427052
JINDAL SAW 157.75 (154.80) 2170474
JINDAL STEEL 264.15 (264.35) 16084560
JK LAKSHMI C 433.65 (443.35) 104130
JK PAPER LIM 142.95 (144.95) 1356975
JM FINANCIAL 166.95 (159.55) 3063727
JP ASSOCIATS 21.70 (20.85) 98659778
JSW ENERGY L 91.70 (89.30) 6267547
JUBILANT FOO 2093.30 (1943.35) 5277319
JUBILANT ORG 879.95 (898.60) 1666503
JYOTHY LABS 375.45 (375.70) 610573
JYOTI STRUC 12.00 (12.60) 254656
KARNATA BANK 158.85 (158.00) 3649719
KEC INTL LTD 359.80 (362.05) 415606
KOLTE PATIL 372.75 (368.55) 213503
KPIT CUMMINS 196.65 (192.30) 1383995
L&TFIN.HOLD 172.25 (171.10) 2484342
LAK VIL BANK 141.65 (141.05) 487574
M & M FINANC 468.60 (474.40) 1913739
MANAPPURAM G 119.65 (115.60) 10146477
MMTC LIMITED 64.20 (64.75) 1017824
MPHASIS LTD 789.55 (794.35) 215672
MRPL 125.95 (126.00) 1012424
MTNL 25.95 (26.25) 2107761
NAGARJUNA OI 4.25 (4.30) 932229
NCC LIMITED 126.70 (123.25) 6478859
NETWORK18 FI 54.60 (54.55) 891222
NEULAND LAB 880.80 (876.80) 20593
NIIT LTD 106.55 (106.15) 744325
NIIT TECHNOL 728.05 (693.20) 2243894
OMAXE LTD 228.35 (228.85) 201733
ONMOBILE GLO 57.70 (58.95) 723950
ORIENTALBANK 122.80 (120.85) 1519990
PARSVNATH DE 25.10 (26.15) 304741
PATEL ENGG 80.60 (79.75) 472596
PFIZER 2123.00 (2100.30) 33049
POLARIS SOFT 411.75 (406.55) 99971
POWERTRADING 115.90 (114.40) 1310709
PRAJ IND 112.90 (113.25) 1142726
PRISM CEMENT 141.90 (139.25) 1977994
PUNJ LLOYD 23.55 (23.80) 1931733
PUNJAB & SIN 47.35 (47.15) 53273
PURAVANKARA 147.65 (148.95) 376810
PVP VENTURES 8.50 (8.90) 132986
PVR LIMITED 1469.05 (1457.15) 104438
RADICO KHAIT 365.55 (341.50) 4861617
RAJESH EXPOR 821.95 (830.90) 425954
RALLIS INDIA 266.80 (265.45) 415091
RAMCO IND 304.70 (301.15) 161988
RAMCO SYS 511.05 (517.30) 22144
RAMKY INFRA 223.40 (225.30) 111542
RAYMOND 1081.90 (1062.00) 373026
RELIANCE CAP 529.25 (526.15) 7654131
RELIANCE COM 29.45 (29.35) 120503938
RELIANCE INF 517.85 (506.50) 3445081
RELIANCE POW 48.90 (48.70) 23589935
ROLTA INDIA 68.50 (70.70) 1919170
SAGAR CEMENT 1048.65 (1069.50) 10153
SAREGAMA 786.35 (788.05) 132376
SHANTHI GEAR 156.30 (155.60) 15505
SHIPPNG CORP 88.90 (90.55) 910244
SHREE RENUKA 15.95 (15.85) 2812606
SINTEX IND 24.20 (23.90) 4171905
SOBHA DEVELO 535.85 (545.45) 276089
SOUTHINDBANK 32.25 (31.80) 8753963
STERLITE TEC 376.05 (389.45) 1803541
SUN PHARMA 496.85 (494.90) 196774
SUND FASTNER 556.15 (542.50) 158579
SUZLON ENERG 15.10 (14.85) 35398031
SYND. BANK 78.95 (77.15) 3927672
TATA CHEM 724.65 (728.65) 644579
TATA COFFEE 159.90 (156.40) 633628
TATA COMMUN 633.85 (634.10) 373829
TATA GLOBAL 308.35 (305.45) 3653286
TATA METALIK 883.95 (882.55) 175968
TATA MOT DVR 243.70 (242.60) 1883916
THE INDIAN H 142.45 (140.60) 793174
TORRENT POWE 302.80 (292.95) 2871058
TRIVENI ENGG 70.25 (73.60) 928622
TTK PRESTIGE 8644.00 (8505.60) 29934
TV TODAY NET 452.70 (450.50) 176032
TV18 BROADCA 59.45 (59.70) 6435198
TVS MOTOR 715.20 (719.95) 465416
UCO BANK 31.20 (31.05) 631908
UNION BANK 141.35 (137.90) 3300807
UNITECH 9.05 (8.80) 41552319
UNITED BANK 17.75 (17.80) 376749
UNITED BREWE 1096.05 (1081.15) 295009
USHA MARTIN 28.40 (27.50) 1562184
VADILAL INDU 921.45 (919.05) 8924
VENKYS 2455.45 (2493.60) 54491
V-GUARD IND 239.65 (235.15) 892810
VIJAYA BANK 66.70 (65.10) 820399
VIP 362.50 (362.30) 419099
VOLTAS 618.20 (600.45) 1348469
ZEE LEARN LI 45.85 (44.85) 726554
ZUARI GLOBAL 212.20 (214.40) 102521
ZYDUS WELLNE 1103.40 (1112.00) 6158

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 895.90 (907.35) 7093
AMAR RAJA BA 824.50 (832.40) 16404
ANDHRA BANK 56.40 (55.70) 124549
ANDHRA CEMEN 13.16 (13.39) 123640
ANDHRA PAPER 364.55 (357.95) 26914
ANDHRA PETRO 64.70 (63.05) 79590
ANDHRA SUGAR 671.90 (654.90) 10525
ASTRA MICROW 116.20 (115.80) 58527
AUROBINDO PH 643.35 (645.85) 124042
AVANTEL SOFT 478.20 (499.75) 10105
AVANTI FEEDS 2459.60 (2433.55) 8281
BALAJI AMIN 694.05 (691.35) 10398
BARTRONICS 14.57 (14.65) 16610
BHAGIRA CHEM 328.75 (321) 2548
BHAGYA NAG 44.30 (44.30) 20445
BRILLIANT SE 16.14 (16.98) 534117
CAMBRIDGE TE 96.95 (98.90) 10473
COMBAT DRUGS 27.40 (27.40) 589
CONT COFFEE 294.15 (287.15) 7188
COROMAN FERT 572.80 (556.60) 8138
CYBERMATE 3.63 (3.76) 53446
CYIENT LIMIT 653.10 (580.95) 236529
DIVI'S LAB 1095.50 (1086.90) 16903
DR REDDY 2487.50 (2465.65) 27108
FOUR SOFT 106.75 (96.95) 47588
GATI CORPN 137.40 (139.40) 293332
GAYATRI PROJ 218.30 (213.45) 30032
GMR INFRASTR 22.65 (22.75) 6055616
GOLDST INFRA 215.55 (213.55) 15834
GRANULES (I) 135.90 (136.05) 130705
GVK POWER 22.05 (23.10) 1435598
HBL NIFE POW 63.90 (64.30) 234275
HERITAGE FOO 802.65 (804.05) 1541
HIND FLUROCA 15.62 (14.89) 19993
HYD INDUS 1654.80 (1536.65) 10201
ILFS ENGINEE 47.85 (48.75) 11633
INNAREDY COM 5.52 (5.81) 15690
IVRCL INFRAS 5.84 (5.99) 327110
KAKATIYA CEM 384.30 (391.60) 7682
KAVERI SEED 510.30 (511.95) 40403
KCP LTD 149.40 (150.15) 29379
KNR CONSTRUC 302.55 (306.80) 27589
LANCO INDUS 397.35 (396.50) 40760
LANCO INFRAT 2.05 (2.15) 3813466
LAURUS LABS 542.70 (537.95) 15014
MADHUCON PRO 33.50 (33.75) 29309
MIC ELECTRON 8.86 (9.07) 96388
MOLD-TEK.TEC 71.80 (71.80) 9537
MOLDTK PLA 354.80 (337.50) 40347
NAGARJAGRICH 56.85 (57.15) 37276
NATCO PHARMA 1014.85 (1005.75) 27906
NAVA BH VENT 165.10 (167.40) 61760
NCC 126.30 (123.20) 419670
NCL IND 282.20 (279.25) 22958
NETTLINX 87.80 (89.55) 15861
NEULAND LAB 878.25 (873.80) 2108
NIHAR INFO 14.50 (14.50) 233
PANYAM CEMEN 61.60 (61.55) 8703
PENNER IND 63.65 (64.90) 99075
PIONEER DIST 203.10 (202.70) 4376
PITTI LAMIN 95.90 (96.15) 12912
PRISM CEMENT 142.10 (139.50) 417319
PRUDENTL PHA 4.94 (5.06) 488361
RAIN INDUSTR 432.45 (419.10) 859148
SAGAR CEM 1050.90 (1070.80) 2000
SAMKRG PIST 336.80 (340.60) 8014
SAMPRE NUTRI 82.60 (85.50) 5313
SATVAH. ISPA 31.35 (31.80) 4592
SMS PHARMA 101.60 (100.75) 15253
SREE RAYAL A 71.35 (70.60) 408149
STEEL EXCHAN 34.30 (35.55) 51608
SUJANA UNIVE 1.11 (1.16) 107186
SUVEN PHARMA 198.60 (200.45) 59475
TAJ GVK HOTE 185.65 (181.90) 27292
TANLA 39.20 (38.80) 161865
TERA SOFTWAR 65.15 (67.35) 2930
VICEROY HOTE 18.95 (19.15) 86286
VIMTA LABS 174.45 (173.40) 3400
VISAKA IND 769.85 (773.90) 37931
VIVIMED LABS 94.95 (96.20) 194307
ZENTECH 127 (127.90) 34260

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ఆర్థిక శాఖ

10 సంవత్సరాల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్టాక్ (సెక్యూరిటీలు) 2028 యొక్క వేలము

మొత్తము	: రూ. 900.00 కోట్లు
జారీ ధర	: ప్రతి రూ. 10,000.00కు రూ. 10,000.00
కాలపరిమితి	: 10 సంవత్సరాలు
బిడ్లు స్వీకరణ పద్ధతి	: అన్ని కాంపిటేటివ్ మరియు నాన్-కాంపిటేటివ్ బిడ్లు ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఆర్‌బీఐ కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ (E-Kuber) సిస్టమ్ మీద 23 జనవరి 2018న దాఖలు చేయవలెను.

పైన తెలిపిన రుణం కొరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము నోటిఫికేషన్లను కోరుతున్నది. పూర్తి వివరాలను భారతీయ రిజర్వు బ్యాంకు, హైదరాబాద్ మరియు ముంబయి నుండి ప్రభుత్వ వ్యాపార వేళల్లో పొందవచ్చును.

ముద్దాడ రవిచంద్ర
స్పెషల్ చీఫ్ సెక్రెటరీ టు గవర్నమెంట్ (FAC),
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము.

DIPR No. 3075/ CL/ADVT/1/1/2017-18

ఛాంపియన్స్



శుభ్‌మన్ గిల్ (90 నాటౌట్)

అండర్‌-19 వన్డే ప్రపంచకప్‌లో యువ భారత్‌ ఆధిపత్యం కొనసాగుతోంది. టోర్నీలో భారత కుర్రాళ్లు ఎదురే లేకుండా దూసుకెళ్తున్నారు. తొలి మ్యాచ్‌లో టోర్నీ ఫేవరెట్లలో ఒకటైన ఆస్ట్రేలియాను 100 పరుగుల తేడాతో మట్టికరిపించి.. రెండో మ్యాచ్‌లో పసికూన పపువా న్యూ గినియాను 10 వికెట్ల తేడాతో చిత్తు చేసిన భారత్‌.. తమ చివరి లీగ్‌ మ్యాచ్‌లో జింబాబ్వే పైనా చెలరేగింది. 10 వికెట్ల తేడాతో విజయం సాధించి మరోసారి తన ఆధిపత్యాన్ని చాటింది.

ద్యుతికి ఊరట



దిల్లీ: భారత అగ్రశ్రేణి అథ్లెట్‌ ద్యుతి చంద్‌కు కోర్ట్‌ ఆఫ్‌ ఆర్బిట్రేషన్‌ ఫర్‌ స్పోర్ట్స్‌ (సీఏఎస్‌)లో ఊరట లభించింది. అంతర్జాతీయ పోటీల్లో ద్యుతి బరిలో దిగకుండా అడ్డుపడుతున్న అంతర్జాతీయ అథ్లెటిక్స్‌ సమాఖ్య (ఐఏఏఎఫ్‌) నిబంధనలపై విధించిన సస్పెన్షన్‌ను సీఏఎస్‌ మరో ఆర్నెల్లు పొడిగించింది. ఈ ఉత్తర్వులతో రానున్న కామన్వెల్త్‌ క్రీడల్లో పాల్గొనేందుకు ద్యుతికి మార్గం సుగమం అయింది. పురుష హార్మోన్లు అధికంగా ఉన్నాయన్న కారణంగా ద్యుతిపై నిషేధం విధించడంతో 2014 కామన్వెల్త్‌ క్రీడల్లో ఆమె పాల్గొనలేకపోయింది. 2015 జులైలో ఐఏఏఎఫ్‌ నిబంధనలపై సీఏఎస్‌ సస్పెన్షన్‌ విధించడంతో ద్యుతి మళ్లీ ట్రాక్‌పై అడుగుపెట్టింది.

కుర్రాళ్లది అదే జోరు..

అండర్‌-19 ప్రపంచకప్‌లో యువ భారత్‌ హవా ● జింబాబ్వేపై పది వికెట్ల విజయం

మౌంట్‌ మౌంగానుయ్‌: అండర్‌-19 ప్రపంచకప్‌ గ్రూప్‌ దశను యువ భారత్‌ అజేయంగా ముగించింది. రెండు వరుస విజయాలతో ఇప్పటికే క్వార్టర్స్‌ బెర్తు ఖరారు చేసుకున్న భారత్‌.. నామమాత్రమైన చివరి లీగ్‌ మ్యాచ్‌లోనూ రెచ్చిపోయింది. అన్ని రంగాల్లోనూ రాణించి భారీ విజయాన్నందుకుంది. గత మ్యాచ్‌లో ఐదు వికెట్ల ప్రదర్శనతో భారత్‌ విజయంలో కీలక పాత్ర పోషించిన స్పిన్నర్‌ అనుకుల్‌ రాయ్‌.. మరోసారి విజృంభించాడు. అతను 20 పరుగులే ఇచ్చి 4 వికెట్లు పడగొట్టగా.. అర్షదీప్‌ సింగ్‌ (2/10), అభిషేక్‌ శర్మ (2/22) కూడా సత్తా చాటడంతో మొదట జింబాబ్వే 48.1 ఓవర్లలో 154 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టులో వెస్లీ (30), షుంబా (36), రోచ్‌ (31) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేశారు. అనంతరం భారత్‌ గత మ్యాచ్‌లో మాదిరే వికెట్‌ నష్టపోకుండా లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. ఇప్పటికే క్వార్టర్స్‌ బెర్తు ఖరారైన నేపథ్యంలో కోచ్‌ రాహుల్‌ ద్రవిడ్‌ను ఈ మ్యాచ్‌కు రెగ్యులర్‌ ఓపెనర్లు పృథ్వీ షా, మన్‌జ్యోత్‌ కల్రాలను కాకుండా హార్విక్‌ దేశాయ్‌, శుభ్‌మన్‌ గిల్‌లతో ఇన్నింగ్స్‌ ఆరంభింపజేసి ప్రయోగం చేశాడు. అది మంచి ఫలితమే ఇచ్చింది. 'మ్యాన్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌' శుభ్‌మన్‌ గిల్‌ (90 నాటౌట్‌; 59 బంతుల్లో 14×4, 1×6) ఆరంభం నుంచి చెలరేగి ఆడాడు. దేశాయ్‌ (56 నాటౌట్‌; 73 బంతుల్లో 8×4, 1×6) కూడా చక్కటి ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. దీంతో భారత్‌ 21.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. లీగ్‌ దశలో మూడుకు మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన భారత్‌.. గ్రూప్‌-బిలో 6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. క్వార్టర్స్‌లో భారత్‌.. బంగ్లాదేశ్‌ను ఢీకొనే అవకాశముంది. మూడు మ్యాచ్‌ల్లో రెండు నెగ్గి 4 పాయింట్లు సాధించిన ఆస్ట్రేలియా రెండో స్థానంతో క్వార్టర్స్‌ బెర్తు సాధించింది.

జింబాబ్వే ఇన్నింగ్స్‌: డొల్లార్‌ (బి) శివమ్‌ మావి 4; వెస్లీ (బి) పరాగ్‌ 30; మైయర్స్‌ (సి) షా (బి) అర్షదీప్‌ 10; షుంబా (స్టంప్డ్‌) దేశాయ్‌ (బి) రాయ్‌ 36; రోచ్‌ (బి) రాయ్‌ 31; చింహిన్యా ఎల్బీ (బి) రాయ్‌ 0; నెన్‌హుంజి ఎల్బీ (బి) అభిషేక్‌ 14; ఫ్రాస్ట్‌ (స్టంప్డ్‌) దేశాయ్‌ (బి) అభిషేక్‌ 7; హారిసన్‌ ఎల్బీ (బి) అర్షదీప్‌ 8; నుంగు (బి) రాయ్‌ 2; కనోలీ నాటౌట్‌ 2; ఎక్స్‌ట్రాలు 10 **మొత్తం:** (48.1 ఓవర్లలో ఆలౌట్‌) **154**

వికెట్ల పతనం: 1-7, 2-36, 3-61, 4-110, 5-110, 6-117, 7-132, 8-143, 9-150

బౌలింగ్‌: శివమ్‌ మావి 7-0-30-1; నాగర్‌కోటి 8-0-35-0; శివ సింగ్‌ 8-1-16-0; అర్షదీప్‌ సింగ్‌ 7-0-10-2; పరాగ్‌ 5-0-17-1; అభిషేక్‌ శర్మ 6-0-22-2; అనుకుల్‌ రాయ్‌ 7.-1-20-4

భారత్‌ ఇన్నింగ్స్‌: హార్విక్‌ దేశాయ్‌ నాటౌట్‌ 56; శుభ్‌మన్‌ గిల్‌ నాటౌట్‌ 90; ఎక్స్‌ట్రాలు 9 **మొత్తం:** (21.4 ఓవర్లలో వికెట్‌ నష్టపోకుండా) **155**

బౌలింగ్‌: రోచ్‌ 6-2-27-0; నుంగు 6-0-44-0; మైయర్స్‌ 2.4-0-26-0; వెస్లీ 2-0-14-0; హారిసన్‌ 1-0-12-0; కనోలీ 1-0-9-0; చింహిన్యా 2-0-20-0; షుంబా 1-0-3-0


ఆసీస్‌ 311 పరుగుల తేడాతో..

అండర్‌-19 ప్రపంచకప్‌ ఆరంభ పోరులో భారత్‌ చేతిలో కంగుతిన్న ఆస్ట్రేలియా.. తర్వాత పుంజుకుంది. రెండో మ్యాచ్‌లో జింబాబ్వేను ఓడించిన ఆ జట్టు.. చివరి లీగ్‌ మ్యాచ్‌లో పపువా న్యూ గినియాపై ఏకంగా 311 పరుగుల తేడాతో భారీ విజయం సాధించి క్వార్టర్స్‌కు అర్హత సాధించింది. మొదట ఓపెనర్‌ నాథన్‌ (156; 111 బంతుల్లో 18×4, 4×6) మెరుపు శతకానికి.. సంఘా (88), పరమ్‌ (61) సమయోచిత ఇన్నింగ్స్‌లు తోడవడంతో ఆసీస్‌ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 370 పరుగులు చేసింది. అనంతరం పేసర్‌ రాల్‌స్టన్‌ (7/15) సంచలన బౌలింగ్‌ ప్రదర్శన చేయడంతో పపువా న్యూ గినియా కేవలం 59 పరుగులకే కుప్పకూలింది. ఇర్ఫాన్‌ పఠాన్‌ (2003లో బంగ్లాదేశ్‌పై 9/16) తర్వాత యూత్‌ వన్డేల్లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన బౌలర్‌గా రాల్‌స్టన్‌ రికార్డులకెక్కాడు. మరోవైపు శ్రీలంకను 3 వికెట్ల తేడాతో ఓడించిన పాకిస్థాన్‌ గ్రూప్‌-డి నుంచి క్వార్టర్స్‌ బెర్తు ఖరారు చేసుకుంది. ఈ గ్రూప్‌ నుంచి అఫ్గానిస్థాన్‌ కూడా ముందంజ వేసింది. శ్రీలంక టోర్నీ నుంచి నిష్క్రమించింది. శనివారం లీగ్‌ దశ పూర్తవుతుంది. క్వార్టర్స్‌లో ఎవరు ఎవరితో తలపడతారన్న దానిపై అప్పుడే పూర్తి స్పష్టత వస్తుంది.

మళ్లీ ఇంగ్లాండే

ఆసీస్‌పై రెండో వన్డేలోనూ విజయం

బ్రిస్బేన్‌: టెస్టు సిరీస్‌లో ఆస్ట్రేలియా చేతిలో చిత్తయిన ఇంగ్లాండ్‌.. వన్డేల్లో మాత్రం చెలరేగి ఆడుతోంది. ఐదు వన్డేల సిరీస్‌లో ఆ జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. రెండో వన్డేలో 271 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్‌ ఇంకో 34 బంతులుండగానే 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. మొదట ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 270 పరుగులు చేసింది. ఓపెనర్‌ ఆరోన్‌ ఫించ్‌ (106; 114 బంతుల్లో 9×4, 1×6) సెంచరీ సాధించాడు. పార్ట్‌టైం స్పిన్నర్‌ జో రూట్‌ (2/31) ఆసీస్‌ను దెబ్బ తీశాడు. అనంతరం బెయిర్‌స్టో (60; 56 బంతుల్లో 9×4), హేల్స్‌ (57; 60 బంతుల్లో 7×4, 1×6), రూట్‌ (46 నాటౌట్‌), బట్లర్‌ (42) రాణించడంతో ఇంగ్లాండ్‌ 6 వికెట్లు కోల్పోయి 44.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. ఆల్‌రౌండ్‌ ప్రదర్శన చేసిన రూట్‌ 'మ్యాన్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌'గా ఎంపికయ్యాడు.



జో రూట్‌


లంకకు మరో పరాభవం

ఢాకా: వరుస ఓటములతో ఉక్కిరిబిక్కిరవుతున్న శ్రీలంకకు మరో పరాభవం. ముక్కోణపు సిరీస్‌లో భాగంగా గత మ్యాచ్‌లో జింబాబ్వే చేతిలో పరాజయం చవిచూసిన లంక.. ఈసారి బంగ్లాదేశ్‌ చేతిలో 163 పరుగుల తేడాతో చిత్తయింది. మొదట బంగ్లా.. 50 ఓవర్లలో 7 వికెట్లకు 320 పరుగులు చేసింది. తమిమ్‌ (84), షకిబ్‌ (67), రహీం (62) రాణించారు. ఛేదనలో షకిబ్‌ (3/47), మొర్తజా (2/30), రుబెల్‌ హుస్సేన్‌ (2/20)ల ధాటికి లంక 157 పరుగులకే ఆలౌటైంది.

కివీస్‌ క్లీన్‌స్వీప్‌

ఐదో వన్డేలోనూ ఓడిన పాక్‌

వెల్లింగ్టన్‌: పాక్‌తో ఐదు వన్డేల సిరీస్‌ను న్యూజిలాండ్‌ క్లీన్‌ స్వీప్‌ చేసింది. శుక్రవారం చివరి వన్డేలో 15 పరుగుల తేడాతో విజయం సాధించిన కివీస్‌.. 5-0తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. టాస్‌ గెలిచి బ్యాటింగ్‌ చేసిన న్యూజిలాండ్‌... 50 ఓవర్లలో 7 వికెట్లకు 271 పరుగులు చేసింది. ఓపెనర్‌ మార్టిన్‌ గప్టిల్‌ (100; 126 బంతుల్లో 10×4, 1×6) సెంచరీ చేయగా.. రాస్‌ టేలర్‌ (59; 73 బంతుల్లో 3×4) కూడా రాణించాడు. టేలర్‌, గప్టిల్‌ మూడో వికెట్‌కు 112 పరుగులు జోడించి జట్టును భారీ స్కోరు దిశగా నడిపారు. కానీ తర్వాత పాక్‌ బౌలర్లు పుంజుకొని 12 పరుగుల తేడాతో నాలుగు వికెట్లు తీసి కివీస్‌ భారీ స్కోరు చేయకుండా అడ్డుకున్నారు. పాక్‌ బౌలర్లలో రాయిస్‌ (3/67), అష్రఫ్‌ (2/49) సత్తా చాటారు. ఛేదనలో పాక్‌ను హెన్రీ (4/53) దెబ్బ తీశాడు. ఆ జట్టు 49 ఓవర్లలో 256 పరుగులకు ఆలౌటైంది. హారిస్‌ సొహైల్‌ (63; 87 బంతుల్లో 5×4), షాదాబ్‌ఖాన్‌ (54; 77 బంతుల్లో 5×4) రాణించినా.. మిగతా బ్యాట్స్‌మెన్‌ చేతులెత్తేయడంతో పాక్‌కు ఓటమి తప్పలేదు.



గప్టిల్‌

సైని ఎందుకో..?

దక్షిణాఫ్రికాకు నవ్‌దీప్‌, శార్దూల్‌



నవ్‌దీప్‌ సైని

జోహన్నెస్‌బర్గ్‌: దిల్లీ యువ పేస్‌ సంచలనం నవ్‌దీప్‌ సైనితో పాటు ముంబయి పేసర్‌ శార్దూల్‌ ఠాకూర్‌ను దక్షిణాఫ్రికాతో మూడో టెస్టు ముంగిట భారత జట్టు యాజమాన్యం దక్షిణాఫ్రికాకు పిలవడం ఆసక్తి రేపుతోంది. వీరిని నెట్‌ బౌలర్లుగా ఉపయోగించుకోవడానికి రప్పిస్తున్నట్లు చెబుతున్నప్పటికీ.. నిజంగా కారణం అదేనా అన్న సందేహాలు కలుగుతున్నాయి. భారత జట్టు భవిష్యత్‌ పేసర్‌గా ప్రశంసలు అందుకుంటున్న సైనిని మూడో టెస్టులో ఆడిస్తారేమో అన్న చర్చ కూడా నడుస్తోంది. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో ఎంపికయిన శార్దూల్‌ను అక్కడి పరిస్థితులకు అలవాటుపడేందుకు ముందే పిలిచారని భావిస్తున్నారు. ఐతే సైనిని పిలిపించడమే సందేహాలు రేకెత్తిస్తోంది. "పేస్‌ విభాగంలో ప్రయోగాలు చేసేందుకు, బౌలర్లను రొటేట్‌ చేసేందుకు సైని అవసరమవుతాడు. ఇటీవల జరిగిన సెలక్షన్‌ కమిటీ సమావేశంలో అతడి పేరు ప్రస్తావనకు వచ్చింది. అతడిని పరీక్షించడానికి ఇది మంచి అవకాశం. త్వరలోనే అతను భారత జట్టుకు ఆడే అవకాశాన్ని కొట్టిపారేయలేం" అని టీమ్‌ఇండియా సహాయ బృందంలో ఒకరు తెలిపారు. టెస్టు సిరీస్‌ ఆరంభానికి ముందు సిరాజ్‌, అంకిత్‌ రాజ్‌పుత్‌, థంపిలతో పాటు సైని దక్షిణాఫ్రికాకు వెళ్లాల్సింది. ఐతే రంజీ ట్రోఫీ ఫైనల్‌ ఆడాల్సి ఉండటంతో అతను ఆగిపోయాడు. రంజీ ట్రోఫీలో సైని 30 వికెట్లతో సత్తా చాటాడు. దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో తుది జట్టు ఎంపికపై కోహ్లి ఇప్పటికే చాలా విమర్శలు ఎదుర్కొన్నాడు. మరి నామమాత్రమైన మూడో టెస్టుకు కోహ్లి ఎలాంటి మార్పులతో బరిలోకి దిగుతాడో చూడాలి.

వైట్‌వాష్‌ తప్పదు



జోహానెస్‌బర్గ్‌: భారత్‌ను 3-0తో వైట్‌వాష్‌ చేయడమే తమ లక్ష్యమని దక్షిణాఫ్రికా ఫాస్ట్‌ బౌలర్‌ కాగిసో రబాడ అన్నాడు. "ఏ మ్యాచ్‌లోనైనా గెలుపే ప్రధానం. అందుకే భారత్‌తో చివరి టెస్టులోనూ గెలిచి వైట్‌వాష్‌ చేయాలనుకుంటున్నాం. మూడో టెస్టు జరిగే వాండరర్స్‌ పిచ్‌ పేస్‌, బౌన్స్‌, స్వింగ్‌కు స్వర్గధామం. మా జట్టు ఒకరిద్దరు ఆటగాళ్లపై ఆధారపడినట్లే టీమ్‌ఇండియా కెప్టెన్‌ కోహ్లిపైనే ఆధారపడుతుంది. అలా అని భారత జట్టులో నాణ్యమైన ఆటగాళ్లు లేరని అర్థం కాదు. కానీ అందరికంటే విరాట్‌ ఎక్కువ పరుగులు చేస్తాడనేది వాస్తవం. అతడి లాంటి బ్యాట్స్‌మెన్‌కు బౌలింగ్‌ చేయడాన్ని ఆస్వాదిస్తున్నా. ఈ సిరీస్‌కు భారత్‌ సన్నాహకం ఎలా ఉందన్నది మాకు ముఖ్యం కాదు.. ఆ జట్టును ఓడించడమే ప్రధానం" అని రబాడ చెప్పాడు.



చెన్నైలో ధోని

మన బౌలర్లు 20 తీశారుగా..

చెన్నై: దక్షిణాఫ్రికాపై టెస్టు సిరీస్‌ను చేజార్చుకుని విమర్శలు ఎదుర్కొంటున్న భారత జట్టుకు మాజీ కెప్టెన్‌ ధోని అండగా నిలిచాడు. ఈ సిరీస్‌లో సానుకూల అంశాలూ ఉన్నాయని, బౌలర్లు అద్భుతంగా రాణించిన విషయం మరువొద్దని ధోని అన్నాడు. ''ఓటమిపై కాకుండా సానుకూల అంశాలపై దృష్టి పెట్టండి. టెస్టు మ్యాచ్‌ గెలవాలంటే 20 వికెట్లు తీయాలి. మన బౌలర్లు ఆ పని చేశారు. ఒకవేళ 20 వికెట్లు తీయలేని పక్షంలో డ్రా గురించి ఆలోచించాలి. వికెట్లు తీయకుంటే తక్కువ పరుగులు చేసినా, భారీ స్కోరు సాధించినా డ్రా కోసం చూడాల్సిందే. మ్యాచ్‌లో ప్రత్యర్థిని రెండు సార్లు ఆలౌట్‌ చేయకుంటే స్వదేశంలో అయినా, విదేశాల్లో అయినా టెస్టు గెలవలేం. మన బౌలర్లు 20 వికెట్లు తీశారంటే.. మనం ఎప్పుడూ గెలిచే స్థితిలోనే ఉన్నామని అర్థం. ఒక్కసారి పరుగులు చేయడం మొదలుపెడితే విజయం మనదే" అని ధోని అన్నాడు. రెండేళ్ల నిషేధం తర్వాత తిరిగి ఐపీఎల్‌లోకి ప్రవేశిస్తున్న చెన్నై సూపర్‌కింగ్స్‌ (సీఎస్కే) తరపున ఆడనుండడం సంతోషంగా ఉందని అతను చెప్పాడు. "ఐపీఎల్‌లో సూపర్‌కింగ్స్‌ కాకుండా వేరే ఫ్రాంఛైజీ తరపున ఆడాలని నేనెప్పుడూ అనుకోలేదు. చెన్నై నాకు రెండో ఇల్లు లాంటిది. ఇక్కడి అభిమానులు నన్ను సొంతమనిషిలా చూస్తారు. వేరే జట్లకు చెందిన చాలా మంది నన్ను సంప్రదించారు కానీ చెన్నైకే ఆడతానని చెప్పాను. సూపర్‌కింగ్స్‌ ఉండగా వేరే జట్ల తరపున ఆడాలనే ఆలోచనే లేదు" అని ధోని చెప్పాడు.

అశ్విన్‌ కోసం ప్రయత్నిస్తాం..: అశ్విన్‌ను తిరిగి జట్టులోకి తీసుకోవాలనే లక్ష్యంతో సూపర్‌కింగ్స్‌ వచ్చే ఐపీఎల్‌ వేలంలో పాల్గొంటుందని ధోని తెలిపాడు. "అశ్విన్‌ను వేలంలో తిరిగి దక్కించుకోవడం కష్టమైన విషయమే. కానీ అందుకోసం కచ్చితంగా ప్రయత్నిస్తాం. మాకు రెండు 'రైట్‌ టు మ్యాచ్‌' అవకాశాలున్నాయి. ఇప్పటికే ముగ్గురు భారత ఆటగాళ్లు జట్టులో ఉండడంతో ఆ అవకాశాన్ని అశ్విన్‌ విషయంలో ఉపయోగించుకోవాలని అనుకోవట్లేదు. అతణ్ని మామూలుగా వేలంలోనే దక్కించుకుంటాం" అని ధోని అన్నాడు. చెన్నై జట్టు ధోనితో పాటు జడేజా, సురేశ్‌ రైనాలను అట్టిపెట్టుకున్న సంగతి తెలిసిందే.


బౌలింగ్‌ కోచ్‌గా బాలాజీ: చెన్నై సూపర్‌కింగ్స్‌ బౌలింగ్‌ కోచ్‌గా బాలాజీని ఎంపిక చేసినట్లు ఆ జట్టు యాజమాన్యం శుక్రవారం ప్రకటించింది. ప్రధాన కోచ్‌గా స్టీఫెన్‌ ఫ్లెమింగ్‌, బ్యాటింగ్‌ కోచ్‌గా మైకేల్‌ హసి వ్యవహరించనున్నారు.

టీమ్‌ఇండియాకు అండగా నిలుద్దాం: భజ్జీ

కోల్‌కతా: దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌ ఓడిన భారత జట్టుకు సీనియర్‌ స్పిన్నర్‌ హర్భజన్‌ సింగ్‌ కూడా మద్దతిచ్చాడు. "మెరుగవ్వాలని ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో జట్టుకు అండగా నిలుద్దాం. వాళ్లు అనుకున్నంత బాగా ఆడలేదు. అంతే కదా.. ఈసారి కాకపోతే వచ్చేసారి బాగా ఆడతారు. నేర్చుకోవడానికి ఇది గొప్ప అవకాశం. తిరిగి పుంజుకుంటారనే నమ్మకం ఉంది. ఒకరితో ఇంకొకర్ని పోల్చడం నాకిష్టం ఉండదు. సందర్భానికి తగ్గట్లు ఎవరికి వారు అద్భుతంగా ఆడతారు. కెప్టెన్సీ బాధ్యతతో కూడుకున్న విషయం. ఇప్పటి వరకూ కోహ్లి దాన్ని విజయవంతంగా మోస్తున్నాడు. ప్రస్తుత సిరీసే అతనికి నిజమైన విదేశీ సవాలు. అచ్చం మనలాంటి పరిస్థితులే ఉండే శ్రీలంకను విదేశం అనలేను" అని హర్భజన్‌ తెలిపాడు.

ప్రీక్వార్టర్స్‌లో నాదల్‌

- మార్తా పోరాటానికి తెర
- దిమిత్రోవ్‌, సిలిచ్‌ ముందంజ
- ఆస్ట్రేలియన్‌ ఓపెన్‌



మార్తా

17వ గ్రాండ్‌స్లామ్‌పై కన్నేసిన స్పెయిన్‌ యోధుడు రఫెల్‌ నాదల్‌ ఆస్ట్రేలియన్‌ ఓపెన్లో మరో అడుగు ముందుకేశాడు. అతను అలవోకగా ప్రీక్వార్టర్స్‌లో అడుగు పెట్టాడు. మరోవైపు మూడో రౌండ్‌ చేరి సంచలనం సృష్టించిన 15 ఏళ్ల మార్తా కొస్తుక్‌ (ఉక్రెయిన్‌) పోరాటం ముగిసింది. దిమిత్రోవ్‌, కిర్గియోస్‌, సిలిచ్‌ ప్రీక్వార్టర్స్‌లోకి ప్రవేశించారు.

మెల్‌బోర్న్‌: ఆస్ట్రేలియన్‌ ఓపెన్లో స్పెయిన్‌ బుల్‌ రఫెల్‌ నాదల్‌ దూసుకెళ్తున్నాడు. అతను పెద్దగా కష్టపడకుండానే ప్రీక్వార్టర్‌లో అడుగుపెట్టాడు. గురువారం పురుషుల సింగిల్స్‌ మూడో రౌండ్లో నాదల్‌ 6-1, 6-3, 6-1తో జుముర్‌ (బోస్నియా)ను చిత్తు చేశాడు. ఈ మ్యాచ్‌లో నాదల్‌ ముందు జుముర్‌ ఏ దశలోనూ నిలువలేకపోయాడు. ఈ పోరులో ఏడుసార్లు ప్రత్యర్థి సర్వీస్‌ బ్రేక్‌ చేసిన రఫా... 28 విన్నర్లు కొట్టాడు. ప్రత్యర్థి ఆరు డబుల్‌ఫాల్ట్‌లు చేయగా.. నాదల్‌ ఒక్క తప్పు కూడా చేయలేదు. మరోవైపు దిమిత్రోవ్‌ (బల్గేరియా), కిర్గియోస్‌ (ఆస్ట్రేలియా) కూడా ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించారు. మూడో సీడ్‌ దిమిత్రోవ్‌ 6-3, 4-6, 6-4, 6-4తో రుబ్‌లెవ్‌ (రష్యా)ను ఓడించగా.. హోరాహోరీ సాగిన పోరులో కిర్గియోస్‌ 7-6 (7-5), 4-6, 7-6 (8-6), 7-6 (7-5)తో సోంగా (ఫ్రాన్స్‌)పై గెలిచాడు. ఆరో సీడ్‌ మారిన్‌ సిలిచ్‌, పదో సీడ్‌ కారెనో బుస్టా (స్పెయిన్‌) కూడా ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. సిలిచ్‌ 7-6 (7-4), 6-3, 7-6 (7-4)తో హారిసన్‌ (అమెరికా)పై గెలవగా.. బుస్టా 7-6 (7-4), 4-6, 7-5, 7-5తో ముల్లర్‌ (లక్సెంబర్గ్‌)పై నెగ్గాడు. నువ్వా నేనా అన్నట్లు సాగిన మరో పోరులో ఆండ్రియస్‌ సెప్పి (ఇటలీ) 6-3, 7-6 (7-4), 6-7 (3-7), 6-7 (5-7), 9-7తో క్రొయేషియా పొడగరి కార్లోవిచ్‌ (క్రొయేషియా)ను ఓడించాడు. దాదాపు నాలుగు గంటల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో కార్లోవిచ్‌ 52 ఏస్‌లు సంధించగా.. సెప్పి 23 కొట్టడం విశేషం. ఎడ్మండ్‌ (బ్రిటన్‌), స్క్వాట్జ్‌మన్‌ (అర్జెంటీనా) కూడా ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టారు.

ఆమె జోరుకు బ్రేక్‌: 15 ఏళ్లకే ఆస్ట్రేలియన్‌ ఓపెన్లో మూడో రౌండ్‌ చేరి ప్రకంపనలు రేపిన ఉక్రెయిన్‌ అమ్మాయి మార్తా కొస్తుక్‌ జోరుకు అడ్డుకట్ట పడింది. మూడో రౌండ్లో ఆమె తన దేశానికే చెందిన నాలుగో సీడ్‌ స్వితోలినా చేతిలో 2-6, 2-6తో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో ఐదు ఏస్‌లు కొట్టిన స్వితోలినా.. ఐదుసార్లు మార్తా సర్వీస్‌ బ్రేక్‌ చేసింది. అనుభవం లేకపోవడంతో తడబడిన మార్తా.. 9 డబుల్‌ఫాల్ట్స్‌ చేసి ఓటమి కొనితెచ్చుకుంది. రెండో సీడ్‌ కరోలినా వోజ్నియాకి, పెట్రా మార్టిచ్‌ కూడా ప్రీక్వార్టర్స్‌ చేరారు. వోజ్నియాకి 6-4, 6-3తో కికి బెర్టెన్స్‌ (నెదర్లాండ్స్‌)ను వరుస సెట్లలో ఓడించగా.. మార్టిచ్‌ 6-3, 3-6, 7-5తో కుమ్‌కుమ్‌ (థాయ్‌లాండ్‌)పై విజయం సాధించింది. ఏడో సీడ్‌ వొస్టాపెంకో (లాత్వియా) పోరాటం ముగిసింది. ఆమె 3-6, 6-1, 3-6తో కొంటావిట్‌ (ఇస్తోనియా) చేతిలో పరాజయం పాలైంది. రేబ్రికోవా (స్లొవేకియా), అలెర్టోవా (చెక్‌ రిపబ్లిక్‌), కార్నెట్‌ (ఫ్రాన్స్‌), సురెజ్‌ నవారో (స్పెయిన్‌) కూడా ప్రీక్వార్టర్స్‌ చేరారు.



నాదల్‌

బోపన్న, దివిజ్‌ ముందుకు

పురుషుల డబుల్స్‌లో రోహన్‌ బోపన్న, దివిజ్‌ శరణ్‌ తమ భాగస్వాములతో కలిసి ప్రీక్వార్టర్స్‌ చేరారు. రెండో రౌండ్లో బోపన్న-రోజర్‌ వెస్లిన్‌ (ఫ్రాన్స్‌) 6-2, 7-6 (7-3)తో మేయర్‌ (అర్జెంటీనా)-సౌసా (పోర్చుగల్‌)పై.. దివిజ్‌ శరణ్‌-ఆండీ రామ్‌ (అమెరికా) 4-6, 7-6 (7-4), 6-2తో గ్రానోలర్స్‌ (స్పెయిన్‌)-ఫాగ్‌నిని (ఇటలీ)పై నెగ్గారు.



సముద్రయానంలో కష్టమైనదిగా భావించే కేప్‌హార్న్‌ను దాటాక ఐఎన్ఎస్‌వీ-తరిణిపై ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్న భారతీయ నావికా దళానికి చెందిన మహిళా సిబ్బంది

సేంద్రియ మాంసంతో లాభాల పంట!

- అంతర్జాతీయ మార్కెట్‌లో భారీ డిమాండు
- భారత్‌లో ప్రత్యేకంగా పశువుల పెంపకం
- సేంద్రియ గ్రాసం ద్వారా మాంసం ఉత్పత్తి లక్ష్యం
- మాంసం, గుడ్డు, పాలు.. గుర్తింపు జారీకి కొత్త మార్గదర్శకాలు
- జాతీయ మాంసం పరిశోధన కేంద్రంలో అధ్యయనాలు
- తెలుగు రాష్ట్రాలకూ ఆదాయావకాశాలు..

ఈనాడు - హైదరాబాద్

సేంద్రియ పంటల్లాగే.. పాలు, మాంసం, గుడ్లు కూడా రానున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సేంద్రియ మాంసం, గుడ్లు, పాలకు డిమాండు పెరుగుతున్నందున వాటి ఉత్పత్తికి ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమం చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. మాంసం, పాలు, గుడ్లకు సేంద్రియ విధానంలో ఉత్పత్తి చేసినట్లు ప్రత్యేక 'గుర్తింపు పత్రం' జారీ చేసేందుకు వీలుగా కొత్త మార్గదర్శకాలను కేంద్రం తాజాగా ఆమోదించింది. వీటిని త్వరలో 'భారత వ్యవసాయ, శుద్ధి చేసిన ఆహారోత్పత్తుల ఎగుమతుల మండలి(అపెడా)' అధికారికంగా విడుదల చేయనుంది. ఈ మార్గదర్శకాల తయారీకి జాతీయ స్థాయిలో ఇటీవల కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో హైదరాబాద్‌కు చెందిన 'జాతీయ మాంసం పరిశోధనా కేంద్రం(ఎన్‌ఆర్‌సీఎం)' శాస్త్రవేత్త సైతం సభ్యులుగా ఉన్నారు. దేశంలోనే తొలిసారిగా ఈ కేంద్రం చేపట్టిన సేంద్రియ మాంసం ఉత్పత్తికి గుర్తింపు పత్రాన్ని జారీ చేశారు. హయత్‌నగర్‌లోని జాతీయ మెట్ట పంటల పరిశోధన కేంద్రం ఆవరణలో కొంత స్థలాన్ని తీసుకుని ఎన్‌ఆర్‌సీఎం ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా సేంద్రియ మాంసం ఉత్పత్తికి ప్రత్యేక ప్రాజెక్టుపై పరిశోధనలు చేపట్టారు. ఇక్కడ ఎలాంటి రసాయనాలు లేకుండా పశుగ్రాసాన్ని సాగుచేసి దానినే గొర్రెలకు అందించారు. దాణా తయారీకి సైతం అవసరమైన మొక్కజొన్న ఇతర పంట ఉత్పత్తులను సేంద్రియ ఎరువులతోనే పెంచారు. ఇలా మూడేళ్లపాటు పెంచిన తర్వాత వాటి మాంసానికి గుర్తింపు పత్రం కోసం దరఖాస్తు చేయగా రాజస్థాన్‌లోని జైపుర్‌కు చెందిన అధీకృత సంస్థ గుర్తింపు పత్రాన్ని జారీ చేసింది.



హయత్‌నగర్‌లోని జాతీయ మెట్ట పంటల పరిశోధన కేంద్రం ఆవరణలో ఎన్‌ఆర్‌సీఎం ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా పెంచుతున్న సేంద్రియ గొర్రెలు

పశ్చిమ ఐరోపా, ఉత్తర అమెరికా దేశాల్లో ఈ ఏడాది దాదాపు 15 లక్షల టన్నుల సేంద్రియ మాంసంపై రూ. 57 వేల కోట్ల వ్యాపారం జరుగుతున్నట్లు తాజా అంచనా. 2027 నాటికి అంతర్జాతీయ మార్కెట్‌లో రూ. లక్ష కోట్లకు పైగా విలువైన సేంద్రియ మాంసం అమ్మకాలకు డిమాండు ఉంటుందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. రసాయనాలున్న మాంసోత్పత్తులకు క్రమంగా డిమాండు తగ్గుతున్నందున కేంద్ర ప్రభుత్వం 'జాతీయ సేంద్రియ ఉత్పత్తుల అభివృద్ధి కార్యక్రమం(ఎన్‌పీఓపీ)'ను ప్రత్యేకంగా చేపట్టింది. భారత్‌లో ఎన్‌పీఓపీ కింద గుర్తింపు పొందిన సేంద్రియ ఉత్పత్తులను ఎలాంటి ఆంక్షలు లేకుండా దిగుమతి చేసుకుంటామని అమెరికా ప్రభుత్వం కేంద్రానికి తెలిపింది. ఈ నేపథ్యంలో ఎన్‌ఆర్‌సీఎం ఆధ్వర్యంలో సేంద్రియ మాంసం ఉత్పత్తికి కేంద్రం చర్యలు చేపట్టింది. ఈ గుర్తింపు పత్రం జారీచేయడానికి దేశవ్యాప్తంగా కొన్ని సంస్థలను ఎంపిక చేయడానికి తాజాగా దరఖాస్తులు చేసింది. హైదరాబాద్, బెంగళూరుకు చెందిన రెండు ప్రైవేటు సంస్థలూ ఇందులో ఉన్నాయి.

ఇదీ ప్రక్రియ..

పాలు, గుడ్లు, మాంసానికి సేంద్రియ గుర్తింపు పొందాలంటే అనేక షరతులు పాటించాలి. చేపలు, గొర్రెలు, కోళ్లు, పాడి పశువులకు తొలుత ట్యాగ్‌లిచ్చి వాటి వివరాలు ఆన్‌లైన్‌లో ఫొటోలుసహా నమోదు చేస్తారు. వాటికి గ్రాసం, దాణా పండించే పొలాల్లో రసాయనాలు లేకుండా మూడేళ్లపాటు సాగు చేయాలి. అక్కడ పండించిన వాటినే ఆహారంగా అందిస్తున్నట్లు ఆధారాలు నమోదు చేయాలి. వ్యాధుల నివారణకు సైతం సాధ్యమైనంత వరకూ జీవ మందులే ఇవ్వాలి. పాలు, గుడ్లు, మాంసం నమూనాలను మూడేళ్లపాటు ప్రయోగశాలల్లో పరీక్షించిన తర్వాత సదరు కేంద్రంలో ఉత్పత్తి చేసిన వాటికి సేంద్రియ గుర్తింపు పత్రం దక్కుతుంది. మాంసం ఎగుమతుల్లో ప్రపంచంలోనే రెండోస్థానంలో ఉన్న భారత్‌కు సేంద్రియ వ్యాపారం కూడా ఊపందుకుంటే భారీగా ప్రయోజనాలు సమకూరే అవకాశం ఉంది. తెలుగు రాష్ట్రాల నుంచి కోడి మాంసం, గుడ్లు, ఇతర మాంసం ఎగుమతులు భారీగా ఉంటున్నందున ఇక్కడి రైతులూ అధికాదాయం పొందేందుకు మంచి అవకాశముంది.

ఆకర్షణీయ నగరాల ప్రాజెక్టులో మరో తొమ్మిది పట్టణాలు

దిల్లీ: ఆకర్షణీయ నగరాల ప్రాజెక్టులో కొత్తగా మరో తొమ్మిది పట్టణాలు చేరాయి. దీంతో ఈ సంఖ్య 99కి చేరుకుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని బరేలీ, మురాదాబాద్, సుహారన్‌పుర్.. తమిళనాడులోని ఇరోడ్, బిహార్‌లోని బిహార్‌శరీఫ్, దాదార్‌నగర్ హవేలీలోని సిల్వాసా, లక్షద్వీప్‌లోని కవారతీ, అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఈటానగర్, దామన్ దీవిలోని దీవి పట్టణాలకు తాజాగా ఈ అదృష్టం దక్కింది. నాలుగోరౌండ్‌లో మొత్తం 15 నగరాలు ప్రతిపాదనలు సమర్పించగా.. తొమ్మిదింటిని ఎంపిక చేసినట్లు కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రి హర్దీప్‌సింగ్ పూరీ తెలిపారు. మరో మూడు నెలల లోపు ప్రతిపాదనలు సమర్పిస్తే.. మేఘాలయలోని శిలాంగ్‌ను ప్రాజెక్టులో వందో నగరంగా చేరుస్తామని పేర్కొన్నారు.

ఆధార్‌తో బహుళ పీఎఫ్ ఖాతాలకు స్వస్తి

కోల్‌కతా: ఆధార్‌తో అనుసంధానం ద్వారా ఒక ఉద్యోగి పేరుతో ఒకే పీఎఫ్ ఖాతా నిర్వహించడానికి వీలు కలిగింది. శుక్రవారం ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో అడిషనల్ సెంట్రల్ పీఎఫ్ కమిషనర్ ఎస్.బి.సిన్హా మాట్లాడుతూ ఆధార్, బ్యాంకు ఖాతాల అనుసంధానంతో ఒకే పేరుతో ఉన్న పలు ఖాతాలను తొలగించినట్లు చెప్పారు. ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ నవేందు రాయ్ మాట్లాడుతూ ఇకపై ఉద్యోగం మారినా పాత ఖాతా కొనసాగుతుందనీ, సార్వత్రిక ఖాతా సంఖ్యను అమలు చేస్తున్నట్లు తెలిపారు. జీవిత ధ్రువ పత్రాల కోసం తమ అధికారులే వృద్ధుల ఇళ్లకు వెళ్తారని అన్నారు.

దేశ జబ్బులను నయం చేసే అత్యుత్తమ వైద్యుడు మోదీ: మేఘ్వాల్

పనాజీ: మనదేశాన్ని పట్టి పీడిస్తున్న రోగాలను నయం చేసే అత్యుత్తమ వైద్యుడిగా ప్రధాని నరేంద్ర మోదీని కేంద్ర జలవనరులశాఖ సహాయమంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ అభివర్ణించారు. పనాజీలో శుక్రవారం నిర్వహించిన 'అంతర్జాతీయ భారత లోహ రీసైక్లింగ్' సదస్సులో మేఘ్వాల్ మాట్లాడారు. అపరిశుభ్రత, అవినీతి, పేదరికం, మతతత్వం, కుల పిచ్చి, ఉగ్రవాదం అనే ఆరు జబ్బులు మనదేశాన్ని పీడిస్తున్నట్లు మోదీ గుర్తించారని చెప్పారు. ఈ రోగాలను నయం చేయగల అత్యుత్తమ వైద్యుడు మోదీ అని వ్యాఖ్యానించారు.

'పద్మావత్'కు సెన్సార్ అనుమతిలో జోక్యానికి సుప్రీంకోర్టు నిరాకరణ

దిల్లీ: వివాదాస్పద 'పద్మావత్' సినిమా విడుదలకు సీబీఎఫ్‌సీ ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. సెన్సార్ అనుమతులు మంజూరయ్యాక తాము జోక్యం చేసుకోలేమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఆ చిత్రం విడుదలైతే పలు రాష్ట్రాల్లో శాంతిభద్రతల పరిస్థితి విషమిస్తుందన్న పిటిషనర్, న్యాయవాది ఎం.ఎల్.శర్మ వాదనలను తోసిపుచ్చింది. శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని స్పష్టం చేసింది. అత్యవసరంగా విచారణ జరపాలన్న పిటిషనర్ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోలేదు.

న్యాయవాది హరీశ్ సాల్వేకు బెదిరింపులు: పద్మావత్ చిత్ర నిర్మాతల తరఫున కోర్టులో వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే కార్యాలయానికి ఓ ఆగంతకుడు ఫోన్ చేసి భౌతిక దాడి జరుపుతామని బెదిరించాడు. అయితే, ఆ హెచ్చరికలతో తమకు సంబంధంలేదని కర్ణి సేన ఒక ప్రకటనలో పేర్కొంది.

ఎన్ఎస్‌జీ నూతన డీజీగా లఖ్టాకియా



దిల్లీ: జాతీయ భద్రత దళం (ఎన్ఎస్‌జీ) నూతన డైరెక్టర్ జనరల్ (డీజీ)గా సీనియర్ ఐపీఎస్ అధికారి సుదీప్ లఖ్టాకియా నియమితులయ్యారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేబినెట్ నియామకాల సంఘం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఎన్ఎస్‌జీ ప్రస్తుత డీజీ ఎస్‌పీ సింగ్ ఈ నెల 31న పదవీవిరమణ పొందనున్నారు. తెలంగాణ క్యాడర్‌కు చెందిన లఖ్టాకియా.. ప్రస్తుతం సీఆర్‌పీఎఫ్ ప్రత్యేక డీజీగా పనిచేస్తున్నారు.

జడ్జి లోయా మృతిపై పిటిషన్ల విచారణ 22న

దిల్లీ: సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి బీహెచ్ లోయా అనుమానాస్పద మృతిపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై విచారణ తేదీని సుప్రీంకోర్టు ధర్మాసనం ఖరారు చేసింది. ఈ నెల 22న విచారణ జరుగుతుందని, రోస్టర్ విధానంలో సముచితమైన ధర్మాసనం ముందుకే ఇది వెళ్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం వెల్లడించింది. కాంగ్రెస్ నేత తెహసీన్ పూనావాలా, మహారాష్ట్ర పాత్రికేయులు బీఎస్ లోనె దాఖలు చేసిన పిటిషన్లపై ఈ నెల 16న జస్టిస్ అరుణ్ మిశ్ర, జస్టిస్ ఎం.ఎం.శంతనగౌడర్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశాలిస్తూ సముచిత ధర్మాసనం విచారణ జాబితాలో వీటిని చేర్చాలని పేర్కొంది. అయితే విచారణ తేదీని మాత్రం వెల్లడించలేదు.

అమిత్ షాకు నేర విముక్తి కల్పించటాన్ని సీబీఐ సవాల్ చేయకపోవటంపై వ్యాజ్యం

ముంబయి: గ్యాంగ్‌స్టర్ సొహ్రాబుద్దీన్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసులో భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్ షాకు నేర విముక్తి కల్పిస్తూ సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పును సీబీఐ హైకోర్టులో సవాల్ చేయకపోవటంపై బాంబే లాయర్స్ అసోసియేషన్ అభ్యంతరం తెలిపింది. దీనికి సంబంధించి బాంబే హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేసింది. 2014 డిసెంబరు 30న వెలువడిన సెషన్స్ కోర్టు తీర్పును ఉన్నత న్యాయస్థానంలో సవాల్ చేయరాదని సీబీఐ నిర్ణయించటం అక్రమం, ఏకపక్షం, దురుద్దేశంతో కూడిన చర్యగా న్యాయవాదుల సంఘం ఆరోపించింది. సెషన్స్ కోర్టు తీర్పును పునఃపరిశీలించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసేలా సీబీఐకి ఆదేశాలివ్వాలని సంఘం హైకోర్టును కోరింది.

'దావోస్‌లో మోదీ, అబ్బాసీల భేటీ ఉండదు'

దిల్లీ: దావోస్‌లో ప్రధాని మోదీ, పాక్ ప్రధాని షహీద్ ఖాకన్ అబ్బాసీతో సమావేశమయ్యే అవకాశాలు లేవు. వారిద్దరి మధ్య ద్వైపాక్షిక సమావేశం నిర్వహించే ఆలోచన ఏదీ లేదని విదేశాంగ శాఖ కార్యదర్శి (ఆర్థిక సంబంధాలు) విజయ్ గోఖలే శుక్రవారం స్పష్టం చేశారు. ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో మోదీ ఈ నెల 23న ప్రసంగించనున్నారు. అదే రోజున పాక్ ప్రధాని కూడా రానుండడం గమనార్హం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సమావేశమవుతారా అన్న ప్రశ్నకు బదులిస్తూ వారిరువురు ఒకే రోజున రావడం లేదని తెలిపారు. ట్రంప్ ప్రసంగానికి హాజరు కాకుండా మోదీ ఏమైనా సంకేతాలు పంపిస్తున్నారా అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ అలాంటిదేమీ లేదన్నారు.

ప్రధానికి రాహుల్ మూడు ప్రశ్నలు

దిల్లీ: ప్రధాని మోదీకి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మూడు ప్రశ్నలు వేశారు. ఈ నెల 28న జరిగే మన్ కీ బాత్ కార్యక్రమానికి సూచనలు ఇవ్వాలని ప్రధాని కోరిన నేపథ్యంలో రాహుల్ ట్విట్టర్ ద్వారా ఈ ప్రశ్నలు సంధించారు. యువకులు ఉద్యోగాలు కల్పించడానికి మీ ప్రణాళిక ఏమిటి? డోక్లాం నుంచి చైనాను పంపించడానికి ఏం చేస్తారు? హరియాణాలో అత్యాచారాలను ఎలా అదుపు చేస్తారని ప్రశ్నించారు.

జీవిత భాగస్వాములకు పనిచేసే అవకాశం కొనసాగించాలి

- హెచ్-1బి వీసాదారులపై టెక్ పరిశ్రమల వాణిజ్య సంఘాల విజ్ఞప్తి

వాషింగ్టన్: హెచ్1బి వీసాదారుల జీవిత భాగస్వాములు కూడా అమెరికాలో చట్టబద్ధంగా పని చేయడానికి ఉన్న అవకాశాన్ని కొనసాగించాలని యాపిల్, మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్, గూగుల్ సంస్థల ఉద్యోగులతో కూడిన వాణిజ్య సంఘాలు ట్రంప్ యంత్రాంగాన్ని కోరాయి. హెచ్-4 కార్యక్రమాన్ని కొనసాగించాల్సిందిగా ట్రంప్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని పౌర, వలస సేవల విభాగానికి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పారిశ్రామిక మండలి, యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, సాఫ్ట్‌వేర్ సేవల సంఘం అయిన బీఎస్ఏ తదితర సంఘాలు లేఖ రాశాయి. గ్రీన్ కార్డుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్న హెచ్1బి వీసాదారుల జీవిత భాగస్వాములు అమెరికాలో చట్టబద్ధంగా పని చేసేందుకు ఈ కార్యక్రమం అనుమతిస్తుంది. ఒబామా హయాంలో తీసుకొచ్చిన ఈ నిబంధన వేల మంది భారతీయులకు సహాయపడింది.

అమెరికా ఉద్యోగార్థులకు అవకాశం లేకుండా పోతోందనే కారణంతో హెచ్1బి వీసాదారుల జీవిత భాగస్వాములకు పని చేసే అనుమతి ఇవ్వరాదన్న నిర్ణయాన్ని అమలు చేయడానికి ట్రంప్ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ప్రస్తుత విధానాల కారణంగా కొన్ని కేటగిరీల వీసాదారుల దరఖాస్తులు పేరుకొని పోతున్నాయని, దేశానికి ఇన్నే వీసాలు అనే కోటా విధానాన్ని తొలగించేందుకు శాసనపరమైన పరిష్కారం కావాలని లేఖలో వాణిజ్యసంఘాలు కోరాయి. నిర్దేశించిన పరిమితికి మించి దరఖాస్తులు ఉన్న దేశాల వారు ఈ కోటా విధానం కారణంగా హెచ్-4వీసా కింద పని చేయడానికి ఏళ్ల తరబడి వేచి చూడాల్సి వస్తోందని పేర్కొన్నాయి. ఈ పరిస్థితుల కారణంగా ఎప్పటి నుంచో పని చేస్తున్న విలువైన ఉద్యోగులు.. జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకునేందుకు తమకు, తమ కుటుంబాలకు అవకాశం కల్పించే దేశాలకు వెళ్లిపోయే అవకాశం ఉందని హెచ్చరించాయి. ఫలితంగా పలు సంస్థలపై ఆర్థికంగా అధిక భారం పడుతుందని, మానవవనరులకు సంబంధించి దీర్ఘకాలిక ప్రణాళికపై ప్రతికూల ప్రభావం పడుతుందని కూడా హెచ్చరించాయి.

సైన్స్, ఇంజినీరింగ్ పట్టభద్రుల తయారీలో అగ్రస్థానాన భారత్

వాషింగ్టన్: సైన్స్, ఇంజినీరింగ్ పట్టభద్రులను తయారుచేయడంలో భారత్ అగ్రస్థానంలో ఉంది. 'ఆన్యువల్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఇండికేటర్స్' పేరుతో అమెరికాలోని నేషనల్ సైన్స్ ఫౌండేషన్ వెల్లడించిన తాజా నివేదిక ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. 2014లో సైన్స్, ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రపంచవ్యాప్తంగా బ్యాచిలర్ పట్టాలు పొందినవారిలో.. నాలుగింట ఒక వంతు మంది భారతీయులేనని పేర్కొంది. ఆ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 75 లక్షల మంది సైన్స్, ఇంజినీరింగ్‌ల్లో బ్యాచిలర్ కోర్సులు పూర్తిచేశారని.. వీరిలో భారతీయులు 25%, చైనీయులు 22%, ఐరోపా సమాఖ్యకు చెందినవారు 12%, అమెరికన్లు 10% ఉన్నారని వెల్లడించింది. ఇటు పరిశోధక (డాక్టోరల్) డిగ్రీల్లో మాత్రం అమెరికానే ముందంజలో ఉంది. 2014లో ఆ దేశంలో 40,000 మంది ఈ పట్టాలు అందుకున్నారు. వరుసగా ఆ తర్వాతి స్థానాల్లో చైనా (34,000), రష్యా (15,000), బ్రిటన్ (14,000), భారత్ (13,000) ఉన్నాయి. ఇటు పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ)కి సంబంధించిన వ్యయం చేయడంలోనూ అమెరికాదే అగ్రస్థానం. ప్రపంచవ్యాప్త వ్యయంలో 26% వాటా అమెరికాదే. 21% వాటాతో చైనా రెండో స్థానంలో ఉంది. మిగతా దేశాలు, ముఖ్యంగా చైనా గణనీయమైన ప్రగతిని సాధిస్తుండటంతో శాస్త్ర సాంకేతిక కార్యాకలాపాల్లో అమెరికా వాటా తగ్గిపోతోందని ఈ నివేదిక వెల్లడించింది.

అమెరికా పౌరసత్వంపై భారతీయుల మక్కువ

వాషింగ్టన్: అమెరికా పౌరసత్వం తీసుకోవడానికి ఇష్టపడుతున్న అర్హులైన వలసదారుల్లో భారత్, ఈక్వెడార్‌కు చెందినవారు అత్యధిక సంఖ్యలో ఉన్నారని తాజా అధ్యయనంలో తేలింది. 2005-2015 మధ్యకాలానికి సంబంధించి ఈ సర్వేను నిర్వహించారు.

- 2005లో అర్హులైన భారతీయ వలసదారుల్లో 69 శాతం మంది అమెరికా పౌరసత్వం తీసుకోవడానికి మక్కువ చూపగా.. 2015లో అది 80 శాతానికి పెరిగింది. తద్వారా 12 పర్సెంటేజీ పాయింట్ల మేర పెరుగుదల నమోదైంది.
- ఇదే కాలానికి సంబంధించి ఈక్వెడార్ కూడా 12 పర్సెంటేజీ పాయింట్లను సాధించింది.
- 2005-2015 మధ్యకాలంలో అమెరికా పౌరసత్వాన్ని తీసుకోవడానికి సిద్ధమైన మొత్తం వలసదారుల పర్సంటేజీ పాయింట్ల కన్నా ఇది చాలా ఎక్కువ. మొత్తం మీద 2005లో అర్హుల్లో 62 శాతం మంది పౌరసత్వానికి మక్కువ చూపగా.. 2015 నాటికి అది 67 శాతానికి పెరిగింది.
- హోండురస్, చైనా, క్యూబాల విషయంలో ఈ శాతం బాగా తగ్గింది.
- 2005లో 1.44 కోట్ల మంది వలసదారులు అమెరికా పౌరసత్వాన్ని తీసుకోగా 2015 నాటికి అది 1.98 కోట్లకు చేరింది.

రజనీ, కమల్ రాజకీయ నేతలు కాలేరు

- మోదీని చాయ్‌వాలా, తక్కువ జాతి అని వ్యాఖ్యానించలేదు
- కేంద్ర మాజీ మంత్రి మణిశంకర్‌అయ్యర్ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ప్రముఖ తమిళ నటులు రజనీకాంత్, కమల్‌హాసన్‌లు పేరొందిన రాజకీయ నాయకులు కాలేరని కాంగ్రెస్ బహిష్కృత నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి మణిశంకర్ అయ్యర్ పేర్కొన్నారు. ప్రధాని మోదీని చాయ్‌వాలా అని సంబోధించలేదని స్పష్టం చేశారు. చిల్లర రాజకీయ ఆరోపణలు మానుకోవాలని పేర్కొంటే.. ప్రధానిని తక్కువ జాతివాడివి అని వ్యాఖ్యానించినట్లు తప్పుడు ప్రచారాలు చేశారని విమర్శించారు. శుక్రవారమిక్కడ 'ఇండియాటుడే' గ్రూపు నిర్వహించిన సదస్సులో పాల్గొని తమిళ రాజకీయాలపై మాట్లాడారు. "అన్నాదురై, కరుణానిధి, జయలలిత, ఎంజీఆర్‌లు ద్రవిడ ఉద్యమంతో సంబంధం ఉన్న నాయకులు. సినిమాను రాజకీయ పరపతికి ఉపయోగించుకున్నారు. శివాజీ గణేశన్, విజయకాంత్ పేరున్న నటులైనా రాజకీయాల్లో రాణించలేకపోయారు. రజనీకాంత్ తమిళనాడులో కాంగ్రెస్ పార్టీని ఓడించవచ్చేమో కానీ ఏ ఇతర పార్టీని ఓడించలేరు." అని పేర్కొన్నారు. ఇక నుంచి ఎన్నికలప్పుడు మీడియాతో మాట్లాడబోనని స్పష్టం చేశారు. దక్షిణాది రాష్ట్రాల్లో పాగా వేసేందుకు, తమిళ రాజకీయాల్లోకి ప్రవేశించేందుకు కొన్ని ద్రవిడ వ్యతిరేక శక్తులు ప్రయత్నిస్తున్నాయని డీఎంకే అధికార ప్రతినిధి మనురాజ్ పేర్కొన్నారు. సినిమాల ప్రభావం తొలుత కొన్ని రోజులు రాజకీయాల్ని నడిపించినా.. తర్వాత పరిస్థితులే నిర్ణయిస్తాయని ఏఐఏడీఎంకే ఎంపీ వి.మైత్రేయన్ పేర్కొన్నారు.



'ఇండియాటుడే' సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి మణిశంకర్ అయ్యర్. చిత్రంలో ఏఐఏడీఎంకే ఎంపీ మైత్రేయన్, దినకరన్ వర్గం నేత పుగజెండి, డీఎంకే అధికార ప్రతినిధి మనురాజ్

లవ్‌జిహాద్ అనలేం..

రెండు మతాల యువతీ, యువకుల మధ్య ప్రేమను లవ్‌జిహాద్ అనే అభిప్రాయానికి రాలేమని కేరళ మాజీ డీజీపీ పీకే హోర్మిస్ అభిప్రాయపడ్డారు. కేరళలో ఐసిస్ సానుభూతిపరుల అరెస్టులు ఎక్కువగా ఉన్నాయన్నారు. గత పదేళ్లలో ఏటా 800 మంది ఇస్లాంలోకి మారారనీ, గత ఏడాదిలో ఈ సంఖ్య 1000గా నమోదైందని కేరళ ఇంటెలిజెన్స్ ఏడీజీపీ టికే వినోద్‌కుమార్ తెలిపారు. కేరళలో లవ్‌జిహాద్ జరుగుతోందని ఓ బాధిత యువతి తల్లి బిందు సంపత్ ఆరోపించారు. దీని కారణంగా మోసపోయిన యువతుల తల్లులు ఎంతో బాధతో ఉన్నారనీ, తమ బిడ్డలు ఎక్కడున్నా తమ వద్దకు తీసుకురావాలని కోరారు.

రాజకీయ హత్యలకు సీఎందే బాధ్యత..

కేరళలో రాజకీయ హత్యలకు సీఎం బాధ్యత వహించాలని ఎంపీ రాజీవ్‌చంద్రశేఖర్ పేర్కొన్నారు. "గత 16 ఏళ్లలో 176 మంది రాజకీయ హత్యలకు గురయ్యారు. 2016 నుంచి 14 మంది చనిపోతే.. వీరిలో 10 మంది భాజపా, 4 గురు వామపక్ష కార్యకర్తలు ఉన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. రాష్ట్రంలో ప్రైవేటు పెట్టుబడులు లేవు. నిరుద్యోగిత పెరిగింది. అప్పులు ఎక్కువయ్యాయి. పర్యటకులు కేరళ కాదని శ్రీలంకకు వెళ్తున్నారు" అని విమర్శించారు. కేరళలో గతంతో పోలిస్తే రాజకీయ హత్యల సంఖ్య తగ్గిందని సీపీఎం కార్యదర్శి కేఎన్‌బాలగోపాల్ తెలిపారు. ఆర్ఎస్ఎస్ కేరళ నుంచి వెళ్లిపోవాలని వామపక్షం బెదిరిస్తోందనీ, కానీ తాము అక్కడే నివసించాలని కోరుకుంటున్నామని ఆర్ఎస్ఎస్ జాతీయ కన్వీనర్ జె.నందకుమార్ పేర్కొన్నారు. కేరళలో రాజకీయ హత్యలకు భాజపా, వామపక్షాల వైఖరులే కారణమని సుప్రీంకోర్టు న్యాయవాది మాథ్యూ కుజల్‌నదన్ పేర్కొన్నారు.

ఎన్టీఆర్ ఒక్కరే నిజాయతీ కలిగిన నేత

నేడు 95 శాతం మంది దుష్టులే: మోహన్‌బాబు

రాజకీయ నాయకుల్లో 95 శాతం మంది దుష్టులని సీనియర్ నటుడు మోహన్‌బాబు వ్యాఖ్యానించారు. తనకు తెలిసినంత వరకు పెద్దన్న, స్నేహితుడు ఎన్టీఆర్ ఒక్కరే నిజాయతీ కలిగిన నాయకుడనీ, లంచం అంటే ఏమిటో తెలియని మహానాయకుడని పేర్కొన్నారు. ఎన్టీఆర్ రాజ్యసభకు పంపించినప్పుడు, ఎలాంటి మచ్చ లేకుండా వెనక్కి వచ్చానని తెలిపారు. సినిమాలు, రాజకీయాలు వేరన్నారు. శుక్రవారమిక్కడ 'ఇండియాటుడే' గ్రూపు నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ రాజకీయ నాయకుల్లో అవినీతి, ప్రస్తుత రాజకీయాలపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. "రాజకీయ నాయకులు ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేస్తున్నారు. అవన్నీ అమలు చేస్తే భారత్ ఎప్పుడో మెరుగైన స్థానంలో ఉండేది. రజనీకాంత్, కమల్‌హాసన్‌లతో కలిసి నేనెప్పుడూ పని చేయలేదు. వారే నాతో పనిచేశారు. రజనీకాంత్ 40 ఏళ్లుగా తెలుసు. మంచి మిత్రుడు. కమల్‌హాసన్‌తో సుహృద్భావ సంబంధాలున్నాయి." అని వివరించారు. ఈ కార్యక్రమంలో సినీనటి మంచు లక్ష్మి పాల్గొన్నారు



సీపీఎం కేంద్ర కమిటీ సమావేశాల్లో పాల్గొన్న పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, త్రిపుర సీఎం మాణిక్‌సర్కార్, నేతలు బిమన్‌బోస్, ప్రకాశ్ కారత్

కాంగ్రెస్‌తో దోస్తీపై సీపీఎం సమాలోచన

కోల్‌కతా: సీపీఎం కేంద్ర కమిటీ సమావేశాలు శుక్రవారమిక్కడ ప్రారంభమయ్యాయి. 3 రోజులపాటు జరగనున్న ఈ సమావేశాల్లో పార్టీ భవిష్యత్ వ్యూహాలు, ప్రణాళికలపై ముసాయిదా తీర్మానాన్ని ఆమోదించనున్నారు. సదరు ముసాయిదాను రానున్న ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో జరగబోయే పార్టీ మహాసభల్లో ఆమోదిస్తారు. పార్టీవర్గాల సమాచారం ప్రకారం.. తాజా సమావేశాల్లో రెండు ముసాయిదా తీర్మానాలను ప్రవేశపెట్టనున్నారు. భాజపాను నిలువరించేందుకుగాను కాంగ్రెస్‌తో దోస్తీ కట్టాలని ప్రతిపాదించే ముసాయిదా అందులో ఒకటి. దీనికి పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితోపాటు పశ్చిమ బెంగాల్, త్రిపురలోని పార్టీవర్గాలు మద్దతు పలుకుతున్నాయి. కాంగ్రెస్‌తో జట్టు కట్టడాన్ని పూర్తిగా వ్యతిరేకించే ముసాయిదా రెండోది.

సరిహద్దుల్లో కొనసాగిన పాక్ కాల్పులు..

బీఎస్ఎఫ్ జవాను సహా ముగ్గురి మృతి

జమ్ము: పాకిస్థాన్ మరో ముగ్గురి ప్రాణాలను పొట్టనపెట్టుకుంది. కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ శుక్రవారమూ.. జమ్ముకశ్మీర్‌లో మూడు జిల్లాల్లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఉన్న జనావాసాలు, సైనిక శిబిరాలపై పాక్ రేంజర్లు కాల్పులకు తెగబడ్డారు. ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఓ బీఎస్ఎఫ్ జవాను.. చికిత్స పొందుతూ అమరుడయ్యారు. ఇద్దరు భారత పౌరులూ ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు జవాన్లు, 23 మంది పౌరులు గాయపడ్డారు. శుక్రవారం మృతిచెందిన జవానును ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన జగ్‌పాల్‌సింగ్‌గా అధికారులు పేర్కొన్నారు. ఇటు గత రెండు (గురు, శుక్ర) రోజులు కలిపి.. మొత్తంగా ఇద్దరు బీఎస్ఎఫ్ జవాన్లు, ముగ్గురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. పాక్ కాల్పుల ఉల్లంఘనలపై జమ్ముకశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా స్పందించారు. భారత ఎన్ఎస్ఏ.. పాక్ ఎన్ఎస్ఏకు వెంటనే ఫోన్‌చేసి ఉల్లంఘనలకు తెరపడేలా చేయాలని కోరారు. ఐబీ వద్ద పరిస్థితి ఉద్రిక్తంగా ఉందని బీఎస్ఎఫ్ డీజీ కేకే శర్మ తెలిపారు.



పాక్ కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన బిష్ణోదేవి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

రెండో రోజూ పాక్ నిరసన

ఇస్లామాబాద్: వరుసగా రెండో రోజూ భారత డిప్యూటీ హైకమిషనర్ జేపీ సింగ్‌ను పిలిపించి.. పాకిస్థాన్ తమ నిరసనను వ్యక్తం చేసింది. పాక్ విదేశాంగ శాఖలోని దక్షిణాసియా, సార్క్ విభాగం డైరెక్టర్ జనరల్ మహమ్మద్ ఫైసల్.. సింగ్‌ను శుక్రవారమూ సమావేశపరిచారు. భారత సేనలు కాల్పుల విరమణను 'ఉల్లంఘించి' సియాల్కోట్ సెక్టార్‌లో కాల్పులు జరిపాయని ఫైసల్ ఆరోపించారు.

కూతురిపై అకృత్యం..తండ్రికి పదేళ్ల జైలు

దిల్లీ: తాగిన మత్తులో అయిదేళ్ల కుమార్తెపై అఘాయిత్యానికి పాల్పడిన ఓ తండ్రికి దిల్లీలోని అదనపు సెషన్స్ జడ్జి పదేళ్ల జైలు శిక్ష విధించారు. బాధితురాలికి రూ. 7.5లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించారు. లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించే (పీఓసీఎస్ఓ-పోక్సో) చట్టాన్ని అనుసరించి ఈ తీర్పును వెలువరించారు. తల్లి లేని ఆ బాలిక తండ్రిపై తప్పుడు ఫిర్యాదు చేసిందన్న డిఫెన్స్ న్యాయవాది వాదనలను జడ్జి తోసిపుచ్చారు.

సిరియాలో కేరళవాసి మృతి

కన్నూర్: సిరియాలో ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) ఉగ్రసంస్థ తరఫున పోరాడుతూ కేరళకు చెందిన అబ్దుల్ మనాఫ్(30) హతమైనట్లు పోలీసులు ధ్రువీకరించారు. అతడి స్వస్థలం కన్నూర్ జిల్లాలోని వలపట్టినమ్. మనాఫ్ గతేడాది నవంబరులో మరణించినట్లు బంధువులకు ఈ నెల 17న సమాచారం అందింది. మనాఫ్ స్నేహితుడు, ఐఎస్ ఉగ్రవాది అయిన కయ్యూమ్ పంపించిన ఈ సమాచారం వాస్తవమేనని పోలీసులు శుక్రవారం ధ్రువీకరించారు. సీపీఎం కార్యకర్త హత్య(2009లో) కేసులో మనాఫ్ నిందితుడిగా ఉన్నట్లు వెల్లడించారు. కన్నూర్ జిల్లా నుంచి దాదాపు 15 మంది ఐఎస్‌లో చేరిన సంగతి గమనార్హం. మనాఫ్‌తో సహా వారిలో మొత్తం ఆరుగురు ఇప్పటికే సిరియాలో హతమయ్యారు. ఐదుగురు అరెస్టయ్యారు.

'సత్యం' ఆస్తులు స్వాధీనం

ఈనాడు, హైదరాబాద్: సత్యం కంప్యూటర్స్ కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆస్తుల స్వాధీనం పరంపర కొనసాగుతోంది. తాజాగా ఈడీ అధికారులు తూర్పుగోదావరి జిల్లా తునిలో 150 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్ శివార్లలోని మేడ్చెల్‌లో ఉన్న రెండు ఖరీదైన విల్లాలను స్వాధీనం చేసుకున్నారు. సత్యం కంప్యూటర్స్‌లో జరిగిన అవకతవకలపై 2009లో తొలుత సీఐడీ కేసు నమోదు చేయగా ఆ తర్వాత సీబీఐకి బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఇప్పటికే పెద్దమొత్తంలో స్థిరాస్తులు స్వాధీనం చేసుకున్న ఈడీ.. తాజాగా గురువారం మరో రెండు చోట్ల ఆస్తులను ఆధీనంలోకి తీసుకుంది.

కర్ణాటక ఎన్నికల్లో... రాహుల్ సారథ్యం

హైదరాబాద్: కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సారథ్యం వహించనున్నట్లు ఆ రాష్ట్ర పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు దినేష్ గుండురావు వెల్లడించారు. ఫిబ్రవరి 10 నుంచి రాహుల్ గాంధీ మూడు రోజులపాటు రాష్ట్రంలో పర్యటిస్తారని, అదేనెల చివరిలో రెండో విడత, మార్చిలో మూడో విడత పర్యటనలు ఉంటాయన్నారు.

కౌలు రైతుకు 'పెట్టుబడి' లేనట్లే!

ఈనాడు, హైదరాబాద్: పంటల సాగుకు ఎకరానికి రూ.4 వేలు చొప్పున రాష్ట్రప్రభుత్వం ఇచ్చే 'పెట్టుబడి' పథకంలో కౌలు రైతులకు నేరుగా లబ్ధి ఉండదని తాజా సమాచారం. కౌలు రైతులను గుర్తించడం కష్టమని, వీరికివ్వాలని నిర్ణయిస్తే వచ్చే జూన్‌కల్లా రూ.4 వేలు పంపిణీ చేయడం సాధ్యపడదని ప్రభుత్వం భావిస్తోంది. భూముల యజమానులకే ఈ సొమ్ము పంపిణీ చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. పొలం కౌలుకు తీసుకునేవారికి భూయజమాని ఇస్తారా లేదా అన్నది వారి పరస్పర ఒప్పందాలపై ఆధారపడి ఉంటుందని వ్యవసాయశాఖ భావిస్తోంది. రాష్ట్రంలో మొత్తం భూయజమానులు 71 లక్షల మంది ఉన్నారని, వీరి చేతిలో 1,42,12,826 ఎకరాల వ్యవసాయ భూములున్నట్లు రెవెన్యూశాఖ రికార్డుల పరిశీలనలో వెల్లడైంది. మొత్తం భూమి వానాకాలం(ఖరీఫ్)లో సాగవుతుందని రూ.4 వేల చొప్పున జూన్‌లో రూ.5,731 కోట్లు ఇవ్వాలని, రబీలో 56 లక్షల ఎకరాలే సాధారణ విస్తీర్ణమైనందున ఇంతవరకూ రూ.4 వేల చొప్పున అక్టోబరులో విడుదల చేయాలని వ్యవసాయశాఖ తాజాగా ప్రతిపాదనలిచ్చింది. రెండు సీజన్లకూ కలిపి రూ.7,969 కోట్లు వచ్చే ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడి పథకానికి విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. వానాకాలంలో ఏడాదంతా సాగుకాలం ఉండే పత్తి, సోయా, కంది, అరటి, మామిడి, పసుపు తదితర పంటలకు ఒకేసారి జూన్‌లో రూ.8 వేలు ఇవ్వాలనే ప్రతిపాదనలు పెట్టకపోవడం గమనార్హం. ఈ పంటలు సాగుచేసే భూములకు అక్టోబరులో తిరిగి యాసంగి సీజన్ ప్రారంభమైనపుడు మరోవిడత రూ.4 వేలు ఇవ్వాలా వద్దా అన్నది ప్రభుత్వ నిర్ణయంపైనే ఆధారపడి ఉంది. రెండు సీజన్లలో రెండుసార్లు పంటలు సాగుచేసే వారికి రూ.4 వేల చొప్పున రావడం దాదాపు ఖాయం. పత్తికి ఒకేసారి రూ.8 వేలు ఇవ్వడం వల్ల తప్పుడు సంకేతాలు వెళతాయనే భావన అధికార వర్గాల్లో ఉంది. గత వానాకాలంలో ఏకంగా 47 లక్షల ఎకరాల్లో బీటీ పత్తి సాగుచేసి నష్టపోయారు. ఎకరాకు రెండు సీజన్లకు ఒకేసారి రూ.8 వేలు ఇస్తే రైతులు అధిక విస్తీర్ణంలో పత్తినే వేసే ప్రమాదముందని, దీనివల్ల ఆహార ధాన్యాల దిగుబడులు తగ్గిపోయే అవకాశాలుంటాయని వ్యవసాయాధికారులు భావిస్తున్నారు.

నిరుపయోగ భూములకు ఎలా!

పంటలు వేయకుండా నిరుపయోగంగా ఉంచే భూములకు రూ.4 వేల చొప్పున ఇవ్వవద్దని అధికార వర్గాలు, కొందరు మంత్రులు అభిప్రాయపడుతున్నారు. ఆర్థికంగా ఉన్నవారు పలు గ్రామాల్లో ఎకరాల కొద్దీ భూములను ఆస్తుల కింద కొంటున్నారని, ఇలాంటి వాటికి రూ.4 వేలు ఇస్తే నిజంగా పంటలు సాగుచేసే రైతుల్లో అసంతృప్తి వస్తుందంటున్నారు. హైదరాబాద్ వంటి నగరాల చుట్టుపక్కల స్థిరాస్తి వ్యాపారాల కోసం వందలాది ఎకరాల భూములను కొని వృథాగా ఉంచుతున్నారు. ఇలాంటి వాటికి ఇవ్వాలా వద్దా అన్నదానిపై సీఎం ఏం నిర్ణయం తీసుకుంటారోనని వ్యవసాయశాఖ ఎదురుచూస్తోంది.



మంత్రి కేటీఆర్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న టోక్యో క్లీన్ అథారిటీ సంస్థ ప్రతినిధి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్. చిత్రంలో సీఎంవో ముఖ్యకార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ సలహాదారు వినోద్ తదితరులు

పర్యావరణానికి పెద్దపీట

- జపాన్ పర్యటనలో రాష్ట్ర మంత్రి కేటీఆర్
- టోక్యో క్లీన్ అథారిటీ, ఐఎస్ఈ ఫుడ్స్ సంస్థలతో ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం పర్యావరణానికి, పరిశుభ్రతకు పెద్దపీట వేస్తోందని, పరిశ్రమలు సహా అన్ని రంగాల్లోని కాలుష్యాన్ని నివారించేందుకు పెద్దఎత్తున చర్యలు చేపడుతోందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖల మంత్రి కె.తారకరామారావు తెలిపారు. జపాన్ పర్యటనలో భాగంగా మూడోరోజు శుక్రవారం ఆయన భారత రాయబారి సుజన్ చినోయ్‌తో కలిసి పారిశ్రామికవేత్తలు, సంస్థల ప్రతినిధులతో భేటీ అయ్యారు. కేటీఆర్ సమక్షంలో టోక్యో క్లీన్ అథారిటీ సంస్థతో, ఐఎస్ఈ ఫుడ్స్ సంస్థలతో అవగాహన ఒప్పందం కుదిరింది. ఒప్పందాలపై పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, క్లీన్ అథారిటీ ఉపాధ్యక్షుడు యోష్మి సాటో, ఐఎస్ఈ ఫుడ్స్ ఛైర్మన్ హికోనోబు ఐస్‌లు సంతకాలు చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ పురపాలక, పారిశ్రామిక రంగాల్లో స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇస్తున్నామని, వ్యర్థాలను ఎప్పటికప్పుడే తొలగిస్తున్నామని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఈ ప్రక్రియను చేపట్టేందుకు క్లీన్ అథారిటీ సహకరిస్తుందని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతో కోళ్ల పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు, అదనపు నిల్వ సౌకర్యాల కోసం ఐఎస్ఈ ఫుడ్స్ సహకారం అందిస్తుందన్నారు. ఐఎస్ఈ ఫుడ్స్ తెలంగాణలో సౌర విద్యుత్ పార్కును ఏర్పాటు చేస్తుందన్నారు. ఆహారశుద్ధి రంగంలోనూ నూతన ఆవిష్కరణలకు తమ ప్రభుత్వం విశేషంగా ప్రోత్సహిస్తోందని, జపాన్ వంటి దేశాలకు చెందిన సంస్థలను ఇందుకోసం ఆహ్వానిస్తున్నామని కేటీఆర్ అన్నారు. అనంతరం కేటీఆర్ జపాన్ విదేశీ వాణిజ్య సంస్థ(జెట్రో) ప్రతినిధులతో సమావేశమయ్యారు. తెలంగాణ పారిశ్రామిక విధానం, టీఎస్ఐపాస్, పెట్టుబడుల అవకాశాలు, ఇతర అంశాలను వారికి వివరించారు. జపాన్ పారిశ్రామికవేత్తలు తెలంగాణకు తరలిరావాలని కోరారు. తర్వాత కేటీఆర్ జపాన్ అంతర్జాతీయ సహకార బ్యాంకు అధికారులతో సమావేశమయ్యారు.

తెలంగాణలో ఆయుర్వేదానికి గొప్ప చరిత్ర

- ఒకటి, రెండో శతాబ్దాల్లోనే ఆసుపత్రులు
- ప్రత్యేక నిధులు ఇచ్చిన రాజులు
- 2వ శతాబ్దంలోనే నాగార్జునకొండలో ఫీవర్ ఆసుపత్రి
- అంతర్జాతీయ సదస్సులో ఆయుర్వేద పరిశోధకుల వెల్లడి



'కాకతీయ డైనస్టీ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి చందూలాల్. చిత్రంలో హెరిటేజ్ తెలంగాణ సంచాలకులు విశాలాక్షి, ప్రభుత్వ ముఖ్యసలహాదారు రాజీవ్‌శర్మ, పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తదితరులు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ఆయుర్వేదానికి ఘనమైన చారిత్రక నేపథ్యముందనీ, నాటి రాజులు ప్రత్యేక ఆసుపత్రులను నిర్మించడమే కాకుండా, నిధులూ ఇచ్చారని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్'లో సహాయ సంచాలకుడు (ఆయుర్వేద పరిశోధకుడు) డా.గోలి పెంచలప్రసాద్ అన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం ప్రారంభమైన 'తెలంగాణ త్రూ ఏజెస్' అంతర్జాతీయ సదస్సులో మాట్లాడుతూ.. మధ్యయుగ ప్రారంభం, అంతకన్నాముందు నుంచే తెలంగాణలో ఆయుర్వేద వైద్యం ఉందనీ, ఉచితంగా సేవలందించారనీ, రాగి ఫలకలు, శిలలపై చెక్కిన శాసనాల్లో ఆధారాలు వెలుగు చూశాయన్నారు. "నాగార్జునకొండలో రెండో శతాబ్దంలోనే ఫీవర్ ఆసుపత్రి ఉంది. ప్రముఖ బౌద్ధ క్షేత్రం ఫణిగిరి రాజ్యంలో మూడో శతాబ్దంలో స్థాపించిన ధర్మచక్రాన్ని రాజ్య ప్రధాన వైద్యుని ద్వారా నిలబెట్టడం వైద్యులకు ఇచ్చిన ప్రాధాన్యాన్ని తెలియజేస్తుంది" అని ఆయన అన్నారు. 'భువనగిరి సమీపంలోని సైదాపూర్‌లో ప్రముఖ సర్జన్ అగలయ్య ఉండేవారు. ఆయన సేవలకు గుర్తింపుగా.. వైద్యరత్నాకర, ప్రాణాచార్య బిరుదులు ప్రదానం చేయడమే కాకుండా, నాటి రాజు జగదేవకవల్ల ఆయణ్ను సామంతరాజుగా ప్రకటించారు" అంటూ ఆధారాలను వివరించారు. రామన్నపేట సమీపంలోని తుమ్మలగూడెంలో ఐదు, ఆరు శతాబ్దాలు, విష్ణుకుండినులు పాలించే సమయంలో అప్పటిరాజు గోవిందవర్మ రోగులకు మందుల కోసం ప్రత్యేక గ్రాంటు ఇచ్చేవారు. ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందేవన్నారు.

ఫణిగిరికి ప్రపంచ గుర్తింపు : సదస్సులో తెలంగాణలో బౌద్ధ క్షేత్రాలు, ప్రాచీన తెలంగాణలో ఆర్థిక వ్యవస్థ-రోమన్, బైజాంటియన్ల కరెన్సీ, వేంగిచాళుక్యుల కాలంలో బంగారు కరెన్సీ, ఫణిగిరి చారిత్రక నేపథ్యం, రాక్ ఆర్ట్ తదితర అంశాలపై పురావస్తు పరిశోధకులు మాట్లాడారు. ఫణిగిరికి అమరావతి, నాగార్జునకొండకు సరితూగే చారిత్రక నేపథ్యముందనీ, అక్కడ దొరికిన తోరణం అద్వితీయమైందన్నారు. ఫణిగిరిలో జరిపిన తవ్వకాల్లో వెలుగు చూసిన చారిత్రక కళాఖండాల్ని పరిరక్షించాలనీ, ఈ బౌద్ధక్షేత్రానికి ప్రపంచ గుర్తింపు లభించేలా తెలంగాణ సర్కారు చొరవ తీసుకోవాలన్నారు.

చరిత్రే గొప్ప వరం.. మంత్రి చందూలాల్: రాతి యుగం నుంచి నేటి వరకు తెలంగాణకు గొప్పగా చెప్పుకునే చరిత్ర ఉందనీ, అదే రాష్ట్రానికి వరమని పర్యాటకశాఖ మంత్రి అజ్మీర చందూలాల్ పేర్కొన్నారు. సదస్సులో మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో వారసత్వ సంపద, పర్యటకాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యసలహాదారు రాజీవ్‌శర్మ మాట్లాడుతూ.. తెలంగాణలోని చారిత్రక కట్టడాలకు ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత గుర్తింపు వస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీ కె.కేశవరావు, ప్రభుత్వ సలహాదారు పాపారావు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రదర్శన.. : సదస్సు సందర్భంగా సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట, పాలమాకులలో గత ఏడాది జరిపిన తవ్వకాల్లో వెలుగు చూసిన వస్తువుల్ని ప్రదర్శనలో పెట్టారు.



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి ఈటల

పారిశ్రామికవేత్తల ఆందోళనలను పటాపంచలు చేశాం

సదస్సులో ఆర్థిక మంత్రి ఈటల

ఈనాడు, హైదరాబాద్: "తెలంగాణ ఉద్యమ సమయంలో చాలా మంది పారిశ్రామికవేత్తలు ఆందోళన చెందారు. మూడున్నర సంవత్సరాల కాలంలోనే అలాంటి ఆందోళనలన్నింటినీ పటాపంచలు చేశాం" అని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. కాంపోసిట్(మిశ్రమ పదార్థాల) పరిశ్రమలపై అంతర్జాతీయ సదస్సు శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన ఈటల మాట్లాడుతూ.. హైదరాబాద్ అనేక రక్షణ రంగ పరిశ్రమలకు నిలయమని. . వాటి అనుబంధ సంస్థలూ ఎన్నో ఇక్కడ ఉన్నాయన్నారు. హైదరాబాద్‌లో వెయ్యి చిన్న పరిశ్రమలు కాంపోసిట్ పరిశ్రమను అల్లుకొని ఉన్నాయని చెప్పారు. అందరి ముందు ఉన్న అతిపెద్ద సవాలు నిరుద్యోగమని.. పారిశ్రామికేత్తలు సహకరించి ఉద్యోగ కల్పనకు కృషి చేయాలని కోరారు. కేంద్ర రక్షణ మంత్రి సలహాదారు సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. అగ్ని-5కి వాడిన చాలా బాగాలు హైదరాబాద్‌లో తయారైనవేనని.. ఇది దేశం గర్వించదగ్గ విషయమన్నారు. హెచ్‌సీయూ మాజీ ఉపకులపతి కోట హరినారాయణ మాట్లాడుతూ.. విమానయాన రంగంలో భారత్ ప్రపంచంలోనే పెద్ద మార్కెట్ అవబోతోందన్నారు. టీఎస్ఐఐసీ ఎండీ ఈవీ నరసింహారెడ్డి తదితరులు మాట్లాడారు.

మధ్యప్రదేశ్ గవర్నర్‌గా ఆనందిబెన్



దిల్లీ: గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి ఆనందిబెన్ మధ్యప్రదేశ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. రాష్ట్రపతి కోవింద్ శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. ప్రస్తుతం గుజరాత్ గవర్నర్ ఓంప్రకాష్‌కోహ్లీ మధ్యప్రదేశ్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు ఆయన స్థానంలో ఆనందిబెన్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆమె 2014లో గుజరాత్‌మహిళా ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

హాఫీజ్ సయీద్‌పై చర్యలు తీసుకోవాల్సిందే

- పాక్‌కు అమెరికా స్పష్టీకరణ

వాషింగ్టన్: ముంబయి ఉగ్రదాడుల సూత్రధారి, లష్కరే తోయిబా ఉగ్రసంస్థ అధిపతి హాఫీజ్ సయీద్‌పై చర్యలు తీసుకోవాల్సిందేనని.. పాకిస్థాన్‌కు అమెరికా తేల్చిచెప్పింది. తమ దేశంలో హాఫీజ్ 'సాబ్'పై ఏ కేసూ నమోదు కానందున, చర్యలేమీ చేపట్టలేమన్న పాక్ ప్రధాని షాహిద్ అబ్బాసీ తాజా వ్యాఖ్యల నేపథ్యంలో అగ్రరాజ్యం తీవ్రంగా స్పందించింది. "హాఫీజ్‌ను ఉగ్రవాదిగానే అమెరికా పరిగణిస్తోంది. ముంబయి ఉగ్రదాడుల సూత్రధారి అతడేనని విశ్వసిస్తోంది. ఐరాస ఉగ్రసంస్థగా గుర్తించిన లష్కరే తోయిబాతో అనుబంధమున్నందుకు హాఫీజ్‌పై భద్రత మండలి ఆంక్షలు కూడా విధించింది. చట్టప్రకారం అతడిపై విచారణ జరగాలి. ఇదే విషయాన్ని పాక్‌కు కూడా స్పష్టం చేశాం." అని అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి హీథర్ నార్ట్ తెలిపారు.

భద్రత కమిషన్ ఏర్పాటుపై నిర్లక్ష్యమా!

- హైకోర్టు ఆగ్రహం
- హోంశాఖ ముఖ్య కార్యదర్శులపై కోర్టు ధిక్కరణ వ్యాజ్యం విచారణకు స్వీకరణ

ఈనాడు - హైదరాబాద్

రెండు తెలుగు రాష్ట్రాల్లో రాష్ట్ర భద్రత కమిషన్(ఎస్ఎస్‌సీ), పోలీసు ఫిర్యాదుల ప్రాధికార సంస్థ(పీసీఏ)లను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శించడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏపీ హోంశాఖ ముఖ్యకార్యదర్శి అనూరాధ, తెలంగాణ హోంశాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్ త్రివేదిలపై సుమోటోగా నమోదు చేసిన కోర్టు ధిక్కరణ వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీచేశారు. పోలీసు అధికారులపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల్ని పరిష్కరించేందుకు పీసీఏను ఏర్పాటు చేయాలనీ, మరోవైపు పోలీసు చర్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజల సమస్యలను పరిష్కరించడం, పోలీసులు చట్ట ప్రకారం నడుచుకొనేలా చూసేందుకు ఎస్ఎస్‌సీని ఏర్పాటు చేయాలని రెండు రాష్ట్రాలకు గతంలో హైకోర్టు ఆదేశాలిచ్చింది. ఆ ఆదేశాలు అమలు చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయమూర్తి.. తనకు తానుగా కోర్టుధిక్కరణ కేసుగా పరిగణించి 2 రాష్ట్రాల హోంశాఖ ముఖ్య కార్యదర్శులకు గతంలో నోటీసులు జారీచేశారు. మరోవైపు కోర్టు ఉత్తర్వులను అమలు చేయడంలో విఫలమైతే తదుపరి విచారణకు ఏపీ హోంశాఖ ముఖ్య కార్యదర్శి స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఏపీ హోంశాఖ ముఖ్య కార్యదర్శి తాజాగా ఓ అనుబంధ పిటిషన్‌ను దాఖలు చేస్తూ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఎస్ఎస్‌సీని ఏపీ పోలీసు చట్టంలో పొందుపరిచేందుకు ముసాయిదా సిద్ధమవుతోందన్నారు. శుక్రవారం జరిగిన విచారణలో ఏపీ హోంశాఖ కార్యదర్శి దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను న్యాయమూర్తి తోసిపుచ్చారు. ఉత్తర్వుల అమలుకు గడువు కావాలని తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది కోరగా, అసంతృప్తి వ్యక్తంచేసిన న్యాయమూర్తి.. కోర్టుధిక్కరణ వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించారు. ఇరురాష్ట్రాల హోంశాఖ ముఖ్యకార్యదర్శులకు నోటీసులు జారీచేస్తూ తదుపరి విచారణకు స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలన్నారు.

జరిమానాలు చెల్లించకుంటే జైలుకే

- రహదారిపై నిబంధనలు ఉల్లంఘించివారి విషయంలో..
- తొలిసారిగా 9 మందికి శిక్ష విధించిన న్యాయస్థానం

ఈనాడు, హైదరాబాద్: రహదారులపై నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై న్యాయస్థానం కన్నెర్ర జేసింది. మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడిపిన వారు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా దూసుకెళ్లినవారు, పదుల సంఖ్యలో చలనాలున్నా జరిమానాలు చెల్లించని వారిని జైలు శిక్ష అనుభవించాలంటూ హైదరాబాద్ ఎర్రమంజిల్ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తులు ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ రహదారులపై వరుసగా చోటుచేసుకుంటున్న ప్రమాదాల నేపథ్యంలో న్యాయమూర్తులు ప్రతి కేసునూ క్షుణ్ణంగా పరిశీలించి తీర్పు వెలవరించినట్లు ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం తెలిపారు. పది కంటే ఎక్కువ చలానాలున్నా కట్టకుండా నిర్లక్ష్యం వహించిన 9 మందికి తొలిసారిగా జైలుశిక్ష విధించారని, ఇప్పటి వరకూ జరిమానాలను చెల్లించకుండా ఉన్నవారిపై నాలుగైదు రెట్లు అపరాధ రుసుం చెల్లించాలంటూ ఆదేశాలు జారీ చేశారని వివరించారు.

రహదారి భద్రతపై సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం.. ట్రాఫిక్ పోలీసులు వాహనచోదకులపై కేసులు నమోదు చేసినప్పుడు న్యాయస్థానాల్లో నేరం తీరు, వాహనచోదకుడి మానసిక స్థితి, అతడి ప్రవర్తనపై అభియోగ పత్రాలను సమర్పిస్తున్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపిన వారు గతంలో ఈ తరహా నేరాలు చేసుంటే ఆ వివరాలు, మోతాదుకు మించి మద్యంతాగిన వ్యక్తి తమకు పట్టుబడినప్పుడు ఎంత మత్తులో ఉన్నాడు? అతడు వాహనాన్ని అలాగే నడుపుకొంటూ వెళ్తే ఎన్ని ప్రమాదాలు జరిగేవి అన్న అంశాలను అభియోగ పత్రాల్లో వివరిస్తున్నారు. మితిమీరిన వేగంతో తరచూ వెళ్తూ చలానాలు విధించినా చెల్లించకుండా ఉండే వాహన యజమానులను గుర్తించి వారిపై ప్రత్యేకంగా అభియోగ పత్రాలను సమర్పిస్తున్నారు. ఈ క్రమంలోనే నలుగురు వాహనచోదకులకు తాజాగా జైలు శిక్ష విధించారు.

కేబుల్ వ్యవస్థను పరిశ్రమగా గుర్తించాలి

సోమాజిగూడ, న్యూస్‌టుడే: ఎంఎస్ఓలు, కేబుల్ ఆపరేటర్ల కృషి ఫలితంగానే రాష్ట్రంలో ఇంటింటికీ కేబుల్ వ్యవస్థను తీసుకురావడం సాధ్యమైందని, కేంద్ర ప్రభుత్వం డిజిటల్ విధానం ప్రకటించడంతో ఆ వ్యవస్థనూ సొంతంగా ఏర్పాటు చేసుకుని ప్రజలకు సేవల్ని అందుబాటులోకి తెచ్చామని తెలంగాణ డిజిటల్ ఎంఎస్ఓల సంఘం పేర్కొంది. నూతన సంఘం గౌరవ అధ్యక్షుడు రమేష్‌బాబు, అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి శుక్రవారం మాట్లాడుతూ.. సమస్యల సాధనకు సంఘంగా ఏర్పడ్డట్లు తెలిపారు. సంఘం ఉపాధ్యక్షులిగా రాజశేఖర్ షెట్కర్, ప్రధాన కార్యదర్శిగా ఎం.రామ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా ఎం.కృష్ణ, రమేష్, కోశాధికారిగా ఎ.సునీల్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా బి.వెంకటేశ్వర్‌రవు, వి.విద్యాసాగర్‌ను ప్రకటించారు.

రాజకీయ నిధుల సమీకరణ చట్టాల లోపాలపై దృష్టి పెట్టండి

- రేవంత్‌రెడ్డి పిటిషన్‌పై ఈసీకి దిల్లీ హైకోర్టు ఆదేశం

దిల్లీ: నిధుల సమీకరణకు రాజకీయ పార్టీలు అనుసరించే విధానాలకు సంబంధించిన చట్టంలో లోపాలపై దృష్టి సారించాలని దిల్లీ హైకోర్టు శుక్రవారం ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. తెలంగాణ కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ మేరకు పేర్కొంది. పిటిషనర్ లేవనెత్తిన అంశాలను పరిశీలించి, ఆ తర్వాత వాటిపై ఒక అభిప్రాయానికి రావాలని స్పష్టంచేసింది. చట్టంలో లోపాలతోపాటు నిధుల సమీకరణకు తెరాస పార్టీ అనుసరిస్తున్న విధానాలు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా అన్నది తేల్చాలని, ఆ విధానాలపై చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి తన పిటిషన్‌లో కోరారు.

మాల్యాకు అరెస్టు వారెంటు

బెంగళూరు, న్యూస్‌టుడే: కింగ్‌ఫిషర్ విమానయానసంస్థ నిర్వహణకు భారీ మొత్తంలో అప్పులు చేసి, విదేశాల్లో తలదాచుకున్న మద్యం వ్యాపారి విజయ్ మాల్యా సహా 18 మందికి ఇక్కడి ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం అరెస్టు వారెంట్లు జారీచేసింది.

NEET
100 DAYS 50 DAYS SHORT TERM 2018
• 20yrs Expert Team • Spl. Focus on Phy. & Chem. • Residential / Day Campus
PRISM • Dilsukhnagar • Himayatnagar • SR Nagar, Hyd
9550102999, 8019250584

కర్ణాటకలో పుట్టిన నిరుపేద స్విస్ ఎంపీగా ఎన్నిక

- చరిత్ర సృష్టించిన నిక్లాజ్ శామ్యూల్



దిల్లీ: కర్ణాటకలోని ఓ ఆసుపత్రిలో పుట్టిన నిక్లాజ్ శామ్యూల్ అనే నిరుపేద.. తాజాగా స్విట్జర్లాండ్ పార్లమెంటుకు ఎన్నికయ్యాడు. 48 ఏళ్లక్రితం కర్ణాటకలోని ఉడుపి పట్టణంలో ఫ్రిట్జ్, ఎలిజబెత్ అనే స్విస్ దంపతులు నివసించేవారు. నిక్లాజ్ పుట్టిన 15 రోజులకు అతని తల్లి అయిన అనసూయ, తన పేదరికం కారణంగా పెంచుకోమని స్విస్ దంపతులకు ఇచ్చేసింది. అనంతరం నాలుగేళ్లపాటు కేరళలో నివసించిన ఆ దంపతులు నిక్లాజ్‌ను తీసుకుని స్విట్జర్లాండ్ వెళ్లిపోయారు. వారి పేదరికం కారణంగా అతన్ని ఉన్నత చదువులు చదివించలేకపోయారు. అర్థం చేసుకున్న నిక్లాజ్.. తోట పని చేస్తూ, ట్రక్కులు నడుపుతూ చదువుకున్నాడు. నవంబరు, 2017లో స్విస్ పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి ఎంపీ అయ్యాడు. ఆ దేశ పార్లమెంటుకు ఎన్నికైన మొదటి భారతీయుడిగా చరిత్ర సృష్టించాడు.

నేరస్థుల సర్వే భయంతో యువకుడి ఆత్మహత్య

గుర్రంపోడు, న్యూస్‌టుడే: పోలీసు శాఖ చేపట్టిన సకల నేరస్థుల సర్వేతో మనస్తాపం చెందిన ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలంలో ఘటన జరిగింది. పోచంపల్లి గ్రామానికి చెందిన వేముల ప్రసాద్(23)పై తొమ్మిదేళ్ల క్రితం మోటారు సైకిళ్ల దొంగతనం చేస్తున్న ముఠాతో కలిసి ఉన్నందుకు పోలీసు కేసు నమోదైంది. అప్పట్లోనే దాన్ని కొట్టివేశారు. రెండు రోజులుగా తెలంగాణ పోలీసుశాఖ చేపట్టిన సకల నేరస్థుల సర్వేలో భాగంగా పోలీసులు పోచంపల్లికి వెళ్లి ప్రసాద్‌కు కౌన్సెలింగ్ చేసి ఆయన ఇంటిని జియోట్యాగింగ్ చేశారు. దొంగతనం కేసు ఇప్పటికీ అలాగే ఉందని, జీవితాంతం ఉంటుందని మనస్తాపం చెందిన ప్రసాద్ శుక్రవారం ఉదయం కళాశాలకు వెళుతున్నట్లు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. నల్గొండ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై పడుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసుల వల్లే తమ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతిని తల్లిదండ్రులు వాపోయారు.

విద్యుదుత్పత్తిలో సింగరేణి కేంద్రాలు దేశంలోనే ప్రథమం

కొత్తగూడెం(సింగరేణి), న్యూస్‌టుడే: సింగరేణి విద్యుత్తు కేంద్రాలు దేశంలోనే అత్యధిక పూర్తిసామర్థ్యం (పీఎల్ఎఫ్)తో విద్యుత్తును ఉత్పత్తిచేసి ప్రథమస్థానంలో నిలుస్తున్నట్లు కేంద్రీయ విద్యుత్తు మండలి (సీఈఏ) ప్రకటించింది. గత తొమ్మిది నెలల విద్యుదుత్పత్తి-వినియోగంపై గణాంకాలను ఆ సంస్థ వెల్లడించింది. 90.19 పీఎల్ఎఫ్‌తో సింగరేణి కేంద్రాలు దేశంలోనే అగ్రస్థానాన ఉన్నాయంది. విద్యుత్తు అందుబాటులో ఉన్నా, పలు రాష్ట్రాలు కోతలను విధిస్తున్నాయన్న సీఈఏ... థర్మల్ విద్యుత్తును పూర్తిస్థాయిలో తయారుచేస్తూ విక్రయిస్తున్న సంస్థగా సింగరేణి మొదటిస్థానంలో ఉందని ప్రకటించింది. అతితక్కువ ధరకు విద్యుత్తు వస్తున్నందున- వీటిలో నిరంతరోత్పత్తి నిమిత్తం దక్షిణాది రాష్ట్రాల 'విద్యుత్తు లోడ్ డిస్పాచ్ కేంద్రం' ఉత్తర్వులిచ్చిందని విశ్లేషించింది. డిసెంబరులో విద్యుదుత్పత్తి కేంద్రాల పనితీరు జాబితాలో సింగరేణి కేంద్రానికి జాతీయస్థాయిలో నాలుగోస్థానం దక్కింది.



Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00